
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 76
శనివారం 7-6-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'


ఆగస్టు 3న నీట్‌-పీజీ పరీక్ష
నీట్‌–పీజీ–2025 పరీక్ష జూన్‌ 15కి బదులుగా ఆగస్టు 3న జరగనుంది - 6లో


రియల్‌ మోసాలకు రెడ్‌లైన్‌
కొనుగోలుదారుల ప్రయోజనాలే ముఖ్యం అన్న రెరా చైర్మన్‌ సత్యనారాయణ -8లో

న్యూస్‌రీల్‌

పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు



పేదల సొంతింటి కల నెరవేర్చే ప్రక్రియ కొలిక్కి వచ్చిన నేపథ్యంలో.. పట్టణాల్లోనూ పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రౌండ్‌+3 ఫ్లోర్ల వరకు ఈ నిర్మాణాలు ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి చెప్పారు.

- వివరాలు 8లో

పత్రికా స్వేచ్ఛపై ఏపీ సర్కారు మరో దాడి



ఏపీలో కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న టీడీపీ కూటమి ప్రభుత్వం సాక్షి దినపత్రికను మరోసారి లక్ష్యంగా చేసుకుంది. ఏపీ శాసనసభ ద్వారా వేధింపులకు దిగింది. అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌ శుక్రవారం 'సాక్షి' దినపత్రికకు సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు.

- వివరాలు 8లో

తెలుగు నేతలే టార్గెట్‌!



తెలుగు నేతలే టార్గెట్‌గా బలగాల స్పెషల్‌ ఆపరేషన్‌ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి నేషనల్‌ పార్కులో గురువారం నాటి ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీసభ్యుడు తెంటు నరసింహాచలం చనిపోగా, శుక్రవారం తెలంగాణ కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్‌ భాస్కర్‌ చనిపోయారు.

- వివరాలు 7లో

పదేళ్లు పగ్గాలివ్వండి

తెలంగాణను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే నా కర్తవ్యం: సీఎం రేవంత్‌రెడ్డి


తిర్మలాపురం వద్ద అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి, కోమటిరెడ్డి, ఉత్తమ్, రాజనర్సింహ, మండలి చైర్మన్‌ గుత్తా, ఎంపీ చామల, ప్రభుత్వ విప్‌ ఐలయ్య

- ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం
- తిరుమల తరహాలో యాదగిరిగుట్టకు బోర్డు
- బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం చట్టం తెచ్చాం
- మహిళలను కోటీశ్వరులను చేసేలా ప్రణాళిక
- బీఆర్‌ఎస్‌ కాదు.. అది భారత దెయ్యాల పార్టీ
- దెయ్యాలు ఉన్నాయన్న ఇంటిబిడ్డ ప్రశ్నకు ఆ నాయకుడు సమాధానం చెప్పట్లేదు
- ఒక్క నోటీసు ఇస్తేనే ఆగమాగం అయితుండు
- తిర్మలాపురం సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఆలేరు నియోజకవర్గంలో రూ. 1,051.45 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇకపై నెలకు రెండుసార్లు
కేబినెట్‌ భేటీలు
- వివరాలు 8లో

సాక్షి, యాదాద్రి

కాంగ్రెస్‌ పార్టీకి పదేళ్లు పాలించే అధికారం ఇవ్వాలని రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణను అన్నివిధాలా అభివృద్ధి చేసి తీరుతామని ఆయన చెప్పారు. 'బీఆర్‌ఎస్‌ ప్రభుత్వాన్ని పడగొడతానని ఆనాడు తొడగొట్టి చెప్పి పట్టు పట్టినం.. పడగొట్టినం. ఇవాళ ముఖ్యమంత్రిగా మీ ముందున్నా. ఇక తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే నా కర్తవ్యం'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలం తిర్మలాపురంలో రూ. 1,051.45 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రధానంగా రూ. 574.56 కోట్లతో గంధమల్ల రిజర్వాయర్‌ నిర్మాణం, రూ. 200 కోట్లతో యంగ్‌ ఇండియా రెసిడెన్షియల్‌ స్కూల్, రూ. 183 కోట్లతో మెడికల్‌ కాలేజీ భవన నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేపట్టారు. అనంతరం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధ్యక్షతన తిర్మలాపురంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన–ప్రగతిబాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దేశంలో

మిగతా 8వ పేజీలో ▶


త్రివర్ణ పతాకంతో చినాబ్‌ బ్రిడ్జిపై ప్రధాని నరేంద్ర మోదీ

మానవత్వంపై పాక్‌ దాడి

- మత ఘర్షణలు సృష్టించాలన్నదే పొరుగు దేశం లక్ష్యం
- జమ్మూకశ్మీర్‌ ప్రజల నోటి వద్ద ముద్ద లాగేసుకోవాలని కుట్ర చేశారు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం
- జమ్మూకశ్మీర్‌లో రూ.46 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం
- రెండు కీలక వంతెనలు ప్రారంభించిన ప్రధాని మోదీ

"దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టడం, ప్రజల మధ్య ఘర్షణలు సృష్టించడం, కశ్మీర్‌ ప్రజల జీవనోపాధిపై దెబ్బకొట్టి నోటి దగ్గర ముద్ద లాగేసుకోవడమే పాకిస్తాన్‌ అసలు లక్ష్యం. పేదలు పిడికెడు అన్నం తినడం కూడా ఆ దేశానికి ఇష్టం లేదు.

- వివరాలు 6లో

మరో కరోనా మహమ్మారి!


- చైనా గబ్బిలాల్లో హెచ్‌కేయూ5 వైరస్‌లు
- ఇవీ మెర్స్‌–కోవ్‌ కుటుంబానికి చెందినవే..
- మ్యుటేషన్‌కు గురైతే ప్రాణాంతకమే -6లో



పెద్దన్నల పోట్లాట

- దుమ్మెత్తి పోసుకుంటున్న మాజీ మిత్రులు
- కొంతకాలంగా ఉప్పునిప్పుగా వ్యవహారం
- 'బ్యూటిఫుల్‌'బిల్లుతో రచ్చకెక్కిన విభేదాలు
- సెక్స్‌ కుంభకోణంలో ట్రంప్‌ పేరు: మస్క్‌
- ఎప్‌స్టీన్‌ ఫైళ్లు బయటపెట్టనిది అందుకే
- ఆ ఉదంతంలో గద్దె దిగడం ఖాయం
- మస్క్‌కు మతి చలించినట్టుంది: ట్రంప్‌
- నాసాకు డ్రాగన్‌ సేవలు బంద్‌: మస్క్‌


6లో



ఆదాయం మూరెడు.. ఖర్చు బారెడు

- రూ.4,023 కోట్ల లోటుతో ప్రారంభమైన 2025-26 ఆర్థిక సంవత్సరం
- అప్పులతో కలిపి ఏప్రిల్‌లో రాబడులు రూ.16,473.99 కోట్లు మాత్రమే
- ఏప్రిల్‌లో పన్నుల రూపంలో వచ్చిన ఆదాయం రూ.10,916.68 కోట్లు
- రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ముఖచిత్రాన్ని వెల్లడించిన కాగ్‌ నివేదిక

- వివరాలు 5లో



ఈఎంఐ.. ఇంకా తగ్గేనోయ్‌

- గృహ, వాహన రుణాలు మరింత చౌక.. వృద్ధికి ఊతమిచ్చే దిశగా ఆర్‌బీఐ చర్యలు
- రెపో రేటు అర శాతం తగ్గింపు
- 5.5 శాతానికి చేరిక
- 2025-26 జీడీపీ వృద్ధి అంచనాలు 6.5 శాతం స్థాయిలో యథాతథం
- పసిడి రుణాలపై ఎల్‌టీవీ 75 శాతం నుంచి 85 శాతానికి పెంపు

- వివరాలు 17లో

ఇదండీ జగత్‌



నాటి కేబినెట్‌ ఆమోదంతోనే

- కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణం నిర్ణయాలపై మాజీ మంత్రి ఈటల స్పష్టీకరణ
- తుమ్మిడిహెట్టి బదులు మేడిగడ్డకు బరాజ్‌ ప్రాంతం మార్పుపై నిర్ణయం నాటి సీఎందే
- సాంకేతిక కమిటీ సిఫారసులను మంత్రివర్గ ఉపసంఘం, మంత్రివర్గం ఆమోదించింది
- కాళేశ్వరం ప్రాజెక్టుతో ఆశించిన ఆదాయం రాలేదు
- జస్టిస్‌ పినాకి చంద్రఘోష్‌ కమిషన్‌కు వెల్లడి.. 20 నిమిషాల్లో ముగిసిన క్రాస్‌ ఎగ్జామినేషన్‌


విచారణ అనంతరం మాట్లాడుతున్న ఈటల

సాక్షి, హైదరాబాద్‌: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన అన్ని నిర్ణయాలు రాష్ట్ర మంత్రివర్గ ఆమోదంతోనే జరిగాయని నాటి ఆర్థిక మంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ బరాజ్‌ల ఏర్పాటుపై చేసిన సిఫారసులపై నాటి ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, తనతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం జరిపి ఆమోదించిందని గుర్తుచేసుకున్నారు. ఆ తర్వాత మంత్రివర్గం ఆమోదించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణలో భాగంగా జస్టిస్‌ పినాకి చంద్రఘోష్‌ కమిషన్‌ శుక్రవారం బీఆర్‌కేఆర్‌ భవన్‌లోని

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఖాళీగా లేదు

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఖాళీగా లేదని, అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలనేది జాతీయ పార్టీ చూసుకుంటుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. రాష్ట్రంలో పర్సంటేజీల పాలన కొనసాగుతోందని, ఇకనైనా దోచుకోవడం ఆపి అభివృద్ధిని కాంక్షించాలన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన భరోసా కార్యక్రమంలో ఆమె పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఏ బిల్లు అయినా 30 శాతం వాటా చెల్లిస్తేనే పెండింగ్ బిల్లులు క్లియర్ అవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వంలో ఉన్న ప్రముఖులంతా ఇదే పనిలో ఉన్నారని, ఇది కాంగ్రెస్ పార్టీ నేతలే చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ గురించి చెప్పింది తామే అని అరుణ తెలిపారు. రాహుల్‌గాంధీ మొదలు రేవంత్‌రెడ్డి వరకు ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. ఐదు గంటల పాటు మంత్రివర్గ సమావేశంలో ఏం చర్చించారని ప్రశ్నించారు. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదని విమర్శించారు.

రూ.వేల కోట్లు ఇవ్వాలని ఇథనాల్ ఫ్యాక్టరీని డిమాండ్ చేశారు

హరీశ్‌రావు మాట్లాడుతున్నవన్నీ పచ్చి అబద్ధాలు: ఏఐసీసీ కార్యదర్శి సంపత్



సాక్షి, హైదరాబాద్: ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యవహారంలో బీఆర్ఎస్ రాజకీయ ప్రేరేపిత కుట్ర చేస్తోందని ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ వ్యాఖ్యానించారు. స్థానిక ప్రజల బాగోగులను పట్టించుకోకుండా తన స్వార్థపూరిత రాజకీయాల కోసం ఈ అంశాన్ని వాడుకునేందుకు హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని, ఆయన చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో సంపత్ మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశం ప్రైవేట్ కంపెనీకి సంబంధించిందని, మహబూబ్‌నగర్ కాంగ్రెస్ నేతలకు గానీ, సీఎం రేవంత్‌కు గానీ సంబంధం లేదన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే చోట స్థానిక ఎంపీగా బీజేపీ నేత ఉన్నారన్న విషయం హరీశ్‌కు తెలియదా అని ప్రశ్నించారు. రూ.వేల కోట్లు ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారని, అవి ఇవ్వకపోవడంతోనే ఇప్పుడు ధర్నాల పేరుతో నాటకాలాడుతున్నారని, విషయాన్ని చిలువలు పలువలు చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్రకు పాల్పడుతున్నారని సంపత్ ఆరోపించారు.

హామీలపై చర్చించకపోవడం బాధాకరం: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గం ఆరుగంటల పాటు సమావేశమై.. ప్రజలకిచ్చిన హామీలపై చర్చించకపోవడం బాధాకరమని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను ఎగవేసేందుకే కేబినెట్ సమావేశం జరిగినట్లు ఉందన్నారు. ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉంటే.. ఒకటి మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో రైతు భరోసా రూ.9,120 కోట్లు ఎగ్గొట్టారని, ఈసారి ఖరీఫ్‌లో కూడా భరోసాను ఎగ్గొడతా రని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు.

ప్రజల ఆశలు అడియాశలు

ఎమ్మెల్సీ మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంపై ప్రజలు ఆశతో ఎదురుచూసినా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారి విమర్శించారు. ఆయన శుక్రవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేయకుండా.. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే మూర్ఖత్వంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గుట్టను తవ్వి గులకరాయిని కూడా తీయలేదనే రీతిలో.. కేబినెట్ భేటీలో ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు, పీఆర్సీపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయలేదని బీఆర్ఎస్ నేత జి.దేవీప్రసాద్ విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 9 డీఏలు పెండింగులో పెట్టిన నాటి సీఎం చంద్రబాబుకు గుణపాఠం చెప్పిన రీతిలో.. ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజల చేతిలో తిరస్కరణ తప్పదని హెచ్చరించారు. తెలంగాణ ప్రయోజనాలపై చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో గోదావరి జలాలు, బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించలేదని బీఆర్ఎస్ నేత పల్లె రవికుమార్ గౌడ్ విమర్శించారు. కృష్ణా నది తరహాలో గోదావరిలోనూ జల దోపిడీకి చంద్రబాబు కుట్ర చేస్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టుపైనా కుట్ర జరుగుతోందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

బనకచర్లపై కేంద్రం కీలక హామీ

లేఖ రాసిన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్

మీడియాతో చిట్‌చాట్‌లో వెల్లడించిన మంత్రి ఉత్తమ్



లేఖను చూపిస్తున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఫిర్యాదులపై స్పందించి కేంద్రం కీలక హామీ ఇచ్చింది. తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసే ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఎలాంటి అనుమతులు, నిధులు ఇవ్వరాదని కోరుతూ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గత జనవరి 22న రాసిన లేఖకు స్పందిస్తూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ గత నెల 28న మరో లేఖ రాశారు. 'ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు ఏపీ నుంచి ఇంకా కేంద్రానికి అందలేదు. అందిన తర్వాత సంబంధిత నియమ నిబంధనలు, ట్రిబ్యునల్ తీర్పులు, అంతర్రాష్ట్ర ఒప్పందాలతోపాటు ఏపీ పునర్విభజన చట్టంలోని వివిధ నిబంధనల కింద ఆ ప్రతిపాదనలను మా శాఖ పరిధిలోని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పరిశీలించాకే తగిన నిర్ణయం తీసుకుంటాం'అని ఈ లేఖలో సీఆర్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ శుక్రవారం సచివాలయంలో విలేకరులతో నిర్వహించిన ఇష్టాగోష్టి సమావేశంలో వెల్లడించారు. ప్రాజెక్టుకు కేంద్రం ఎలాంటి ఆర్థిక సహాయం చేయరాదని కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి సైతం లేఖ రాసినట్టు గుర్తు చేశారు.

నీళ్ల విషయంలో బీఆర్ఎస్ ద్రోహం

సాగునీటి విషయంలో తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. నీళ్ల విషయంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణకు తీవ్ర అన్యాయం, ద్రోహం జరిగిందని స్పష్టం చేశారు. 2014 జూన్ 2 నాటికి శ్రీశైలం జలాశయం నుంచి మొత్తం 47,850 క్యూసెక్కులను మాత్రమే తరలించుకునే సామర్థ్యాన్ని ఏపీ కలిగి ఉండగా, బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో 2023 డిసెంబర్ నాటికి 1,11,400 క్యూసెక్కులకు ఏపీ పెంచుకుందని ఆరోపించారు. ఈ కాలంలో రోజుకు నీటి తరలింపు సామర్థ్యం 4.1 టీఎంసీల నుంచి 9.6 టీఎంసీలకు పెరిగిందన్నారు. రాష్ట్ర విభజనకు ముందు 10 ఏళ్లలో శ్రీశైలం జలాశయం నుంచి 727.15 టీఎంసీలను ఏపీ తరలించుకోగా, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 12,01 టీఎంసీలను తరలించుకుందని లెక్కలు బయటపెట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.64 వేల కోట్ల వృథా ఖర్చులను కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులపై చేసి ఉంటే మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లోని ప్రాజెక్టుల కింద 25,64,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేదన్నారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి నిర్వహించిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ హాజరై ఏపీ, తెలంగాణ మధ్య నీటి విభజనపై కృష్ణా ట్రిబ్యునల్–2 నిర్ణయం తీసుకునే వరకు ఇదే తాత్కాలిక సర్దుబాటు కొనసాగుతుందని చెప్పి వచ్చారని ఆరోపించారు. గత ప్రభుత్వం రాతపూర్వకంగా ఈ తాత్కాలిక కోటాకు అంగీకరించడంతో దాన్ని తెలంగాణకు వ్యతిరేకంగా వాడుకోవడానికి ఏపీ ప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్–2లో దాఖలు చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే ఏపీలోని ముచ్చుమర్రి లిఫ్టు సామర్థ్యం 3,850 క్యూసెక్కుల నుంచి 6,300 క్యూసెక్కులకు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం 44వేల క్యూసెక్కుల నుంచి 92,592 క్యూసెక్కులకు పెరిగిందని చెప్పారు. బీఆర్ఎస్ సహకారంతోనే నాటి ఏపీ ప్రభుత్వం శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 3 టీఎంసీలను తరలించుకోవడానికి రాయలసీమ లిఫ్టును చేపట్టిందన్నారు. ఈ ప్రాజెక్టు టెండర్లను అడ్డుకోవాల్సింది పోయి సజావుగా జరిగేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించిందని, ఇందుకోసం టెండర్లకు ముందు జరగాల్సిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాలని కేంద్రానికి లేఖ రాసిందన్నారు. బీఆర్ఎస్ వారు తమ ప్రభుత్వంపై గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, గోబెల్స్‌కు వారసులు కావడంతో వారి పేర్లను 'గోబెల్స్ రావు'గా మార్చాలని ఎద్దేవా చేశారు.

ప్రపంచంతోనే పోటీ పడేలా తెలంగాణ

నాటి పాలకులకు ప్రజలపై ప్రేమ లేదు

- వారి కుటుంబసభ్యులే వాస్తవాలను బయటపెడుతున్నారు: డిప్యూటీ సీఎం భట్టి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'మాది ప్రజా ప్రభుత్వం ..ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చడమే మా అంతిమ లక్ష్యం. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రపంచంతోనే పోటీ పడేలా తెలంగాణను తీర్చిదిద్దుకుంటున్నాం'అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మూసాపేట, నవాబ్‌పేటలలో శుక్రవారం మంత్రి జూపల్లితో కలిసి సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగసభల్లో భట్టి మాట్లాడుతూ తలాపున ఉన్న కృష్ణమ్మను ఈ ప్రాంతానికి మళ్లించడానికి ప్రయత్నం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలే అని గుర్తు చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ కాలం వెళ్లదీసిందే తప్ప గుక్కెడు నీళ్లు ఇవ్వలేదన్నారు. ఎన్నికలకు ముందుగా నార్లపూర్ పంప్‌ను ఆన్ చేసి అరచేతిలో వైకుంఠం చూపించారని విమర్శించారు. తామే పాలమూరు పనులను పూర్తి చేస్తామన్నారు.బీఆర్ఎస్ పాలనలో నీళ్లు రాలేదని.. నిధులు ఆవిరయ్యాయని.. దొంగల్లా అందిన కాడికి దోచుకున్నారని భట్టి మండిపడ్డారు. నాటి పాలకులకు ప్రజలపై ప్రేమ లేదని వారి కుటుంబసభ్యులే వాస్తవాలను బయటపెడుతున్నారని తెలిపారు.

అధికారం పోయిందనే కేసీఆర్‌కు దుఃఖం: జూపల్లి

రాష్ట్రంలో 17 నెలల పాలన చూస్తుంటే తనకు దుఃఖం వస్తోందని వరంగల్ సభలో మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడ డాన్ని మంత్రి జూపల్లి ప్రస్తావిస్తూ.. అధికారం పోయిందని, కుటుంబసభ్యులకు పదవులు పోయాయనే ఆయనకు దుఃఖం వస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో 22 మంది ముఖ్యమంత్రులు పాలన చేస్తే రూ.65 వేల కోట్ల అప్పు ఉండగా.. కేవలం పదేళ్ల పాలనలో కేసీఆర్ రూ.7.30 లక్షల కోట్ల అప్పు చేశారని మండిపడ్డారు. 60 ఏళ్ల పరిపాలన చేసిన కాంగ్రెస్ వద్ద పార్టీ ఫండ్ రూ.15 కోట్లు ఉండగా, కేవలం పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్‌కు రూ.1,500 కోట్ల పార్టీ ఫండ్ ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్, ఈటల కూడబలుక్కున్నారు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ అనంతరం.. ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను చూస్తే ఆశ్చర్యమేసిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ తప్పేమీ లేదన్నట్టు, అంతా కేబినెట్ నిర్ణయం మేరకే జరిగినట్టు ఈటల బుకాయిస్తున్నారని శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ఆర్థికమంత్రిగా పనిచేసిన వ్యక్తి ప్రాజెక్టు నిధులతో తనకు సంబంధం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేపీ నేతలు మోదీ, అమిత్‌షాలు కూడా ఈ ప్రాజెక్టు బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారిందని ఆరోపించారని, అందుకు భిన్నంగా ఈటల మాట్లాడడం బట్టి చూస్తే కేసీఆర్‌తో ఆయన కుమ్మక్కైనట్టు స్పష్టమవుతోందన్నారు. పక్కా ప్లాన్ ప్రకారం కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లు కూడబలుక్కుని ఒక్కటే సమాధానాలు చెప్పాలని నిర్ణయించుకున్నారని, అందుకే కేసీఆర్‌ను కాపాడే వకాల్తాను ఈటల రాజేందర్ పుచ్చుకున్నారని అభిప్రాయపడ్డారు. హరీశ్‌రావును ఈటల రహస్యంగా కలిశారని తాను చెప్పింది నిజమేనని రుజువైందన్నారు. ఈటల ఇచ్చిన వివరణ ఆయన సొంతమా? లేక బీజేపీ విధానమా స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబుకు గురుదక్షిణగా బనకచర్లకు రేవంత్ సహకారం

మాజీ మంత్రి హరీశ్‌రావు



దుబ్బాకలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

దుబ్బాక: ఏపీ ప్రభుత్వం అక్రమంగా బనకచర్ల ప్రాజెక్టు కడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు నోరు మెదపడం లేదని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం దుబ్బాకలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబును ఎదిరించే దమ్మూ, సత్తా లేదా అంటే.. ఎందుకు మీ లాగులు తడుస్తున్నాయని ఘాటుగా వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లరు.. ప్రధానమంత్రిని ఎందుకు ప్రశ్నించరని హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి గురుదక్షిణగా బనకచర్లను అడ్డుకోవడం లేదన్నారు. బనకచర్ల మీద కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ఎందుకు మాట్లాడటం లేదని, మీకు రాష్ట్ర ప్రయోజనాలు పట్టవా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్లతో గోదావరిలో తెలంగాణ వాటా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిల్లర మాటలు మాని శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ అక్రమ పనులు, బనకచర్ల అక్రమ ప్రాజెక్టును ఆపే ప్రయత్నం చేయాలన్నారు.

కేబినెట్‌లో కమీషన్లు, పర్సంటేజీలపైనే చర్చా?: ఐదు గంటల పాటు జరిగిన కేబినెట్ మీటింగ్‌లో బనకచర్లపై మాట్లాడకుండా కేవలం కమీషన్లు, పర్సంటేజీలు, హైకమాండ్‌కు పంపే మూటల గురించే మాట్లాడరా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లి రాష్ట్రానికి అన్యాయం జరగకుండా అడ్డుకుంటామన్నారు. అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని, జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేద్దామన్నారు.

ఉద్యోగులను నిట్టనిలువునా ముంచిన ప్రభుత్వం: ఉద్యోగులకు ఒక్క డీఏ ఇచ్చేందుకు ముచ్చటగా మూడు కమిటీలు వేశారని, దీనికి 5 గంటలు కేబినెట్‌లో చర్చనా అని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను నిట్టనిలువునా ముంచిందన్నారు. తక్షణమే ప్రభుత్వం మూడు డీఏలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కాళేశ్వరం కూలిందని గ్లోబల్ ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లాలో గంధమల్ల ప్రాజెక్టుకు ఎందుకు కొబ్బరికాయ కొట్టావని హరీశ్‌రావు ప్రశ్నించారు.

'ఇసుక దందా'పై విజిలెన్స్ తనిఖీలు

'సాక్షి' కథనంతో స్పందించిన ప్రభుత్వం

- పలు జిల్లాలో ఇసుక రీచ్‌లను తనిఖీ చేసిన అధికారులు
- రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణా జరగటంలేదు
- టీజీఎండీసీ వైస్ చైర్మన్ భవేష్ ప్రకటన



సాక్షిప్రతినిధి, వరంగల్/మహబూబాబాద్‌నగర్: రాష్ట్రంలోని పలు నదులు, వాగుల్లో సాగుతున్న ఇసుక దందాపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేపట్టారు. నదులు, వాగుల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఇసుక తవ్వకాలపై 'సాక్షి'దినపత్రికలో ఈ నెల 5న 'నదుల్లో ఇసుక తోడేళ్లు'శీర్షికన ప్రచురితమైన కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ ప్రత్యేక బృందాలు శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. బృందం సభ్యులు జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం తుమ్మిళ్ల, జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని మిడ్జిల్ మండలం కొత్తపల్లి తదితర రీచ్‌లను పరిశీలించారు. అక్కడ సీసీ కెమెరాల ఏర్పాటు, ఎన్ని క్యూబిక్ మీటర్ల మేరకు తవ్వకాలు జరిపారు.. అనుమతులు ఉన్నాయా అన్న విషయాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా లారీల్లో సామర్థ్యానికి మించి ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. తనిఖీల్లో గుర్తించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోనూ తనిఖీలు చేసినట్లు సమాచారం.

ఇసుక అక్రమ రవాణా అబద్ధం

రాష్ట్రంలో ఇసుక అక్రమ రవాణా జరగడం లేదని, ఇసుక తవ్వకం, అక్రమ రవాణాను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని టీజీఎండీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భవేష్ శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అధిక బరువుతో ఇసుకను మోసుకెళ్లే వాహనాలను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. టీజీఎండీసీ స్టాక్ యార్డుల వద్ద నిరంతర పర్యవేక్షణ కోసం సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాలను ట్రాక్ చేసేందుకు ఏఎన్ఆర్ (ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్) టెక్నాలజీని అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు.

ఈటల మాటలపై కిషన్‌రెడ్డి స్పష్టతనివ్వాలి

కాళేశ్వరం విషయంలో బీజేపీ వైఖరి కూడా ఇదేనా?: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలకు నెలవు అన్న విషయం జగమెరిగిన సత్యమని, అయితే ఈ ప్రాజెక్టు విషయంలో విచారణ కమిషన్ ముందు హాజరై వచ్చిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మాత్రం అంతా బాగుందని క్లీన్‌చిట్ ఇస్తున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టతనివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాళేశ్వరం విషయంలో బీజేపీ వైఖరి కూడా ఈటల చెప్పినట్టే ఉంటుందా? అని ప్రశ్నించారు. ఇది పార్టీ విధానమో కాదో కిషన్‌రెడ్డి చెప్పాలని, లేదంటే బీజేపీది కూడా ఇదే వైఖరి అని ప్రజలు ఫిక్స్ అవుతారని వ్యాఖ్యానించారు. కాగా, ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్‌పార్టీది ఒకటే స్టాండ్ అని, మరి బీజేపీ వైఖరి ఎలా మారిందో చెప్పాలని కోరారు. ఈటల మాటలను కిషన్‌రెడ్డి సమర్థిస్తారా అని ప్రశ్నించారు. అసలు ఈటల రాజేందర్ బీజేపీ నాయకుడో, బీఆర్ఎస్ నాయకుడో కూడా కిషన్‌రెడ్డి చెపితే బాగుంటుందని ఎద్దేవా చేశారు.

నేడు కాళేశ్వరంపై హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరించేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇప్పటికే ప్రభుత్వం, ఇతర పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని పార్టీ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు సూచించారు. దీంతో శనివారం ఉదయం 11 గంటలకు తెలంగాణ భవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం–వాస్తవాలు అనే అంశంపై హరీశ్‌రావు ప్రజెంటేషన్ ఇస్తున్నారు. చేవెళ్ల–ప్రాణహిత ప్రాజెక్టుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పనులు, మహారాష్ట్ర ప్రభుత్వం నాడు చెప్పిన అభ్యంతరాలు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, వ్యయం, ప్రభుత్వం చేస్తున్న ప్రచారం, మేడిగడ్డ కుంగిన పిల్లర్లు, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, ఎన్ని ఎకరాలకు నీరిచ్చింది.. ఎన్ని జిల్లాలకు అందిస్తున్న నీరు, సాగులోకి వచ్చిన ఆయకట్టు, పంట దిగుబడి, సాధించిన విజయాలను ఇందులో వివరించనున్నారు. ఇదిలాఉండగా ఈనెల 9న కాళేశ్వరం కమిషన్ విచారణకు హరీశ్‌రావు, 11న కేసీఆర్ హాజరుకానున్నారు.

నాటి కేబినెట్ ఆమోదంతోనే..

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాలయంలో ఈటల రాజేందర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. పలు కీలక ప్రశ్నలు సంధించింది. కేవలం 20 నిమిషాలపాటు ఆయన్ను కమిషన్ విచారించింది.

ప్రాంతం మార్పుపై నిర్ణయం సీఎందే..

ఎవరి ఆలోచన ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణం చేపట్టారని కమిషన్ తొలుత ప్రశ్నించగా ఈటల సుదీర్ఘ వివరణ ఇచ్చారు. 'రూ. 38 వేల కోట్లతో చేపట్టిన ప్రాణహిత–చెవెళ్ల ప్రాజెక్టు కింద తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. ఆ రాష్ట్రంలో ముంపు నివారణకు బరాజ్ ఎత్తును 150 నుంచి 148 మీటర్లకు తగ్గించాలని కోరింది. వన్యప్రాణుల అభయారణ్యం ఉండటంతోపాటు అక్కడ నీటిలభ్యత సైతం లేదని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పేర్కొంది. ప్రాజెక్టు కింద 16.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితోపాటు పట్టణ తాగునీటికి 30 టీఎంసీలు, గ్రామీణ తాగునీటికి 15 టీఎంసీలు, పరిశ్రమలకు 10 టీఎంసీల నీళ్లు అవసరం. తుమ్మిడిహెట్టి వద్ద అంత నీటి లభ్యత లేకపోవడంతోనే అక్కడి నుంచి మేడిగడ్డకు బరాజ్ లొకేషన్‌ను మార్చాం. నాటి సీఎం (కేసీఆర్) నిర్ణయం తీసుకున్నారు. సాంకేతిక కమిటీ నివేదికపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం జరిపి బరాజ్‌ల నిర్మాణంపై నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి అంచనా వ్యయం అప్పట్లో రూ. 63 వేల కోట్లు. సాగునీటి కోసం రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను తీర్చడానికి అంచనా వ్యయాన్ని రూ. 83 వేల కోట్లకు పెంచడం జరిగింది. ఆ తర్వాత అంచనా వ్యయం పెరుగుతూ పాయింది. ఇప్పుడు ఎంతో తెలియదు'అని ఈటల పేర్కొన్నారు.

బరాజ్‌ల లొకేషన్లను సూచించింది ఎవరు?

ప్రాజెక్టుల రీఇంజనీరింగ్‌పై మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన నివేదికపై సంతకాలు చేశారా? అని మళ్లీ కమిషన్ ప్రశ్నించగా అవునని ఈటల బదులిచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల లొకేషన్లను నిపుణుల కమిటీ సూచించిందా? అని కమిషన్ ప్రశ్నించగా గోదావరిపై వేర్వేరు చోట్ల అధ్యయనం జరిపి చివరకు ఆ మూడు లొకేషన్లను నిపుణుల కమిటీ అంగీకరించిందని ఈటల బదులిచ్చారు. ఆ లొకేషన్ల వద్ద బరాజ్‌లను నిర్మించాలన్న నిర్ణయం ప్రభుత్వానిది కాదా? అని కమిషన్ మళ్లీ అడగ్గా ఆర్థిక శాఖతో సంబంధం లేకపోవడంతో సమాధానం ఇవ్వలేనని ఈటల పేర్కొన్నారు. డీపీఆర్ తయారీ కోసం వ్యాప్కోస్ సంస్థకు రూ. 5.94 లక్షలు చెల్లించాలని 2015 ఏప్రిల్ 13న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందా? అని కమిషన్ అడగ్గా తనకు గుర్తు లేదన్నారు.

'కాళేశ్వరం'తో ఆశించిన ఆదాయం రాలేదు..

కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు లేకపోవడంతో రుణాల సమీకరణ కోసం కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేవపీసీఎల్)ను ఏర్పాటు చేయాలని నాడు నిర్ణయించామని ఈటల రాజేందర్ మరో ప్రశ్నకు బదులిచ్చారు. కేవపీసీఎల్ ఆర్థిక శాఖ పరిధిలోకి రాదని.. నీటిపారుదల శాఖ గజ్వేల్ ఈఎన్‌సీ బి.హరిరామ్ దీనికి అధిపతిగా వ్యవహరించారని గుర్తుచేశారు. అన్ని శాఖల రుణాలకు ఇచ్చినట్లే కేవపీసీఎల్ రుణాలకు సైతం ఆర్థిక శాఖ పూచీకత్తు ఇచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయంతోనే రుణాలను తిరిగి చెల్లించాలని విజయ బ్యాంకు రాసిన లేఖను కమిషన్ ప్రస్తావించగా.. ప్రాజెక్టు ద్వారా తాగు, పరిశ్రమల అవసరాలకు నీటి సరఫరాతో వచ్చే ఆదాయంతో రుణాలు తిరిగి చెల్లిస్తామని కాగితాల్లో చూపినా వాస్తవికంగా అంత ఆదాయం వసూలు కాలేదని ఈటల వివరణ ఇచ్చారు. బడ్జెటేతర రుణాలతో బరాజ్‌లను నిర్మించారా? అని కమిషన్ అడగ్గా ఆ వ్యవహారాలతో ఆర్థిక శాఖకు సంబంధం లేదని బదులిచ్చారు. నీటిపారుదలశాఖతోపాటు కేవపీసీఎల్‌లు ఈ వ్యవహారాలు చూశాయన్నారు. బరాజ్‌ల నిర్మాణంలో ఆర్థిక క్రమశిక్షణ పాటించలేదా? అని కమిషన్ ప్రశ్నించగా దీనితో ఆర్థిక శాఖకు సంబంధం లేదన్నారు. నీటిపారుదల శాఖలోని అకౌంట్స్ విభాగం ఈ వ్యవహారాలు పర్యవేక్షించిందన్నారు.

నివేదికను బయటపెట్టి దోషులను శిక్షించాలి

కమిషన్ ఎదుట విచారణ అనంతరం మీడియాతో ఈటల



విచారణ అనంతరం బయటకు వస్తున్న ఎంపీ ఈటల

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించనున్న నివేదికను సత్వరమే రాష్ట్ర ప్రభుత్వం బహిర్గతపరిచి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. కమిషన్ ఎదుట శుక్రవారం హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నివేదికను దాచి రాజకీయపబ్బం గడుపుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సాంకేతిక అంశాలతో తనకు సంబంధం లేదని కమిషన్ అడిగిన ప్రశ్నకు బదులిచ్చినట్లు తెలిపారు. తన జీవితం పారదర్శకంగా ఉందని, కణత మీద తుపాకీ పెట్టినా విలువలు పోగొట్టుకోలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త తానేనని కేసీఆర్ వందల పర్యాయాలు అన్నారని.. నిర్ణయాలన్నీ ఆయనే తీసుకొని మంత్రివర్గంతో ఆమోదింపజేశారన్నారు.

కమిషన్ తీరుపై ఈటల ఆనందం..

విచారణ సందర్భంగా కమిషన్ తనపై చిరాకు లేదా కోపం ప్రదర్శించకుండా వ్యవహరించిందని.. కమిషన్ ఎదుట తనకు గౌరవం లభించిందని ఈటల భావిస్తున్నట్లు తెలిసింది. విచారణ ఎదుర్కొంటున్న తనకు కమిషన్ జడ్జి థాంక్స్ చెప్పడంపై ఈటల సన్నిహితుల వద్ద ఆనందం వ్యక్తం చేసినట్లు తెలిసింది. విచారణ ఎదుర్కొనే వారికి థాంక్స్ చెప్పడం తనపట్ల ఆయనకున్న సదభిప్రాయం కావొచ్చని ఈటల పేర్కొన్నట్లు సమాచారం.

సీఎంతో మీనాక్షి నటరాజన్ భేటీ


సీఎం రేవంత్ నివాసానికి రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి

తాజా రాజకీయ పరిణామాలు, పీసీసీ కార్యవర్గం కూర్పుపై చర్చ!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం ఆమె జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వెళ్లి ఆయనతో అరగంటకు పైగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, పీసీసీ కార్యవర్గం కూర్పుపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. పీసీసీ కార్యవర్గాన్ని ఏఐసీసీ ఇప్పటికే ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రేవంత్, మీనాక్షిల భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. పీసీసీ కార్యవర్గ జాబితాపై తుది ఆమోదం కోసమే ఇద్దరి మధ్య భేటీ జరిగి ఉంటుందని గాంధీభవన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. చివరి నిమిషంలో చేపట్టాల్సిన మార్పుల కోసం పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అభిప్రాయాలను తీసుకుని మీనాక్షి, రేవంత్‌ను కలిశారని, ఇద్దరి మధ్య కార్యవర్గ కూర్పుపై చర్చ జరిగిందని తెలుస్తోంది. మరోవైపు గత 15 రోజులుగా మీనాక్షి నటరాజన్ పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతల అభిప్రాయాలు, పరస్పరం చేసుకున్న ఫిర్యాదుల విషయంలో కూడా ఇద్దరి మధ్య చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అలాగే రాష్ట్రంలో పార్టీ కమిటీల నియామకం కోసం పీసీసీ నుంచి పరిశీలకులు జిల్లాలకు వెళ్లి వచ్చారు. వీరితో కూడా మీనాక్షి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జైబాపూ, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమ సమన్వయకర్తలతో కూడా ఆమె ఇటీవల భేటీ అయ్యారు. ఈ అంశాలన్నిటిపై చర్చించేందుకు మీనాక్షి, ముఖ్యమంత్రితో సమావేశమయ్యారని గాంధీభవన్ వర్గాలంటున్నాయి.

కాళేశ్వరం బంతి ఇప్పుడు కేసీఆర్ కుటుంబం కోర్టులో ఉంది: యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం బంతి ఇప్పుడు కేసీఆర్ కుటుంబం కోర్టులో ఉందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన కమిషన్ ముందు ఆయన హాజరైతే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని, ఆలస్యం చేయకుండా కేసీఆర్, హరీశ్‌రావులు హాజరై అన్ని విషయాలు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ విచారణకు హాజరైన ఈటల రాజేందర్ కూడా తనకు ఏమీ సంబంధం లేదని, అంతా కేసీఆర్ చేతుల మీదుగా నడిచినట్టు చెబుతున్నారన్నారు.



Reliance
Growth is Life
అందమైన వర్షపు
జల్లులు
చేసుకోండి కాస్త
పొదుపులు
SMART
BAZAAR
₹9*/kg
ఉల్లిపాయ 2 kg
*₹1499 మరియు అంతకు మించిన విలువ గల షాపింగ్ పై.
ఒక కస్టమర్ కు. 2 kg మాత్రమే.
మాన్సూన్ మేళా
zeel
పాంచో / రెయిన్‌వియర్ శ్రేణి
ఎమ్ఆర్‌పి ₹199 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹149 మొదలుకుని
అంబ్రెలా శ్రేణి
ఎమ్ఆర్‌పి ₹299 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹199 మొదలుకుని
మెన్స్ / ఉమెన్స్ / కిడ్స్ క్లాగ్స్ అండ్ ఫ్లోటర్స్ శ్రేణి
స్మార్ట్ ప్రైస్ ₹299 మొదలుకుని
కొంచెం సిప్ కొంచెం స్నాక్
ఫ్లాట్ 25% తగ్గింపు
బిస్కెట్స్ శ్రేణి / రస్క్ 200 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹50 స్మార్ట్ ప్రైస్ ₹38 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹75
టాటా టీ చక్ర గోల్డ్ డస్ట్ 500 g
ఎమ్ఆర్‌పి ₹430 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹355 మొదలుకుని
కోల్డ్ డ్రింక్ అండ్ జ్యూసెస్ 600 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 3 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹40 మొదలుకుని /యూనిట్
బూస్ట్ / హార్లిక్స్ 750 g
ఆదా చేసుకోండి ₹175
ఎమ్ఆర్‌పి ₹459 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹284 మొదలుకుని
బింగో! చిప్స్ 45 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఫ్లాట్ 25% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹20 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹15 మొదలుకుని
రుచికరమైన ఆహారం వండుకోండి
ఫార్చ్యూన్ రిఫైన్డ్ రైస్ బ్రాన్ ఆయిల్ 3 L + ఎవిరిడే బాస్మతి రైస్ ఫుల్ గ్రైన్ 5 kg
కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1494 | ఆదా చేసుకోండి ₹695
స్మార్ట్ ప్రైస్ ₹799
లూజ్ చక్కెర S / కంది పప్పు పెల్లూ 1 kg
స్మార్ట్ ప్రైస్ ₹42.50/ ₹104
మార్కెట్ ధర ₹50 / ₹109
ఆశీర్వాద్ / ఈస్టర్న్ / ఆచి స్పైసెస్ (ఎంపిక శ్రేణి)
BUY ANY 2 GET ANY 1 FREE*
*ఎం ఆర్‌పి
కర్నూలు సోనా మసూరి / గుడ్ లైఫ్ డైలీ రైస్ 26 kg
స్మార్ట్ ప్రైస్ ₹1029/ ₹1049
ఎమ్ఆర్‌పి ₹1650 / ₹1800
ఆదా చేసుకోండి ₹621 / ₹751
బోలాస్ సూపర్ సేవర్ క్యాష్యూ 400 g / గుడ్ లైఫ్ బాదం 500 g
స్మార్ట్ ప్రైస్ ₹345/ ₹419
ఎమ్ఆర్‌పి ₹599 / ₹620
ఆదా చేసుకోండి ₹254 / ₹201
చక్కి ఫ్రెష్ ఆటా / ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ ఆటా 5 kg
స్మార్ట్ ప్రైస్ ₹209/ ₹295
ఎమ్ఆర్‌పి ₹270 / ₹355
ఆదా చేసుకోండి ₹61 / ₹60
ఫ్రీడమ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ / గుడ్ లైఫ్ ఫిల్టర్డ్ వేరుశెనగ ఆయిల్ 1 L
స్మార్ట్ ప్రైస్ ₹146/ ₹149
ఎమ్ఆర్‌పి ₹164 / ₹210
ఆదా చేసుకోండి ₹18 / ₹61
విజయా ఘీ 1 L
ఎమ్ఆర్‌పి ₹690
ఆదా చేసుకోండి ₹131
స్మార్ట్ ప్రైస్ ₹559
మాన్సూన్ కోసం తయారు
టూత్‌పేస్ట్ / సోప్ 150 g మొదలుకుని (మల్టీ ప్యాక్) (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹175 మొదలుకుని
కనీసం 33% తగ్గింపు
టైడ్ డిటర్జెంట్ పౌడర్ 2 kg (సెలెక్ట్ వేరియంట్స్)
ఆదా చేసుకోండి ₹35
ఎమ్ఆర్‌పి ₹285 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹250 మొదలుకుని
సోఫీ / స్టే ఫ్రీ / విస్పర్ సానిటరీ నేప్కిన్స్ (ఎంపిక శ్రేణి) (సెలెక్ట్ వేరియంట్స్)
స్మార్ట్ ప్రైస్ ₹99
ఎమ్ఆర్‌పి ₹120 మొదలుకుని
ఆదా చేసుకోండి ₹21 మొదలుకుని
సన్‌సిల్క్ / క్లినిక్ ప్లస్ షాంపు 340 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఆదా చేసుకోండి ₹120
ఎమ్ఆర్‌పి ₹393 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹273 మొదలుకుని
మెన్స్ అండ్ ఉమెన్స్ డియో 150 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఫ్లాట్ 55% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹275 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹124 మొదలుకుని
స్కూలుకు తయారవ్వడం
నోట్ బుక్
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹70 మొదలుకుని
Flair స్టూడియో / కానార్డ్ జెల్ పెన్ (ప్యాక్ తగ్గింపు 3 / 5)
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹50 మొదలుకుని
apsara పెన్సిల్స్
ఎమ్ఆర్‌పి ₹60
స్మార్ట్ ప్రైస్ ₹48
ఫ్లాట్ 50% తగ్గింపు
PRIORITY కార్గర్ బ్యాక్‌ప్యాక్
ఎమ్ఆర్‌పి ₹599 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹299 మొదలుకుని
LES డేప్యాక్
స్మార్ట్ ప్రైస్ ₹199
ఎమ్ఆర్‌పి ₹399
బాటిల్ / టిఫిన్ శ్రేణి
ఎమ్ఆర్‌పి ₹156 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹69 మొదలుకుని
కనీసం 5% తక్కువ ఎమ్ఆర్‌పి పై ప్రతిరోజు
చక్కెర 1 kg ₹9* ప్రతిరోజు
*₹1499 మరియు అంతకంటే మించిన షాపింగ్ పై
ఇప్పుడు తెరవబడింది
మాదాపూర్: ఇనార్బిట్ మాల్, ఎల్ 1.
SMART SUPERSTORE
SMART BAZAAR

> భయము, ప్రేమ, కోపము విడిచి నా మీద ధ్యాన కలవారై నన్ను ఉపాసించువారు
> ఎందరో జ్ఞాన తపనచే పవిత్రులై నా స్వరూపమును పొందిరి.
> – హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 7 జూన్ 2025

ఎట్టకేలకు జనగణన

దేశంలో జనగణన నిర్వహించబోతున్నట్టు ఆరేళ్ల సుదీర్ఘ జాప్యం అనంతరం బుధవారం అధికారిక ప్రకటన వెలువడింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈనెల 16న విడుదల చేస్తామని, 2027 మార్చి 1తో ఈ మొత్తం ప్రక్రియ పూర్తవుతుందని అందులో తెలియజేశారు. అంటే ఆ ఏడాది ఫిబ్రవరి 28తో జనగణనను ముగిస్తారన్నమాట. మంచు కురిసే లద్దాఖ్, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో వచ్చే ఏడాది అక్టోబర్ 1కల్లా జనగణన ప్రక్రియ ముగుస్తుంది. అంటే సెప్టెంబర్ నెలాఖరుకు జనగణన పూర్తవుతుంది. ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల కాబోతోంది. ఆ తర్వాతగానీ మెథడాలజీ తదితర వివరాలపై స్పష్టత రాదు. ప్రక్రియ ముగించదల్చుకున్న తేదీని గమనిస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి తుది గణాంకాలు వెల్లడికావొచ్చని తెలుస్తోంది. కనుక ప్రస్తుత లోక్‌సభ గడువు ముగిసేలోగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఉండకపోవచ్చు. స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి జనగణనతోపాటు కులగణన కూడా వుండబోతోంది. రాజకీయంగా, సామాజికంగా సంచలనం కలిగించగల కులగణన స్వరూప స్వభావాలేమిటో తెలియాలన్నా నోటిఫికేషన్ వచ్చేవరకూ ఆగాల్సిందే. జనగణన రెండు దశల్లో వుంటుంది. మంచుకురిసే ప్రాంతాలు మినహా దేశంలో మిగిలినచోట్ల వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్ నెలల్లో తొలి దశ ఉంటుంది. అందులో నివాస గృహాలు, వాటి యాజమాన్య వివరాలు, నివాసం వుండేవారి సంఖ్య, వారికి ఎలాంటి సౌకర్యాలున్నాయో, ఏయే వాహనాలున్నాయో లెక్కేస్తారు. రెండో దశలో ఇంటి యజమాని పేరు, ఆయన భార్యాపిల్లలు, విద్యార్హతలు, ఉద్యోగ వ్యాపార వివరాలు, ఆదాయ వనరులు, కులమతాలు వగైరాలు తెలుసుకుంటారు.


ప్రభుత్వాలకు డేటా ప్రాణప్రదమైనది. ఏ విధానం రూపొందించాలన్నా, ఏ పథకం ప్రవేశ పెట్టాలన్నా, ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా వాటి లబ్ధిదారులెందరు, ప్రభుత్వ నిర్ణయాల ప్రభావం ఎందరిపై పడుతుంది వగైరా అంశాలన్నీ అవసరమవుతాయి. దేశంలో పట్టణీకరణ విస్తృతి, స్త్రీ పురుష నిష్పత్తి, కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, వలసలు, నివాసగృహాల తీరుతెన్నులు వగైరాలన్నీ జనగణనలోనే వెల్లడవుతాయి. మహిళలకు అవసరమైన పథకాలకూ, దారిద్ర్య నిర్మూలన పథకాల రూపకల్పనకూ, గృహనిర్మాణం, ఉపాధి హామీ పథకం వంటివి ఎక్కడెక్కడ అవసరమో తేల్చడానికి జనగణనే ఆధారం. ఒక్కమాటలో చెప్పాలంటే దేశ సంపూర్ణ ముఖచిత్రం ఈ జనగణన ద్వారా ఆవిష్కృతమవుతుంది. ఆఖరుగా 2011లో జనగణన జరిగింది గనుక 2021లో వాస్తవంగా తదుపరి జనగణన వుండాలి. అది మొదలుకాబోతోందని 2019 డిసెంబర్‌లో కేంద్రం ప్రకటించింది కూడా. ఆ ప్రక్రియ తొలి దశ 2020లో మొదలయ్యేలోగానే కరోనా మహమ్మారి విరుచుకుపడటంతో జనగణన కాస్తా మూలనబడింది. ఆ తర్వాతైనా దాన్ని ప్రారంభించాలన్న ఆసక్తి కేంద్రంలో ఎందుకనో కనబడలేదు. కారణాలేమిటో కూడా చెప్పలేదు. కరోనా ప్రభావం తగ్గాక ప్రపంచంలో అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి 143 దేశాలు యుద్ధప్రాతిపదికన జనగణన పూర్తిచేశాయి. మనతోసహా 44 దేశాలు మాత్రమే దానికి దూరంగా వున్నాయి. కేంద్ర హోంశాఖ ప్రతినిధి చెప్పినట్టు అప్పుడు జనగణన పూర్తయిన దేశాల్లో లభ్యమైన డేటా నాణ్యమైనదీ, సమగ్రమైనదీ కాదని తేలివుండొచ్చు. కానీ విధాన నిర్ణయాల రూపకల్పనలో అక్కడి ప్రభుత్వాలకు ఎంతో కొంత పనికొచ్చింది. అసలు లేనిదానికన్నా ఇది మేలే. మన వరకూ చూస్తే జనగణన ఆలస్యం వల్ల విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్థితిగతులు వంటి 15 అతి కీలకమైన సర్వేలు నిలిచిపోయాయి. ఫలితంగా పథకాల అమలు చీకట్లో తడుములాటగా మిగిలింది.

దేశంలో చాలామంది, ముఖ్యంగా రాజకీయంగా చురుగ్గా ఉండదల్చుకున్నవారు ఎదురుచూసేది నియోజకవర్గాల పునర్విభజన గురించే. 1971 జనాభా లెక్కల ఆధారంగా 1973లో లోక్‌సభ స్థానాల సంఖ్యను 543గా నిర్ధారించారు. ఆ తర్వాత పునర్విభజన జోలికెళ్తే సమస్య లెదురవుతాయన్న భయంతో రెండు రాజ్యాంగ సవరణల ద్వారా దాన్నే కొనసాగిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లోనూ, తూర్పునున్న హిందీయేతర రాష్ట్రాల్లోనూ, దక్షిణాది రాష్ట్రాల్లోనూ కేంద్ర ప్రభుత్వ కుటుంబ నియంత్రణ సమర్థంగా అమలుకావటంతో జనాభా రేటు నియంత్రణలో వుంది. కానీ హిందీ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆ విషయంలో చొరవచూపలేదు. దాంతో అక్కడ జనాభా పెరిగింది. జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన ప్రక్రియవుంటుంది కనుక తమ ప్రాంతాల్లో లోక్‌సభ స్థానాలు గణనీయంగా తగ్గుతాయని హిందీయేతర రాష్ట్రాలు వాదిస్తున్నాయి. 2011నాటి జనగణన తుది ఫలితాలు 2013లో వెల్లడయ్యాయి. ఇప్పుడు కూడా అదే సమయంపడితే 2029లోగానీ పూర్తి ఫలితాలు రావు. ఆ తర్వాతే పునర్విభజన ప్రక్రియ ఉంటుందని భావించాలి.

జాప్యం మాటెలావున్నా జనగణన ప్రారంభం కాబోతోందన్న ప్రకటన హర్షించదగ్గది. సాధారణ ప్రజానీకానికి జనగణనపై పెద్దగా ఆసక్తివుండదు. కానీ విధాన నిర్ణేతలూ, విశ్లేషకులూ దీన్ని ప్రాణప్రదంగా భావిస్తారు. ఎందుకంటే అన్ని రకాల సర్వేలకూ ఇదే ప్రాతిపదిక. నేతలూ, పార్టీలూ సరేసరి. ఎవరినుద్దేశించి ఎలాంటి పథకాలు రూపొందించాలో, ఏ సమస్యల్ని ప్రధానంగా ప్రస్తావించాలో నిర్ణయించుకోవటానికి జనగణన తోడ్పడుతుంది. ఈ ప్రక్రియకు అధునాతన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవటం, పారదర్శకతకు చోటీయటం అవసరం. ఇక 1931 తర్వాత తొలిసారి కులగణన జరుగుతున్నందువల్ల వివాదాలు తలెత్తకుండా జాగరూకతతో వ్యవహరించాలి.

కలసి నడిస్తే... కట్టడి చేయొచ్చు!

అభిప్రాయం



రాజ్‌నాథ్ సింగ్

మానవాళి ఎదుర్కొంటున్న పెను విపత్తు ఉగ్రవాదం. ఇది నాగరిక సమాజపు అత్యున్నత విలువలకు మాయని మచ్చ. విప్లవం, బలిదానం, హింసను గొప్పగా చేసి చెప్పడం లాంటి తప్పుడు భావనలు ఉగ్రవాదం పెచ్చరిల్లడానికి ప్రాతిపదికలవుతున్నాయి. 'ఒకరికి స్వాతంత్ర్య యోధుడైనవాడు మరొకరికి ఉగ్రవాది' అన్న వాదన అతి ప్రమాదకరమైన అపోహ. భయమూ, రక్తపాతాలపై నిజమైన స్వతంత్రాన్ని ఎన్నటికీ నిర్మించలేం.

ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదులను పెంచుతున్నది భయమే. కానీ, ఆ భయాన్ని వ్యాపింపజేయడంలోనూ ఉగ్రవాదులు విఫలురయ్యారు. 26/11 దాడి, 2001లో భారత పార్లమెంటుపై దాడి, ఇటీవలి పహల్‌గామ్ దాడి... ఘటన ఏదయినా, భారత్ దృఢంగా నిలబడింది.

ఉగ్రవాదుల దుష్ట పన్నాగం

పాకిస్తాన్ నుంచి ప్రభుత్వ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదానికి దశాబ్దాలుగా మనం బాధితులం. పర్యాటకులను వారి మతమేమిటో అడిగి మరీ చంపేయడాన్ని బట్టి ఉగ్రవాదుల పన్నాగం స్పష్టమవుతోంది. దేశ ఐక్యతకు ముప్పు కలిగించాలన్న దురుద్దేశంతో, వివిధ విశ్వాసాలకు చెందిన పలు ఆధ్యాత్మిక ప్రదేశాలపై పాక్ దాడికి తెగబడటం కూడా ఇలాంటి చర్యే.

ఇలాంటి దుర్మార్గపు చర్యలను ఏ మతమూ ఆమోదించదు. ఉగ్రవాదులు వ్యూహాత్మకంగా మతాన్ని దుర్వినియోగం చేస్తూ, తమ ఆటవిక చర్యలకు సమర్థింపుగా దాన్ని వాడుకుంటున్నారు. ఈ మత దుర్వినియోగం ప్రమాదవశాత్తు జరిగినదో, లేదా హఠాత్పరిణామమో కాదు, ఇది ఉద్దేశపూర్వక పన్నాగం. దురాగతాలకు తప్పుడు సమర్థనలను చెప్పుకునే కుటిల వ్యూహం.

ఉగ్రవాదాన్ని ఎంతమాత్రమూ సహించబోమన్న విధానాన్ని భారత్ స్పష్టం చేసింది. ఉగ్రవాద చర్యలూ, చర్చలూ ఒకేసారి సాధ్యం కావు. భవిష్యత్తులో పాకిస్తాన్‌తో జరిగే ఏ చర్చలయినా ఉగ్రవాదం, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌పైనే ప్రధానంగా దృష్టి పెడతాయి. పాకిస్తాన్ నిజంగా ఉగ్రవాదాన్ని తీవ్రమైనదిగా పరిగణిస్తే ఐక్యరాజ్యసమితి గుర్తించిన హఫీజ్ సయీద్, మసూద్ అజార్ వంటి ఉగ్రవాదులను అప్పగించాలి.

పాక్ మూల్యం చెల్లించాలి!

మనం చాలాకాలంగా దీర్ఘకాలిక దృక్పథంతో, సమర్థమైన వ్యూహాలను అన్వేషిస్తూనే ఉగ్రవాద చర్యలపై ప్రతిస్పందించాం. మన సాయుధ దళాలకు గతంలో రక్షణాత్మక చర్యలకు మాత్రమే అనుమతి ఉండేది. సర్జికల్ స్ట్రైక్స్ (2016), బాలాకోట్ దాడులు (2019), ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ (2025)లతో పాక్‌లోని ఉగ్రవాదులు, ఉగ్రవాద సూత్రధారుల పట్ల తన వైఖరిలో భారత్ సమూల మార్పులు చేసింది. నైతిక, రాజకీయ అసమ్మతితోపాటు కేవలం రక్షణాత్మక వైఖరి ఇక సరిపోదని ఇప్పుడు తేటతెల్లమైంది. ఏ ఉగ్ర వాద చర్యనైనా ఇకపై యుద్ధ చర్యగానే పరిగణిస్తాం. భారత్‌పై ఏ ఉగ్రవాద దాడి జరిగినా... ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదానికీ ఉగ్రవాదులకూ తేడా లేదనే భావిస్తూ దీటుగా బదులిస్తాం. పాక్ తన గడ్డపై ఉగ్రవాదులను నిలువరించలేకపోతే, ఆ అసమర్థతకు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.



ఉగ్రవాదానికి ఆర్థిక చేయూతను నిరోధించడంపై న్యూఢిల్లీలో నిర్వహించిన 'నో మనీ ఫర్ టెర్రర్' మూడో మంత్రివర్గ సదస్సులో ప్రధాని మోదీ, ''ఒక్క దాడినీ తేలిగ్గా తీసుకోం, ఒక్క ప్రాణం పోయినా తీవ్రంగా పరిగణిస్తాం. కాబట్టి, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకలించే వరకు మేము విశ్రమించబోం'' అని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి మనం కట్టుబడి ఉన్నామని ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత ప్రభుత్వం, సాయుధ బలగాలు ప్రపంచానికి చాటాయి. స్పష్టమైన, కచ్చితమైన, తీవ్రతరం కాని ఆపరేషన్ ద్వారా, పాకిస్తాన్, పాక్ ఆక్రమిత జమ్మూ-కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను మనం లక్ష్యంగా చేసుకున్నాం.

ఉగ్రవాదులపై సైనిక చర్య ఆవశ్యకమనీ, కానీ అదొక్కటే సరిపోదనీ మనకు తెలుసు. పాక్ ఉగ్రవాదాన్ని సాధనంగా ఉపయోగిస్తుండటంతో... ఆ దేశాన్ని దౌత్యపరంగానూ, ఆర్థికంగానూ ఏకాకిని చేయడంలో భారత్ విజయం సాధించింది. పాక్ సీమాంతర ఉగ్రవాదానికి మద్దతివ్వడాన్ని పూర్తిగా మానేసే వరకూ, ఆ దిశగా విశ్వసనీయతను పొందే వరకూ సింధూ జలాల ఒప్పందాన్ని మనం 'నిలిపివేశాం'. ఈ నిర్ణయం పాక్‌పై భారీ ప్రభావాన్ని చూపుతుంది. ఆ దేశం తన 1.6 కోట్ల హెక్టార్ల వ్యవసాయ భూమికి 80%, మొత్తం నీటి వినియోగంలో 93% సింధూనది వ్యవస్థపైనే ఆధారపడుతుంది. అలాగే 23.7 కోట్ల మంది దీనిపై ఆధారపడి ఉండగా, పాక్ జీడీపీలో నాలుగో వంతుకు ఇదే దోహదపడుతోంది.

ఐదు కీలక చర్యలు!

ఉగ్రవాదం కేవలం భారత్ సమస్యే కాదు, ఇది ప్రపంచ సమస్య. అంతర్జాతీయ ఉగ్రవాద సూచీ (జీటీఐ) ప్రకారం– ఉగ్రవాద సంఘటనలను ఎదుర్కొంటున్న దేశాల సంఖ్య కొన్నేళ్లుగా పెరిగింది. ఉగ్రవాద వ్యవస్థలను సమర్థంగా నిర్వీర్యం చేయడానికీ, రాబోయే తరాలకు భద్రమైన భవిష్యత్తును అందించడానికీ మనం సమష్టిగా ముందుకు సాగాలి. సూత్రప్రాయమైన, సమగ్రమైన, స్థిరమైన, సమన్వయంతో కూడిన అంతర్జాతీయ వ్యూహాన్ని మనం అవలంబించాలి. ఈ దిశగా అయిదు కీలక చర్యలు తీసుకోవాలి.

మొదటిది: 'ఉగ్రవాదం' పదాన్ని నిర్వచించడం. ఉగ్రవాదమంటే ఏమిటన్న దానిపై ఏకాభిప్రాయం లేదు. భారత్ ప్రతిపాదన ఆధారంగా ఐక్యరాజ్యసమితిలో జరిగిన 'అంతర్జాతీయ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమగ్ర ఒడంబడిక'లో ఉగ్రవాద నిర్వచనం విషయంలో అతి సమీపంగా వచ్చాం. అర్థపరమైన అంశాలు ఉగ్రవాదంపై పోరాటాన్ని పరిమితం చేయకూడదు. ఉగ్రవాద చర్యల దర్యాప్తునకు లేదా విచారణకు లేదా విదేశాల నుంచి వారిని అప్పగించేందుకు విస్తృతంగా ఆమోదం పొందిన నిర్వచనం అవసరం.

రెండోది: ఉగ్రవాద సంస్థలవే కాకుండా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాల ఆర్థిక వనరులను కూడా స్తంభింపజేయాలి. పాక్‌కు ఇచ్చే నిధులు సైనిక–ఉగ్రవాద చర్యలు రెండింటితో ప్రపంచాన్ని అస్థిరపరచడానికే దారితీస్తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కాబట్టి, పాకిస్తాన్‌ను ఎఫ్‌ఏటీఎఫ్ తిరిగి గ్రే లిస్టులో చేర్చాల్సిన అవసరముంది.

మూడోది: పాకిస్తాన్‌లో ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తులు ఒకే నాణేనికి రెండు పార్శ్వాల వంటివని తెలిసిన విషయమే. ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయడం, సైనికాధికారులు యూనిఫామ్‌లో హాజరు కావడం దీన్ని మరింతగా తేటతెల్లం చేస్తోంది. పాకిస్తాన్‌లో అణ్వాయుధాలు ప్రభుత్వేతర సంస్థల చేతికి చేరే ప్రమాదం ఎప్పటికైనా ఉంది. అంతర్జాతీయ సమాజం ఈ తీవ్రమైన ప్రమాదాన్ని గుర్తించి, పాక్ అణ్వాయుధాలను అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) పర్యవేక్షణలో ఉంచాలి.

నాలుగోది: తమ సౌలభ్యం లేదా ప్రయోజనాల ప్రాతిపదికన మాత్రమే ఏ ఉగ్రవాద చర్యలను ఖండించాలో దేశాలు నిర్ణయించుకుంటే– అది సమష్టి బాధ్యతను బలహీనపరుస్తుంది. అటువంటి చర్యలకు అది వ్యూహాత్మకమైన సమర్థింపునూ అందిస్తుంది.

అయిదోది: కృత్రిమ మేధ, అటానమస్ సిస్టమ్స్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ వంటి అధునాతన సాంకేతికతలను కూడా స్వీకరిస్తున్న పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలు ప్రపంచమంతటికీ ప్రమాదకరమే. ఈ ముప్పులను అధిగమించడం కోసం అంతర్జాతీయ సహకారం అత్యావశ్యం.

9/11 దాడుల అనంతరం, ''ఉగ్రవాదానికి సంబంధించి ఏ సైద్ధాంతిక, రాజకీయ లేదా మతపరమైన సమర్థననైనా మనం దృఢంగా ఖండించాలి'' అని నాటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభలో పేర్కొన్నారు. ఏ రూపంలో ఉన్నా సరే, ఉగ్రవాదాన్ని నిర్మూలించాలన్న సంకల్పానికి భారత్ స్థిరంగా కట్టుబడి ఉంది. శాంతికాముక దేశాలన్నీ మాతో కలిసి రావాలని కోరుతున్నాం.

> ◆ ఉగ్రవాదమంటే ఏమిటన్న దానిపై ఏకాభిప్రాయం లేదు. అర్థపరమైన అంశాలు ఉగ్రవాదంపై పోరాటాన్ని పరిమితం చేయకూడదు. ఉగ్రవాద చర్యల దర్యాప్తునకు లేదా విదేశాల నుంచి వారిని అప్పగించేందుకు విస్తృతంగా ఆమోదం పొందిన నిర్వచనం అవసరం.

> ◆ తమ సౌలభ్యం లేదా ప్రయోజనాల ప్రాతిపదికన ఏ ఉగ్రవాద చర్యలను ఖండించాలో దేశాలు నిర్ణయించుకుంటే – అది సమష్టి బాధ్యతను బలహీన పరుస్తుంది.

వ్యాసకర్త భారత రక్షణ మంత్రి

సోషల్ మీడియా

వాళ్ళే బలిపశువులా?



అర్థంలేని విజయ యాత్రకు నిస్సంశయంగా అనుమతిని నిరాకరించిన అధికారులు బెంగళూరు పోలీసులు మాత్రమే! ఆర్సీబీ, కేఎస్‌సీఏ మళ్లీ మళ్లీ అనుమతి కోరడంతో, కర్ణాటక ప్రభుత్వం తమ పోలీసులను పట్టించుకోకుండా అనుమతించినట్టుంది. కానీ ఇప్పుడేమో ఆ పోలీసుల్నే సస్పెండ్ చేశారు.

– రుపికా పార్టీకర్, జర్నలిస్ట్

నాయకులదే బాధ్యత



ఉమ్మడిగా కర్ణాటక పాలక రాజకీయ నాయకులు, క్రికెట్ నిర్వాహకులు బుధవారం నాటి తొక్కిసలాట విషాదానికి బాధ్యులు. అవతలివారి ఘనతకు తాము పేరు కొట్టేయాలనే యావ, దురాశ దీనికంతటికీ కారణమయ్యాయి.

– రామచంద్ర గుహ, చరిత్రకారుడు

అదే ముఖ్యమా?



హంగరీకి వ్యతిరేకంగా ఉన్న యూరోపియన్ యూనియన్ న్యాయస్థానపు తాజా అభిప్రాయం సిగ్గుచేటు! చూస్తుంటే – చిన్నారుల హక్కులను కాపాడటం కన్నా, లైంగిక ప్రాపగాండా పట్ల భావస్వేచ్ఛే బ్రస్సెలియన్స్ (బెల్జియం, కోర్టుకెక్కిన దేశం)కు అధిక ప్రాధాన్యంలా ఉంది. ఇది పిచ్చితనం! (హంగరీ విధానం ఎల్జీబీటీక్యూ ప్లస్ పట్ల వ్యతిరేకంగా ఉందని ఈయూ న్యాయవాది అన్నారు.)

– అర్బాన్ విక్టర్, హంగరీ ప్రధాని

ఆపితే నయం!



నూతన పరిణామాల నేపథ్యంలో, 'స్టార్ లింక్' లైసెన్స్‌కు ఇచ్చిన సమ్మతి విషయంలో భారత ప్రభుత్వం పునరాలోచిస్తుందని అనుకుంటున్నా. భారత భద్రతా దృక్కోణంలో ఇది చాలా ప్రాముఖ్యం కలిగినది.

– ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ సభ్యురాలు

కోల్పోయిన స్నేహం



ఒక్కటైతే నిజం. ఎలాన్ మస్క్‌ను మించిన విధేయుడు, నమ్మకస్థుడు, నిష్కపటి అయిన స్నేహితుడు ఇంకెవరూ ట్రంప్‌కు దొరకరు.

– హసన్ సజ్వానీ, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

పాసైనా... రాని చదువు!

నేడు ప్రపంచవ్యాప్తంగా దిగువ, మధ్యాదాయ దేశాల పాఠశాల విద్యా వ్యవస్థలు తీవ్రమైన అభ్యసన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. భాష, గణితాలలో కనీస పునాది నైపుణ్యాలు లేకుండా ప్రాథమిక విద్యను పూర్తి చేస్తున్నారు. పదేళ్ల వయస్సు గల పిల్లలు తాము అభ్యసిస్తున్న మాధ్యమంలో భాషకు సంబంధించిన ఒక చిన్న పేరాగ్రాఫ్‌ను అర్థవంతంగా చదవలేని అశక్తతను అభ్యసన పేదరికంగా పరిగణిస్తారు. వివిధ దేశాలలో నెలకొని ఉన్న అభ్యసన సంక్షోభ స్థాయిని అంచనా వేసేందుకు ప్రపంచ బ్యాంకు, యునెస్కో గణాంకాల విభాగం సంయుక్తంగా ప్రస్తావించిన సూచికే ఈ అభ్యసన పేదరికం.

భారత్‌లో కోవిడ్‌కు ముందు 55%గా ఉన్న అభ్యసన పేదరికం నేడు 70%కి చేరుకుందని ప్రపంచ బ్యాంకు అంచనా. 'అర్థవంతంగా చదవటం'లో వెనుకబాటు విద్యార్థుల భవిష్యత్ అభ్యసనాన్నీ, వారి ఉపాధి అవకాశాలనూ బలహీన పరుస్తాయి. మూలధన అభివృద్ధికి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఆటంకం ఏర్పడుతుంది. అభ్యసన పేదరికంలో మగ్గుతున్న విద్యార్థులు అధిక శాతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న పేద, బలహీన వర్గాలవారు. భారత్‌లో నెలకొని ఉన్న బోధనా సంక్షోభం కారణంగానే ఈ పరిస్థితి.

తమిళనాడు ప్రభుత్వం ప్రాథమిక స్థాయి విద్యార్థుల పునాది నైపుణ్యాల పెంపుకు అమలు పరిచిన 'ఇల్లం తేడి కల్వి' (ఇంటి ముంగిటే విద్య) వంటి కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. తెలంగాణ మంత్రి ఒకరు ఖమ్మం జిల్లాలోని తన నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలలో ఏడవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులు బడికి ప్రయాణించే సమయాన్ని తగ్గించడానికి అందచేసిన 600కు పైగా సైకిళ్ళు, విద్యార్థినుల హాజరు శాతాన్ని పెంచాయి. పదవ తరగతి ఫలితాలలో మెరుగైన ఉత్తీర్ణతా శాతానికి కారణమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి అమలు పరిచిన 'నాడు–నేడు' కార్యక్రమం, పాఠశాలల స్థాయిలోని అన్ని తరగతుల్లో ఆంగ్ల మాధ్యమం అమలు, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంపుదలకు అమలు పరిచిన 'అమ్మ ఒడి' కార్యక్రమం, డిజిటల్ టెక్నాలజీ ద్వారా తరగతి గది బోధనా పర్యవేక్షణ వంటివి ఆ రాష్ట్రంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుదలకు దోహదపడ్డాయి. సత్ఫలితాలను ఇచ్చిన ఈ కార్యక్రమాలను రాజకీయ నాయకత్వాలకు అతీతంగా కొనసాగించాలి.

– ఏటూరి సోమశేఖర్ శర్మ,
విశ్రాంత జిల్లా విద్యా శాఖాధికారి, ఖమ్మం । 84640 98989

కార్పొరేట్ల కోసమేనా ఈ పాలన?

అభిప్రాయం



జూలకంటి రంగారెడ్డి

మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దేశంలో ఒక విపరీత ధోరణి కనిపిస్తోంది. ప్రజా సమస్యలు, వాటిపై జరిగే పోరాటాల నుంచి ప్రజలను పక్కదోవ పట్టించడానికి మతాన్ని రాజకీయాల్లోకి జొప్పించటం, సైనిక విజయాలను తమ ఇమేజ్‌ను పెంచుకోవడానికి వాడటం ఈ ధోరణి లక్షణాలు. ఇటీవలి పహల్‌గామ్ ఘటన ఇందుకు తాజా ఉదాహరణ.

గత ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ–కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో పర్యాటకులపై టెర్రరిస్టులు దాడి చేసి 26 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఈ విషయంలో పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరిచేందుకు కేంద్రం ససేమిరా అంటోంది. ప్రతిపక్షాల విజ్ఞప్తులను ఏమాత్రం పట్టించుకోకుండా బిహార్ సభలో పహల్‌గామ్ దారుణాన్ని ఎన్నికల అంశంగా మల్చుకునేందుకు వీలుగా ప్రధాని మోదీ ప్రసంగం కొనసాగింది. ఉగ్రవాదుల దాడిలో ఉగ్రవాదులను ప్రతిఘటిస్తూ తుపాకులు గుంజుకునే ప్రయత్నంలో స్థానిక ముస్లిం కూడా మరణించాడనే విషయాన్ని మనం ఇక్కడ గుర్తు పెట్టుకోవాలి.

'ఆపరేషన్ సిందూర్' పేరుతో జమ్మూ–కశ్మీర్ సరిహద్దుల్లో టెర్రరిస్టు స్థావరాల మీద మన సైన్యం నాలుగు రోజులపాటు దాడులు జరిపింది. ఈ సందర్భంగా, మన దేశం గుండా పాకిస్తాన్‌కు ప్రవహించే నది జలాలను నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఆ దేశంలోని వైమానిక స్థావరాల మీద దీటుగా ప్రతి దాడులు నిర్వహించినట్టు ఢిల్లీ ప్రభుత్వం ఉత్కంఠ భరితమైన వార్తలను జనం మీదికి వదిలింది.

మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి విజయ్ షా, భారత ఆర్మీ అధికారిణి కల్నల్ సోఫియా ఖురేషి మతాన్ని ఎత్తిచూపుతూ బహిరంగంగా ఆమె మీద మతోన్మాద వ్యాఖ్యలు చేశారు. అయినా ఆయనపై ఆ పార్టీ ఎలాంటి చర్య తీసుకోకపోవటం విస్మయకరం. తన నాయకత్వంలో విశ్వగురుగా భారత్ అవతరిస్తుందని చెప్పుకునే ప్రధాని కంటే ముందే మూడో పక్షం (ట్రంప్) భారత్–పాక్‌ల యుద్ధ విరమణ ప్రకటన చేయడం విషాదం.



> ◆ అడవుల్లో జీవిస్తున్న ఆదివాసీలను బయటకు పంపించి, ఆ ప్రాంతాలను మైనింగ్ కోసం కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారు.

ఈ క్రమంలో దేశంలో ప్రధాన సమస్యలను పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ పాలకులు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ప్రజల ఆస్తిగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్లకు చౌకగా అమ్ముతున్నారు. రైల్వే, ఎయిర్ వేస్, టెలికాం, ఓడరేవులు తదితర మౌలిక రంగాలను 'నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్' పేర కార్పొరేట్లకు అప్పగిస్తున్నారు. మైనింగ్ కోసం అటవీ ప్రాంతాల్లో జీవిస్తున్న ఆదివాసీలను బయటకు పంపించి, ఆ ప్రాంతాలను ప్రైవేట్ కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకు పాలకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే 'ఆపరేషన్ గ్రీన్ హంట్', 'ఆపరేషన్ కగార్'ల పేరు మీద ఆదివాసీ జనావాసాల మీద యుద్ధం ప్రారంభించారు. ఇటీవలి కొద్ది నెలల్లో దాదాపు 400 మంది ఆదివాసీలు, మావోయిస్టులు చనిపోయారు. చర్చలకు సిద్ధమని ప్రకటించిన తర్వాత కూడా మావోయిస్టుల మీద ఏకపక్షంగా కాల్పులు కొనసాగాయి.

ప్రజల ఆర్థిక స్వావలంబనను, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధంగా కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలను అనుసరించడం వల్ల ప్రస్తుతం దేశంలోని అన్ని వర్గాల ప్రజలు జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్నారు. రైతుల శ్రమను కార్పొరేట్‌పరం చేసేందుకు లోగడ మూడు రైతు చట్టాల్ని ప్రవేశపెట్టి రైతు ఉద్యమం కారణంగా వెనక్కి తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను సవరించే ప్రయత్నాల్లో ఉంది. 'ఒకే దేశం–ఒకే భాష' పేరు మీద బలవంతంగా హిందీని రుద్దేందుకు, 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అంటూ ప్రాంతీయ పార్టీలను, తమ ప్రత్యర్థి పక్షాలను దెబ్బ కొట్టేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోంది. పార్లమెంటు స్థానాల పునర్విభజనతో తమకు అనుకూలంగా లేని దక్షిణాది రాష్ట్రాల ప్రజాభిప్రాయాన్ని అధిగమించడానికి, ఉత్తరాది రాష్ట్రాలలో పెద్ద ఎత్తున పార్లమెంట్ స్థానాల సంఖ్యను మరింత పెంచుకోవడానికి ఇది ఆ పార్టీ నాయకత్వం దురాలోచన. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు, ఫాసిస్ట్ పాలనకు వ్యతిరేకంగా సమస్త వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాసకర్త సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

త్యాగానికి ప్రతీక

మనం బక్రీద్ అని పిలుచుకునే 'ఈదుల్ అజ్‌హా' మహా పర్వదినం, త్యాగానికి, సహనానికి ప్రతీక. ప్రతి సంవత్సరం జుల్ హజ్ మాసంలో జరుపుకొనే ఈ పండుగ, ప్రవక్త ఇబ్రాహీం (అ), ఇస్మాయీల్ (అ)ల అత్యున్నత అంకితభావాన్నీ, దైవం పట్ల వారికున్న విధేయతనూ తెలియజేస్తుంది.

ఈ నెలలో మక్కాలో జరిగే హజ్ యాత్రతో ఈ పండుగకు సంబంధం ఉంది. ఆర్థిక స్తోమత కలిగినవారు హజ్‌కు వెళ్ళగలిగితే, వెళ్ళలేనివారు ఖుర్బానీ ద్వారా ఆ పుణ్యఫలాన్ని పొందగలిగే అవకాశం ఉంది. ఇది కేవలం ఆనందోత్సవం మాత్రమే కాదు, హృదయాన్ని శుద్ధి చేసుకునే ప్రక్రియ. స్వార్థాన్ని త్యజించడం, అవసరార్థులకు సహాయం చేయడం, దయాభావం కలిగి ఉండడం; సామాజిక, మానవీయ సేవలు అందించడం వంటి విలువలు ఇందులో నిగూఢంగా ప్రతిఫలిస్తాయి. బక్రీద్ అంటే కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, త్యాగంతో కూడిన జీవితం ఎంత గొప్పదో సమాజానికి ఒక సందేశం కూడా! తమ అవసరాలను కొంత మేర నియంత్రించుకొని పేదసాదలతో ఆనందాన్ని పంచుకోవడం ఖుర్బానీని మూడు భాగాలుగా విభజించి ఒక భాగం తమ సొంతానికి, రెండవ భాగం బంధువులకు, మూడవ భాగం పేదసాదలకు ఇస్తారు. ఈ చర్యలో పరోపకారం, ఇతరుల పట్ల మన బాధ్యత, మానవీయ సుగుణం వ్యక్తమవుతాయి.



ఒకరినొకరు పట్టించుకోకుండా, అంటీ ముట్టనట్లు ఉంటున్న ఈ కాలంలో బక్రీద్ మనల్ని ఒక్కటిగా ఉండమని, సమానత్వాన్ని అలవరచుకోమని, అసహనానికి దూరంగా ఉండి సోదరులుగా మానవతా విలువల దిశగా నడవమని పిలుపునిస్తోంది.


ఈ పవిత్ర దినాన మన జీవితాల్లో త్యాగానికి స్థానం ఇవ్వాలి. సమాజం పట్ల బాధ్యతను గుర్తించాలి. పొరుగువాడి ఆకలిని మన ఆకలిగా భావించాలి. అదే నిజమైన ఖుర్బానీ స్ఫూర్తి. ఎందుకంటే, 'మీరు కడుపు నిండా భుజించి, మీ పక్కన ఉన్న పొరుగువారు ఆకలితో గనక ఉన్నట్లయితే మీలో విశ్వాసం గాని, మానవత్వంగాని లేవు' అన్నారు ప్రవక్త మహనీయులు సల్లల్లాహు అలైహివసల్లం.

కనుక ఇరుగు పొరుగు పట్ల, సమాజం పట్ల బాధ్యతను నెరవేరుస్తూ పండుగ జరుపుకొంటే అదీ నిజమైన పండుగరోజు. అదే నిజమైన ఆనందం.

– మదీహా అర్జుమంద్
(నేడు ఈదుల్ అజ్‌హా పర్వదినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.ద్వాదశి పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** చిత్త ఉ.10.07 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** సా.4.20 నుండి 6.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.02 నుండి 7.13 వరకు, **అమృతఘడియలు:** రా.2.57 నుండి 4.44 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.28.



‘టాస్క్’ ద్వారా 6 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

- మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులకు ఆధునాతన సాంకేతిక శిక్షణ అందించి దాదాపు ఆరు వేల మందికి ఈ సంవత్సరంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్(టాస్క్)ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. ‘టాస్క్’కార్యక్రమాలను మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం సచివాలయంలో ఆ విభాగం ఉన్నతాధికారులతో సమీక్షించారు. గత సంవత్సరంలో 4,100 మంది ఉద్యోగాలు పొందడంలో టాస్క్ క్రియాశీలకంగా వ్యవహరించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. నిరుద్యోగులు, విద్యార్థులకు నైపుణ్యాలను అందించడంలో టాస్క్ గణనీయమైన పురోగతి సాధించిందని మంత్రి చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తగిన విధంగా ఆయా విభాగాల్లో నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాలు పొందడంలో సాయం చేస్తున్నట్టు వివరించారు. గడిచిన ఏడాది కాలంలో టాస్క్ సంస్థ రికార్డు స్థాయిలో 1,37,677 మంది విద్యార్థులు, 2,791 మంది ఫ్యాకల్టీ సభ్యులకు వివిధ సాంకేతిక, నైపుణ్య అంశాల్లో శిక్షణ అందించిందని మంత్రి వెల్లడించారు. ‘21 జిల్లాల్లోని 148 కళాశాలలు, పలు కంపెనీల ప్రాంగణాల్లో నిర్వహించిన జాబ్ మేళాల్లో 4,100 మంది ప్రతిభావంతులు ఉద్యోగాలు పొందడంలో టాస్క్ కీలక పాత్ర పోషించింది. వెరిస్క్ ఎనలైటిక్స్ అనే అమెరికన్ కంపెనీ హైదరాబాద్ క్యాంపస్ కోసం ఏడాదికి రూ.11 లక్షల ప్యాకేజీతో సాంకేతిక నిపుణులను ఎంపిక చేసుకుంది’ అని మంత్రి వివరించారు.

సింగరేణి కార్మికుడి కుటుంబానికి రూ.కోటి బీమా

- చెక్కు అందజేసిన సంస్థ డైరెక్టర్లు



మూల్‌చంద్ సతీమణికి బీమా చెక్కు అందజేస్తున్న సింగరేణి డైరెక్టర్లు, బ్యాంకు అధికారులు

సింగరేణి(కొత్తగూడెం)/మణుగూరు టౌన్: ఉద్యోగులకు రూ.కోటికి పైగా బీమా అమలుతో సింగరేణి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఈపీ ఆపరేటర్ మూల్‌చంద్ విశ్వకర్మ ఇటీవల మణుగూరులో మృతి చెందారు. ఆయన సతీమణి హరిదేవికి కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు రూ.కోటి బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ బలరామ్ మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రం, ప్రభుత్వ సంస్థల్లో లేనివిధంగా సింగరేణి ఉద్యోగుల కోసం తొలిసారి ఎస్‌బీఐ అధికారులతో చర్చించి గరిష్టంగా రూ.1.25 కోట్ల బీమా పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చామని తెలిపారు. బ్యాంకులో వేతన ఖాతా కలిగి.. ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. సింగరేణిలో అమలు చేశాక.. ఇదే విధానాన్ని అస్సాం, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలతో పాటు కోల్ ఇండియాలోనూ అమల్లోకి తీసుకొచ్చారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు కూడా రూ.40 లక్షల ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని సీఎండీ వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఎస్‌బీఐ డీజీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో టీజీ ఐసెట్

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో టీజీ ఐసెట్–2025 ప్రవేశ పరీక్షలు నిర్వహించేందుకు యూనివర్సిటీ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈనెల 8, 9 తేదీల్లో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు నిర్వహించే ఈ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు టీజీ ఐసెట్ కన్వీనర్, ఎంజీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఈనెల 8న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు మొదటి విడత, మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు రెండో విడత జరుగుతుందన్నారు. 9న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు ఒకే విడత నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 96 కేంద్రాల్లో పరీక్ష జరగనుంది. మొత్తం 71,757 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. హాల్ టికెట్లను టీజీ ఐసెట్ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్లు పొందుపరిచిన క్యూఆర్ కోడ్ ద్వారా విద్యార్థులు తమ పరీక్ష కేంద్రాలను సులువుగా గుర్తించవచ్చన్నారు. అభ్యర్థులు ఒక గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లతో పాటు ప్రభుత్వం ఆమోదించిన ఏదైనా ఐడీ కార్డును తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. హాల్‌టికెట్‌లో ఉన్న సూచనలను అభ్యర్థులు విధిగా పాటించాలన్నారు.

17 నుంచి ‘ఆర్‌ఎఫ్‌సీఎల్’ పునఃప్రారంభం !

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారం (ఆర్‌ఎఫ్‌సీఎల్) నుంచి యూరియా ఉత్పత్తిని పునఃప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. వార్షిక మరమ్మతుల నేపథ్యంలో మే 6న యూరియా ఉత్పత్తి నిలిచిపోయిన విషయం తెలిసిందే. 31 రోజులుగా ఉత్పత్తి నిలిచిపోవడంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడింది. ఇప్పటికే వానాకాలం సీజన్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులపై ఒత్తిడి తేవడంతో సీఈవో అలోక్ సింఘాల్ 15 రోజులుగా వార్షిక మరమ్మతుల్లో వేగం పెంచేలా పర్యవేక్షిస్తున్నారు. ప్లాంట్ షట్‌డౌన్ పనులు పూర్తిచేసి ఈనెల 17న ఉత్పత్తి పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆదాయం మూరెడు.. ఖర్చు బారెడు

- రూ.4,023 కోట్ల లోటుతో ప్రారంభమైన 2025–26 ఆర్థిక సంవత్సరం
- అప్పులతో కలిపి ఏప్రిల్‌లో రాబడులు రూ.16,473.99 కోట్లు మాత్రమే
- ఏప్రిల్‌లో పన్నుల రూపంలో వచ్చిన ఆదాయం రూ.10,916.68 కోట్లు
- రూ.12 వేల కోట్లు దాటిన అనివార్య చెల్లింపులు
- రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ముఖచిత్రాన్ని వెల్లడించిన కాగ్ నివేదిక

గత ఏడాది, ప్రస్తుత ఏడాది ఏప్రిల్ నెలల్లో పన్ను రాబడుల వివరాలు (రూ.కోట్లలో):

పన్ను రాబడి	ఏప్రిల్-2024	ఏప్రిల్-2025
జీఎస్టీ	4,475.57	4,054.14
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	1,116.33	1,126.18
అమ్మకపు పన్ను	2,661.,10	2,703.53
ఎక్సైజ్	1,580.43	1,288.00
కేంద్ర పన్నుల్లో వాటా	908.87	1,096.31
ఇతర పన్నులు	721.86	648.27



(ఇవి కాకుండా పన్నేతర ఆదాయం రూపంలో 2024 ఏప్రిల్‌లో రూ.354.71 కోట్లు, 2025 ఏప్రిల్‌లో రూ.253.60 కోట్లు ఖజానాకు సమకూరాయి.)

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త ఆర్థిక సంవత్సరం భారీ ద్రవ్యలోటుతో ప్రారంభమైంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో తొలి మాసమైన 2025, ఏప్రిల్ నెలలో రూ.4,023.11 కోట్ల ద్రవ్యలోటు నమోదైనట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో రూ.1,020 కోట్ల ద్రవ్య మిగులుతో ప్రారంభం కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో పన్ను రాబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయని కాగ్ నివేదిక చెబుతోంది. ఆ నెలలో రూ.10,916.68 కోట్లు పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యాయి. గత ఏడాది ఏప్రిల్ నెలలో పన్నుల రూపంలో రూ.11.464.17 కోట్లు వచ్చాయి. అయితే, ఈ ఏడాది అప్పులతో కలిపి ఏప్రిల్‌లో రూ.16,473.99 కోట్లు వచ్చాయి. ఇందులో అప్పు రూ. 5,230.99 కోట్లు.

ఖర్చులు అనివార్యం

ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభ నెలలో రెవెన్యూ ఖర్చు రూ.15,262 కోట్లుగా నమోదైంది. ఇందులో గత అప్పులకు వడ్డీల చెల్లింపులు రూ.2,260 కోట్లు, వేతనాలకు రూ.3,968 కోట్లు, పింఛన్ల రూపంలో రూ.1,569 కోట్లు, సబ్సిడీల కింద రూ.4,187 కోట్లు, రెవెన్యూ పద్దు కింద రూ.3,275 కోట్లు ఖర్చయ్యాయి. మూలధన వ్యయం కింద రూ.1,204 కోట్లు కలిపి మొత్తం ఖర్చు రూ.16,466.63 కోట్లుగా నమోదైంది.

ఏటా 14 లక్షల మంది ఇంజనీర్లు

- ఎస్సార్ స్నాతకోత్సవంలో డాక్టర్ సతీశ్‌రెడ్డి



స్నాతకోత్సవంలో డాక్టర్ సతీశ్‌రెడ్డి, ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి

హసన్‌పర్తి: దేశవ్యాప్తంగా ఏటా 14 లక్షల మంది ఇంజనీర్లు తయారవుతున్నారని ఏపీ ప్రభుత్వ ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారుడు సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన మూడవ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డ్రోన్స్, రాడార్లు, మిస్సైల్ వ్యవస్థల ద్వారా భారత్ తనశక్తిని ప్రపంచానికి చాటిందన్నారు. దేశం విద్యారంగంలో ముందుకు దూసుకెళ్తోందని పేర్కొన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంజనీరింగ్ బిజినెస్, వ్యవసాయం, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ వంటి రంగాల్లో బీఏ, ఎంఏ, పీహెచ్‌డీ స్థాయిల్లో వరుసగా 17 బ్యాచిలర్ ప్రోగ్రామ్స్, 16 మాస్టర్స్ ప్రోగ్రామ్స్, 18 డాక్టరల్ ప్రోగ్రామ్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విద్యార్థులకు పట్టాలు అందజేశారు. అలాగే ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణికి వరదారెడ్డి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, ప్రొ. వైస్‌చాన్స్‌లర్లు మధుకర్‌రెడ్డి, మహేశ్‌తోపాటు పలు విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆగస్టు 3న నీట్‌-పీజీ పరీక్ష

సాక్షి, న్యూఢిల్లీ: నీట్‌–పీజీ–2025 పరీక్ష తేదీ మార్పునకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ పరీక్ష జూన్‌ 15కి బదులుగా ఆగస్టు 3వ తేదీన జరుగనుంది. ఈ ఏడాది నీట్‌–పీజీ పరీక్షను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించాలని నేషనల్‌ ఎగ్జామినేషన్‌ బోర్డును సుప్రీంకోర్టు మే 30న ఆదేశించిన సంగతి తెలిసిందే. ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేయడానికి తగినంత సమయం కావాలని, ఆగస్టు 3న నిర్వహిస్తామని నేషనల్‌ ఎగ్జామినేషన్‌ బోర్డు కోరగా, సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం అంగీకరించింది. ఇకపై గడువు పొడిగింపు ఇవ్వలేమని స్పష్టం చేసింది.

కెనడా ప్రధాని కార్నీ ఆహ్వానం
జీ7 భేటీకి వెళ్లనున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: కెనడాలో ఈ నెల 15–17 తేదీల్లో జరిగే ప్రముఖ పారిశ్రామిక దేశాల నేతల జీ7 శిఖరాగ్రానికి వెళ్లాలని ప్రధాని మోదీ నిర్ణయించుకున్నారు. కెనడా ప్రధాని మార్క్‌ కార్నీ శుక్రవారం మొట్టమొదటిసారిగా ప్రధాని మోదీకి ఫోన్‌ చేశారు. జీ7 భేటీకి రావాలంటూ ఆయన ఇచ్చిన ఆహ్వానంపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. 'కెనడా ప్రధాని కార్నే నుంచి ఫోన్‌ కాల్‌ వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఇటీవలి ఎన్నికల్లో విజయం సాధించి, ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కార్నేను అభినందించాను. జీ7 భేటీకి ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపాను'అని మోదీ అనంతరం 'ఎక్స్‌'లో పేర్కొన్నారు. కెనడాలో ఖలిస్తాన్‌ ఉగ్రవాది నిజ్జర్‌ హత్యతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే జీ7 భేటీకి మోదీని ఆహ్వానించడం ఆలస్యం కావడంతో ఆయన వెళ్లకపోవచ్చనే వార్తలు వచ్చాయి.

వచ్చే ఏప్రిల్‌లో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు

ఢాకా: బంగ్లాదేశ్‌లోని మహ్మద్‌ యూనస్‌ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల తేదీని ప్రకటించింది. 2026 ఏప్రిల్‌ 15వ తేదీలోగా నిర్వహించనున్నట్లు తెలిపింది. ప్రధాన రాజకీయ పార్టీలు డిసెంబర్‌లోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌ చేస్తున్న వేళ కొత్త తేదీని ప్రకటించడం గమనార్హం. సవివర ఎన్నికల రోడ్‌ మ్యాప్‌ను ఎన్నికల కమిషన్‌ త్వరలోనే నిర్ణయిస్తుందని యూనుస్‌ తెలిపారు. గతేడాది ఆగస్ట్‌లో ప్రజా ఉద్యమం నేపథ్యంలో ప్రధాని షేక్‌ హసీనా సారథ్యంలోని అవామీ లీగ్‌ ప్రభుత్వం గద్దెదిగడం తెల్సిందే. దేశంలో నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడమనే ప్రధాన బాధ్యతతో అనంతరం యూనుస్‌(84) సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది.

మానవత్వంపై పాక్‌ దాడి

మత ఘర్షణలు సృష్టించాలన్నదే పొరుగు దేశం లక్ష్యం

- జమ్మూకశ్మీర్‌ ప్రజల నోటి వద్ద ముద్ద లాగేసుకోవాలని కుట్ర చేశారు
- ప్రధానమంత్రి మోదీ ఆగ్రహం
- జమ్మూకశ్మీర్‌లో రూ. 46 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం
- రెండు కీలక వంతెనలు ప్రారంభించిన మోదీ



కాట్రా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాకిస్తాన్‌పై మరోసారి విరుచుకుపడ్డారు. పహల్గాంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా మానవత్వంపై, కశ్మీర్‌ గుర్తింపుపై దాడి చేసిందని నిప్పులు చెరిగారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టడం, ప్రజల మధ్య ఘర్షణలు సృష్టించడం, కశ్మీర్‌ ప్రజల జీవనోపాధిపై దెబ్బకొట్టి నోటిదగ్గర ముద్ద లాగేసుకోవడమే పాకిస్తాన్‌ అసలు లక్ష్యమని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ శుక్రవారం జమ్మూకశ్మీర్‌లో రియాసీ జిల్లాలోని కాట్రాలో పర్యటించారు. రూ.46,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. 272 కిలోమీటర్ల ఉధంపూర్‌–శ్రీనగర్‌–బారాముల్లా రైల్వేలింక్‌(యూఎస్‌బీఆర్‌ఎల్‌) ప్రాజెక్టులో భాగమైన చినాబ్‌ రైల్వే బ్రిడ్జితోపాటు అంజి వంతెన ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. త్రివర్ణ పతాకం చేతబూని చినాబ్‌ బ్రిడ్జిపై కాసేపు నడిచారు. అనంతరం వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌ ప్రారంభించారు. చినాబ్‌, అంజి వంతెనలపై వందే భారత్‌ రైలులో ప్రయాణించారు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత మోదీ జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ సందర్భంగా కాట్రాలో భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మన పొరుగు దేశం మానవత్వం, సామాజిక సామరస్యం, ఆర్థికాభివృద్ధికి ముమ్మాటికీ వ్యతిరేకమని ఆరోపించారు. పేదలు పిడికెడు అన్నం తినడం కూడా ఆ దేశానికి ఇష్టం లేదని విమర్శించారు. పర్యాటక రంగం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించడమే కాకుండా ప్రజల మధ్య ఐక్యత పెంచుతుందని తెలిపారు. పర్యాటక రంగాన్ని నాశనం చేసి, కశ్మీర్‌ ప్రజల పొట్టకొట్టాలని చూసిందని పాకిస్తాన్‌పై మండిపడ్డారు. ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

జమ్మూకశ్మీర్‌లో శాంతి సౌభాగ్యాలు

''రూ.46,000 కోట్ల విలువైన ప్రాజెక్టులతో జమ్మూకశ్మీర్‌ అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుంది. శాంతి సౌభాగ్యాలు విలసిల్లుతాయి. జమ్మూకశ్మీర్‌ ప్రగతిని అడ్డుకోవడానికి పాకిస్తాన్‌ పదేపదే కుట్రలు సాగిస్తోంది. గత కొన్నేళ్లుగా రికార్డు స్థాయిలో పర్యాటకులు వస్తుండడం పొరుగు దేశానికి కంటగింపుగా మారింది. అందుకే పహల్గాంలో దాడులకు పాల్పడింది. ఇక్కడ పర్యాటక రంగం కుప్పకూలితే స్థానికులు ఉపాధి కోల్పోతారు. పర్యాటకంపై వచ్చే ఆదాయంతో జీవిస్తున్న పేద కుటుంబాలు రోడ్డున పడతాయి. పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసినప్పుడు ఆదిల్‌ హుస్సేన్‌ షా ధైర్యంగా ఎదుర్కొంనేందుకు ప్రయత్నించాడు. గుర్రంపై పర్యాటకులను తీసుకెళ్తూ వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకొనే ఆ యువకుడు ముష్కరుల దాడిలో బలైపోవడం నన్ను కలచివేసింది. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదులను ఎగదోస్తున్న పాకిస్తాన్‌కు ఆపరేషన్‌ సిందూర్‌తో గట్టిగా బుద్ధి చెప్పాం. ఇకపై ఆపరేషన్‌ సిందూర్‌ పేరు విన్నప్పుడల్లా పాకిస్తాన్‌కు సిగ్గుచేటైన పరాజయమే గుర్తుకొస్తుంది.

బడి పిల్లలపై బాంబు దాడులా?

పహల్గాంలో ఉగ్రవాద దాడి జరగ్గానే వేగంగా స్పందించాం. మనం తీసుకున్న చర్యలను పాకిస్తాన్‌ సైన్యం గానీ, ఉగ్రవాద ముఠాలు గానీ ఊహించలేకపోయాయి. పాకిస్తాన్‌ భూభాగంలోకి ప్రవేశించి, ఉగ్రవాదులు మౌలిక సదుపాయాలను, వైమానిక స్థావరాలను నిమిషాల వ్యవధిలోనే శిథిలాలుగా మార్చేశాం. దశాబ్దాలపాటు నిర్మించుకున్న స్థావరాలను నేలమట్టం చేశాం. మన సైనిక శక్తిని తట్టుకోలేక పాకిస్తాన్‌ సైన్యం ఆక్రోశంతో పూంచ్‌తోపాటు సరిహద్దు జిల్లాల్లో దాడులకు దిగింది. స్కూల్‌కు వెళ్లే పిల్లలపై బాంబులు విసిరింది. స్కూళ్లు, ఆసుపత్రులు, ఆలయాలు, మసీదులు, గురుద్వారాలపై దాడులకు పాల్పడింది. మన దేశంలో ప్రజలంతా బాధితులకు అండగా నిలిచారు. పాకిస్తాన్‌ దాడుల్లో మరణించినవారి కుటుంబాలను ఆదుకుంటాం. ఉద్యోగాలు కల్పిస్తాం. ఆర్థిక సాయం అందిస్తాం. బాంబు దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లకు పరిహారం చెల్లిస్తాం.

యువత కలలు సాకారం

జమ్మూకశ్మీర్‌లో ప్రజలు గతంలో ఉగ్రవాదానికి అలవాటు పడిపోయారు. ఎంతో మంది తమ కలలు వదిలేసుకోవాల్సి వచ్చింది. హింసాకాండను అంతా తమ తలరాత అనుకున్నారు. కానీ, కేంద్రంలో మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జమ్మూకశ్మీర్‌ యువత మళ్లీ కలలు కంటున్నారు, వాటిని సాకారం చేసుకుంటున్నారు. జనంతో కిక్కిరిసిపోయిన మార్కెట్లు, సందడితో వెలిగిపోతున్న షాపింగ్‌ మాల్స్‌, సినిమా హాళ్లను ప్రత్యక్షంగా చూస్తూ సంబర పడుతున్నారు. ఇక్కడ ఎంబీబీఎస్‌ సీట్లు 500 నుంచి 1,300కు చేరాయి. పహల్గాం లాంటి దాడులతో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. జమ్మూకశ్మీర్‌ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. జమ్మూకశ్మీర్‌ యువత కలలను ఛిద్రం చేయాలనుకుంటే అంతకంటే ముందు మోదీని ఎదుర్కోవాలన్న సంగతిని ప్రత్యర్థులు గుర్తుపెట్టుకోవాలి. ఉగ్రవాదానికి మర్చిపోలేని గుణపాఠం నేర్పాలని జమ్మూకశ్మీర్‌ యువత నిర్ణయించుకున్నారు. ఉధంపూర్‌–శ్రీనగర్‌–బారాముల్లా రైల్వే లైన్‌ ప్రాజెక్టు నూతన, సాధికార జమ్మూకశ్మీర్‌కు ప్రతీక. భారత నవశక్తికి ఉదాహరణ. చినాబ్‌, అంజి వంతెనలు జమ్మూకశ్మీర్‌ సౌభాగ్యానికి గవాక్షాలుగా నిలుస్తాయి. ఇక్కడి మెగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు జమ్మూకశ్మీర్‌ అభివృద్ధి ప్రయాణంలో కీలక మైలురాళ్లు. కశ్మీర్‌ నుంచి కన్యాకుమారి అని తరచుగా అంటుంటాం. రైల్వే ప్రాజెక్టుతో అది వాస్తవ రూపం దాల్చింది'' అని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

ఆయనకు ప్రమోషన్‌, నాకు డిమోషన్‌

జమ్మూకశ్మీర్‌కు సాధ్యమైనంత త్వరగా రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి ఒమర్‌ అబ్దుల్లా ప్రధాని మోదీని కోరారు. కాట్రా సభలో ఆయన మాట్లాడుతూ ఈ అంశాన్ని లేవనెత్తారు. గతంలో పూర్తిస్థాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న తాను ఇప్పుడు కేంద్ర పాలిత ప్రాంతానికి ముఖ్యమంత్రిగా పని చేస్తున్నానని సరదాగా వ్యాఖ్యానించారు. ''2014లో మోదీ తొలిసారి ప్రధానమంత్రి అయిన తర్వాత జమ్మూకశ్మీర్‌కు వచ్చారు. కాట్రా రైల్వే స్టేషన్‌ ప్రారంభించారు. అప్పట్లో నేను జమ్మూకశ్మీర్‌కు ముఖ్యమంత్రిగా పని చేస్తున్నా. మోదీ ప్రస్తుతం మూడోసారి ప్రధానమంత్రిగా వ్యవహరిస్తున్నారు. అప్పట్లో మనోజ్‌ సిన్హా రైల్వే శాఖ సహాయ మంత్రిగా ఉండేవారు. ఆయన ఇప్పుడు జమ్మూకశ్మీర్‌ లెఫ్టినెంట్‌ గవర్నర్‌గా ఎదిగారు. మనోజ్‌ సిన్హాకు ప్రమోషన్‌, నాకు డిమోషన్‌ లభించాయి. నాకు త్వరలో పదోన్నతి కల్పిస్తారని ఆశిస్తున్నా'' అని ఒమర్‌ అబ్దుల్లా పేర్కొన్నారు.



ప్రధాని మోదీతో ఒమర్‌ అబ్దుల్లా



మోదీ పచ్చజెండా ఊపి ప్రారంభించిన వందేభారత్‌ రైలు చినాబ్‌ బ్రిడ్జి మీదుగా వెళ్తున్న దృశ్యం

జమ్మూ కశ్మీర్‌లో శుక్రవారం ప్రారంభించిన చినాబ్‌ బ్రిడ్జిపై త్రివర్ణ పతాకం ధరించి నడుస్తున్న మోదీ

ఇంజనీరింగ్‌ అద్భుతం.. చినాబ్‌ వంతెన

- జమ్మూకశ్మీర్‌లో చినాబ్‌ నదిపై నిర్మించిన రైల్వే వంతెన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే ఆర్చి బ్రిడ్జిగా రికార్డుకెక్కింది. రూ.1,486 కోట్ల వ్యయంతో ఎనిమిదేళ్లలో ఈ వంతెన నిర్మించారు.
- ఇదొక ఇంజనీరింగ్‌ అద్భుతంగా అని చెప్పొచ్చు. చినాబ్‌ నదీ గర్భం నుంచి దీని ఎత్తు 359 మీటర్లు. పారిస్‌లోని ఈఫిల్‌ టవర్‌ కంటే 35 మీటర్లు అధికం.
- చినాబ్‌ బ్రిడ్జి పొడవు 1.32 కిలోమీటర్లు. అన్ని రకాల వాతావరణ పరిస్థితులు, భూకంపాలు, బాంబు పేలుళ్లు, భీకర గాలులను తట్టుకోగలదు. 100 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణించవచ్చు. ఈ వంతెన నిర్మాణానికి 2002లో అనుమతి లభించింది. 2017లో పనులు మొదలయ్యాయి.
- ఈ వంతెన నిర్మాణం కంటే ముందే 26 కిలోమీటర్ల అప్రోచ్‌ రోడ్లు, 400 మీటర్ల పొడవైన సొరంగం నిర్మించారు.
- చినాబ్‌ బ్రిడ్జితో జమ్మూ, శ్రీనగర్‌ మధ్య ప్రయాణ సమయం తగ్గిపోతుంది. దీని జీవిత కాలం 120 ఏళ్లు.

తీగల వంతెన అంజి బ్రిడ్జి

- అంజి వంతెనకు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. చినాబ్‌ బ్రిడ్జి తర్వాత ఇది రెండో అత్యంత ఎత్తయిన రైల్వే బ్రిడ్జి. ఇండియాలో అత్యంత ఎత్తయిన కేబుల్‌ రైల్వే బ్రిడ్జి ఇదే. నదీ గర్భం నుంచి దీని ఎత్తు 196 మీటర్లు. 2017 జనవరిలో నిర్మాణం ప్రారంభమైంది.
- చినాబ్‌కు ఉప నది అయిన అంజి నదిపై నిర్మించారు. ఇది తీగలతో అనుసంధానమైన వంతెన. నిర్మాణానికి పూర్తిగా ఉక్కు ఉపయోగించారు.
- దీని మొత్తం పొడవు 725 మీటర్లు. ప్రధాన వంతెన పొడవు 473 మీటర్లు. 82 మీటర్ల నుంచి 295 మీటర్ల పొడవైన 96 ఉక్కు తీగలతో ఈ వంతెన నిర్మాణం పూర్తయ్యింది.



మరో కరోనా మహమ్మారి!

చైనా గబ్బిలాల్లో హెచ్‌కేయూ5 వైరస్‌లు

- ఇవీ మెర్స్‌–కోవ్‌ కుటుంబానికి చెందినవే..
- మ్యుటేషన్‌కు గురైతే ప్రాణాంతకమే
- గుర్తించిన అమెరికా పరిశోధకులు
- ప్రస్తుతానికి మనుషులకు ముప్పు లేదని వెల్లడి

బీజింగ్‌: ప్రపంచవ్యాప్తంగా ఐదేళ్ల క్రితం ఉధృతంగా మొదలై ఇప్పటికీ మరణశాసనం రాస్తున్న కరోనా వైరస్‌ కుటుంబానికి చెందిన కొత్త వైరస్‌లు పుట్టుకొస్తున్నట్లు అమెరికా పరిశోధకులు గుర్తించారు. కోవిడ్‌–19కు మూలకారణంగా భావిస్తున్న చైనాలోని గబ్బిలాల్లో ఈ వైరస్‌ల ఉనికిని కనిపెట్టారు. వీటిలో మరొక్క చిన్నపాటి ఉత్పరివర్తనం(మ్యుటేషన్‌) జరిగితే మనుషులకు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని చెబుతున్నారు. వాషింగ్టన్‌ స్టేట్‌ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్‌ నార్త్‌ కరోలినా పరిశోధనలు నిర్వహించిన ఈ అధ్యయనం వివరాలను నేచర్‌ కమ్యూనికేషన్స్‌ పత్రికలో ప్రచురించారు. ఈ మిస్టరీ వైరస్‌లు కరోనా మాదిరిగానే మెర్స్‌–కోవ్‌ కుటుంబానికి చెందుతాయని తెలిపారు. కరోనా వైరస్‌ సృష్టిస్తున్న ఉత్పాతం గురించి తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఈ మహమ్మారి బారినపడిన వారిలో 34 శాతం మంది మరణించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

- మెర్స్‌–కోవ్‌ కుటుంబంలోని ఉపవర్గమైన మెర్బికో వైరస్‌లపై అమెరికా సైంటిస్టులు నిశితంగా దృష్టిపెట్టారు. ఈ ఉపవర్గంలోని హెచ్‌కేయూ5 వైరస్‌లతో ముప్పు ముంచుకొస్తున్నట్లు పేర్కొంటున్నారు.
- హెచ్‌కేయూ5 వైరస్‌ల గురించి ఇప్పటిదాకా తెలిసింది తక్కువే. మనుషుల్లో కణాలను తీవ్రంగా ప్రభావితం చేసే శక్తి వీటికి ఉందని వైరాలజిస్టు డాక్టర్‌ మైఖేల్‌ లెట్కో చెప్పారు. వీటిలో మరో మ్యుటేషన్‌ జరిగి, మనుషులకు సోకితే ప్రాణాంతకంగా మారే పరిస్థితిని కొట్టిపారేయలేమని వెల్లడించారు.
- సార్స్‌–కోవ్‌–2 అనే వైరస్‌ కోవిడ్‌–19 వ్యాధిని కలిగించినట్లుగానే హెచ్‌కేయూ5 వైరస్‌లు స్పైక్‌ ప్రొటీన్‌ ఆధారంగా మనుషుల కణాల్లోకి ప్రవేశించి, నాశనం చేయగలవు.
- చైనాలో గబ్బిలాల నుంచి మింక్స్‌ అనే జంతువులకు వ్యాప్తి చెందినట్లు చెబుతున్నారు. ఇతర జీవులకు సైతం వ్యాప్తి చెందే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.
- హెచ్‌కేయూ5 వైరస్‌ల విషయంలో ఇప్పటికిప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్‌ మైఖేల్‌ లెట్కో సూచించారు. అయినప్పటికీ అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

పెద్దన్నల పోట్లాట

దుమ్మెత్తిపోసుకుంటున్న మాజీ మిత్రులు

- కొంతకాలంగా ఉప్పునిప్పుగా వ్యవహారం
- 'బ్యూటిఫుల్‌' బిల్లుతో రచ్చకెక్కిన విభేదాలు
- సెక్స్‌ కుంభకోణంలో ట్రంప్‌ పేరు: మస్క్‌
- ఎప్‌స్టీన్‌ ఫైళ్లు బయటపెట్టనిది అందుకే
- ఆ ఉదంతంలో గద్దె దిగడం ఖాయం
- వాన్స్‌ అధ్యక్షుడవుతారంటూ జోస్యం
- మస్క్‌కు మతి చలించినట్టుంది: ట్రంప్‌
- కాంట్రాక్టులన్నీ ఆపేస్తానని హెచ్చరిక



ట్రంప్‌ గద్దె దిగుతారు: మస్క్‌

అమెరికాను కుదిపేసిన సెక్స్‌ కుంభకోణంలో నిందితుడైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌కు సంబంధాలున్నట్టు మస్క్‌ సంచలన ఆరోపణలు చేశారు. ''అతి పెద్ద బాంబు పేల్చాల్సిన సమయం ఆసన్నమైంది. ఎప్‌స్టీన్‌ దర్యాప్తు ఫైళ్లలో ట్రంప్‌ పేరు కూడా ఉంది. అందుకే వాటిని ఆయన బయట పెట్టడం లేదు''అంటూ ఆరోపించారు. ట్రంప్‌ను అభిశంసించాలంటూ ఓ నెటిజన్‌ పెట్టిన పోస్టును సమర్థించారు. వాన్స్‌ను అధ్యక్షున్ని చేయాలన్న పోస్టును రీ పోస్ట్‌ చేస్తూ 'అవు'నని కామెంట్‌ చేశారు. ''ట్రంప్‌ అధ్యక్షునిగా ఉండేది మహా అయితే మూడున్నరేళ్లు. నేను మాత్రం కనీసం ఇంకో 40 ఏళ్ల దాకా ఉంటాను'' అన్నారు. అమెరికన్లలో కనీసం 80 శాతం మందికి ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ స్థాపనపై ఒపీనియన్‌ పోల్‌ పెట్టారు. నాసాకు డ్రాగన్‌ సేవలు ఆపేయబోనంటూ కాస్త వెనక్కు తగ్గారు.

వాషింగ్టన్‌: ఒకరు ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు. మరొకరు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశానికి అధినేత. బెదిరించి పనులు చక్కబెట్టుకోవడంలో, అవసరం తీరిందనుకుంటే ఎంతటి వారినైనా సరే దూరం పెట్టడంలో, భావోద్వేగాలకు తావన్నదే లేకుండా స్వీయ ప్రయోజనాలే పరమావధిగా వ్యవహరించడంలో ఒకరికొకరు ఏ మాత్రమూ తీసిపోరు. అలాంటి వాళ్లు పరస్పరం తలపడితే ఎలా ఉంటుంది? అచ్చం ఎలాన్‌ మస్క్‌, డొనాల్డ్‌ ట్రంప్‌ తాజా రగడ మాదిరిగానే ఉంటుంది. నిజానికి అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు మొదలైన వారి బ్రొమాన్స్‌ ట్రంప్‌ గద్దెనెక్కాక కూడా బ్రహ్మాండంగా కొనసాగింది. అవకాశం దొరికినప్పుడల్లా మస్క్‌ను ఇంద్రుడు చంద్రుడంటూ ట్రంప్‌ ఆకాశానికెత్తేశారు. ప్రభుత్వ వ్యయానికి కత్తెర వేసేందుకు సృష్టించిన డోజ్‌ విభాగపు సారథ్యం అప్పగించారు. దాని ముసుగులో కీలకమైన ప్రభుత్వ డేటాను మస్క్‌ చేజిక్కించుకున్నారంటూ ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. అధ్యక్ష కార్యాలయమైన ఓవల్‌ ఆఫీసులో, అధికారిక విమానం ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో, కేబినెట్‌ సమావేశాల్లో... ఇలా ఎక్కడ చూసినా మస్కే. వైట్‌హౌస్‌ను చివరికి మస్క్‌కు అత్తారిల్లుగా మార్చేశారంటూ ట్రంప్‌పై విపక్షాలు దుమ్మెత్తిపోసేదాకా వెళ్లింది. అంతలా కొనసాగిన ట్రంప్‌, మస్క్‌ సాన్నిహిత్యానికి మూడు రోజుల క్రితం అనూహ్యంగా, అర్ధాంతరంగా తెరపడింది. అంతే! ఒక్కసారిగా అంతా తల్లకిందులైంది. అసలే మొండితనంలోనూ, నోటి దురుసులోనూ ఒకరికొకరు ఏ మాత్రమూ తీసిపోని బాపతు కావడంతో పరస్పర నిందలు, విమర్శలు, ఆరోపణలతో 'తగ్గేదే లే'అంటూ ఇద్దరూ చెలరేగిపోతున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అనే రీతిలో సోషల్‌ మీడియాలో సవాళ్లు విసురుకుంటున్నారు. మస్క్‌కు మతి చలించిందంటూ ట్రంప్‌ దుయ్యబట్టడమే గాక ఆయన స్పేస్‌ ఎక్స్‌, స్టార్‌లింక్‌ తదితర సంస్థలకు బిలియన్ల కొద్దీ డాలర్ల విలువైన ప్రభుత్వ కాంట్రాక్టులు రద్దు చేసి పారేస్తానని హెచ్చరించారు. దాంతో చిర్రెత్తుకొచ్చిన మస్క్‌, దమ్ముంటే ఆ పని చేసి చూపించాలంటూ సవాలు విసిరారు. నాసాకు అతి కీలకమైన స్పేస్‌ఎక్స్‌ డ్రాగన్‌ అంతరిక్ష నౌక సేవలను తక్షణం నిలిపేస్తానంటూ బెదిరించారు. అంతేగాక, ''అసలు నావల్లే ట్రంప్‌ అధ్యక్షునిగా గెలిచారు. కనీసం ఆ కృతజ్ఞత కూడా లేకుండా వ్యవహరిస్తున్నారు''అంటూ మండిపడ్డారు. అంతటితో ఆగకుండా మైనర్లతో సెక్స్‌ కార్యకలాపాల 'ఎప్‌స్టీన్‌ కుంభకోణం'లో ట్రంప్‌ పేరూ ఉందంటూ పెద్ద బాంబు పేల్చారు. ఈ ఉదంతంలో ఆయన గద్దె దిగడం, ఉపాధ్యక్షుడు వాన్స్‌ అధ్యక్ష పీఠమెక్కడం తప్పదని జోస్యం చెప్పారు. వారి వాగ్యుద్ధం ఇప్పుడు టాక్‌ ఆఫ్‌ ద వరల్డ్‌గా మారిపోయింది. ఇది చివరికి ఎటు దారి తీస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

అలా మొదలైంది...

నిజానికి ట్రంప్‌, మస్క్‌ సంబంధాలు కొంతకాలంగా ఒడిదొడుకులమయంగానే సాగుతున్నాయి. ప్రభుత్వ పనితీరుపై మస్క్‌ పెత్తనం మరీ మితిమీరుతోందని ట్రంప్‌ బృందం ఆక్షేపిస్తూ వస్తోంది. ఆ క్రమంలో ట్రంప్‌ గద్దెనెక్కిన ఒకట్రెండు రోజుల నుంచే ఆయన సన్నిహితులతో మస్క్‌ తరచూ గొడవ పడుతూ వస్తున్నారు. వ్యవహారం శ్రుతి మించుతోందని భావించిన ట్రంప్‌ కూడా క్రమంగా ఆయనను దూరం పెడుతూ వచ్చారు. డోజ్‌ సారథిగా కేవలం 130 రోజుల కోసం జరిగిన తన నియామకాన్ని పొడిగిస్తారని మస్క్‌ ఆశించారని కూడా అంటారు. అలాంటి సూచనలు కన్పించకపోవడంతో ఇటీవల ఆయనే తప్పుకున్నారు. ట్రంప్‌ ఇటీవల తెరపైకి తెచ్చిన 'వన్‌ బిగ్‌ బ్యూటిఫుల్‌ బిల్‌'ను తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ వ్యయానికి కత్తెర వేస్తానని గొప్పలు చెప్పుకున్న పెద్దమనిషి చివరికిలా భారీ దుబారాకు వీలు కల్పించే బిల్లుకు రూపమిచ్చారంటూ నిప్పులు చెరిగారు. దాంతో అప్పటిదాకా సంయమనం పాటిస్తూ వచ్చిన ట్రంప్‌ కూడా శషభిషలన్నీ పక్కన పెట్టి మస్క్‌పై విరుచుకుపడ్డారు.

ఏమిటీ ఎప్‌స్టీన్‌ కుంభకోణం?

మైనర్‌ బాలికలతో పాటు మహిళలను లైంగికంగా వేధించినట్టు ఎప్‌స్టీన్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. తన ఎదుగుదల కోసం వారిని సన్నిహితులైన రాజకీయ తదితర రంగాల ప్రముఖులకు ఎరగా వేశాడని అభియోగాలు నమోదయ్యాయి. జాబితాలో ట్రంప్‌, బిల్‌ క్లింటన్‌, ప్రిన్స్‌ ఆండ్రూ, పలు దేశాల ప్రధానులు, రాజకీయ దిగ్గజాలు, హాలీవుడ్‌ తారలు తదితరులున్నారు. 2019లో అతను జైల్లో అనుమానాస్పదంగా మరణించాడు. సంబంధిత ఫైళ్లను బయట పెడతానని గత అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌ హామీ ఇచ్చారు.

మస్క్‌కు ఎదురుదెబ్బలు

విద్యుత్‌ కార్లపై ట్యాక్స్‌ క్రెడిట్‌కు 'బ్యూటిఫుల్‌' బిల్లులో భారీ కోతలు ప్రతిపాదించారు. అందులోని పలు అంశాలు తన వ్యాపార ప్రయోజనాలను దెబ్బతీసేవి కావడం మస్క్‌కు మంట పుట్టించింది. అంతకుముందు అమెరికా వైమానిక వ్యవస్థ తన స్టార్‌లింక్‌ శాటిలైట్‌ సిస్టం సేవలను వాడుకునేలా ఒప్పించేందుకు ప్రయత్నించినా కుదరలేదు. మస్క్‌ సన్నిహితున్ని నాసా చీఫ్‌ పదవికి పరిగణించొద్దని ట్రంప్‌ నిర్ణయించారు. ట్రంప్‌తో రగడ నేపథ్యంలో మస్క్‌ కార్ల కంపెనీ టెస్లా షేర్లు ఏకంగా 14 శాతం పడిపోయాయి.

మస్క్‌తో మాట్లాడను: ట్రంప్‌

మస్క్‌ వంటి వ్యక్తి డోజ్‌ పదవిని నెలల క్రితమే వదిలేసి ఉంటే బాగుండేదని ట్రంప్‌ అభిప్రాయపడ్డారు. 'బ్యూటిఫుల్‌ బిల్లు'లో టెస్లాకు మస్క్‌ ఆశించిన లబ్ధి కన్పించకపోవడంతో తనపై నిందారోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ''ట్రంప్‌ గురించి కనీసం ఆలోచించడం కూడా లేదు. కొంతకాలం ఆయనతో మాట్లాడబోను''అని సీఎన్‌ఎన్‌ వార్తా సంస్థతో మాట్లాడుతూ స్పష్టం చేశారు. ''పాపం మస్క్‌. అతనికేదో సమస్య ఉన్నట్టుంది! బహుశా మతి చలించినట్టుంది'' అంటూ ఎద్దేవా చేశారు. ''బిలియన్ల కొద్దీ డాలర్లు ఆదా చేసేందుకు సులువైన మార్గం ఒకటుంది. మస్క్‌ సంస్థలకు అందుతున్న ప్రభుత్వ కాంట్రాక్టులు, రాయితీలను తెగ్గోస్తే చాలు!''అంటూ గురువారం ట్రూత్‌ సోషల్‌లో వరుస పోస్టులు పెట్టారు.

హార్వర్డ్‌కు విదేశీ విద్యార్థుల బ్యాన్‌పై స్టే

వాషింగ్టన్‌: అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్‌ వర్సిటీలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలపై నిషేధం విధిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ జారీ చేసిన ఆదేశాలపై ఫెడరల్‌ కోర్టు తాత్కాలిక స్టే విధించారు. ట్రంప్‌ బుధవారం జారీ చేసిన ఉత్తర్వులపై హార్వర్డ్‌ యాజమాన్యం బోస్టన్‌లోని యూఎస్‌ డిస్ట్రిక్‌ కోర్టును ఆశ్రయించింది. 'హార్వర్డ్‌లో 7 వేల మంది జే1 వీసా దారులు, వారిపై ఆధారపడిన వారు ఉన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతీకార చర్యలకు వీరంతా పావులుగా మారారు'అని హార్వర్డ్‌ తన పిటిషన్‌లో పేర్కొంది. కొద్దిగంటల్లోనే జడ్జి అలిసన్‌ బర్రో..అధ్యక్షుడు ట్రంప్‌ ఉత్తర్వుల అమలుపై తక్షణమే తాత్కాలిక స్టే విధిస్తున్నట్లు తెలిపారు. అధ్యక్ష భవనం డిమాండ్లకు తలొగ్గలేదనే కారణంతో జారీ చేసిన ఆ ఉత్తర్వులు చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇరు వర్గాల వాదనలను తర్వాత వింటానని ఆమె తెలిపారు. హార్వర్డ్‌లో అంతర్జాతీయ విద్యార్థుల నమోదును ఆపేందుకు ట్రంప్‌ ప్రభుత్వం చేసిన ప్రయత్నంపై గతంలో విధించిన తాత్కాలిక స్టేను కూడా బర్రోస్‌ ఈ సందర్భంగా పొడిగించారు.

అంబేడ్కర్‌ కలలు సాకారం: జస్టిస్‌ గవాయ్‌



లండన్‌: రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్‌ ఆశయాలు ఆచరణలోకి వస్తున్నాయని, భారత్‌లో నిమ్నవర్గాల ప్రజలు కూడా అత్యున్నత రాజ్యాంగ పదవులు అధిరోహిస్తున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ బి.ఆర్‌.గవాయ్‌ చెప్పారు. భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లండన్‌లోని చరిత్రాత్మక గ్రేస్‌ ఇన్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని అంబేడ్కర్‌ బోధించారని గుర్తుచేశారు. బడుగు వర్గాల ప్రజలు కూడా ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన కలలుగన్నారని తెలిపారు. అంబేడ్కర్‌ కలలు సాకారం అవుతుండడం సంతోషంగా ఉందన్నారు. అంబేడ్కర్‌ సూచించిన దారితో తాము నడుస్తున్నామని తెలిపారు. తాను దళిత వర్గం నుంచే వచ్చినట్లు జస్టిస్‌ గవాయ్‌ గుర్తుచేశారు. గిరిజన మహిళ ద్రౌపది ముర్ము భారత రాష్ట్రపతి అయ్యారని పేర్కొన్నారు. ఇది నిజంగా గర్వకారణమని వ్యాఖ్యానించారు. ఇండియాలో అన్ని రంగాల్లో బడుగు బలహీన వర్గాల ప్రాతినిధ్యం పెరుగుతోందన్నారు.

తెలుగు నేతలే టార్గెట్

ఎన్‌కౌంటర్‌లో మైలారపు ఆడెళ్లు అలియాస్ భాస్కర్ మృతి

- మృతుడిది ఆదిలాబాద్ జిల్లా పొచ్చర
- ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌లో కొనసాగుతున్న ఎదురు కాల్పులు



మావోల కీలక నేత మడావి హిడ్మా పాత, కొత్త ఫొటోలు



భాస్కర్ మృతదేహం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ఆదిలాబాద్ /చర్ల: వరుస ఘటనలు చూస్తుంటే... తెలుగు నేతలే టార్గెట్‌గా స్పెషల్ ఆపరేషన్లు చేపడుతున్నట్టు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి టైగర్ రిజర్వ్ నేషనల్ పార్కులో గురు, శుక్రవారాల్లో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు అగ్రనేతలు మృతి చెందారు. గురువారం కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీ నరసింహాచలం, శుక్రవారం తెలంగాణ కమిటీ సభ్యుడు మైలారపు ఆడెళ్లు అలియాస్ భాస్కర్ చనిపోయారు. కాగా, ఆయన తెలంగాణ కమిటీతోపాటు స్పెషల్ జోనల్ కమిటీలోనూ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. భాస్కర్‌పై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి రూ.25 లక్షలు, తెలంగాణ నుంచి రూ.20 లక్షల రివార్డు ఉండగా, ఆయన మృతదేహం వద్ద ఏకే 47 తుపాకీ లభించింది.

మూడో అంచెపై వల

మావోయిస్టులను దెబ్బ తీసేందుకు పోలీసులు, భద్రతా దళాలు ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలను అమలుచేస్తున్నాయి. అగ్ర నేతలకు మూడంచెల భద్రత ఉంటుంది. ఇందులో తొలి అంచెలో అగ్రనేతతోపాటు అతని సపోర్టింగ్ స్టాఫ్, రెండు, మూడో అంచెలో ఇతర మావోలు ఉంటారు. వీరిలో ఎక్కువమంది బస్తర్ వాసులే ఉంటున్నారు. అగ్రనేతలే టార్గెట్‌గా దాడులు జరిగినప్పుడు ఎక్కువగా చనిపోయే వారిలో వీరే ఉంటున్నారు. ఇదే విషయాన్ని హైలైట్ చేస్తూ 'తెలుగు నేతలను కాపాడేందుకు మీరు ఎందుకు చనిపోవాలి'అంటూ ప్రచార కార్యక్రమాన్ని వ్యూహాత్మకంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇది సత్ఫలితాలను ఇస్తోందని పోలీసులే బాహాటంగా ఒప్పుకుంటున్నారు. దీనికి తగ్గట్టే ఆ పార్టీ చీఫ్ నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు ముందు ఆయన రక్షణ టీమ్‌లో ముగ్గురు మావోలు లొంగిపోవడం తీవ్రనష్టానికి దారి తీసింది. అంతకు ముందు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక అలియాస్ భాను విషయంలో ప్రస్తుతం సుధాకర్, మైలారపు ఆడెళ్ల విషయంలోనూ 'కోవర్ట్' తరహా ఆపరేషన్ జరిగిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇదే పరంపరలో నేటి తరం అగ్రనేత, బస్తర్ మూలవాసి, మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టుగా ఉన్న మడావి హిడ్మా లేటెస్ట్ ఫొటోను సైతం భద్రతా దళాలు సంపాదించాయి.

హిట్‌లిస్ట్‌లో తెలుగు నేతలు

తెలంగాణ నుంచి మల్లోజుల వేణుగోపాల్ తి ప్పర్తి తిరుపతి, పాక హనుమంతు , కదారి సత్యనారాయణరెడ్డి, తక్కెళ్లపల్లి వాసుదేవరావు, చంద్రన్న, బండి ప్రకాశ్, రామన్న, పాపారావు, కంకణాల రాజిరెడ్డిలు మావోయిస్టు పార్టీలో అగ్రనేతలుగా కొనసాగుతున్నారు. వీరితో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి దామోదర్‌తో పాటు కొయ్యాడ సాంబయ్య, వెంకటేశ్ కూడా కీలక నేతలుగా ఉన్నారు. వీరి కదలికపై కన్నేసిన భద్రతా దళాలు అనుకూల సమయం చూసి దాడి చేస్తున్నట్టు తెలు స్తోంది. ఇంద్రావతి నదీతీరంలో రెండో రోజైన శుక్రవారం కూడా మావోలు – పోలీసుల బలగాల నడుమ కాల్పులు కొనసాగాయని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ చెప్పారు.

మూడు దశాబ్దాల క్రితమే ఉద్యమంలోకి..

మైలారపు ఆడెళ్లది ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చర స్వస్థలం. బోథ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన ఆడెళ్లు...1989లో నిర్మల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరాడు. ఆ సమయంలో భూపోరాటాలు ఉధృతంగా సాగేవి. అభ్యుదయ భావాలు కలిగిన ఆయన రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చేరాడు. దానికి అధ్యక్షుడిగా పనిచేశాడు.ఆ తర్వాత ఉద్యమం వైపు మళ్లి 1995లో నక్సల్స్‌లో చేరాడు. మొదట బోథ్ దళ సభ్యుడిగా, ఆ తర్వాత ఇంద్రవెల్లి దళ డిప్యూటీ కమాండర్‌గా పనిచేసి, దండకారణ్యంలోకి వెళ్లిపోయాడు. ఉద్యమంలో ఉన్న సమయంలోనే నిర్మల్ జిల్లా కడెం మండలం లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన దళ సభ్యురాలు కంతి లింగవ్వను వివాహం చేసుకున్నారు. 2022 డిసెంబర్‌లో మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమె మృతి చెందింది. అప్పటి నుంచి ఆడెళ్లు దండకారణ్యంలోనే ఉంటున్నారు. ఆయన సోదరులు మాత్రమే స్వగ్రామంలో ఉంటున్నారు. ఆడెళ్ల మరణ వార్తతో పొచ్చరలో టెన్షన్ వాతావరణం నెలకొంది. అతని పెద్ద సోదరుడు పేరు కూడాఆడెళ్లు. మావోయిస్టు ఆడెళ్లు మృతిచెందిన వార్త తెలిసిన తర్వాత ఆయన తన ఇంటివైపు ఎవరూ రావద్దని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆడెళ్ల మృతదేహాన్ని పొచ్చరకు తీసుకొస్తారా.. అందుకు సోదరులు సమ్మతిస్తారా అనేది చూడాల్సిందే.

మడావి హిడ్మా ఎక్కడ | సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

కూలిన పాఠశాల భవనం

- ఇద్దరు చిన్నారులకు తీవ్రంగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు



కూలిన పాఠశాల భవనం



సాయికుమార్



ప్రేమ్‌కుమార్

కుభీర్: పాఠశాల భవనం ఆవరణలో ఆడుకుంటున్న చిన్నారులపై పైకప్పు కూలి ఇద్దరికి తీవ్రంగా.. మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లా కుభీర్ మండలం అంతర్ని గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన బాలబాలికలు.. వేసవి సెలవులు కావడంతో రోజూ ఈ పాఠశాల భవనం నీడలో ఆడుకుంటున్నారు. భవనం ఆవరణలో శుక్రవారం ఆడుకుంటుండగా, ఒక్కసారిగా పాఠశాల పైకప్పు ఒకవైపు కూలిపోయింది. పిల్లలు పరుగులు తీయడంతో.. కొందరు శిథిలాల కింద చిక్కుకున్నారు. అక్కడే ఉన్న యువకులు వారిని రక్షించారు. ఈ ఘటనలో సాయికుమార్ (7), ప్రేమ్‌కుమార్ (7)కు తీవ్ర గాయాలయ్యాయి. తలకు గాయమైన ప్రేమ్‌కుమార్‌ను భైంసా ఏరియా ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి పంపించారు. కాలు విరిగిన సాయికుమార్‌కు భైంసా ఏరియా ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. బాలుడు ప్రస్తుతం కోలుకుంటున్నాడు. మరో ఇద్దరు చిన్నారులు ప్రణయ్ (6), అభినయ్ (6)లకు స్వల్ప గాయాలయ్యాయి. సాయి కుమార్, లక్ష్మణచాంద మండలం నుంచి వేసవి సెలవుల్లో అమ్మమ్మ గ్రామమైన అంతర్నికి వచ్చి ఈ ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ సంఘటనపై ఎంఈవో విజయ్ కుమార్‌ను వివరణ కోరగా.. పాఠశాల పాత భవనం కావడంతో కూలిపోయిందని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు సుభాష్ మాట్లాడుతూ.. ఉదయం బడిబాట కార్యక్రమం అనంతరం భవనం కూలిపోయిందని చెప్పారు. ఈ భవనాన్ని కూల్చివేయాలని గతంలోనే డీఈవోకు లేఖ రాసినట్లు చెప్పారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాక భవనం కూలి ఉంటే.. ఘోరం జరిగేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

నారాయణ జేఈఈ టాపర్స్‌కు ఏపీ సీఎం చంద్రబాబు అభినందనలు

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 ఫలితాల్లో విజయకేతనం ఎగరవేసిన నారాయణ కాలేజీ విద్యార్థులను ఏపీ సీఎం చంద్రబాబు అభినందించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10వ ర్యాంకు సాధించిన వడ్లమూడి లోకేశ్, 51వ ర్యాంకర్ భానుచరణ్‌రెడ్డి, 82వ ర్యాంకు సాధించిన తోరాటి భరద్వాజ్, 98వ ర్యాంకు సాధించిన జస్వంత్ వెంకట రఘువీర్, వారి తల్లిదండ్రులకు ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, శరణి నారాయణ, ప్రేమ్ పొంగూరు పాల్గొన్నారు.

మావో కీలక నేతలు బండి ప్రకాశ్, దిలీప్‌లకు ప్రాణహాని ఉంది

- తెలంగాణ పౌరహక్కుల సంఘం నేతలు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు నాయకులు బండి ప్రకాశ్, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్, మద్దెడు ప్రాంత కార్యదర్శి సీటు, డీసీ మెంబర్ రామన్న, మున్నా, సునీత, మహేశ్‌లతోపాటు పదిమంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ పోలీసుల అదుపులో ఉన్నారని తెలంగాణ పౌరహక్కుల సంఘం నాయకులు తెలిపారు. వారికి ప్రాణహాని తలపెట్టకుండా కోర్టులో హాజరుపర్చాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలోని ఒక గ్రామంలో గురువారం మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు ఆడెళ్లు అలియాస్ భాస్కర్, బండి ప్రకాష్, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్‌లతోపాటు పదిమందిని పోలీసులు ప్రాణాలతో పట్టుకొన్నారు. సుధాకర్‌ను ఎన్‌కౌంటర్ పేరున హత్య చేశారని ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం భాస్కర్‌ను కూడా ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేశారు. ఇంకా వారి అదుపులో ఉన్న మిగతావారిని ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చే ప్రమాదముందన్నారు.

నంబర్లు మార్చి.. నయా దందా

- బీఎస్–3 కార్లకు ఇంజిన్, చాసిస్ నంబర్ల మార్పు
- ప్రమాదాల్లో ధ్వంసమైన కార్ల నంబర్లు వేసి విక్రయాలు
- చోరీకి గురైన కారు యజమాని ఫిర్యాదుతో బయటపడిన వ్యవహారం

మిర్యాలగూడ: గడువు తీరిన వాహనాలను స్క్రాప్ కింద తక్కువ ధరకు కొనుగోలు చేసి.. ప్రమాదానికి గురైన వాహనాల ఇంజిన్, చాసిస్ నంబర్లను వీటికి మార్చి అధిక ధరలకు విక్రయిస్తున్న వైనం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో వెలుగు చూసింది. హైదరాబాద్‌లో చోరీకి గురైన ఒక కారును మిర్యాలగూడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఒకరు ఇటీవల ఆంధ్రాలో కొనుగోలు చేశారు. ఈ కారును మిర్యాలగూడలోని ఓ కారు షెడ్డులో మరమ్మతు చేయిస్తుండగా, కారు జీపీఎస్ ఆన్ అయ్యింది. రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో కారు చోరీకి గురైనట్టు యజమాని అక్కడ ఫిర్యాదు చేశాడు. కారు జీపీఎస్ ఆధారంగా మిర్యాలగూడకు వచ్చిన సదరు యజమాని.. విషయాన్ని పోలీసులకు చెప్పాడు. కారు ఇంజిన్ నంబర్, చాసిస్ నంబర్ మార్చి ఉన్నట్టుగా గుర్తించిన మెకానిక్.. విషయాన్ని పోలీసులకు వివరించాడు. దీంతో కారు ఎక్కడ కొనుగోలు చేశారో, ఎవరు అమ్మారో చెప్పాలని పోలీసులు మిర్యాలగూడకు చెందిన వ్యక్తిని ప్రశ్నించారు. ఆయన చెప్పిన వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారైనట్టు తెలిసింది.

చాసిస్ నంబర్లు మార్చి అధిక ధరలకు విక్రయాలు

సదరు కారు నంబర్ ఎవరు మార్చారు.. ఎలా మార్చారనే విషయాన్ని విచారణ చేసే క్రమంలో మిర్యాలగూడకు చెందిన ఓ వ్యక్తిని పోలీసులు ప్రశ్నించారు. దీంతో తాను ఈ కారు నంబర్, చాసిస్ నంబర్ మార్చలేదని.. కానీ, పట్టణంలోని ఒక పార్కింగ్ యార్డు యజమాని పంపించిన 3కార్లకు మాత్రం ఇంజిన్, చాసిస్ నంబర్లను మార్చినట్టు పోలీసుల ముందు ఒప్పుకున్నట్టు సమాచారం. కాగా ఆ పార్కింగ్ యార్డులో 60 రోజుల సీసీ టీవీ ఫుటేజీ అందుబాటులో ఉంటుందని, పోలీసులు ఈ ఫుటేజీని పరిశీలిస్తే ఇలాంటి కార్లు ఎన్ని ఉన్నాయో వెలుగు చూసే అవకాశముంది.

బీఎస్–3 వాహనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి...

మిర్యాలగూడలోని కారు గురించి కూపీ లాగడంతో బీఎస్–3 వాహనాల దందా బయటపడింది. 2019లో భారత ప్రభుత్వం నిర్ణీత గడువు తీరిన తర్వాత బీఎస్–3 కార్లను విక్రయించొద్దని ఆదేశాలు జారీచేసింది. దీంతో షోరూమ్‌ల యజమానులు చాసిస్, ఇంజిన్ నంబర్లను తొలగించి వాటిని స్క్రాప్ కింద విక్రయించినట్టు సమాచారం. వీటిని అతి తక్కువ ధరలకు కొనుగోలు చేసి రోడ్డు ప్రమాదాల్లో ధ్వంసమైన కార్ల ఇంజిన్, చాసిస్ నంబర్లను అమర్చి బీఎస్–3 వాహనాలను అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. ఈ దందా భారీగానే కొనసాగుతున్నట్టు సమాచారం. బీఎస్–3 వాహనాలకు ఇంజిన్, చాసిస్ నంబర్లను మార్చి విక్రయాలు జరుపుతున్న వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నామని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు చెప్పారు.

కోడెలకు క్వారంటైన్

- లంపీస్కిన్ వ్యాధి నివారణ కోసం అధికారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచన
- కొత్త కోడెలకు ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వేములవాడ రాజన్న గోశాలలో కోడెల వరుస మరణాలను నిలువరించేందుకు తీవ్రంగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా క్వారంటైన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఇటీవల మరణించిన కోడెల్లో కొన్ని లంపీస్కిన్ వ్యాధితో బాధపడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి గోశాలలో కోడెలన్నిటికీ లంపీస్కిన్ వ్యాధి రాకుండా వ్యాక్సినేషన్ చేస్తున్నారు. అయితే బయట నుంచి కొత్తగా వచ్చిన కోడెల్లో లంపీస్కిన్‌తో బాధపడుతున్న పలు కోడెలు మరణిస్తున్నాయని, వాటి ప్రభావంతో బలహీనంగా ఉన్న తోటి కోడెలు కూడా వ్యాధికి గురవుతున్నాయని అధికారులు ఆది శ్రీనివాస్‌కు వివరించారు. దీంతో గోశాలలో ప్రత్యేకంగా మూడు క్వారంటైన్ షెడ్లు ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ ఆదేశించారు. కొత్తగా వచ్చిన కోడెలను 15 రోజుల పాటు గమనించి, వాటికి ఎలాంటి వ్యాధి లక్షణాలు లేవని నిర్ధారించుకున్న తరువాతే వాటిని మిగిలిన కోడెలతో కలపాలని సూచించారు. భక్తులు మొక్కు కింద ఇచ్చే 6 నెలల వయసున్న కోడెలకు కూడా ప్రత్యేక షెడ్లలో ఆశ్రయం కల్పించాలన్నారు. ఎదిగిన కోడెలను కూడా విడిగా ఉంచాలని, ఫలితంగా కొట్లాటలు, దాడులు తగ్గి మరణాల సంఖ్య తగ్గుతుందని ఆది శ్రీనివాస్ శుక్రవారం గోశాల అధికారులకు సూచించారు. దీంతో వారు ఈ దిశలో ఏర్పాట్లు ప్రారంభించారు. అనంతరం ఆది శ్రీనివాస్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. గోశాలలో కోడెల మరణాలను రాజకీయం చేస్తున్నారంటూ మాజీ మంత్రి హరీశ్‌రావుపై మండిపడ్డారు. అసలు వారు అధికారంలో ఉన్నప్పుడు మాస్టర్‌ప్లాన్ ఎందుకు అమలు చేయలేదని, వారు చేసి ఉంటే.. గోశాలకు నేడు ఈ దుస్థితి వచ్చేది కాదని అన్నారు.

క్లుప్తంగా...

కాళేశ్వరంలో భాగమే గంధమల్ల

- మల్లన్న సాగర్ నుంచే గంధమల్లకు నీటి తరలింపు
- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు వృథా అని, కూలిపోయిందని వంకర మాటలు మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడెలా గంధమల్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న కాళేశ్వరం మీద కాంగ్రెస్ నాయకులు చేసింది దుష్ప్రచారం అని ఇప్పుడు తేటతెల్లమైందన్నారు. గంధమల్ల రిజర్వాయర్ పూర్తయితే మల్లన్న సాగర్ నుంచి నీటిని తరలించాలని, ఇది కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌లో ఉందని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు తాగునీరు, గంధమల్ల రిజర్వాయర్‌కు నీటిని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్న సాగర్ నుంచే తరలించాలనే విషయం మర్చిపోయారా? అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేసినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అహంకారం వదిలి కన్నడలో మాట్లాడండి

మోహన్‌దాస్ పాయ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: కర్ణాటకలో కన్నడ భాషాభిమానులు చేస్తున్న ఆందోళనకు టెక్ ఇన్వెస్టర్ మోహన్ దాస్ పాయ్ జత కలిశారు. కర్ణాటక వంటి రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ స్థానిక భాషను నేర్చుకోవాలని, కనీసం స్థానికులతో మాట్లాడేప్పుడయినా కన్నడను వాడాలని ఆయన సూచించారు. అధికారులు కొందరు ప్రజలతో కన్నడలో మాట్లాడేందుకు నిరాకరించడాన్ని ఆయన అహంకార వైఖరిగా అభివర్ణించారు. ఇటువంటి ప్రవర్తన అనవసర ఉద్రిక్తతలకు దారి తీస్తుందని, దీనిని సులువుగా నివారించవచ్చని పాయ్ తెలిపారు. 'బెంగళూరు చాలా మంచి ప్రదేశం. కేవలం 33 శాతం మంది స్థానికులు మాత్రమే కన్నడ మాట్లాడుతారు. ఎంతోమంది ఇక్కడికి వచ్చి లాభపడుతున్నారు. బాగా పనిచేస్తున్నారు..'అని పాయ్ పేర్కొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై ఏపీ సర్కారు మరోదాడి

'సాక్షి'కి సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

- ఇటీవలే పత్రిక ఎడిటర్ నివాసంలో అక్రమంగా సోదాలు
- పలువురు 'సాక్షి' జర్నలిస్టులపైనా ఇప్పటికే టీడీపీ కూటమి నేతల దాడులు
- తాజాగా ప్రివిలేజ్ నోటీసు ఇచ్చిన ఏపీ అసెంబ్లీ

సాక్షి, అమరావతి: రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న టీడీపీ కూటమి ప్రభుత్వం తాజాగా సాక్షి దినపత్రికను మరోసారి లక్ష్యంగా చేసుకుంది. ఏపీ శాసనసభ ద్వారా వేధింపులకు దిగింది. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ శుక్రవారం 'సాక్షి' దినపత్రికకు ప్రివిలేజ్ నోటీసు ఇచ్చారు. బడ్జెట్ సమావేశాలకు ముందు ఫిబ్రవరి 25న సాక్షిలో ప్రచురితమైన 'కోట్లు ఖర్చు.. శిక్షణ తుస్సు' కథనం అసెంబ్లీకి, అసెంబ్లీ సభ్యుల హక్కులకు భంగం కలిగించిందని అందులో పేర్కొన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే జి. జయసూర్య ఇచ్చిన ఫిర్యాదును స్పీకర్ ప్రివిలేజ్ కమిటీకి పంపారని, ఈనెల 2న సమావేశమైన కమిటీ పత్రిక ఎడిటర్, సంబంధిత రిపోర్టర్, ప్రింటర్ అండ్ పబ్లిషర్ స్పందన తెలుసుకోవాలని సూచించిందని పేర్కొన్నారు. వారం రోజుల్లో ఈ నోటీసుపై స్పందించాలని కోరారు.

ఎవరి హక్కుల ఉల్లంఘనా జరగలేదు..

వాస్తవానికి.. 'సాక్షి' ప్రచురించిన కథనంలో ఎక్కడా సభా హక్కుల ఉల్లంఘన జరగలేదు. అసెంబ్లీ, అసెంబ్లీ సభ్యులు, అధికారుల ప్రస్తావన అందులో లేదు. వారి హక్కులకుగానీ, వారి హుందాతనానికి గానీ అగౌరవం కలిగే వ్యాఖ్యలు అసలేలేవు. కేవలం పరిపాలనాపరమైన లోపాలను మాత్రమే అందులో ప్రస్తావించారు. శిక్షణా తరగతుల పేరుతో అన్ని ఏర్పాట్లుచేశాక రద్దుచేయడం ద్వారా ప్రజాధనం వృధా అయిందని, ప్రణాళికా లోపంవల్లే ఇది జరిగిందని వ్యవస్థాపరమైన లోపాలను గుర్తుచేస్తూ ఈ కథనంలో రాశారు. కానీ, సాక్షి మీడియాపై కక్షగట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం.. బడ్జెట్ సమావేశాల్లో ఒక సభ్యుడితో దీనిపై ఫిర్యాదు చేయించి సభా హక్కుల ఉల్లంఘనగా ఆరోపించింది. ఆ సభ్యుడి ఫిర్యాదు మేరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు దాన్ని ప్రివిలేజ్ కమిటీకి పంపగా కమిటీ నోటీసులిచ్చింది. ఇలా కూటమి ప్రభుత్వం సాక్షి మీడియాపై వరుస దాడులు చేయిస్తోంది. జర్నలిస్టులను భయపెట్టాలని, పత్రికా స్వేచ్ఛకు పరిమితులు విధించాలనే కుతంత్రంతో ఇలా చేయిస్తున్నట్లు ప్రజాస్వామ్యవాదులు చెబుతున్నారు.

సాక్షి, సాక్షి సిబ్బందిపై వరుస దాడులు..

ఇక ఇటీవలే సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్. ధనంజయ రెడ్డి నివాసంలో 'సిట్' పోలీసులు అకారణంగా సోదాలు జరిపారు. ముందస్తు నోటీసు ఇవ్వకుండా.. మద్యం కేసు నిందితుల కోసం అన్వేషించే పేరుతో ఒక పత్రిక ఎడిటర్ నివాసంలో సోదాలు జరిపి పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించారు. అలాగే, సమాజంలో జరిగే పలు అంశాలను ప్రతిబింబించే క్రమంలో రాసిన వివిధ కథనాలపై పరువు నష్టం కేసులు వేసింది. మరోవైపు.. సాక్షి విలేకరులపై రాష్ట్ర వ్యాప్తంగా అక్రమార్కులు దాడులకు తెగబడుతున్నారు. వారి తప్పులను ఎత్తిచూపడమే నేరమన్నట్లు భౌతిక దాడులకు దిగుతున్నారు. ఏలూరు సాక్షి కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దాడిచేసి కంప్యూటర్లు, ఫర్నిచర్‌ను ధ్వంసంచేశారు. అలాగే, గుంటూరు జిల్లా సాక్షి ఛానల్ ప్రతినిధిపై కూటమి నేతలు దాడికి పాల్పడ్డారు. శ్రీకాళహస్తిలోనూ సాక్షి విలేకరిపై దాడిచేశారు. ఇంకా అనేకచోట్ల సాక్షి మీడియాపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా.. ఇప్పుడు అసెంబ్లీ ద్వారా ప్రివిలేజ్ నోటీసు ఇచ్చి పత్రికా స్వేచ్ఛను హరించే ప్రయత్నం చేస్తున్నారు.




బహిరంగ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య... సభకు హాజరైన జనం

పదేళ్లు పగ్గాలివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

ఎవరూ చేయని విధంగా కులగణన ద్వారా బీసీల లెక్క తేల్చి 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టం చేశామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కులగణన చేసే అనివార్యతను కల్పించామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి దశాబ్దాల కలను నెరవేర్చామని చెప్పారు. మోత్కుపల్లి నర్సింహులు లాంటి సీనియర్ నేత ఎస్సీ వర్గీకరణపై తనను అభినందించారని సీఎం చెప్పారు. గత ప్రభుత్వం గంధమల్ల, మూసీ కాలువల ఆధునీకరణ, ఎస్ఎల్‌బీసీ, డిండి వంటి ఉమ్మడి నల్లగొండ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని రేవంత్ నిలదీశారు. గంధమల్లకు నీళ్లు ఎలా ఇస్తారని కొందరు అడుగుతున్నారని.. నిధులిచ్చిన తమకు గంధమల్లకు నీళ్లు ఎలా ఇవ్వాలో తెలియదా? అని సీఎం బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు. గోదావరి జలాలను అందించడానికి ఎస్సారెస్పీ, మిడ్ మానేరు కట్టింది కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కాదా అని ఆయన అడిగారు.

లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో ప్రభుత్వం ఏర్పాటు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలను కోటీశ్వరులను చేసే బృహత్తర కార్యక్రమం చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ. 21 వేల కోట్ల మేర బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో పాఠశాలల నిర్వహణను ఆడబిడ్డల చేతిలో పెట్టామన్నారు. ప్రజాపాలనలో ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులతో ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని రేవంత్ వివరించారు. తిరుమల తరహాలో త్వరలో యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

మేం మూసీ ప్రక్షాళన చేసుకోవద్దా?

'బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారు. గతేడాది నవంబర్ 8న పాదయాత్ర చేసి మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరతామని మాట ఇచ్చా. ఎవరు అడ్డుపడినా మూసీ నదిని పునరుజ్జీవం చేసి తీరుతాం. ప్రధాని మోదీ సబర్మతి, యమునా నదుల ప్రక్షాళన, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ గంగానది ప్రక్షాళన చేసుకోవచ్చుగానీ మేం మూసీ ప్రక్షాళన చేసుకోవద్దా?'అని సీఎం రేవంత్ ప్రశ్నించారు.

వాసాలమర్రిని బాగుచేస్తా..

కేసీఆర్ ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు రోడ్డు వేసుకోవడానికి వాసాలమర్రి ప్రజలను మోసం చేశారని సీఎం రేవంత్ ఆరోపించారు. 'ఆనాడు వాసాలమర్రికి వచ్చి ఆకుల ఆగవ్వకు అల్లనేరేడు పండు ఇచ్చి ఆసుపత్రిపాలు చేసిండు. వాసాలమర్రిలో ఇళ్లు కూలగొట్టి శ్మశానంగా మార్చిండు. ఆయన ఆగం చేసినా వాసాలమర్రి గ్రామ పరిస్థితిని బాగు చేస్తా'అని సీఎం రేవంత్ చెప్పారు. ఇందుకోసం గ్రామ పరిస్థితిని అధ్యయనం చేయాలని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి సూచించారు.

ఆలేరును అభివృద్ధి చేస్తా..

బలహీనవర్గాల బిడ్డ బీర్ల ఐలయ్యను ఎమ్మెల్యేగా గెలిపించిన ఆలేరు ప్రజలకు అండగా ఉంటానని సీఎం రేవంత్ అన్నారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని అందరికీ మాట ఇస్తున్నా అని చెప్పారు. అడగకున్నా ఐలయ్యకు ప్రభుత్వ విప్ పదవి ఇచ్చానని సీఎం చెప్పారు.

దెయ్యాల రాష్ట్ర సమితిగా పిలవండి

బీఆర్ఎస్‌ను ఇకపై దెయ్యాల రాష్ట్ర సమితి (డీఆర్ఎస్)గా పిలవాలని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ లో దెయ్యాలు ఉన్నాయని ఆ ఇంటి బిడ్డనే బయటపెట్టినా ఆ దెయ్యాల నాయకుడు సమాధానం చెప్పడం లేదని ఎద్దేవా చేశారు. ఈ కొరివి దెయ్యాలను తెలంగాణ రాష్ట్రం పొలిమేరల వరకు తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'ఒక్క నోటీసు ఇస్తేనే ఆయన ఆగమాగం అయితుండు. కోర్టుకు వచ్చి జవాబు చెప్పాల్సింది పోయి విమర్శలు చేస్తుండు' అని విమర్శించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు లాంటి వ్యక్తులే కోర్టుకు హాజరయ్యారని రేవంత్ గుర్తుచేశారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం..

రాష్ట్రంలో ఉన్న 5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటామని సీఎం రేవంత్ చెప్పారు. గత ప్రభుత్వం విడతల వారీగా వేతనాలు ఇచ్చిందని.. కానీ ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచన్‌గా జీతాలు ఇస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. రాష్ట్రంలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు

రూ. వెయ్యి కోట్లకు శంకుస్థాపన చరిత్రాత్మకం: మంత్రి ఉత్తమ్

ఆలేరు నియోజకవర్గానికి రూ. వెయ్యి కోట్లు కేటాయించి శంకుస్థాపన చేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దేశ చరిత్రలోనే 80 శాతం జనానికి సన్నబియ్యంతో కడుపునిండా అన్నం పెడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. గత ప్రభుత్వం రూ. 11 వేల కోట్లు ఖర్చు చేసి దొడ్డు బియ్యం ఇచ్చిందన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న గంధమల్ల చెరువుకు జీవం పోసేందుకు రూ. 574.56 కోట్లతో 1.4 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం చేస్తున్నామన్నారు. ఎవరు అడ్డుపడినా గంధమల్ల రిజర్వాయర్‌ను పూర్తి చేసి 60 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి కోమటిరెడ్డి

పేదలందరికీ రూ. 5 లక్షల చొప్పున ఖర్చు చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రూ. 210 కోట్లు ఖర్చు చేసి ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు ఇచ్చేలా పైప్‌లైన్ పనులను ప్రారంభించామన్నారు. ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో ఈ పైప్‌లైన్లను మూడు నెలల్లో పూర్తి చేసి భగీరథ నీళ్లు అందిస్తామని చెప్పారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, సోనియా గాంధీ కలలు కన్న తెలంగాణను, రాహుల్ గాంధీ ఆలోచనలను నిజం చేస్తున్న నాయకుడు రేవంత్‌రెడ్డి అని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కొనియాడారు. ఆలేరు నియోజకవర్గానికి భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, శంకర్‌నాయక్, శ్రీపాల్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇకపై నెలకు రెండుసార్లు కేబినెట్ సమావేశాలు

- రాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం
- తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మంత్రివర్గ సమావేశాల నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతినెలా రెండుసార్లు కేబినెట్ సమావేశాలు నిర్వహించనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేబినెట్ సమావేశాలకు సంబంధించి ఎజెండాల రూపకల్పన, సమాచార సేకరణ.. తదితర అంశాలపై దృష్టిపెట్టాలని స్పష్టం చేశారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం లేకుండా ఉండటం, తీసుకున్న నిర్ణయాల అమలును వెంటనే సమీక్షించడం వల్ల పాలనలో సీరియస్‌నెస్ పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రెండు మూడు నెలలకోమారు నిర్వహిస్తున్న కేబినెట్ సమావేశాలను ఇకపై ప్రతినెలా మొదటి, మూడో శనివారాల్లో విధిగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి.. అధికారులను ఆదేశించారు. కాగా, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను, ఆ శాఖల పురోగతిని సంబంధిత మంత్రితోపాటు అధికారులతో కలిసి చర్చించడానికి మంత్రిమండలి త్వరగా సమావేశం కావడం మంచిదని సీఎం భావిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారం ఆధారంగా అవసరమైతే మార్పులు చేర్పులకు వెంటనే నిర్ణయం తీసుకోవడానికి కూడా వీలుంటుందని భావిస్తున్నారు. అలాగే క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు ఇతర శాఖల మంత్రుల దృష్టికి కూడా పలు అంశాలు వచ్చే అవకాశం ఉన్నందున, వారు మంత్రి మండలిలో ఆయా అంశాలను లేవనెత్తితే.. మరింత సమర్థవంతంగా వాటిని అమలు చేయడానికి చర్యలు తీసుకోవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఉన్నతాధికారి ఒకరు వివరించారు. నెలకు రెండుసార్లు సమావేశాల విధానాన్ని ఈనెల నుంచే ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం.



స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, పొన్నం ప్రభాకర్

ఈసారి పంటలకు ముందే రైతు భరోసా

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కేంద్రం పూర్తి స్థాయిలో ఎరువులు సరఫరా చేయడం లేదు
- హుస్నాబాద్‌లో రైతు మహోత్సవం ప్రారంభం

సాక్షి, సిద్దిపేట: ఈసారి పంటలు వేయకముందే రైతు భరోసా డబ్బులను అన్నదాతల ఖాతాల్లో జమ చేస్తామని, దీనిపై కేబినెట్ సమావేశంలో చర్చించామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణలో రైతులను కాపాడుకుంటున్నామని చెప్పారు. ఇప్పటివరకు రూ.35 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే తెలంగాణ రైతు మహోత్సవాన్ని శుక్రవారం ఆయన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కేంద్రం పూర్తి స్థాయిలో యూరియా, ఇతర ఎరువులు సరఫరా చేయట్లేదన్నారు. ప్రతిపక్షాలు రైతులను రాజకీయాలకు వాడుకుంటే వారికే నష్టం తప్పదన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఆయిల్ ఫెడ్ సంస్థ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఎడ్ల బండిపై మంత్రులు ర్యాలీగా ఈ కార్యక్రమానికి వచ్చారు.

మోదుగ విస్తరాకుల్లో రైతులకు భోజనాలు



ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా శుక్రవారం హుస్నాబాద్‌లో జరిగిన రైతు మహోత్సవానికి హాజరైన రైతులకు మోదుగ ఆకుల్లో భోజనాలు వడ్డించారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి ప్రత్యేక చొరవతో రైతు మహోత్సవాన్ని ప్లాస్టిక్ రహితంగా నిర్వహించారు. దాదాపు 10 వేల మోదుగ విస్తరాకులను తీసుకువచ్చి ఉపయోగించారు.

పోలీస్ అరాచకాలకు నా చావు కనువిప్పు కావాలి

అప్పుడైనా వేధింపులకు చెక్ పడుతుందేమో

- కేవలం వైఎస్సార్‌సీపీ వాడినని టార్చర్ పెట్టారు
- లేని నేరాన్ని మోపి రూ.35 లక్షలు కట్టాలంటున్నారు
- కమ్మోడివై వైఎస్సార్‌సీపీలో ఎలా ఉంటావ్ అంటూ దూషణ
- పురుగు మందు తాగి వ్యాపారి లక్ష్మీనారాయణ ఆత్మహత్యాయత్నం.. సెల్ఫీ వీడియో వైరల్
- తన పాడె మోయాలంటూ వైఎస్ జగన్‌కు విన్నపం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు



జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు ఉన్నచోటే.. జీ+3 పద్ధతిలో నిర్మాణం: మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: పేదల సొంతింటి కల నెరవేర్చే ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిన నేపథ్యంలో.. పట్టణ ప్రాంతాల్లోనూ పేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రౌండ్+3 ఫ్లోర్ల వరకు ఈ నిర్మాణాలు ఉండాలని నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని, అందులో భాగంగానే పట్టణ ప్రాంతాల్లోని పేదలకు కూడా ఇళ్లు నిర్మించనున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణాల్లోని మురికివాడల్లో జీవిస్తున్న పేదలను మరోచోటకు తరలించి గృహ నిర్మాణం చేపడితే వారు వెళ్లడానికి సిద్ధంగా ఉండరని, వారు నివసిస్తున్న ప్రాంతంలోనే జీ+3 ఫ్లోర్లలో ఈ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించినట్టు చెప్పారు. హైదరాబాద్‌కు దూరంగా ఇళ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇళ్లు తీసుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదన్నారు. కొల్లూరులో 42 వేల ఇళ్లు నిర్మించగా, 19 వేల మంది మాత్రమే అక్కడకు వెళ్లారన్నారు. ఇటీవల క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలన జరపగా, కేవలం 13 వేల మంది మాత్రమే ఆ నివాసాల్లో ఉంటున్నట్టు తేలిందని మంత్రి చెప్పారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని హైదరాబాద్‌లోని మురికివాడల్లో పేదలు ఉన్నచోటనే జీ+3 పద్ధతిలో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్టు చెప్పారు. తొలివిడతలో హైదరాబాద్‌లో 16 మురికివాడలను గుర్తించామని, వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్ తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

రియల్ మోసాలకు రెరా రెడ్ లైన్

- కొనుగోలుదారులను మోసం చేస్తే కఠినచర్యలు
- ప్రీలాంచ్‌లు, అనుమతిలేని ప్రకటనలు చట్ట విరుద్ధం
- మే చివరి నాటికి 'రెరా'లో 9,641 ప్రాజెక్టులు రిజిస్టర్
- 2,198 ఫిర్యాదులు వస్తే.. 1,278 పరిష్కరించాం
- రూ.42 కోట్ల జరిమానా విధించి.. రూ.15 కోట్లు వసూలు చేశాం



'సాక్షి' ఇంటర్వ్యూలో రెరా చైర్మన్ సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాల కొనుగోలుదారుల ప్రయోజనాలే ముఖ్యమని.. ప్రమోటర్లు, డెవలపర్లు, రియల్టర్లు కొనుగోలుదారులను మోసగించే చర్యలను సహించేది లేదని రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) చైర్మన్ సత్యనారాయణ స్పష్టం చేశారు. రెరా నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలకు రూ.42 కోట్ల జరిమానాలు విధించినట్లు చెప్పారు. కొనుగోలుదారుల ఫిర్యాదులు, పత్రికల్లో వస్తున్న కొన్ని వాణిజ్య ప్రకటనల ఆధారంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2023 జూన్‌లో రెరాకు పూర్తిస్థాయిలో చైర్మన్, ఇద్దరు సభ్యులను నియమించిన తర్వాత ఇప్పటివరకు తీసుకున్న చర్యలను 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సత్యనారాయణ వివరించారు. 500 చదరపు అడుగులకు పైబడిన లేదా కనీసం తొమ్మిది.. అంతకంటే ఎక్కువ ఫ్లాట్లు, ప్లాట్లు నిర్మించే ప్రతి ప్రాజెక్టు 'రెరా'కింద రిజిస్ట్రేషన్ తప్పకుండా చేసుకోవాలని తెలిపారు. అనుమతుల సమయంలో హెచ్ఎండీఏ, డీటీసీపీ, జీహెచ్ఎంసీ, పురపాలక సంఘాలు, సంస్థలు కూడా విధిగా 'రెరా'రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రమోటర్లు, డెవలపర్లకు సూచిస్తున్నాయని చెప్పారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు..

రెరాలో ఇప్పటివరకు ఎన్ని ప్రాజెక్టులు రిజిస్టర్ అయ్యాయి?

ఈ ఏడాది మే చివరి నాటికి 'రెరా'లో 9,641 ప్రాజెక్టులు నమోదయ్యాయి. 4,237 వ్యక్తులు/సంస్థలు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు నమోదు చేసుకున్నారు.

రెరా ప్రధాన బాధ్యతలేంటి?

ప్రమోటర్లు, డెవలపర్లు కొనుగోలుదారులకు జవాబుదారీగా ఉండేలా చేయడం, న్యాయబద్ధంగా వ్యవహరించేలా చూడడం, పారదర్శకత నెలకొల్పి మోసాలను నివారించడం, ఒప్పందం ప్రకారం కొనుగోలుదారులకు సకాలంలో ప్రాపర్టీలను పూర్తి చేసి అందించేలా చూడడం, ఒప్పందాలు సరిగా అమలయ్యేందుకు నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయడం రెరా ప్రధాన బాధ్యతలు.

ప్రజల నుంచి రెరాకు ప్రధానంగా ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి?

ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావడం లేదని, ఒప్పందం మేరకు నిర్ణీత గడువులోగా ఫ్లాట్లను అప్పగించటంలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. సకాలంలో ప్రాజెక్టులు మొదలుపెట్టకపోవటం, లేఅవుట్ నిబంధనలకు అనుగుణంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ సమయంలో అభివృద్ధి చేయకపోవడం, అసంపూర్తిగా ఉన్న ఫ్లాట్లను రిజిస్టర్ చేయడం, నిధులను మళ్లించడం, కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన డబ్బును దుర్వినియోగం చేయడం, అగ్రిమెంట్లలో పేర్కొన్న మేరకు వసతులు కల్పించకపోవడం, ఒకే ప్లాట్/ఫ్లాట్‌ను ఇద్దరు ముగ్గురికి విక్రయించడం, వినియోగదారుల నుంచి డబ్బు వసూలు చేసి కనిపించకుండా పోవటం, రెరాలో రిజిస్టర్ చేసుకోని ఏజెంట్లు ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావడంపై ప్రధానంగా ఫిర్యాదులు వస్తున్నాయి.

రెరా అనుమతి లేకుండానే ప్రకటనలు వస్తున్నాయి. వాటికి చెక్‌పెట్టే విధానం ఉందా?

రిజిస్టర్ చేసుకోని ప్రాజెక్టులపై సుమోటోగా కేసులు నమోదుచేస్తున్నాం. ప్రమోటర్ల అధికారిక వెబ్‌సైట్లను పరిశీలించి రిజిస్టర్ చేసుకోని ప్రాజెక్టులను గుర్తించి షోకాజ్ నోటీసులు ఇస్తున్నాం. రెరా నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలిస్తే.. 040–23394972కు ఫోన్ చేసిగానీ, 9000006301 నంబర్‌కు వాట్సాప్ ద్వారా గానీ, rera&maud@telangana.gov.in,secy&rera&maud@telangana.gov.in వెబ్‌సైట్లలోగానీ ఫిర్యాదు చేయవచ్చు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులపై ప్రీ లాంచింగ్ కార్యక్రమాలు చేపట్టడం రెరా చట్టరీత్యా నేరం. రిజిస్టర్ చేసుకోని సంస్థల ప్రకటనలను నియంత్రించేందుకు రెరా త్వరలోనే అడ్వర్టయిజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో అవగాహన ఒప్పందం చేసుకోబోతోంది.

రియల్ ఎస్టేట్ మోసాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

రియల్ ఎస్టేట్ మోసాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. నరెడ్కో, క్రెడాయ్, తెలంగాణ బిల్డర్స్ ఫోరం, తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్, వినియోగదారుల సంఘాల సహకారంతో రియల్ మోసాలను అరికట్టే చర్యలు చేపట్టాం.

ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు అందాయి? అందులో ఎన్నింటిపై చర్యలు తీసుకున్నారు? చర్యల తరువాత సంస్థల తీరు మారిందా? మీ నిర్ణయాలపై అప్పిలేట్‌కు వెళ్లిన కేసులెన్ని?

2,198 ఫిర్యాదులు అందాయి. వాటిలో 1,278 ఫిర్యాదులను పరిష్కరించాం. 862 ప్రాజెక్టులపై జరిమానాలు విధించాం. 42 కేసుల్లో అప్పీల్‌కు వెళ్లారు.

ఇప్పటివరకు ఎంత జరిమానా విధించారు? అందులో సంస్థలు ఎంత చెల్లించాయి?

నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు రూ.41,04,09,425 జరిమానా విధించాం. అందులో రూ.15,76,82,170 వసూలు అయ్యింది.

రెరా అమలులో ఇతర రాష్ట్రాలు ఏవిధంగా ముందుకెళ్తున్నాయి?

మన రాష్ట్రంలో రెరా పర్మనెంట్ అథారిటీని ప్రారంభించి రెండేళ్లు అవుతోంది. ఇతర రాష్ట్రాల్లో అంతకంటే ముందునుంచే ఉన్నాయి. అయినా వాటితో సమానంగా మన దగ్గర రిజిస్ట్రేషన్లు జరిగాయి. మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటకలో రెరాను 2017లోనే ప్రారంభించారు. మన రాష్ట్రంలో రెరా చైర్మన్‌గా నన్ను, సభ్యులుగా శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణను 2023 జూలైలో నియమిస్తే.. సిబ్బందిని 2024 నవంబర్‌లో కేటాయించారు. సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణలతో కలిసి వినియోగదారుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

వసూలు కాని జరిమానాను రాబట్టేందుకు రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగిస్తారా?

92 కేసుల్లో రెవెన్యూ రికవరీ చట్టం కింద జరిమానాలు వసూలు చేయాలని హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, ఖమ్మం జిల్లాల కలెక్టర్లను కోరాం. అందులో 3 కేసుల్లో ఆర్‌ఆర్ యాక్ట్ కింద జరిమానాలు వసూలు చేశారు. మిగతావి కూడా త్వరలో వసూలు చేస్తాం.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 7 । జూన్ । 2025



శ్రీవిశ్వశాంతి మహాశక్తి గణపతిగా..
ప్రతి యేటా వివిధ రూపాలలో దర్శనమిచ్చే ఖైరతాబాద్ మహా గణపతి ఈ సంవత్సరం శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నాడు. -10లో



అందం.. ఆత్మగౌరవం..
నగరం వేదికగా ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలు ముగిశాయో లేదో మరో ప్రతిష్టాత్మక ఫ్యాషన్ ఈవెంట్ 'మిస్ యూనివర్స్' ప్రారంభమవుతోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
37.0/23.0
నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 37, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.





రెండ్రోజుల ముందే రెక్కలు కట్టుకుని..

ఈ నెల 8న పంపిణీ చేయనున్న చేప ప్రసాదం కోసం నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు శుక్రవారం సాయంత్రం బిహార్, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వందలాది మంది ఆస్తమా రోగులు తరలివచ్చారు. రెండ్రోజుల ముందుగానే వచ్చిన వీరికి పలు స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు భోజనాలు, ఇతర వసతులు కల్పించనున్నారు.
– అబిడ్స్

మాదాపూర్ మెట్రో ఇక 'ఐఐఎల్ మాదాపూర్'



సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్ మెట్రో స్టేషన్ పేరు మారింది. ఇక నుంచి ఐఐఎల్ మాదాపూర్ మెట్రో స్టేషన్‌గా పరిగణిస్తారు. ఇమ్యునైజేషన్ వ్యాక్సిన్ తయారీలో ప్రఖ్యాతి చెందిన ఇండియన్ ఇమ్యునలాజికల్ లిమిటెడ్ సంస్థ పేరు మీదుగా మాధాపూర్ మెట్రో స్టేషన్‌కు నామకరణం చేశారు. ఈ మేరకు ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైల్, ఐఐఎల్ సంస్థల మధ్య శుక్రవారం ఒప్పందం కుదిరింది. హైదరాబాద్ ప్రజలకు పర్యావరణహితమైన ప్రయాణ సదుపాయాన్ని అందజేస్తున్న మెట్రో సేవలు అభినందనీయమని, మెట్రోతో ఏటా 2.2 మెట్రిక్ టన్నుల కార్బన్ తగ్గుతుందని ఇండియన్ ఇమ్యునలాజికల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏకే ఆనంద్‌కుమార్ తెలిపారు. ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. ఐఐఎల్‌తో ఒప్పందం హర్షించదగిన పరిణామం అని పేర్కొన్నారు.

పాతబస్తీలో కొత్వాల్ పర్యటన

బక్రీద్ బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



పాతబస్తీలో సిబ్బందితో కలిసి సీవీ ఆనంద్

చార్మినార్: బక్రీద్ సందర్భంగా నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ శుక్రవారం పాతబస్తీలో పర్యటించారు. దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, దక్షిణ తూర్పు మండలం డీసీపీ ఎస్.చైతన్య కుమార్‌లతో కలిసి బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. గోషామహల్‌తో పాటు ఎంజే బ్రిడ్జి, హసన్‌నగర్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లోని చెక్ పోస్టుల వద్ద తనిఖీలను పర్యవేక్షించారు. శనివారం బక్రీద్ సందర్భంగా ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసిందని సీవీ ఆనంద్ అన్నారు. జంతు కళేబరాలను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని, జీహెచ్ఎంసీ సిబ్బంది సూచనల మేరకు వ్యవహరించాలని ఆయన సూచించారు. పశు వైద్యుల నిబంధనల మేరకు జంతువులను తరలించాలని.. అక్రమ రవాణా చేయవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జంతువులను రవాణా చేస్తున్నారంటూ కొంత మంది చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నించవద్దని గో రక్షణ ప్రతినిధులను కోరారు. గంగా జమునా తహజీబ్ లాంటి నగరంలో కలిసి మెలసి ఉత్సవాలు నిర్వహించుకోవడం తరతరాలుగా వస్తోందని.. నగరం మత సామరస్యానికి చిహ్నంగా కొనసాగుతోందనే విషయాన్ని కొత్వాల్ గుర్తు చేశారు.

నగరానికి పచ్చని హారం

హైదరాబాద్ చుట్టూ 189 అర్బన్ బ్లాక్‌లు

- ఇప్పటి వరకు 45 అర్బన్ ఫారెస్ట్‌లుగా అభివృద్ధి
- అందమైన ఉద్యాన వనాలుగా విస్తరణ
- గతేడాది 6.8 కోట్ల మొక్కలు నాటిన హెచ్ఎండీఏ
- ఈసారి 4.5 కోట్ల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు



సాక్షి, సిటీబ్యూరో:

ఉద్యాన వనాల నగరంగా పేరొందిన హైదరాబాద్‌లో పచ్చదనం విస్తరణ కోసం హెచ్ఎండీఏ ప్రత్యేక దృష్టి సారించింది. నగరం చుట్టూ ఉన్న ఫారెస్ట్ బ్లాకులను అర్బన్ ఫారెస్ట్ పార్కులుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది. నగరం చుట్టూ వివిధ ప్రాంతాల్లో 189 బ్లాక్‌లు ఉన్నాయి. వాటిలో ఇప్పటి వరకు 45 అర్బన్ బ్లాకులను ఉద్యాన వనాలుగా తీర్చిదిద్దారు. దశల వారీగా మరిన్ని పార్కులను ఏర్పాటు చేయనున్నారు.

నర్సరీల్లో మొక్కల పెంపకంతో..
మహా నగర పరిధిని తాజాగా ఔటర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించిన నేపథ్యంలో అందుకనుగుణంగా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందజేసేందుకు అర్బన్ ఫారెస్ట్ బ్లాకుల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. వన మహోత్సవంలో భాగంగా గత ఏడాది 6.8 కోట్ల మొక్కలను నాటారు. ఈ ఏడాది మరో 4.5 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెచ్ఎండీఏ అర్బన్‌ఫారెస్ట్రీ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కోర్ అర్బన్ ఏరియాతో పాటు, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మొక్కల పెంపకాన్ని ఉద్యమ స్థాయిలో చేపట్టారు. హెచ్ఎండీఏకు చెందిన 42 నర్సరీల ద్వారా ప్రతి సంవత్సరం 5 కోట్ల మొక్కలను పెంచుతున్నట్లు ఆయన చెప్పారు. వీటిలో స్థానిక జాతులతో పాటు, అటవీ మొక్కలు, పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు, తదితర కేటగిరీలకు చెందినవి ఉన్నాయి. అలాగే ఇళ్లల్లో అలంకరణ కోసం పెంచే పూల మొక్కలను కూడా హెచ్ఎండీఏ నర్సరీలు అందజేస్తున్నాయి. రాష్ట్ర, జాతీయ రహదారులను ఆహ్లాదభరితం చేసే రకరకాల పూలమొక్కలను కూడా పెంచుతున్నారు.

ఆహ్లాద విహారం..
నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఔటర్‌కు ఇరువైపులా వందలకొద్దీ కొత్త కాలనీలు, నివాస ప్రాంతాలు వెలిశాయి. కానీ అనేక ప్రాంతాల్లో విశాలమైన పార్కులు అందుబాటులో లేకపోవడం నగర విస్తరణలో ఒక లోపంగా మారింది.ఈ క్రమంలో శివారు ప్రాంతాలను ఆనుకొని ఉన్న పట్టణ అడవుల్లో కొంతభాగాన్ని ఉద్యాన వనాలుగా మార్పు చేయడం వల్ల వివిధ ప్రాంతాల ప్రజలకు సాయంకాలం పూట కుటుంబాలతో కలిసి పార్కుల్లో ఆహ్లాదంగా గడిపేందుకు అవకాశం లభిస్తుంది. ఈ లక్ష్యంతోనే హెచ్ఎండీఏ పరిధిలో చేపట్టిన పార్కుల అభివృద్ధిలో భాగంగా త్వరలో 45 పార్కులను అభివృద్ధి చేశారు.మరో 17 పార్కులు వివిధ దశల్లో ఉన్నాయి. హెచ్ఎండీఏతో పాటు, టీఎస్ఐఐసీ, ఎఫ్‌డీసీ, జీహెచ్ఎంసీ, మెట్రో రైల్ సంస్థలు కూడా పార్కుల అభివృద్ధిలో భాగస్వామ్య సంస్థలుగా నిలిచాయి.

వాకింగ్ ట్రాక్‌లు, యోగా ప్లేస్‌లు..

- ప్రతి అర్బన్ ఫారెస్ట్ పార్కులో తప్పనిసరిగా ప్రవేశద్వారం, నడకదారి, వ్యూ పాయింట్ ఏర్పాటు ఉండేలా ఏర్పాటు చేశారు. పిల్లలకు ఆట స్థలం, యోగా షెడ్, సైక్లింగ్, వనదర్శిని కేంద్రం వంటి వాటికి ఈ పార్కుల్లో ప్రాధాన్యమిస్తున్నారు. మరోవైపు 189 ఫారెస్ట్ బ్లాకుల్లో 100 శాతం చిక్కటి అడవి పెరిగేలా, స్థానిక స్థలం, మట్టి స్వభావం, వాతావరణ పరిస్థితి ఆధారంగా పెద్ద ఎత్తున మొక్కలను పెంచుతున్నారు. మరోవైపు 158 కిలోమీటర్ల ఔటర్‌రింగ్‌రోడ్డుకు ఇరువైపులా సుమారు 97 లక్షల మొక్కలను పెంచేందుకు చర్యలు చేపట్టారు. గత పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో పచ్చదనం విస్తరణ 33.15 చ.కి.మీ. నుంచి 81.81 చ.కి.మీలకు పెరిగినట్లు అంచనా.



మేయర్ పీఠమే లక్ష్యంగా..

జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బీజేపీ

- కీలక నేతలు, కార్పొరేటర్లతో సమావేశాలు
- త్వరలోనే గ్రీవెన్స్ స్వీకరించాలని నిర్ణయం
- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలకు సిద్ధం



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ జనతా పార్టీ వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. జీహెచ్ఎంసీ మేయర్ పీఠం దక్కించుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. దానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేశారు. ప్రస్తుతం జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ నేతలు వ్యవహరించాల్సిన తీరును హితబోధ చేస్తున్నారు. రానున్న ఫిబ్రవరితో ప్రస్తుత పాలకవర్గం గడువు ముగియనుంది. ఈలోగా పార్టీ నేతలు, క్యాడర్‌ను ఎన్నికల ప్రక్రియకు సిద్ధం చేయాలని అగ్రనేతలు భావిస్తున్నారు. సమీప భవిష్యత్తులో వార్డు స్థాయిలో గ్రీవెన్స్ కార్యక్రమాలను ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ పరిధిలోని జిల్లాల వారీగా కార్పొరేటర్లు, ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో నేతలు వ్యవహరించాల్సిన తీరు, ప్రజలకు వివరించాల్సిన అంశాలను బోధిస్తున్నారు. నిత్యం ప్రజలతోనే ఉండాలని ఆదేశిస్తున్నారు. ఆయా వార్డుల పరిధిలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు అన్వేషించాలని దిశానిర్దేశం చేస్తున్నారు. అధికారులు స్పందించకుంటే స్థానికులతో కలసి నిరసన కార్యక్రమాలకు సిద్ధం కావాలని స్పష్టం చేస్తున్నారు.

శ్రేణులకు దిశా నిర్దేశం..
ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్నారు. ఇదే తరహాలో జీహెచ్ఎంసీ పరిధిలోనూ ఒక కార్యాలయం ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. వివిధ వార్డుల నుంచి వచ్చే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, స్వీకరించిన వినతుల పరిష్కారానికి ఎవరి పరిధిలో వారు కృషి చేయాలని దిశానిర్దేశం చేస్తున్నారు. 2016లో నలుగురు కార్పొరేటర్ల నుంచి 2020 ఎన్నికలు వచ్చే సరికి 48 మంది కార్పొరేటర్లు చేరుకున్నారు. ఓట్ల శాతం పరంగా చూస్తే బీఆర్ఎస్‌కు బీజేపీకి మధ్య 0.25 శాతం మాత్రమే తేడా. ఇది చాలా చిన్న వ్యత్యాసమే. అయినా అధికారానికి దూరమయ్యారు. ఈసారి చిన్నచిన్న పొరపాట్లను సరిదిద్దుకుని అందరూ కలసికట్టుగా పనిచేస్తే మేయర్ పీఠానికి కావాల్సిన 76 స్థానాలు గెలుపొందడం పెద్ద కష్టం కాదని కాషాయ దళం భావిస్తోంది.

మోదీ విజయాలే అజెండా..
దేశంలో హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసిన ప్రధాన మోదీ 11 ఏళ్ల పరిపాలనా కాలంలో సాధించిన ఘన విజయాలను ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రజల్లోకి తీసుకుకెళ్లాలని, దేశ రక్షణ, ప్రజల భద్రత విషయంలో మోదీ ముందుంటారనే అంశాన్ని గట్టిగా చెప్పాలని భావిస్తున్నారు. డివిజన్లలో సంకల్ప సభలు, శక్తి కేంద్రాల వారీగా రచ్చబండ కార్యక్రమాలు, జిల్లా స్థాయిలో ప్రొఫెషనల్ మీట్ ఏర్పాటు చేయాలి. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పైనా (మైగావ్ పోర్టల్) ఎడిటోరియల్ బ్లాక్స్. నాటి ఎమర్జెన్సీ పరిస్థితులను ఇప్పటి యువతకు వివరించాలని నిర్ణయించారు. ఈ నెల 9 నుంచి 25 వరకు అనిన డివిజన్లలోనూ చేపట్టాల్సిన ప్రణాళికను ఇప్పటికే ఆయా నేతలకు చేరవేశారు.

ప్యాట్నీ నాలాకు మోక్షం

ఆక్రమణలతో కుంచించుకుపోయిన వైనం

- 18 మీటర్ల నుంచి ఐదు మీటర్లకు వెడల్పు
- దీనిపై హైడ్రాకు ఫిర్యాదు చేసిన స్థానికులు
- 150 మీటర్ల మేర ఆరు నిర్మాణాల కూల్చివేత
- అక్కడి ఐదు కాలనీలకు తప్పిన వరద ముప్పు
- పక్షం రోజుల్లోగా రిటైనింగ్ వాల్ నిర్మాణం



ఆక్రమణలను కూల్చివేస్తున్న హైడ్రా సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: ఏళ్లుగా ఆక్రమణ చెరలో ఉన్న ప్యాట్నీ/పికెట్ నాలాకు మోక్షం లభించింది. స్థానికుల వరుస ఫిర్యాదులతో కదిలిన హైడ్రా అధికారులు శుక్రవారం ఆక్రమణల్ని తొలగించారు. ఎస్పీ రోడ్డులోని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ పార్క్ వద్ద 150 మీటర్ల మేర నిర్మితమై ఉన్న ఆరు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో ఆ చుట్టుపక్కల ఉన్న ఐదు కాలనీలకు వరద ముంపు ముప్పు తప్పినట్లు అయింది. ఈ ప్రాంతంలో నాలాకు 15 రోజుల్లోగా రిటైనింగ్ వాల్ నిర్మించనున్నట్లు కంటోన్మెంట్ బోర్డు అధికారులు ప్రకటించారు.

ఆక్రమించి అక్రమ నిర్మాణాలు..
ప్యాట్నీ/పికెట్ నాలాను ఆక్రమించిన కొందరు అక్రమంగా వాణిజ్య సముదాయాలు నిర్మించారు. 18 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన ఈ నాలా ఎస్పీ రోడ్డులోని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ పార్కు వద్ద ఐదు మీటర్లకు కుంచించుకుపోయింది. దీంతో వర్షాలు కురిసినప్పుడు వరద నీరు వెళ్లే ఆస్కారం లేక పైగా కాలనీ, ప్యాట్నీ కాంపౌండ్, ప్యాట్నీ కాలనీ, విమాన నగర్, బీహెచ్ఈఎల్ కాలనీ, ఇందిరమ్మ నగర్ నీట మునుగుతున్నాయి. దీంతో ఆ ఆక్రమణలు తొలగించాలంటూ స్థానికులు గతంలో కంటోన్మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల హైడ్రాకు దీనిపై పలు ఫిర్యాదులు అందాయి. దీంతో గురువారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

ఆక్రమణల తొలగింపును నిర్ణయం...
క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అధికారులు నాలా ఆక్రమణలు గుర్తైనట్లు నిర్ధారించారు. వర్షాలు కురిసిన ప్రతి సందర్భంలోనూ తమ కాలనీలు ఎలా మునిగిపోతున్నాయో, తాము ఎలాంటి బాధలు అనుభవిస్తున్నామో అధికారులకు తెలిసేలా స్థానికులు తమ ఫోన్లలో ఉన్న వీడియోలను చూపించారు. దీంతో అక్కడ ఉన్న ఆక్రమణలు తొలగించాలని అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో ఆక్రమణలకు గురి కాకుండా హద్దులు నిర్ణయించి, ప్రహరీలు నిర్మించేలా చర్యలు తీసుకోవాని భావించారు. శుక్రవారం ఉదయం రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు నాలాను ఆక్రమించిన నిర్మించిన ఆరు వాణిజ్య సముదాయాలను కూల్చేశారు. పేదలు, మధ్యతరగతి ప్రజల నిర్మాణాల జోలికి వెళ్లకూడదని నిర్ణయించారు. హైడ్రా కూల్చివేతలు చేపట్టిన ప్రాంతంలో 15 రోజుల్లోగా నాలాకు కాంక్రీట్ రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని కంటోన్మెంట్ బోర్డు అధికారులు ప్రకటించారు.

కొందరి కారణంగా ఇబ్బంది: రంగనాథ్
కొందరు ప్రైవేట్ వ్యక్తులు నాలాలను ఆక్రమిస్తూ నిర్మిస్తున్న భవనాల కారణంగా వేలాది మంది ముంపు ముప్పు ఎదుర్కొంటున్నారని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని అన్ని వాటర్ లాగింగ్, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలను అధ్యయనం చేస్తున్నామని ఆయన తెలిపారు. నాలాలు, వాటర్ బాడీ ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

అనుమతి లేని నిర్మాణాలను తొలగించండి

హెచ్ఎండీఏ అధికారులకు హైకోర్టు ఆదేశం

- రక్షణ శాఖ పిటిషన్లపై ముగిసిన విచారణ



సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం బౌరంపేట్ గ్రామ పరిధి సర్వే నంబర్ 345/పీ, 347/పీ పరిధిలోని రక్షణ సంస్థ సమీపంలోని అనధికారిక నిర్మాణాలను జాతీయ భద్రత దృష్ట్యా వెంటనే నిలిపివేయాలని హెచ్ఎండీఏను హైకోర్టు ఆదేశించింది. అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలతో అంతర్గత భద్రతకు ముప్పు కలిగే అవకాశం ఉన్నందున చట్టప్రకారం చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. రక్షణ సంస్థలను ఆనుకుని ఉన్న భూమిలో సంబంధిత అధికారుల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందకుండా అనధికారిక ప్రతివాదులు నిర్మిస్తున్న నిర్మాణాలను సవాల్ చేస్తూ రక్షణ మంత్రిత్వ శాఖ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. దీనిపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ ఆరోపించింది.

ఈ పిటిషన్లపై జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. '2012, ఏప్రిల్ 7న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన జీఓ నంబర్ 168 ప్రకారం సంబంధిత రక్షణ శాఖ అధికారుల నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరి. అయితే.. రక్షణ శాఖ అధికారుల సమ్మతి లేకుండా ఈ నిబంధనలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2016లో జీఓ నంబర్ 7ను జారీ చేసింది. ఇది 2011, మే 18న రక్షణ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించడమే. రక్షణ సంస్థల పక్కనే నిర్మాణాలను అనుమతించడం రక్షణ పనుల చట్టం–1903 నిబంధనలకు విరుద్ధం. వెంటనే ఆ నిర్మాణాలను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలి' అని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్లు, అనధికారిక ప్రతివాదులు రక్షణ సంస్థ ప్రాంతాలు, వాటి వివరాలను తమకు సమర్పించనందున వారికి విజ్ఞప్తి మేరకు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమన్నారు. హుడా సెక్షన్ 3 కింద నోటిఫికేషన్ లేదా డిక్లరేషన్ ప్రచురించడానికి పిటిషనర్లకు 2025, డిసెంబర్ 31 వరకు సమయం ఇస్తున్నామని.. ఒకవేళ ఇది ఇప్పటికే జారీ చేసి అమలు కాకుంటే, నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు. 2016 తర్వాత భవన నిర్మాణ అనుమతులపై కేంద్రం 2011 మార్గదర్శకాల ఆధారంగా ఎటువంటి చర్య తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఆరు నెలల వ్యవధిలో నోటిఫికేషన్ తర్వాత ఏదైనా చర్య తీసుకుంటే భూ యజమానులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే అక్రమ నిర్మాణాలు ఉంటే మాత్రం తొలగించాల్సిందేనని తేల్చిచెబుతూ.. పిటిషన్లపై విచారణ ముగించారు.

రాజేంద్రనగర్‌లో దారుణం



జన చైతన్య ఫేజ్-2 అపార్ట్‌మెంట్

వృద్ధ దంపతుల ఉసురుతీసిన ఆగంతకులు

- బక్రీద్ పండుగ వేళ విషాద ఛాయలు
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రాజేంద్రనగర్: ఒకరోజు గడిస్తే బక్రీద్ పండుగ. ఆనందోత్సాహాల మధ్య పర్వదినాన్ని జరుపుకోవాలని ఆశిస్తున్న వేళ.. ఆ కుటుంబానికి అశనిపాతమే మిగిలింది. విశ్రాంత ఉద్యోగులైన వృద్ధ దంపతుల హత్య తీరని శోకాన్నే మిగిల్చింది. రాజేంద్రనగర్ ఠాణా పరిధి జన చైతన్య ఫేజ్-2లో నివాసముంటున్న షేక్ అబ్దుల్లా (77), ఆయన భార్య రిజ్వానా (68) గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో దారుణ హత్యకు గురయ్యారు. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ అబ్దుల్లా ఎస్‌బీఐ మేనేజర్‌గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. ఆయన భార్య రిజ్వానా నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఓడీగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేశారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు సంతానం. ఈ నలుగురూ అమెరికా, లండన్‌లలో స్థిరపడ్డారు. కాగా.. జన చైతన్య ఫేజ్-2లో 500 గజాల స్థలాన్ని కొనుగోలు చేసిన షేక్ అబ్దుల్లా మూడేళ్ల క్రితం ఐదంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మించి అద్దెకు ఇచ్చారు. రెడ్‌హిల్స్‌లోని సొంత భవనం నుంచి 40 రోజుల క్రితమే జనచైతన్య ఫేజ్-2 ఇంట్లోకి మకాం మార్చి ఐదో అంతస్తులో నివసిస్తున్నారు. పార్కింగ్ స్థలంలో నిర్మించిన ఓ గదిలో వాచ్‌మన్ రాజేశ్ తన కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు.

బురఖా, మాస్క్ ధరించి వచ్చి..
గురువారం సాయంత్రం 5 గంటలకు బురఖా ధరించిన ఓ వ్యక్తి, మాస్క్, టోపీ ధరించిన మరో యువకుడు వాచ్‌మన్ రాజేశ్ వద్దకు వచ్చి షేక్ అబ్దుల్లా ఫిజియోథెరపీ కోసం పిలిపించారని చెప్పాడు. వాచ్‌మన్ రాజేశ్ ఫోన్ ద్వారా షేక్ అబ్దుల్లాకు సమాచారం ఇవ్వడంతో అతడిని పైకి రమ్మని తెలిపాడు. వచ్చిన ఇద్దరిలో మాస్క్ ధరించిన వ్యక్తి 5 నిమిషాల్లో తిరిగి బయటికి వెళ్లిపోగా.. బురఖా ధరించిన వ్యక్తి 45 నిమిషాల అనంతరం బయటికి వెళ్లాడు. వాచ్‌మన్ రాత్రి 8 గంటల ప్రాంతంలో షేక్ అబ్దుల్లాకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. నిద్రకు ఉపక్రమించి ఉంటారని భావించి ఊరుకున్నాడు.

రక్తపు మడుగులో విగతజీవులుగా..
శుక్రవారం ఉదయం 10 గంటలకు వాచ్‌మన్ ఐదో అంతస్తుకు వెళ్లగా... ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లగా మొదటి బెడ్రూంలో షేక్ అబ్దుల్లా, రిజ్వానా రక్తపు మడుగులో పడి ఉండటంతో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు జుల్ఫీ అలీకి సమాచారం అందించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించారు. పంచనామా నిర్వహించి మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఘటన స్థలాన్ని రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ శ్రీనివాస్‌తో పాటు ఏసీపీ సందర్శించారు. అబ్దుల్లా ఒంటిపై ఏడు కత్తిపోట్లు, రిజ్వానా ఛాతీపై ఒక కత్తిపోటును పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. నిందితులిద్దరూ పురుషులేనని ప్రాథమికంగా గుర్తించారు. తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నిందితులను తొందరలోనే పట్టుకుంటామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. కాగా.. వృద్ధ దంపతులకు డ్రైవర్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతడి జాడ లేకపోవడంతో.. ఆచూకీ కోసం వెతుకుతున్నారు.



షేక్ అబ్దుల్లా (ఫైల్)



షేక్ అబ్దుల్లా, రిజ్వానా మృతదేహాలు

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీ అరెస్టు

సనత్‌నగర్: క్రికెట్ బెట్టింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఓ బుకీతో సహా మరో ఇద్దరిని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రసూల్‌పురా గన్‌బజార్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఐ వరలక్ష్మి, ఇతర సిబ్బంది గురువారం సాయంత్రం ఆకస్మికంగా దాడి చేశారు. ఓ ఇంట్లో బెల్లం కిరణ్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి క్రికెట్ బెట్టింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అదే ఇంట్లో సుధాకర్‌రెడ్డి, మయూర్ జోషి అనే ఇద్దరు పందెం కాసేవారు కూడా ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటన స్థలం నుంచి ఓ ల్యాప్‌ట్యాప్, రూ.1,44,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ల్యాప్‌ట్యాప్‌లో ఇన్‌స్టాల్ చేసిన మ్యాట్రిక్స్ బెట్టింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా క్రికెట్ పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు కనుగొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేబుల్ బ్రిడ్జిపై కారు దగ్ధం



మాదాపూర్: దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జిపై ఎలక్ట్రికల్ లోపం కారణంగా శుక్రవారం ఓ కారు దగ్ధమైంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం సాయంతం నాలుగు గంటల ప్రాంతంలో కేబుల్‌బ్రిడ్జిపై ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఇనార్బిట్‌మాల్ నుంచి జూబ్లీహిల్స్ వెల్తుండగా ఘటన జరిగినట్లు గుర్తించారు. మంటలు చెలరేగగానే అందులో ప్రయాణిస్తున్న వారు కారు దిగి వెళ్లిపోయారని, మియాపూర్‌కి చెందిన పి.శ్రీరామ్‌రెడ్డి పేరుతో కారు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవిశ్వశాంతి మహాశక్తి గణపతిగా

ఖైరతాబాద్ వినాయకుడు



కర్రపూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఖైరతాబాద్: ప్రతి యేటా వివిధ రూపాలలో దర్శనమిచ్చే ఖైరతాబాద్ మహాగణపతి ఈ సంవత్సరం శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నాడు. శుక్రవారం సాయంత్రం నిర్జల ఏకాదశి సందర్భంగా కర్రపూజ నిర్వహించి మహాగణపతి తయారీ పనులకు శ్రీకారం చుట్టారు. 71వ సంవత్సరం సందర్భంగా 69 అడుగుల ఎత్తులో విగ్రహాన్ని రూపొందిస్తారు. కర్రపూజ(తొలిపూజ)ను ఖైరతాబాద్ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ విజయారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సంవత్సరం శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి మూర్తి నిలబడి ఉండే ఆకారంలో ఏర్పాటు చేస్తున్నట్లు శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు. 69 అడుగుల ఎత్తులో వినాయకుడు, పక్కనే 10 అడుగుల ఎత్తులో జగన్నాథస్వామి, లలితా త్రిపుర సుందరి అమ్మవార్ల విగ్రహాలు, మహాగణపతి ఇరు వైపులా కుడి వైపు లక్ష్మీ సమేత హయగ్రీవుడు, ఎడమవైపు గజ్జలమ్మ అమ్మవారి విగ్రహాలు 15 అడుగుల ఎత్తులో ఉంటాయన్నారు. ఈ సంవత్సరం వినాయకచవితి ఆగస్టు 27న, నిమజ్జనం సెప్టెంబర్ 6వ తేదీన జరుగుతాయి.



శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి నమూనా చిత్రం

వివాహితపై లైంగిక దాడి...ఆపై బెదిరింపులు

నిందితుడిపై కేసు నమోదు

సనత్‌నగర్: భర్తతో మనస్పర్థలు వచ్చి దూరంగా ఉంటున్న వివాహితను బలవంతంగా హోటల్‌కు పిలిపించాడు. మత్తు మందు కలిపిన పండ్ల రసం ఇచ్చి ఆమె స్పృహ కోల్పోయేలా చేశాడు. అనంతరం లైంగిక దాడి చేయడమే కాకుండా ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి కుటుంబ సభ్యులకు పంపుతానని బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట ప్రాంతానికి చెందిన మహిళ (37)కు 2013లో వివాహం కాగా, భర్తతో కలిసి మహారాష్ట్రలో నివాసం ఉండేది. భర్తతో మనస్పర్థల కారణంగా గొడవ పడి ఐదు నెలల క్రితం బేగంపేటలోని తన తల్లి ఇంటికి వచ్చి ఉంటోంది. కాగా జనవరిలో నిజాముద్దీన్ అనే వ్యక్తి మహిళకు ఫోన్ చేసి డెలివరీ బాయ్‌నని చెప్పగా, తాను ఎటువంటి ఆర్డర్ చేయలేదని ఫోన్ పెట్టేసింది. అప్పటి నుంచి నిజాముద్దీన్ తరచూ మహిళకు ఫోన్ చేస్తూ, సందేశాలు పంపుతూ బయటకు రమ్మని తీవ్రంగా ఒత్తిడి చేశాడు. చివరకు అతని వేధింపుల తట్టుకోలేక బాధితురాలు ఓ రోజు నగరంలోని పబ్లిక్ గార్డెన్స్‌లో కలిసింది. భర్తతో గొడవలు ఉన్నందున అతడికి విడాకులు ఇవ్వాలని, తాను పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. విడాకుల కోసం దరఖాస్తు చేసేందుకు ఆమె ఆధార్‌కార్డు తీసుకున్నాడు. అనంతరం ఓ న్యాయవాదిని కలిసేందుకని గుడిమల్కాపూర్ సమీపంలోని ఓ హోటల్‌కు తీసుకుపోయాడు. హోటల్‌లో బాధితురాలికి మత్తు కలిపిన పండ్ల రసం ఇచ్చాడు. బాధితురాలు స్పృహ కోల్పోయిన తర్వాత ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో ఫొటోలు, వీడియోలు తీశాడు. ఆ తర్వాత న్యాయవాది రాలేదని ఆమెను పంపించేశాడు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ ఫోన్ చేసి తనకు లక్ష రూపాయలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఫొటోలు, వీడియోలు కుటుంబ సభ్యులకు పంపుతానని బెదిరించాడు. దీంతో భయపడిన మహిళ ఏప్రిల్‌లో లక్ష రూపాయలు అతనికి ఇచ్చింది. మళ్లీ కొన్ని రోజులకు ఫోన్ చేసి తనను కలవాలని, లేకుంటే ఫొటోలు, వీడియోలు అందరికీ పంపుతానని హెచ్చరించాడు. ఆమె అంగీకరించలేదు. ఓ రోజు స్నేహితురాలితో కలిసి వస్తుండగా బాధితురాలిని కారులో బలవంతంగా తీసుకుపోయాడు. ఓ హోటల్‌కు తీసుకెళ్లి మరోసారి లైంగిక దాడి చేశాడు. దీంతో బాధితురాలు గురువారం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు నిజాముద్దీన్‌పై కేసు నమోదు చేసిన బేగంపేట పోలీసులు సంఘటన జరిగిన ప్రాంతాన్ని బట్టి గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

మాగంటి త్వరగా కోలుకోవాలి: మంత్రి పొన్నం

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ త్వరగా కోలుకోవాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నానని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావడం లేదని పేర్కొన్నారు. 'ఇన్‌చార్జి మంత్రిగా నేను, ఎమ్మెల్యేగా ఆయన అనేక దఫాలు కలిశాం. ఇది రాజకీయాలకు అతీతంగా మాట్లాడాల్సిన సమయం. బీఆర్‌ఎస్ నాయకులు ఈ సందర్భాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చారనే అక్కసుతోనే ఆరోపణలు చేస్తున్నారు' అని పొన్నం పేర్కొన్నారు.

మాగంటిని పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అక్కడి వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న మాగంటి కుటుంబ సభ్యులకు మంత్రి శ్రీధర్ బాబు ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సర్వే ల్యాండ్ రికార్డులను పరిశీలించిన ట్రైనీ ఐఏఎస్‌లు



లక్డీకాపూల్: 2024 బ్యాచ్‌కి చెందిన ట్రైనీ ఐఏఎస్‌లు శుక్రవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సర్వే ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాన్ని సందర్శించారు. టౌన్ సర్వే ల్యాండ్ రికార్డులను పరిశీలించారు. హైదరాబాద్‌లో సర్వే రికార్డ్స్ భద్రపరిచే విదానం, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధికారి వి.శ్రీరామ్, సహాయ సంచాలకులు, మధుసూదన్, అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్

జీడిమెట్ల: మహిళను హత్య చేసి సూటుకేసులో కుక్కి పారవేసిన కేసులో నిందితుడిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ కె.సురేష్‌కుమార్, ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్ తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నేపాల్‌కు చెందిన తారా బెహరా(33), విజయ్‌తోఫాలు పరిచయస్తులు. తారాబెహరాకు వివాహం కాగా ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తతో విడిపోయి విడిగా ఉంటుండగా ఆమెకు విజయ్ తోఫాతో ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైంది. కొద్దిరోజులకు విజయ్ హైదరాబాద్ రావాలని ఇద్దరం కలిసి ఉందామని తారాను అడిగాడు. విజయ్ చెప్పినట్లుగానే తారా 2 నెలల క్రితం హైదరాబాద్‌కు వచ్చి జూబ్లీహిల్స్‌లోని విజయ్ తల్లిదండ్రుల వద్ద ఉంది. ఆ తర్వాత కొద్ది రోజులకు బౌరంపేటలోని 60 గజాల్లోకి వచ్చి అక్కడే ఓ గదిని అద్దెకు తీసుకుని ఇద్దరు ఉంటున్నారు. ఈక్రమంలో తారా గర్భవతి అయ్యింది. తారా గర్భం వద్దని, అబార్షన్ చేయించాలని కోరగా..విజయ్ అందుకు ఒప్పుకోలేదు. మే 23న ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన విజయ్ తోఫా నైలాన్ తాడును తారా మెడకు బిగించి ఊపిరాడకుండా చేసి ప్రాణం తీశాడు.

మృతదేహాన్ని సూట్‌కేసులో ఉంచి..

మతదేహాన్ని ఇంట్లో ఉంచిన విజయ్ కూకట్‌పల్లికి వెళ్లి అదేరోజు పెద్ద సూటుకేసు కొనుక్కొచ్చాడు. అందులో మృతదేహాన్ని పెట్టి డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ సమీపంలో పారవేశాడు. జూన్ 4న నిర్మానుష్య ప్రదేశంలో సూటుకేసు నుండి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన వెలుగుచూసిన విషయం విదితమే. కాగా నిందితుడు విజయ్ జూబ్లీహిల్స్‌లో ఉన్నట్లు గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు విజయ్ బెహరాపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

విదేశీ మద్యం సీజ్

చందానగర్: అక్రమంగా మిలటరీ, విదేశీ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన శేరిలింగంపల్లి పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ వివరాలు వెల్లడించారు. మియాపూర్ మాతృశ్రీనగర్ కాలనీలో నివాసముండే మన్నవ గాంధీ అక్రమంగా విదేశీ మద్యం, మిలటరీ క్యాంటీన్‌లో లభించే మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో సీఐ సుభాష్ చందర్‌రావు, ఎస్ఐ అఖిల్ సిబ్బందితో కలిసి అతని ఇంటిపై దాడులు జరిపారు. అతని వద్ద నుంచి 160 విదేశీ, మిలటరీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

స్పా సెంటర్లపై పోలీసుల దాడులు: పలువురి అరెస్టు

అమీర్‌పేట: స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తుండగా ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడు స్పా సెంటర్లపై పోలీసులు దాడులు చేశారు. బీకే గూడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ అద్దెకు తీసుకుని గుట్టుచప్పుడుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో సీసీఎస్ యాంటీ ట్రాఫికింగ్ వింగ్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. యూసుఫ్‌గూడకు చెందిన స్పా సెంటర్ నిర్వాహకురాలు నడిమింటి అనూష, కార్మికనగర్‌కు చెందిన విటుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వినయ్‌బాబుతో పాటు ఐదుగురు మహిళలను అరెస్టు చేశారు. అదే విధంగా అమీర్‌పేట విశాల్ చాంబర్స్‌లోని 2వ అంతస్తులో గ్లోరీ ఫిజియోథెరపీ హాస్పిటాలిటీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. బోరబండకు చెందిన స్పా సెంటర్ యజమాని టి.కళ్యాణి, ఐడీపీఎల్ చింతల్‌కు చెందిన అశోక్‌కుమార్, మియాపూర్ నివాసి సాంబ శివరెడ్డితో పాటు నలుగురు మహిళలను అరెస్టు చేశారు. అమీర్‌పేట గురుద్వారా సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో ఎస్.ఎస్.బ్యూటీ సెలూన్ అండ్ స్పా సెంటర్‌లో ఎస్ఆర్‌నగర్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆదిలాబాద్‌కు చెందిన నిర్వాహకురాలు సుధ, వెస్ట్ గోదావరికి చెందిన విటుడు సాగిరాజు దినేష్ వర్మ, వరంగల్‌కు చెందిన గౌతమ్, కుత్బుల్లాపూర్ నివాసి రవికుమార్, బంజారాహిల్స్‌కు చెందిన చవన్ సురేందదర్, గుంటూరుకు చెందిన పిన్ని ప్రవీణ్ కుమార్, వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఒక యువతిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసులను ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి



సాయిరాం (ఫైల్)

మేడిపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా లింగాల ఘనపురం గ్రామానికి చెందిన వెంకటేష్ కుమారుడు సాయిరాం (22) రామంతాపూర్‌లోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పీర్జాదిగూడ ఉప్పల్ డిపో సమీపంలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఈ నెల 1వ తేదీన సాయిరాం ఊరికి వెళ్లాడు. కాలేజీ ఫీజు కట్టాలని తండ్రికి చెప్పి రూ.34 వేలు తీసుకుని తిరిగి గురువారం రాత్రి ఉప్పల్‌లోని తన గదికి వచ్చాడు. అనంతరం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తన కుమారుడి ఆత్మహత్యపై పలు అనుమానాలు ఉన్నాయని తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'వేలం' వాహనాలు కొని..

డ్రగ్ పెడ్లర్ల కొత్త బాట..

- బ్యాంక్ ఆక్షన్‌లో వాహనాలను కొంటున్న కేటుగాళ్లు
- మాదక ద్రవ్యాల సరఫరా కోసం వీటి వినియోగం
- పోలీసులకు చిక్కినా వ్యక్తిగత వివరాలు తెలియకుండా ఎత్తుగడ
- బైక్స్, లగ్జరీ కార్లు సైతం ఈ తరహాలోనే కొనుగోలు

సాక్షి, సిటీబ్యూరో: డ్రగ్ పెడ్లర్లు తెలివిమీరిపోతున్నారు. మాదక ద్రవ్యాలు రవాణా చేసే సమయంలో పోలీసులకు చిక్కినా తమ వ్యక్తిగత వివరాలు తెలవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నకిలీ పేర్లు, గుర్తింపు కార్డులనే కాదు తాము వినియోగించే వాహనాలు సైతం బినామీ పేర్ల మీద కొనుగోలు చేస్తున్నారు. తమ ముఠా సభ్యులతో బ్యాంకు వేలంలో పాల్గొని వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. వీటిని డ్రగ్స్ సరఫరా చేసేందుకు వినియోగిస్తున్నారు.

ఏజెంట్లతో పెడ్లర్ల సత్సంబంధాలు..

గ్రేటర్‌లోని ట్రై కమిషనరేట్‌లో పలు మాదక ద్రవ్యాల కేసులలో పోలీసులు నిందితులను పట్టుకుని వారి వద్ద ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకున్న తర్వాత ఆయా వాహనాల యజమానులు, ఇతరత్రా వివరాలను పరిశీలించగా..అవి సెకండ్‌హ్యాండ్ వాహనాలని తేలింది. ఆయా వెహికిల్స్‌లో ద్విచక్ర వాహనాలతో పాటు లగ్జరీ కార్లు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బ్యాంక్ రుణం తీసుకొని వాహనాలను కొనుగోలు చేసిన యజమానులు..నెలవారీ వాయిదా (ఈఎంఐ) చెల్లించడంలో విఫలమైతే.. బ్యాంక్‌లు ఆయా వాహనాలను రికవరీ చేస్తాయి. అనంతరం వాటిని వేలంలో విక్రయిస్తుంటాయి. కొంతమంది బ్యాంక్ రికవరీ ఏజెంట్లు డ్రగ్ పెడ్లర్లతో చేతులు కలిపి వ్యవస్థీకృత పద్ధతిలో వేలంలో వాహనాల కొనుగోళ్లు జరుపుతున్నారు. మంచి కండీషన్ ఉన్న వాహనాలు తక్కువ ధరకు వేలానికి వచ్చినప్పుడు ఆయా సమాచారాన్ని ఏజెంట్లు పెడ్లర్లతో పంచుకుంటారు. డిఫాల్టర్ల వాహనాలను తమ ముఠా సభ్యుల పేర్ల మీద తక్కువ ధరకే వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. వీటిని మాదకద్రవ్యాల రవాణాతో పాటు వ్యక్తిగత అవసరాల కోసం వినియోగిస్తున్నారు.

30 వాహనాలు..

ట్రై కమిషనరేట్ పోలీసులు మాదకద్రవ్యాల విక్రయదారుల వద్ద కనీసం 30 వేలం వేసిన వాహనాలను అధికారులు గుర్తించారు. వీటిల్లో ఎస్‌యూవీ, హైఎండ్ సెడాన్ కార్లు కూడా ఉన్నాయి. డ్రగ్స్ అమ్మకాల ద్వారా సంపాదించిన సొమ్మును పెడ్లర్లు, సిండికేట్లు ఈ వాహనాలను కొనుగోలు చేయడానికి ఉపయోగిస్తున్నారని పోలీసులు గుర్తించారు. ఇటీవల అరెస్టయిన డ్రగ్స్ పెడ్లర్ మహ్మద్ ఉస్మాన్ అలియాస్ ఫైసల్ ఇదే తరహాలో వేలంలో వాహనాలను కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుల నుంచి వాహనాలతో పాటు ఇతరత్రా స్థిరాస్తులను సైతం పోలీసులు జప్తు చేస్తున్నారు.

చంచల్‌గూడ జైళ్ల శాఖ స్థలానికే ఎసరు

- దర్జాగా స్థలాన్ని లీజుకు ఇచ్చిన ప్రైవేట్ వ్యక్తులు
- చాదర్‌ఘాట్ పీఎస్‌లో సూపరింటెండెంట్ ఫిర్యాదు



మలక్‌పేట ఫైర్‌స్టేషన్ పక్కనున్న జైళ్ల శాఖ స్థలం

చాదర్‌ఘాట్: జైళ్ల శాఖకు చెందిన స్థలాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులు తమదిగా చెప్పుకొని మరో నిర్మాణ సంస్థకు లీజుకు ఇచ్చారు. తప్పుడు లీజు అగ్రిమెంట్ ద్వారా వారు జైళ్ల శాఖకు చెందిన భూమి ద్వారా నెలనెలా పెద్ద మొత్తంలో సొమ్ము తమ జేబులో వేసుకుంటున్నారు. ఈ మేరకు చంచల్‌గూడ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ గురువారం చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుండి చంచల్‌గూడ వైపు వెళ్లే మార్గంలో మలక్‌పేట ఫైర్‌స్టేషన్ పక్కన తెలంగాణ జైళ్లశాఖకు చెందిన రెండు ఎకరాల భూమి ఉంది. అయితే గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ నుండి ఒవైసీ చౌరస్తా వరకు స్టీల్ బ్రిడ్జ్ నిర్మించడానికి జీహెచ్‌ఎంసీ నుంచి ఒక సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకుంది. వారి సామాగ్రి తదితరాలు ఉంచుకోవటానికి వారికి స్థలం అవసరమైంది. జైళ్లశాఖకు చెందిన భూమిని తమదిగా చెప్పుకొని వెంకట్రావ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వ్యక్తులు మోసపూరితంగా నిర్మాణ సంస్థతో లీజు కుదుర్చుకున్నారు. 2020లోనే కుదుర్చుకున్న ఈ తప్పుడు లీజు ద్వారా ఐదు సంవత్సరాలుగా వారు నెలనెలా లీజు కిందనే రూ.లక్ష చొప్పున ఇప్పటికి రూ.60 లక్షలు తీసుకున్నారని సమాచారం. అయితే ఇటీవలే ఈ వ్యవహారాన్ని జైళ్ల శాఖ అధికారులు గుర్తించారు. వెంకట్రావ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఉద్దేశపూర్వకంగానే జైళ్లశాఖ స్థలం నుంచి చట్టవిరుద్ధంగా నగదు ప్రయోజనాలను పొందుతున్నారని, ఇది వారి నేరపూరిత కుట్ర అని చంచల్‌గూడ సూపరింటెండెంట్ తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంకట్రావ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జి.సత్యనారాయణరావు, కట్టా సోమలింగం, జి.శంకర్‌యాదవ్, డి.కరుణాకర్, ఎ.రామచంద్రరావు అనే ఐదుగురు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జవహర్‌నగర్: బాలాజీనగర్ నుండి కౌకూర్‌కు వస్తున్న క్రమంలో వేగంగా నడుపుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌకూర్ భరత్‌నగర్‌లో నివసించే ధనుష్‌కుమార్ (30 ఐసీఐసీఐ బ్యాంకులో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం కీసరలో విధులు ముగించుకుని బైకుపై ఇంటికి వస్తుండగా బాలాజీనగర్ ఫైరింగ్ కట్ట వద్ద అటువైపుగా అతి వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో కింద పడిన ధనుష్‌కుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్ సహాయంతో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని అనురాగ్ కిషోర్‌శర్మపై ధనుష్‌కుమార్ భార్య అఖిల జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ దుర్గా భవానీనగర్ బస్తీలోని దుర్గా భవానీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూస్, సాక్సులు ఉచితంగా ఇస్తారని, ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా బస్తీలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు.

10న హిందీ ప్రచార సభ 90వ వార్షికోత్సవ సభ



హిమాయత్‌నగర్: హిందీ ప్రచారసభ హైదరాబాద్ స్థాపించి 90 ఏళ్ల పూర్తయిన సందర్భంగా జూన్ 10న జాతీయ స్థాయిలో 90వ వార్షికోత్సవ సభ ఘనంగా నిర్వహిస్తున్నట్లు హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి తెలిపారు. వార్షికోత్సవాల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, విశిష్ట అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. శృతికాంత్ భారతి, డా.సుష్మాదేవి, వెంకటేశ్వర్లు, నాందేవ్, శివలింగం, మాయపాండే, వినోద్, శ్రీకాంత్, భానుదాస్ పాల్గొన్నారు.

రోగుల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది

- ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో కలుషిత ఆహారంతో ఉస్మానియాలో చికిత్స పొందుతున్న 17 మంది రోగుల్లో 13మంది తిరిగి ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రికి చేరుకొని వైద్య సేవలు అందుకుంటున్నారు. మరో ఆరుగురు రోగుల్లో లోబీపీ, ఇతర అనారోగ్య సమస్యలు ఉండటంతో అక్కడే చికిత్స అందజేస్తున్నారు. రోగుల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపారు. అంతేగాకుండా ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు బీజేపీ కృషి



మొక్కలను నాటుతున్న బీజేపీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు బీజేపీ కృషి చేస్తోందని శ్రీనగర్‌కాలనీ డివిజన్ శాఖ ప్రెసిడెంట్ గారపాటి అనంతలక్ష్మి అన్నారు. బీజేపీ పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 5 నుంచి వచ్చేనెల 15 వరకూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా నాగార్జుననగర్‌కాలనీ పార్టీ ఆఫీస్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు.కార్యక్రమంలో నేతలు బంగారు ప్రశాంత్, శాంతికుమార్, ఉదయ్, హరీష్‌యాదవ్, శ్రీధర్, ఉమేష్, కిషోర్, భాస్కర్, రాజేష్, సుధ,డాక్టర్ మణికంఠ, వినోద్, గిరి పాల్గొన్నారు.

మోడల్ ఇందిరమ్మ కాలనీ నిర్మించాలి



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్ పక్కన ఉన్న గురుబ్రహ్మనగర్ బస్తీలో నాలుగు దశాబ్దాల నుంచి తాము గుడిసెలు, రేకుల షెడ్లలో నివాసం ఉంటూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే తమకు మోడల్ ఇందిరమ్మ ఇళ్ల కాలనీని ప్రకటించి ఇళ్లు నిర్మించాలని బస్తీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రాజెక్టులో భాగంగా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి బస్తీలో పర్యటించగా బస్తీవాసులు అధికారులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇందిరమ్మ మోడల్‌కాలనీ నిర్మాణానికి తమ బస్తీ అన్ని రకాలుగా అర్హత ఉందని, ఇక్కడే 272 మందికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ ఎలాంటి వివాదాలు లేవని, ఈ ప్రాజెక్టుకు అందరి అంగీకారం ఉందని బస్తీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అధికారులకు తెలియజేశారు.

వైభవంగా స్వామివారి రథోత్సవం



మహారథంపై కొలువుదీరిన స్వామివారు

హిమాయత్‌నగర్: శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం ఉదయం 8.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారు మహారథంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. వందలాది మంది భక్తజన సందోహంలో గోవింద నామ స్మరణల మధ్య రథోత్సవం సాగింది. సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో నాల్గవ రోజు రాత్రి శ్రీవారు అశ్వవాహన సేవలో దుష్ట శిక్షకునిగా కల్కి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ వాహనంపై స్వామి వారు క్షత్రియ లక్షణాలు కలిగిన తలపాగా, దూసిన కరవాలంతో, విశేష తిరు ఆభరణాలతో అలంకారమై వీధుల్లో ఊరేగారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓంప్రకాష్ బిశ్వా, స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్‌గౌడ్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అతిథులను ఆలయ ఏఈఓ రమేష్, ఉత్సవాల దాత త్రినాథ్ బాబు సన్మానించారు.



ఎంపీ ఈటల రాజేందర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న త్రినాథ్‌బాబు



అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి

'యువ వికాసం' లెక్క తేలేదెన్నడో..?

- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- ఇంకా విడుదల కాని అర్హుల జాబితా
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లోని దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ

బంజారాహిల్స్: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధిదారుల లెక్క తేల్చేందుకు మరికొన్ని రోజులు పట్టేలా కనిపిస్తోంది. ఈ నెల 2వ తేదీన లబ్ధిదారుల జాబితా విడుదల అవుతోందని, రుణ పత్రాలు కూడా అందజేస్తారని భారీగా ప్రచారం జరగడంతో అర్హులు, దరఖాస్తుదారులు ఎంతో ఆశతో ఎదురుచూశారు. తీరా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ఈ పథకానికి సంబంధించిన రుణ పత్రాలు పంపిణీ చేయలేదు. ఫలితంగా వేలాది మంది దరఖాస్తుదారులు అర్హత ఉండి రుణాలు వస్తాయని ఎదురుచూసి నిరాశ చెందారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకం కోసం 16,786 మంది దరఖాస్తు చేసుకున్నారు.
- ఇందులో 2,776 మందిని అర్హులుగా తేల్చి బ్యాంక్‌లకు పత్రాలను నెల క్రితమే అందజేశారు.
- స్కోర్ ఆధారంగా లబ్ధిదారుల జాబితాను బ్యాంక్‌లు రూపొందించి తిరిగి మండల కార్యాలయాలకు పంపించాల్సి ఉంటుంది.
- ఇప్పటి వరకు బ్యాంక్‌ల నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో అటు అధికారులు, ఇటు లబ్ధిదారులు ఎదురుచూపుల్లో మునిగిపోయారు.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధి కిందికి వచ్చే యూసుఫ్‌గూడ, షేక్‌పేట, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, బోరబండ డివిజన్ల పరిధిలో ఈ పథకం కోసం 19,656 మంది దరఖాస్తు చేసుకోగా, ఇందులో 2,366 మందిని అర్హులుగా గుర్తించి బ్యాంక్‌లకు పత్రాలను పంపిణీ చేశారు.
- ఇప్పటి వరకు బ్యాంక్‌ల నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. లబ్ధిదారుల లెక్క తేల్చేందుకు మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది.



రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

- ఈ పథకం కింద రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయడానికి గత నెల మొదటి వారంలో రెండు వారాల పాటు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మండల కార్యాలయాల్లో సిబ్బంది కసరత్తు చేసి జాబితాను రూపొందించారు.
- రూ.50 వేలు, రూ.లక్షల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న కొందరికి ఈనెల 2వ తేదీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున మంజూరు పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో చాలా మంది మండల, జీహెచ్‌ఎంసీ కార్యాలయాలకు తరలివచ్చారు.
- ఒక్కరికి కూడా రుణ పత్రాలు మంజూరు కాలేదు. ఒకవేళ రుణ పత్రాలు ఇచ్చి ఉంటే ఈ నెల 10 నుంచి 15 వరకు వ్యాపార నైపుణ్యంపై శిక్షణ ఇవ్వాలని భావించారు.
- ఈ నెల 16–20 వరకు లబ్ధిదారుల ఖాతాల్లో రాయితీ డబ్బులు జమ చేసి ఈ నెల 30వ తేదీలోగా అన్ని యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని ముందే నిర్ణయించారు. మంజూరు పత్రాలు ఇవ్వడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉండటంతో లబ్ధిదారుల్లో నిరాశ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

మార్పులు చేసుకుంటున్నారు

- మారిన నిబంధనలతో రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమ యూనిట్లను ఆయా కార్యాలయాల్లో మార్చుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గత నెల 29న ఎడిట్ ఆప్షన్ ఇవ్వడంతో రూ.3 లక్షలు, రూ.4 లక్షలు యూనిట్ కోసం దరఖాస్తు చేసుకున్న కొంతమంది దరఖాస్తుదారులు అంత రుణం వస్తుందో లేదో అన్న భావనతో రూ.50 వేల నుంచి రూ.లక్షకు తగ్గించుకుంటున్నట్లు తెలుస్తోంది.

అడిగింది ఇస్తే.. కేసులో నుంచి బయటపడేస్తా..!

డబ్బులు వసూలు చేసిన వ్యక్తులపై ఫిలింనగర్‌లో కేసు నమోదు

బంజారాహిల్స్: ఒక గంజాయి కేసులో పోలీసులను మేనేజ్ చేస్తానంటూ డబ్బుల వసూలుకు పాల్పడిన వ్యక్తులపై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. బాచుపల్లిలో నివసించే వ్యాపారి నరేంద్ర గర్తే కుమారుడిపై గంజాయి కేసు నమోదైంది. ఈ వ్యవహారంలో వారికి పరిచయం ఉన్న ఫణి శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి గత నెల 21న వీరిని సంప్రదించాడు. కేసు విషయంలో పోలీసులు, మరికొందరిని మేనేజ్ చేసి, అతని కుమారుడిని జైలు నుంచి బయటకు తీసుకువస్తానని నమ్మించాడు. తరుణ్ కుమార్ పేరుతో ఉన్న ఫోన్ నంబర్‌కు రూ.లక్ష పంపాలని సూచించడంతో అతడు గూగుల్‌పే చేశాడు. అదే రోజు రాత్రి నరేంద్ర గర్తేకు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ రావడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా సూచించడంతో అక్కడికి వెళ్లి ఫణి శ్రీనివాస్‌తో పాటు అతడి మరో ఇద్దరు స్నేహితులను కలిశాడు. అర్ధరాత్రి తర్వాత అతడి కుమారుడు పోలీస్‌స్టేషన్ నుంచి విడుదల కావడంతో ఇంటికి వెళ్లాడు. 23వ తేదీన నరేంద్ర గర్తేకు మరోసారి ఫోన్ చేసిన ఫణి శ్రీనివాస్ ఇర్ఫాన్ హుస్సేన్ ఫోన్ నంబర్‌కు మరో రూ.10 వేలు పంపాలని కోరగా పంపాడు. అయితే సాధారణంగా గంజాయి కేసుల్లో పోలీసులు అరెస్టు చేసి నోటీజులు జారీ చేయడం, కౌన్సెలింగ్‌కు పంపడం, పునరావాస కేంద్రాలకు తరలించడం చేస్తారని నరేంద్ర గర్తే ఆలస్యంగా గుర్తించారు. దీంతో ఫణి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు డబ్బులు వసూలు చేసేందుకు ఈ పథకం వేశారని గుర్తించి ఈ వ్యవహారంపై ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఫణి శ్రీనివాస్‌రెడ్డి తదితరులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంలో ఇదే పోలీస్‌స్టేషన్‌లో పనిచేసి వెళ్లిన ఒక ఎస్‌ఐ డబ్బులు తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

ఉదయ్‌నగర్ స్వయం సహాయక బృందాలకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న మహిళా సమాఖ్య సభ్యురాలు రమ

బంజారాహిల్స్: పచ్చదనం–పరిశుభ్రత కోసం కృషి చేయడమే కాకుండా కాలుష్య నియంత్రణకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తున్న మహిళా సమాఖ్య అధ్యక్షురాలితో పాటు రిసోర్స్ పర్సన్‌కు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రశంస పత్రాలతో పాటు అవార్డులు అందజేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–10లోని ఉదయ్‌నగర్ బస్తీకి చెందిన జయభారతి స్వయం సహాయక బృందం ఎస్‌ఎల్‌ఎఫ్ ప్రెసిడెంట్ కే.రమతో పాటు ఆర్పీ ఇమాంబిషేక్‌లకు ఈ అవార్డు లభించింది. సనత్‌నగర్‌లోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డులను అందజేశారు. ఉదయ్‌నగర్ బస్తీకి చెందిన జయభారతి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ఎస్‌ఎల్‌ఎఫ్ ప్రెసిడెంట్ రమతో పాటు ఆర్పీ ఇమాంబిషేక్ గత ఏడాది కాలంగా ఇక్కడ రోడ్ల పక్కన చెత్త కుప్పలు లేకుండా చేశారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను రోడ్లపై వేయవద్దంటూ అవగాహన కలిగించారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛ ఆటో వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. తరచూ చెత్త వేసే ప్రాంతాల్లో హోటళ్లతో పాటు కూరగాయల దుకాణం ఏర్పాటు చేయించారు. దీంతో చెత్త సమస్య పరిష్కారానికి మార్గం సులువైంది. విధి నిర్వహణలో వీరు చూపిన చిత్తశుద్ధి, అంకిత భావానికి గుర్తింపుగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఈ అవార్డులను అందజేశారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు రాజ్‌భవన్ స్కూల్ విద్యార్థులు



ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన రాజ్‌భవన్ పాఠశాల విద్యార్థులు

బంజారాహిల్స్: ప్రతి సంవత్సరం నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు నగరంలోని రాజ్‌భవన్ పాఠశాల నుంచి అత్యధికంగా 16మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఎన్‌ఎంఎంఎస్ ఇన్‌చార్జి ఎస్.సురేందర్ తెలిపారు. ప్రతి సంవత్సరం తమ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్ పొందుతున్నారని తెలిపారు. విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్స్ ఇవ్వనున్నారు. ఈ పరీక్షను ప్రభుత్వ పాఠశాలలో చదివే 8వ తరగతి విద్యార్థులకు ప్రతి ఏడాది నిర్వహిస్తుంటారు. నగరవ్యాప్తంగా మొత్తం 146 మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో రాజ్‌భవన్ పాఠశాల విద్యార్థులు 16 మంది ఉండటం గర్వకారణం. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో కూడా రాజ్‌భవన్ పాఠశాల విద్యార్థులే అత్యధికంగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వికారుద్దీన్, ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ కమిటీ సభ్యులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి నూతన కమిటీని దేవాదాయశాఖ ప్రకటించిన నేపథ్యంలో కమిటీ సభ్యులు శుక్రవారం స్వామివారి సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేశారు. 15 మంది సభ్యులతో కూడిన కమిటీని దేవాదాయ శాఖ ప్రకటించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. సభ్యులతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీ సభ్యులుగా ఎన్.దినేష్ కుమార్, ఉన్నం సుబ్బారావు, గొంటి నర్సింగ్‌యాదవ్, గొట్టిపర్తి శరత్ బాబు, సిపిరి అర్జున్ యాదవ్, జి.కళ్యాణి, కటకం రాజేష్, యల్వర్తి జగదీష్, మోట విజయ్‌కుమార్, కె.లక్ష్మణ్, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఆలయ ప్రధాన అర్చకులు మురళీధర శర్మ నియమితులయ్యారు. త్వరలోనే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకుంటుమని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ అజారుద్దీన్ తనయుడు, కాంగ్రెస్ నేత అసదుద్దీన్ తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

ఇథనాల్ పరిశ్రమను అడ్డుకోవడం దుర్మార్గం

హిమాయత్‌నగర్: గద్వాల జిల్లా రాజోలు మండలం ధన్‌వాడ గ్రామం దగ్గర ఉన్న ఇథనాల్ పరిశ్రమను బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకోవడం దుర్మార్గమని, ఇది ఓబీసీ వర్గాలకు వ్యతిరేకంగా జరుగుతున్న సామాజిక వివక్షకు ఉదాహరణ అని బీసీ సంక్షేమ సంఘం సౌత్ ఇండియా ప్రధాన కార్యదర్శి చిరుతల విఠల్ గౌడ్ ఆరోపించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఇది కేవలం ఒక పరిశ్రమను అడ్డుకోవడమే కాదు, ఉద్యోగ అవకాశాలను అడ్డుకోవడం కూడా అన్నారు. ఓబీసీ వర్గాలు తమ కష్టంతో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న తరుణంలో, వారి ఎదుగుదలను అడ్డుకునేలా రాజకీయ కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం సౌత్ ఇండియా కార్యదర్శులు వంశికేలి లింగమూర్తి, కె.కొండమయ్య, తెలంగాణ యువజన విభాగం అధ్యక్షులు జి.అనిల్, కార్యదర్శి బి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం

వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులకు సహకరిస్తామని ప్రభుత్వం నుంచి మాత్రమే కాకుండా తనకు తెలిసిన మిత్రుల ద్వారా, స్వచ్ఛంద సంస్థల ద్వారా విద్యార్థుల కోసం పనిచేస్తామని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. ఫిలింనగర్ ప్రభుత్వ రౌండ్‌టేబుల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటికే ఈ పాఠశాలలో ఒక టీచర్‌కు వేతనాన్ని ఇస్తున్నానని, ఇంకా ఏవైనా పెండింగ్ సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఫిలింనగర్ సొసైటీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు

కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు

ఫిలింనగర్: ఫిలింనగర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ (ఎఫ్‌ఎన్‌సీహెచ్‌ఎస్) స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న శ్రీనివాస్‌యాదవ్ అనే వ్యక్తిపై సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిలింనగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిలింనగర్ సైట్–1 రోడ్డు నంబర్–6లోని ప్లాట్ నంబర్ ఏ–36లోని దాదాపు 1,067 గజాల ప్లాట్‌ను 1984లో సొసైటీ జీవీజీ రాజు అనే వ్యక్తికి కేటాయించింది. అందులో 400 గజాలను అతను మహ్మద్ సలీం అనే వ్యక్తికి విక్రయించగా, అతను సురేష్‌బాబుకు, అతని ద్వారా శ్రీనివాస్‌యాదవ్‌కు విక్రయించారు. కాగా సొసైటీకి చెందిన దాదాపు వంద గజాల స్థలాన్ని శ్రీనివాస్‌యాదవ్ ఆక్రమించి టీన్‌షీట్లను ఏర్పాటు చేశాడు. దీంతో ఆయా షీట్లను తొలగించాలని సొసైటీ ఇప్పటికే అతడికి నోటీసులు జారీ చేయడమే కాకుండా సొసైటీ స్థలమని బోర్డును ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల శ్రీనివాస్‌యాదవ్ ఆయా భూమిలో నిర్మాణ పనులను ప్రారంభించాడు. ఈ నెల 2న చెట్లను కూల్చివేసి, బోర్డును తొలగించి సొసైటీ ఏర్పాటు చేసిన హద్దులను తొలగించి ఇనుపరాడ్లు, టీన్ షీట్లను ఏర్పాటు చేసి పనులను ప్రారంభించాడు. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులకు కాజా సూర్యనారాయణ ఫిర్యాదు చేయగా పోలీసులు శ్రీనివాస్‌యాదవ్‌పై సెక్షన్ 329(4), 324(4) బీఎన్‌ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ జాతిపితగా

ప్రొ.జయశంకర్ పేరు ప్రకటించాలి

తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నేతల డిమాండ్



మాట్లాడుతున్న వేములవాడ మదన్మోహన్

హిమాయత్‌నగర్: ప్రత్యేక రాష్ట్రం కోసం జీవితాన్ని త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించి, ప్రత్యేక జీవో జారీ చేయాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్మోహన్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ కాంస్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి ఆయన జయంతి, వర్ధంతిలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వారు కోరారు. వరంగల్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎయిర్‌పోర్టుకు ఆచార్య జయశంకర్ పేరును పెట్టాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆచార్య జయశంకర్ చేసిన సేవలను ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో విశ్వకర్మలు పూర్తిగా అన్యాయానికి గురయ్యారని ఆరోపించారు. విశ్వకర్మ కార్పొరేషన్‌కు వెంటనే పాలక మండలి ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. చేతి వృత్తులకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు శ్రీనివాసచారి, శశిధర్ శిల్పి, రవీంద్రచారి, విష్ణుచారి, బ్రహ్మచారి, సుకర్మచారి, విద్యానందచారి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్‌, శనివారం, 7, జూన్‌, 2025



ఉత్సాహంగా తరంగోత్సవం

చిక్కడపల్లి : బల్కంపేట చెన్నయ్స్‌ అమ్రిత హోటల్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాల ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో తరంగోత్సవం–2025 ఉత్సాహపూరిత వాతావరణంలో శుక్రవారం జరిగింది. దీనికి స్టార్‌ సెలబ్రిటీ, భారతీయ సంగీత రాపర్‌, నటుడు నోయెల్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు సంప్రదాయ, పాశ్చాత్యశైలిలో నృత్యాలు ప్రదర్శించారు. సోలో, డ్యూయెట్‌ నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించి విద్యార్థుల ప్రతిభకు తార్కాణంగా నిలిచాయి. విద్యార్థులతో నోయెల్‌ స్టెప్పులు వేశారు. కళాశాల విద్యార్థుల ప్రతిభ, అంకితభావాన్ని ప్రశంసిస్తూ పత్రాలతో పాటు లక్షల రూపాయల అవార్డులను నోయెల్‌ అందజేశారు. ముగిసిన జాబ్‌ఫెయిర్‌ 2025లో 300 కంటే ఎక్కువ మంది తమ కళాశాల విద్యార్థులు ఉపాధి పొందారని చైర్మన్‌ ఆర్‌ బూమీ నాథన్‌ అన్నారు. మిరియట్‌ ఇంటర్నేషనల్‌ మల్టీప్రాపర్టీ జీఎం విశాల్‌మెహ్రా, డైరెక్టర్‌ కిరణ్‌ప్రీత్‌ కౌర్‌, కళాశాల ప్రతినిధులు రవిశంకర్‌, లావణ్య, చంద్రమోహన్‌ పాల్గొన్నారు.

నగర వేదికగా ప్రతిష్టాత్మక మిస్‌ వరల్డ్‌ పోటీలు ముగిశాయో లేదో మరో ప్రతిష్టాత్మక ఫ్యాషన్‌ ఈవెంట్‌ 'మిస్‌ యూనివర్స్‌' ప్రారంభమవుతోంది. ఈ సారి థాయ్‌లాండ్‌లో జరగనున్న మిస్‌ యూనివర్స్‌ 2025 కోసం భారత్‌ నుంచి మిస్‌ యూనివర్స్‌ ఇండియాను ఎంపిక చేయడానికి ఆడిషన్స్‌ మొదలయ్యాయి. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాల నుంచి మిస్‌ యూనివర్స్‌ తెలంగాణ, మిస్‌ యూనివర్స్‌ ఆంధ్రప్రదేశ్‌లను ఎంపిక చేయడానికి ప్రతి రాష్ట్రం నుంచి 15 మంది ఫైనలిస్ట్‌లను ఎంపిక చేశారు. నగరంలో నేడు జరగనున్న ఫినాలేలో ఎంపిక చేసిన ఆ ఇద్దరినీ తెలుగు రాష్ట్రాల తరపున మిస్‌ యూనివర్స్‌ ఇండియా గ్రాండ్‌ ఫినాలేకు పంపిస్తారు. ఈ నేపథ్యంలో మిస్‌ యూనివర్స్‌ పోటీల కోసం తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన కొందరు ఫైనలిస్టులు తమ ప్రయాణాన్ని, ఆలోచనలను 'సాక్షి'తో పంచుకున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

అందం.. ఆత్మగౌరవం..

మరో ప్రతిష్టాత్మక పోటీకి తెలుగమ్మాయిలు

- మిస్‌ యూనివర్స్‌ కోసం నగరంలో సన్నాహాలు
- ఈ సారి థాయ్‌లాండ్‌ వేదికగా మిస్‌ యూనివర్స్‌
- మిస్‌ యూనివర్స్‌ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల ఎంపిక
- 'సాక్షి'తో అనుభవాలు పంచుకున్న టాప్‌ 15 ఫైనలిస్టులు



మాది మల్టీ టాస్కింగ్‌..

నాది విశాఖపట్నం, ప్రస్తుతం ఎంబీబీఎస్‌ ఫైనల్‌ ఇయర్‌ చదువుతున్నా. మెడిసిన్‌, మోడలింగ్‌ రెండూ చిన్నప్పటి కలలే. ఆడవారికున్న శక్తి మల్టీటాస్కింగ్‌. నేను బ్రాహ్మన వర్గం నుంచి వచ్చాను.. మొదట్లో కుటుంబం నుంచి అడ్డంకులు వచ్చినప్పటికీ ఇంట్లో ఒప్పించాను. ఏ రంగంలో చూసినా తెలుగు వారు టాప్‌లో ఉన్నారు. మిస్‌ యూనివర్స్‌లో సత్తా చాటాలని నిర్ణయించుకున్నా. నగరంతో పాటు ఢిల్లీ, ముంబయి వంటి ప్రాంతాల్లో ర్యాంప్‌ వాక్‌, గ్రూమింగ్‌, స్టైల్స్‌ వంటి అంశాలపై శిక్షణ తీసుకున్నా. ఇప్పటికీ ఇంట్లో మగవారికి పీరియడ్స్‌ గురించి చెప్పుకోలేని పరిస్థితి. దీనిని పోగొట్టడానికి ఈ వేదికను వినియోగించుకుంటా. డాక్టర్‌గా కన్నా ఫ్యాషన్‌ ఐకాన్‌గా ఈ అంశాన్ని మరింత ప్రభావ వంతంగా ముందుకు తీసుకెళ్లగలను.

– డా.వైష్ణవీ వెన్నెల, మిస్‌ యూనివర్స్‌ ఆంధ్రప్రదేశ్‌ ఫైనలిస్టు

విలేజ్‌ టూ మిస్‌ యూనివర్స్‌..

నేనొక డాక్టర్‌.. విజయవాడ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో హౌస్‌ సర్జన్‌గా చేస్తున్నా. 2019 నుంచి బ్యూటీ పేజెంట్‌లో పలు సార్లు రిజెక్ట్‌ అయ్యినా పట్టుదలతో మిస్‌ యూనివర్స్‌ ఆంధ్రప్రదేశ్‌ ఫైనలిస్టుగా నిలిచాను. నాన్న రైతు.. మారుమూల గ్రామం. ఇక్కడి అమ్మాయిలకు ఎన్నో బంధనాలు. వాటన్నింటినీ ఛేదించాలనేదే లక్ష్యం. గతంలో రన్నరప్‌గా నిలిచిన ఆటో డ్రైవర్‌ కూతురు మాన్యా సింగ్‌ నాకు స్ఫూర్తి. మహిళలు పెద్ద లక్ష్యాలను ఎంచుకోడానికి బయపడుతున్నారు. దానిని సాధించి ఈ తరానికి ఒక మార్గదర్శకంగా నిలవాలనుంది. విశ్వ వేదిక పై మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శించాలనుంది. సాఫల్య అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి మహిళలకు, బాలికలకు మెన్‌స్ట్రువల్‌ హైజీన్‌పై అవగాహన కల్పిస్తున్నా.

– డా.సురేఖ, మిస్‌ యూనివర్స్‌ ఆంధ్రప్రదేశ్‌ ఫైనలిస్టు

మాతృ భూమి పై ప్రేమతో..

న్యూయార్క్‌లో పుట్టాను, న్యూజెర్సీలో పెరిగాను. నా మాతృభూమిపై ప్రేమతో కుటుంబంతో పాటు హైదరాబాద్‌ వచ్చాను. అమ్మ ఒకే మాట చెబుతుంది.. ఏది చేసినా చదువును నిర్లక్ష్యం చేయొద్దని. అందుకే మెడిసిన్‌, మోడలింగ్‌, యాక్టింగ్‌ రంగాల్లో రాణిస్తున్నా. మిస్‌ యూనివర్స్‌తో పాటు, నటనలో ఆస్కార్‌ అందుకున్న తొలి భారతీయ యువతిగా నిలవాలనేదే లక్ష్యం. బాడీ టైప్‌, కలర్‌పై వారికి తోచింది మాట్లాడతారు. ఎవరేమన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం ముఖ్యం. సొంతంగా గ్రూమింగ్‌, మేకప్‌ ప్రతిదీ నేర్చుకున్నా. బేసిక్‌ మెంటల్‌ హెల్త్‌పై, డొమెస్టిక్‌ హౌస్‌ హోల్డ్‌ వయెలెన్స్‌పై అవగాహన కల్పించడం విధిగా పెట్టుకున్నాను. జెండర్‌ స్టీరియోటైప్‌ పోగొట్టిన రాణి రుద్రమా దేవి నాకు స్ఫూర్తి.

– శ్వ్య, మిస్‌ యూనివర్స్‌ తెలంగాణ ఫైనలిస్టు



ప్రియాంక చోప్రా స్ఫూర్తి..

పుట్టి పెరిగింది, చదువుకున్నదంతా హైదరాబాద్‌లోనే.. డేటా సైన్స్‌–ఏఐలో బీటెక్‌ చేశా. నాకున్న టాలెంట్‌ స్కిల్‌తో టాప్‌ 15లో స్థానం పొందాను. ఈ ఎంపికలో ఎంత ఆత్మవిశ్వాసంతో ఉన్నామన్నదే ముఖ్యం. ఫ్యాషన్‌ వాక్‌, ప్రజెంటేషన్‌, డ్రెస్సింగ్‌ వంటి అంశాల్లో ఆడిషన్స్‌ జరిగాయి. ప్రియాంక చోప్రా, లారా దత్త ఇష్టం. మోడలింగ్‌ కోసం పలు అంశాల్లో ముంబయిలో శిక్షణ తీసుకున్నా. హైదరాబాద్‌లో మిస్‌ వరల్డ్‌ జరిగితే ఎంత గర్వపడ్డామో.. ఒక ఆడపిల్ల బ్యూటీ పేజెంట్‌లో పాల్గొంటే అంతే గర్వపడాలి. నా బ్యూటీ విత్‌ పర్పస్‌.. చిన్నారుల కోసం పనిచేయడం. గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌ పై అవగాహన కల్పించాలి. విపత్కర పరిస్థితుల్లో ఎలా రక్షించుకోవాలో నేర్పించాలన్నదే లక్ష్యం. పలు ఎన్‌జీఓలతో పనిచేశాను.

– అను శ్రీ, మిస్‌ యూనివర్స్‌ ఆంధ్రప్రదేశ్‌ ఫైనలిస్టు

మిస్‌ టీన్‌ తెలంగాణ..

ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంజినీరింగ్‌ చేస్తున్నా. రెండేళ్ల నుంచి మోడలింగ్‌లో ఉన్నా. 2023లో ఢిల్లీలో నా మొదటి కాంపిటీషన్‌లో మిస్‌ టీన్‌ తెలంగాణ క్రౌన్‌, తరువాతి ఏడాది ఫ్యాషన్‌ ఐకాన్‌ అవార్డ్‌ గెలుచుకున్నా. మిస్‌ యూనివర్స్‌ కిరీటం కన్నా, దాని వల్ల వచ్చే గుర్తింపు శక్తివంతమైనది. నేను బ్రాహ్మన వర్గం నుంచే వచ్చాను. ఈ విషయంలో నాన్న నన్ను అర్థం చేసుకుని ప్రోత్సహించారు. సినిమాలు, మోడలింగ్‌, చదువును బ్యాలెన్స్‌ చేస్తూ వచ్చాను. తెలుగమ్మాయిల అందమంతా వారి కళ్లలోనే కనిపిస్తుంది. ఉమెన్‌ సేఫ్టీ, వాటర్‌ స్కేర్‌ సిటీ, నిరుద్యోగం అంశాల్లో కృషి చేయాలనుంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఉద్యోగాలకు దూరమవుతున్నారు. దీని పైన దృష్టి సారిస్తున్నా.

– లక్షణ అత్తిలి, మిస్‌ యూనివర్స్‌ తెలంగాణ ఫైనలిస్టు

బ్రైడల్‌ స్టోరీ, ఫ్యాషన్‌ షో

అక్టోబర్‌ 3 నుంచి 5 వరకూ జీతో కనెక్ట్‌ 2025

హెచ్‌ఐసీసీలో ర్యాంప్‌వాక్‌ చేసిన మోడల్స్‌



మాదాపూర్‌ : మోడల్స్‌ ర్యాంప్‌పై క్యాట్‌వాక్‌ చేసి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో జైన్‌ ఇంటర్నేషనల్‌ ట్రేడ్‌ ఆర్గనైజేషన్‌ (జీతో) ఆధ్వర్యంలో కనెక్ట్‌–2025 సన్నాహక కార్యక్రమం శుక్రవారం జరిగింది. అక్టోబర్‌ 3 నుంచి 5వ తేదీ వరకూ నిర్వహించనున్న సమ్మేళనంలో భాగంగా బ్రైడల్‌ స్టోరీ నిర్వహించారు. జీతో లేడీస్‌ వింగ్‌ అధ్వర్యంలో ప్రత్యేక వివాహ ప్రదర్శన నిర్వహించారు. డిజైనర్లు దీప్తిరెడ్డి, భ్రికి అంగ్రిస్‌, రోజీ అహ్లువాలియా, పల్లవి జైపూర్‌ డిజైన్‌లను ప్రదర్శించనున్నారు. జీతో అపెక్స్‌ అధ్యక్షుడు విజయ్‌బండారి, చైర్మన్‌ పృథ్వీరాజ్‌ ఎస్‌ కొఠారి, కోశాధికారి విశాల్‌ అంచలియా, కనెక్ట్‌ కన్వీనర్‌ బీఎల్‌ బండారి, కో–కన్వీనర్‌ సుశీల్‌ సంచేతి పాల్గొన్నారు.



ఆఫ్‌ రోడ్‌లో.. అదే ఊపు

సాక్షి, సిటీబ్యూరో: గతుకుల్లేని రహదారుల్లో మాత్రమే కాదు గుంతలు, గుట్టల్లో కూడా తమ వాహనాలు ఝామ్మంటూ దూసుకుపోతాయని పలు ఆటోమొబైల్‌ సంస్థలు వినియోగదారులకు హామీ ఇస్తున్నాయి. ప్రత్యక్ష అనుభూతించేందుకు రమ్మంటూ ఆహ్వానిస్తున్నాయి. నగరం చుట్టుపక్కల వారాంతపు రోజుల్లో సందడి చేసే ఇలాంటి ఈవెంట్స్‌ నగరవాసులకు కొత్త కార్ల సత్తా తెలుసుకునేందుకు ఆస్కారం ఇస్తున్నాయి. ఇదే క్రమంలో ప్రముఖ ఆటోమొబైల్‌ సంస్థ టయోటా కిర్లోస్కర్‌ వాహనదారుల కోసం ఒక ప్రత్యేక ఈవెంట్‌ షామీర్‌పేట్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించింది. తమ టయోటా హిల్లక్స్‌ ఆఫ్‌ రోడ్‌లోనూ అడ్డంకులను అధిగమిస్తూ ప్రయాణిస్తాయనే విషయాన్ని వినియోగదారులు స్వీయానుభవం ద్వారా తెలుసుకునేందుకు అవకాశం కల్పించారు. గతుకులు, గుంతలతో గుట్టలు ఎత్తు పల్లాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆఫ్‌ రోడ్‌ ట్రాక్‌పై వాహనం నడిపించడం వాహనదారులకు కొత్త అనుభూతిని పంచింది.



నైపుణ్యాల వేదిక వైఎల్‌పీ..

లీడ్‌ గ్రూప్‌ ఆధ్వర్యంలో యంగ్‌ లీడర్స్‌ ప్రోగ్రాం

నగరంలో గ్రాండ్‌ ఫినాలే, విజేతగా విజ్‌ టైటాన్స్‌

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా దాదాపు 20 రాష్ట్రాలకు చెందిన పాఠశాలల్లోని విద్యార్థులను లీడ్‌ గ్రూప్‌ ఆధ్వర్యంలో ఒకే వేదిక పైకి తీసుకొచ్చింది. యంగ్‌ లీడర్స్‌ ప్రోగ్రాం (వైఎల్‌పీ)లో వారందరినీ అత్యుత్తమ నైపుణ్యాలున్న విద్యార్థులుగా తిర్చిదిద్దేందుకు నాంది పలికింది. దీనికి సంబంధించిన గ్రాండ్‌ ఫినాలే నగరంలోని రాడిసన్‌ బ్లూ వేదికగా శుక్రవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణతో పాటు తమిళనాడు, బిహార్‌, ఛత్తీస్‌గఢ్‌, ఢిల్లీ, గుజరాత్‌, హర్యాన, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ వంటి రాష్ట్రాలకు చెందిన లీడ్‌ వైఎల్‌పీ విద్యార్థులు ఏఐ ప్రాజెక్టులను ప్రదర్శించారు. లీడ్‌ గ్రూప్‌ సీఈఓ సుమీత్‌ మెహతా మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు నుంచి 53 మంది విద్యార్థులు 10కి పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో విజ్‌ టైటాన్స్‌ విజేతగా నిలిచిందని తెలిపారు.

ఏఐపై అవగాహన పెరిగింది..

నేను రెండేళ్ల ఈ యంగ్‌ లీడర్స్‌ ప్రోగ్రాంలో శిక్షణ పొందాను. ఇందులో భాగంగా అధునాతన సాంకేతికత, నైపుణ్యాలపై అవగాహన పెంచుకున్నా. ల్యాప్‌టాప్‌ వాడటమే రాని నేను ప్రస్తుతం ఏఐ లెర్నింగ్‌ ప్రోగ్రామ్స్‌పై అవగాహన పెంచుకున్నా. ఇందులో తల్లిదండ్రులకు సైతం భాగస్వామ్యముంది.



– యశ్విని, గీతా స్కూల్‌, మెదక్‌.






ఆర్ట్‌గ్యాలరీలో ఆకట్టుకుంటున్న ఆలిండియా ఆర్ట్‌ ఎగ్జిబిషన్‌

అందుబాటులో 155 చిత్రాలు, ఈ నెల 9 వరకూ ప్రదర్శన

చిత్రం.. భళా విచిత్రం..

మాదాపూర్‌ : కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని సందర్శకులు, ప్రముఖులు కొనియాడారు. పల్లెటూరి వాతావరణంలో జరిగే సన్నివేశాలు, యదార్థ సంఘటనలను చిత్రరూపంలో వేసి కళాకారులు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌గ్యాలరీలో నిర్వహిస్తున్న ఆలిండియా ఆర్ట్‌ కాంపిటీషన్‌, ఎగ్జిబిషన్‌ 2025ను నిర్వహిస్తున్నారు. దేశం నలుమూలల నుంచి కళాకారులు ప్రదర్శన కోసం 646 ఎంట్రీలు వచ్చాయని, ఇందులో 155 ఎంపికైన చిత్రాలు, స్కల్ప్చర్స్‌ ప్రదర్శనలో ఉంచినట్టు నిర్వాహకులు తెలిపారు. 155 చిత్రాల్లో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి అవార్డులను, నగదు బహుమతులను అందజేయనున్నారు. సందర్శకులకు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



బ్రోన్జ్‌, పెన్సిల్‌ స్కెచ్‌, లాటెక్స్‌ రబ్బర్‌ స్కల్ప్చర్‌, ఆక్రిలిక్‌, ఆయిల్‌ పేయింటింగ్‌, వాటర్‌ కలర్స్‌, మిక్సడ్‌ మీడియా, ఫొటోగ్రాఫ్‌ తదితర చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈనెల 9న చివరి రోజు అవార్డులు, నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష నగదు బహుమతి, రెండో బహుమతి ముగ్గిరికి (ఒక్కొక్కరికీ) రు.50వేల నగదు, మూడో బహుమతి 20 మందికి రూ.20వేల నగదు, స్పెషల్‌ అవార్డులు ఏడుగురికి రూ.10వేల చొప్పున ఇవ్వనున్నారు.

వాహ్‌.. చౌమహల్లా..

యూరోపియన్‌ శైలిలో ప్యాలెస్‌ నిర్మాణం

నిజాం ప్రభువుల నివాస గృహంగా గుర్తింపు

అసఫ్‌ జాహీల రాచరిక పాలనకు నిలువుటద్దం

చార్మినార్‌ : అసఫ్‌ జాహీల రాచరిక పాలనకు పాతనగరంలోని చౌమహల్లా ప్యాలెస్‌ 'సాక్షి'గా నిలుస్తుంది. రెండో నిజాం కాలంలో చార్మినార్‌–లాడ్‌బజార్‌కు అతి సమీపంలో ఈ ప్యాలెస్‌ నిర్మాణం జరిగింది. యూరోపియన్‌ శైలిలో అత్యంత ఆకర్షణీయంగా పాలరాతి వలే నిర్మితమైన ఈ ప్యాలెస్‌ చార్మినార్‌ కట్టడానికి దగ్గరలోని ఖిల్వత్‌లో ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో చూడముచ్చటగా ఉంటుంది. నగర సందర్శకులకు, పర్యాటకులకు కనువిందు చేస్తుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మ్యూజియం అందుబాటులో ఉంటుంది.



దేశ, విదేశీ పర్యాటకులను అధికంగా ఆకట్టుకుంటున్న చౌమహల్లా ప్యాలెస్‌ సౌధం



నిర్మాణ విశిష్టతలు..

ఇది నాలుగు ప్యాలెస్‌ల సముదాయం. ఏకాంతం (ఖిల్వత్‌)గా నిర్మించిన ఈ ప్యాలెస్‌లో పలు నిర్మాణాలు జరిగాయి. 5వ నిజాం అఫ్జల్‌–ఉద్‌–దౌలా–బహదూర్‌ పాలనా (1857–69) కాలంలో ఖిల్వత్‌ ప్యాలెస్‌లో నాలుగు ప్యాలెస్‌ల నిర్మాణం జరిగింది. టెహ్రాన్‌లోని షా ప్యాలెస్‌ను పోలిన ఆర్కిటెక్చర్‌లో ఐదో నిజాం అఫ్తాబ్‌ మహల్‌, మహ్తాబ్‌ మహల్‌, తహనియత్‌ మహల్‌, అఫ్జల్‌ మహల్‌ నిర్మాణం జరిగింది. 1912లో ఏడో నిజాం ప్యాలెస్‌కు చేయించిన మరమ్మతులతో మరింత శోభాయమానంగా మారింది.

మ్యూజియం విశేషాలు..

నాటి ఫర్నీచర్‌, దుస్తులు, తల్వార్లు, ఫొటోలు ఇతర విలువైన పురాతన వస్తువులన్నింటినీ నాలుగు ప్యాలెస్‌లలో భద్రపరిచారు. ప్రస్తుతం నిజాం ట్రస్ట్‌ పర్యవేక్షణలో చౌమహల్లా ప్యాలెస్‌ కొనసాగుతోంది. వారంలో శుక్రవారం మినహా ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సందర్శించవచ్చు. పెద్దలకు రూ.100, పదేళ్ల లోపు చిన్నారులకు రూ.40, విదేశీయులకు రూ.400, మొబైల్‌ ఫొటోగ్రఫీ రూ.50గా సందర్శనకు టికెట్‌ ధర నిర్ణయించారు.

నాటి చరిత్రకు వెలుగులు..

దాదాపు 2.90 లక్షల గజాల విస్తీర్ణంలో విశాలమైన ప్రాంగణంలో ఇది నిర్మితమైంది. నాటి కాలంలో విద్యుత్‌ లైట్లు లేని కారణంగా ప్యాలెస్‌లో వెలుగుల కోసం షాండిలియర్లను ఏర్పాటు చేశారు. వీటిలో పొగరాని కొవ్వొత్తులు, మైనపు ఒత్తులు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం విద్యుత్‌ దీపాలు ఉండడంతో షాండిలియర్లు దేదీప్యమానంగా వెలుగుతూ చౌమహల్లా ప్యాలెస్‌కు మరింత శోభను తీసుకొస్తున్నాయి. 1915లో చౌమహల్లా ప్యాలెస్‌ ప్రధాన గేటు వద్ద అతి పెద్ద గడియారాన్ని ఏర్పాటు చేశారు. విదేశాల నుంచి వచ్చే అతిథులందరికీ చౌమహల్లా ప్యాలెస్‌లో ఆతిథ్యమిచ్చేవారు.

రుణంతోనే సొంతిల్లు

పెరుగుతున్న మహిళా రుణ గ్రహీతలు

స్త్రీ నగటు లోన్ రూ.70 లక్షలు

ఏటా ఉమెన్ రుణ గ్రహీతల్లో 13 శాతం వృద్ధి



సాక్షి, సిటీబ్యూరో: గృహాలకు డిమాండ్ పెరుగుతుండటంతో గృహ రుణ మార్కెట్ కూడా బలపడుతోంది. అర్బన్ మనీ గణాంకాల ప్రకారం.. దేశంలోని ప్రధాన నగరాలలో 2025 ఆర్థిక సంవత్సరంలో గృహ రుణాల పంపిణీ పరిమాణం 10 శాతం, విలువలు 15 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా రూ.కోటి కంటే ఎక్కువ టికెట్ సైజు ఉన్న రుణాలు ఏడాది కాలంలో గృహ రుణ పంపిణీలో 21 శాతం మేర వృద్ధి చెందాయి. తుది గృహ కొనుగోలుదారుల డిమాండ్, పట్టణీకరణ, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలతో గృహ రుణాలు సులభతరంగా పంపిణీ అవుతున్నాయి. గృహ రుణ పరిమాణం, విలువలు రెండు అంకెల వృద్ధిని నమోదు చేస్తోందని అర్బన్ మనీ రీసెర్చ్ వెల్లడించింది.



❖ దేశంలోని ప్రధాన నగరాలలో మహిళా గృహ రుణ గ్రహీతలు పెరుగుతున్నారు. ప్రతి ఐదు గృహ రుణాలలో ఒక మహిళా రుణ గ్రహీత ఉంది. గృహ రుణ పంపిణీలో పురుషుల వాటా 10 శాతం కాగా.. మహిళ రుణ గ్రహీతల వాటా 9 శాతంగా ఉంది. అదే లోన్ అమౌంట్‌లో చూస్తే మగవారి వాటా 14 శాతంగా ఉండగా.. మహిళల వాటా 23 శాతంగా ఉంది. అర్బన్ మనీ నివేదిక ప్రకారం ప్రధాన నగరాలలో సగటు రుణం రూ.74 లక్షలుగా ఉంది. ఇది ఏటేటా 5 శాతం వృద్ధిని నమోదు చేస్తోంది.

సగటు రుణం రూ.70 లక్షలు

సగటున పురుషులు రూ.76 లక్షల రుణం తీసుకుంటుంటే.. మహిళా రుణ గ్రహీతలు రూ.70 లక్షల రుణం తీసుకుంటున్నారు. పురుషులు తీసుకునే లోన్ అమౌంట్ ఏటా 3 శాతం వృద్ధి చెందుతుండగా.. మహిళల రుణం ఏకంగా 13 శాతం పెరుగుతోంది. లోన్ అమౌంట్ వారీగా చూస్తే.. రూ.కోటి కంటే ఎక్కువ రుణం వాటా 21 శాతం కాగా.. రూ.45 లక్షల నుంచి రూ.కోటి మధ్య లోన్ వాటా 32 శాతం, రూ.45 లక్షల కంటే తక్కువ లోన్ వాటా 47 శాతంగా ఉంది.

ముంబై తర్వాత మనమే..

మెట్రో నగరాల్లో పెరిగిన ఆఫీస్ అద్దెలు

2022లో అద్దె చ.అ.కు రూ.58.. ఇప్పుడు రూ.72

అయినా ఇతర నగరాల కంటే మన దగ్గరే తక్కువ రెంట్లు

జీసీసీ, దేశీయ సంస్థల ఏర్పాటు, విస్తరణే వృద్ధికి కారణం

దేశంలోని ప్రధాన మెట్రో నగరాలలో ఆఫీసు స్పేస్ అద్దెలు గణనీయంగా పెరుగుతున్నాయి. కరోనా తర్వాత ఆఫీసు స్పేస్ విభాగం శరవేగంగా కోలుకుంది. ముఖ్యంగా ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, హైదరాబాద్ నగరాలలో కార్యాలయ స్థలాలు హాట్‌స్పాట్‌గా మారాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ఒడిదుడుకులు, అనిశ్చితి పరిస్థితులు ఉన్నప్పటికీ దేశీయ వాణిజ్య రియల్ ఎస్టేట్ మార్కెట్ గణనీయమైన పెరుగుదల నమోదు చేస్తోందని అనరాక్ సంస్థ రిపోర్ట్‌లో వెల్లడించింది.

– సాక్షి, సిటీబ్యూరో

ఆఫీసు స్పేస్ అద్దెల వృద్ధి..
(చ.అ.కు అద్దె, రూ.లలో)

నగరం	2022	2023	2024	2025
ముంబై	131	138	155	168
పుణె	72	75	76	80
ఢిల్లీ-ఎన్‌సీఆర్	92	94	101	110
బెంగళూరు	82	88	92	95
హైదరాబాద్	58	64	66	72
చెన్నై	66	68	70	72

దాదాపు అన్ని బహుళ జాతి, దేశీయ సంస్థలు వర్క్ ఫ్రం హోమ్ విధానానికి స్వస్తి చెప్పాయి. పూర్తి స్థాయిలో కార్యాలయాలు పునఃప్రారంభమయ్యాయి. దీంతో ఆఫీసు స్పేస్‌కు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాలలో కార్యాలయాల అద్దె విలువలు వృద్ధి చెందుతున్నాయి. కరోనా మహమ్మారి కాలంలో అలవాటైన వర్క్ ఫ్రం హోమ్, హైబ్రిడ్ మోడల్ పని విధానాలు మరింత సంప్రదాయక, నిర్మాణాత్మక కార్యాలయ కార్యకలాపాలకు దారి తీసింది. కంపెనీలు ప్రధాన నగరాలలో తమ ఉనికిని రెట్టింపు చేశాయి. గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు(జీసీసీ), టెక్ దిగ్గజాలు, బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు గ్రేడ్–ఏ కార్యాలయ స్థలాల లీజులు, కొనుగోళ్లకు మొగ్గు చూపించాయి. మన దేశంలో ఆఫీసు స్పేస్ విభాగంలో జీసీసీలు చోదకశక్తిగా మారాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే జీసీసీలు ఏకంగా 83.5 లక్షల చ.అ. స్థలాన్ని లీజుకు తీసుకున్నాయంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు.

అమెరికాలో అనిశ్చితితో..

యూఎస్ కంపెనీలు మన దేశంలోని గ్రేడ్–ఏ ఆఫీసు స్పేస్ లీజులపై ఆసక్తి చూపిస్తుంటాయి. ప్రస్తుతం దేశీయ ఆఫీసు స్పేస్ విభాగంలో అమెరికాకు చెందిన సంస్థల వాటా 45 శాతం ఉంటుంది. ప్రస్తుతం అమెరికాలో వ్యాపార విధానంలో అనిశ్చితి ఏర్పడటంతో ఇండియాలోని ఆఫీసు స్పేస్‌కు మరింత డిమాండ్ ఏర్పడింది. ముంబైలోని ఆఫీసు స్పేస్ లీజులలో అమెరికాకు చెందిన బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థల వాటా ఏకంగా 48 శాతంగా ఉంటుంది.



అత్యధికంగా ముంబైలో..

నాలుగేళ్లలో అత్యధికంగా ముంబైలో అద్దెలు 28 శాతం మేర పెరిగాయి. ఆ తర్వాత హైదరాబాద్‌లో 24.1 శాతం వృద్ధి చెందాయి. ఇక ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో 20 శాతం, బెంగళూరులో 15.8 శాతం, పుణెలో 11.1 శాతం, చెన్నైలో 9.1 శాతం మేర పెరిగాయి. 2022లో ముంబైలో చ.అ. అద్దె నెలకు రూ.131గా ఉండగా.. 2025 నాటికి రూ.168కి చేరింది. హైదరాబాద్‌లో నాలుగేళ్ల క్రితం రూ.58గా ఉండగా.. ఇప్పుడది రూ.72కు చేరింది.

మన దగ్గరే తక్కువ..

హైదరాబాద్‌లో ఆఫీసు స్పేస్ అద్దెలు గణనీయంగా పెరిగాయి. నాలుగేళ్లలో 24.1 శాతం మేర వృద్ధి చెందాయి. నాలుగేళ్లలో ప్రధాన నగరాలలో ఆఫీసు స్పేస్ అద్దెల వృద్ధిలో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. అయినా కూడా ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే ఇప్పటికీ మన దగ్గరే అద్దెలు తక్కువగా ఉన్నాయి. కాస్మోపాలిటన్ కల్చర్, తక్కువ జీవన వ్యయం, అందుబాటు ధరలు, చురుకైన ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి చెందుతున్న ఐటీ కారిడార్ వంటివి నగరంలో ఆఫీసు స్పేస్ అద్దెల వృద్ధికి ప్రధాన కారణాలు.



ఓటు ఓపెన్ ప్లాట్లుకే..

ఏటా స్థలాల ధరలు 7 శాతం వృద్ధి

అదే ఫ్లాట్లలో పెరుగుదల 2 శాతమే

ఓపెన్ ప్లాట్లకు అధిక డిమాండ్

'కొనేటప్పుడు తక్కువకు రావాలి.. అమ్మేటప్పుడు ఎక్కువకు పోవాలి' అని కోరుకునేది ఒక్క స్థిరాస్తి రంగంలోనే.. కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు ఎవరైనా సరే రాబడి ఎక్కువగా ఉన్న చోట కొనేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అయితే ఓపెన్ ప్లాట్, అపార్ట్‌మెంట్, కమర్షియల్ స్పేస్, రిటైల్.. ఇలా రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు సాధనాలు అనేకం. కానీ, ఓపెన్ ప్లాట్లలో ఇన్వెస్ట్‌మెంట్సే ఎక్కువ రాబడి వస్తుందని ఓ సర్వే తెలిపింది. 2015 నుంచి దేశంలోని 8 ప్రధాన నగరాలలో ప్రతి ఏటా స్థలాల ధరలలో 7 శాతం వృద్ధి నమోదవుతుంటే.. అపార్ట్‌మెంట్లలో మాత్రం 2 శాతమే పెరుగుదల కనిపిస్తుందని పేర్కొంది.

– సాక్షి, సిటీబ్యూరో

పెద్ద నగరాలలో స్థలాల కొరత ఎక్కువగా ఉండటం, విపరీతమైన పోటీ నేపథ్యంలో ఉన్న కొద్ది స్థలాల ధరలు ఎక్కువగా ఉన్నాయని ఓ సంస్థ సీఈఓ తెలిపారు. అందుకే ప్రధాన నగరాలలో పరిమిత స్థాయిలోని స్థలాలకు డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఓపెన్ ప్లాట్లకు, ఇండిపెండెంట్ గృహాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో పెద్ద నగరాల్లోని శివారు ప్రాంతాలలో బడా డెవలపర్లు ఓపెన్ ప్లాట్ వెంచర్లు, వ్యక్తిగత గృహాల ప్రాజెక్ట్‌లను చేపడుతున్నారని, దీంతో డిమాండ్ పునఃప్రారంభమైందని చెప్పారు.

కరోనాతో పెరిగిన డిమాండ్

ఢిల్లీ–ఎన్‌సీఆర్, పుణె, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కోల్‌కత్తా, అహ్మదాబాద్ ఎనిమిది ప్రధాన నగరాల్లో సాధారణంగా కొనుగోలుదారులు ఓపెన్ ప్లాట్ల కంటే అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేయడానికే ఇష్టపడతారు. ఎందుకంటే భద్రతతో పాటూ పవర్ బ్యాకప్, కార్ పార్కింగ్, క్లబ్ హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్, గార్డెన్ వంటి కామన్ వసతులు ఉంటాయని అపార్ట్‌మెంట్ కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నారు. కానీ, కరోనా వ్యాప్తి నేపథ్యంలో కామన్ వసతులు వినియోగం, అపార్ట్‌మెంట్లలో ఎక్కువ జనాభా వంటివి శ్రేయస్కరం కాదనే అభిప్రాయం ఏర్పడింది. దీంతో సొంతంగా స్థలం కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకోవడమో లేక వ్యక్తిగత గృహాలను కొనుగోలు చేసేందుకే కొనుగోలుదారులు మొగ్గు చూపుతున్నారు.

13–21 శాతం పెరిగిన ధరలు

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలతో పాటూ గుర్గావ్‌లోని కొన్ని ప్రధాన ప్రాంతాలలోని నివాస స్థలాలకు డిమాండ్ పెరుగుతుందని ఓ సంస్థ రీసెర్చ్ హెడ్ తెలిపారు.



2018 నుంచి ఆయా నగరాలలోని ఓపెన్ ప్లాట్లలో రెండంకెల వృద్ధి నమోదవుతుందని పేర్కొన్నారు. మూడు సంవత్సరాలలో ఈ నగరాల్లో భూముల ధరలు 13–21 శాతం మేర పెరిగాయని చెప్పారు. ఇదే నగరాల్లోని అపార్ట్‌మెంట్ల ధరలలో మాత్రం 2–6 శాతం మేర వృద్ధి ఉందని తెలిపారు. కరోనా నేపథ్యంలో కొనుగోలుదారుల అభిరుచుల్లో వచ్చిన మార్పులు, పాలసీలతో రాబోయే త్రైమాసిక కాలంలో ఈ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశారు.

హైదరాబాద్‌లో ప్లాట్లకే డిమాండ్ ఎక్కువ

- ఇతర దక్షిణాది నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోని ఓపెన్ ప్లాట్లకే డిమాండ్ ఎక్కువగా ఉంది. 2018–21 మధ్య కాలంలో నగరంలోని స్థలాలలో గరిష్ఠంగా 21 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదవుతుంది. శంకర్‌పల్లి, పటాన్‌చెరు, తుక్కుగూడ, మహేశ్వరం, షాద్‌నగర్ ప్రాంతాల్లోని స్థలాలకు డిమాండ్, ధరల పెరుగుదల ఎక్కువగా ఉందని తెలిపింది. కాగా.. చెన్నైలో ప్లాట్లలో వార్షిక వృద్ధి రేటు 18 శాతం, బెంగళూరులో 13 శాతం ఉంది. చెన్నైలో అంబత్తూరు, అవడి, ఒరిగడం, శ్రీపెరంబుదూర్, తైయూర్ ప్రాంతాలలో, బెంగళూరులో నీలమంగళ, దేవనహళ్లి, చిక్కబల్లాపూర్, హోస్కోట్, కొంబల్‌గోడు ప్రాంతాల్లోని నివాస ప్లాట్లకు ఆదరణ ఎక్కువగా ఉంది.
- 2018–21 మధ్య ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో ప్లాట్ల వార్షిక వృద్ధి రేటు 15 శాతంగా ఉంది. సోహ్నా, గుర్గావ్‌లో భూముల ధరలు ఏటా 6 శాతం పెరుగుతున్నాయి. సెక్టార్ 99, ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, సెక్టార్ 95ఏ, సెక్టార్ 70ఏ, సెక్టార్ 63లలోని నివాస స్థలాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది.



అధిక అద్దెలు రావాలా?

సాక్షి, సిటీబ్యూరో: కొనేటప్పుడు తక్కువ ధరకు కావాలి.. అమ్మేటప్పుడు ఎక్కువ ధర రావాలని కోరుకునేది స్థిరాస్తి రంగంలోనే.. ఇది అద్దె విభాగానికీ వర్తిస్తుంది. గత కొన్నేళ్లుగా దేశంలోని ప్రధాన నగరాలలో అద్దె గృహాల విపణి క్రమంగా పెరుగుతోంది. ప్రధానంగా మెరుగైన ప్రయాణ సాధనాలు, పని కేంద్రాలకు చేరువలో ఉన్న అద్దె ఇళ్లకు డిమాండ్ ఉంది. ప్రాపర్టీల విలువ పెరగడంతో గృహ యజమానులు అద్దెల కంటే లాభదాయకమైన ఆస్తుల విక్రయాల కోసం అన్వేషిస్తుండటంతో సప్లయి తగ్గింది. దీంతో అద్దె గృహాలకు డిమాండ్‌తో పాటు రెంట్లు కూడా పెరిగాయి.



❖ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తొలి త్రైమాసికంలో హైదరాబాద్‌లో అద్దె గృహాలకు డిమాండ్ 22 శాతం మేర పెరిగింది. సరఫరా 2.1 శాతం క్షీణించగా.. సగటు రెంట్లు 4.5 శాతం మేర పెరిగాయి. అద్దెల మార్కెట్‌లో డిమాండ్, సప్లయి వాటా 50, 39 శాతంగా ఉన్నాయి.

పశ్చిమంలో డిమాండ్ ఎక్కువ..

గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లోని అద్దె గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కార్యాలయాలు, ఉపాధి కేంద్రాలకు సమీపంలో ఉండటం, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)తో మెరుగైన కనెక్టివిటీనే ప్రధాన కారణం. రూ.25 వేలు నుంచి రూ.35 వేలు నెలవారీ అద్దెలకు కోసం ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. 1,000 చ.అ. నుంచి 1,500 చ.అ. విస్తీర్ణంలో ఉన్న గృహాలకు డిమాండ్ అధికంగా ఉంది.

'హైదరాబాద్ నుంచి 140 కి.మీ. దూరంలో ఉన్న నారాయణ్‌ఖేడ్‌లో ఓ నిర్మాణ సంస్థ ఫామ్‌ల్యాండ్ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నామని ప్రచారం చేస్తోంది. రెండు గుంటలు(242 గజాలు)కు రూ.3 లక్షలు చెల్లిస్తే.. ప్రతి నెలా రూ.15 వేల అద్దె చొప్పున 20 నెలల్లో తర్వాత మొదట్లో కట్టిన రూ.3 లక్షలతో సహా మొత్తం రూ.6 లక్షలు కొనుగోలుదారుడికి చెల్లిస్తోంది. అలాగే.. 4 గుంటల స్థలానికి రూ.6 లక్షలు చెల్లిస్తే.. ప్రతి నెలా రూ.30 వేల చొప్పున 20 నెలల తర్వాత రూ.12 లక్షలు, అలాగే 8 గుంటలకు రూ.12 లక్షలు కడితే.. నెలకు రూ.24 వేల చొప్పున 20 నెలల్లో రూ.24 లక్షలు రిటర్న్ చేస్తుంది.'

– సాక్షి, సిటీబ్యూరో

సూపర్ ఆఫర్స్.. ఎవరికి ఎరుక..?

- ఓపెన్ ప్లాట్లకు కిరాయి చెల్లిస్తామని మాయమాటలు
- ప్రీలాంచ్, బై బ్యాక్, రెంటల్ స్కీమ్ అంటూ ప్రచారం
- సరికొత్త మోసాలకు పాల్పడుతున్న నిర్మాణ సంస్థలు
- ఏజెంట్లకు విదేశీ టూర్లు, కార్లు, బంగారం బహుమతులు

..ఇలా అపార్ట్‌మెంట్లకు ప్రతి నెలా అద్దె చెల్లించినట్లుగానే ఓపెన్ ప్లాట్లకు, ఫామ్‌ల్యాండ్లకు కూడా రెంట్ చెల్లిస్తామని కొత్త తరహా మోసాలకు తెరలేపారు పలువురు బిల్డర్లు. ఇప్పటికే గృహ నిర్మాణంలో ప్రీలాంచ్ విక్రయాల పేరిట జరిగిన దందాలో మోసపోయిన కొనుగోలుదారులు పోలీసు స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే.. కొత్తగా బైబ్యాక్, రెంటల్ ఇన్‌కమ్ వంటి సరికొత్త ఆఫర్ల పేరిట అమాయకులను నట్టేటా ముంచేస్తున్నారు. ఫామ్ ప్లాట్లు, ఖాళీ స్థలాలను అక్రమ మార్గంలో విక్రయిస్తూ సామాన్యులను నిలువునా ముంచేస్తున్నారు. ఏడాదిలో అద్దెబ్బుతో సహా కట్టిన సొమ్మును తిరిగి ఇచ్చేస్తామని నమ్మించి మోసం చేస్తున్నారు. ఒక వేళ ఏడాది తర్వాత మార్కెట్ ఒడిదుడుకులలో ఉన్నా లేక కంపెనీ బోర్డు తిప్పేసినా నష్టపోయేది కొనుగోలుదారుడే. ఎందుకంటే ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం గజానికి రూ.5 వేలు కూడా పలకని ప్రాంతంలో రూ.10 వేలకు పైగానే ధరతో విక్రయించి.. ముందస్తుగానే బిల్డర్లు సొమ్ము వసూలు చేసేస్తున్నారు.

❖ కరోనా కాలంలో పుట్టుకొచ్చిన కొన్ని కొత్త నిర్మాణ సంస్థలు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నాయి. డీటీసీపీ, హెచ్ఎండీఏ నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతులు, రెరాలో నమోదు చేయకుండానే వెంచర్లను విక్రయిస్తున్నారు. సదాశివపేట, నారాయణ్‌ఖేడ్, నందివనపర్తి, చేవెళ్ల, జనగాం, బచ్చన్నపేట, చౌటుప్పల్, యాదాద్రి వంటి ప్రాంతాల్లో నగరం నుంచి వందకు పైగా కి.మీ. దూరంలో ఉన్న శివారు ప్రాంతాలలో ఈ తరహా ప్రాజెక్ట్‌లు కుప్పలుతెప్పలుగా ఉన్నాయి. రహదారులు, విద్యుత్, మురుగునీటి వ్యవస్థ వంటి కనీస మౌలిక వసతులు కూడా లేని ప్రాంతాలలో వందలాది ఎకరాలలో ప్రాజెక్టులు చేస్తున్నామని మాయ మాటలు చెబుతున్నారు.

నమ్మకస్తులే మధ్యవర్తులుగా..

గ్రామాలు, శివారు ప్రాంతాలలో టీచర్లు, ఎల్ఐసీ ఏజెంట్లు, రిటైర్డ్ ఉద్యోగులను రియల్ ఎస్టేట్ ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు. గ్రాఫిక్స్ హంగులను అద్ది రంగురంగుల బ్రోచర్లను ముద్రించి ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేస్తూ కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. ప్రతి నెలా స్టార్ హోటళ్లలో మధ్యవర్తులతో సమావేశం నిర్వహించి, ఎక్కువ విక్రయాలు చేసిన ఏజెంట్లకు విదేశీ టూర్లు, కార్లు, బంగారం వంటివి బహుమతులుగా అందజేస్తున్నారు.



హరిత భవనాలపై ఆసక్తి

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ అనుకూల హరిత భవనాలకు ఆదరణ పెరుగుతోంది. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలే కాదు ప్రభుత్వం నిర్మించిన సచివాలయం, పోలీసు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, జిల్లా కలెక్టరేట్లు, ఇతరత్రా ఆఫీసు భవనాలు సైతం పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మిస్తుండటమే ఇందుకు ఉదాహరణ. స్వచ్ఛమైన గాలి, వెలుతురు రావడంతో పాటు సహజ వనరులను వినియోగించుకోవడం, విద్యుత్, నీటి పొదుపు, సౌర శక్తి వినియోగం, గృహోపకరణాలు సైతం ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) అనుగుణంగా ఉండటమే హరిత భవనాల ప్రత్యేకత.

నీటి వృథాకు చెక్ పెట్టేందుకు..

- గ్రీన్ బిల్డింగ్స్‌లో 60 శాతం వరకు నీటి వృథాను అరికట్టవచ్చు. నిత్యావసరాలకు వినియోగించే నీరు బయటకు పంపకుండా వాటిని రీసైకిల్ చేసి తిరిగి మొక్కలకు, బాత్‌రూమ్ అవసరాలకు వాడుకోవచ్చు. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి, వర్షపు నీటిని నిల్వ చేస్తారు. సాధారణ భవనాలతో పోలిస్తే గ్రీన్ బిల్డింగ్స్‌లో నిర్మాణ వ్యయం 8–10 శాతం అధికంగా ఉంటుంది. కానీ ఈ భవనాలలో రోజు నీరు, విద్యుత్ పొదుపు అవుతున్న కారణంగా ఇంటి నిర్మాణం కోసం అదనంగా వెచ్చించిన వ్యయం 2–3 ఏళ్లలో తిరిగి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.



- ఇంటి నిర్మాణ సమయంలోనే రీసైకిల్ మెటీరియల్స్‌ను ఉపయోగించడం గ్రీన్ బిల్డింగ్స్ మరొక ప్రత్యేకత. పర్యావరణానికి హాని చేయని ఉత్పత్తులనే నిర్మాణంలో వాడుతుంటారు. ఇటుకల నుంచి టైల్స్ వరకు గ్రీన్ ఉత్పత్తులు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 720కి పైగా గ్రీన్ బిల్డింగ్ ప్రాజెక్ట్‌లు ఐజీబీసీ వద్ద రిజిస్టర్ అయ్యాయి. దేశవ్యాప్తంగా 11 వేల నిర్మాణాలు ఉన్నాయని ఐజీబీసీ ప్రతినిధులు చెబుతున్నారు.

సంపాదించుకోవాలి.. త్వరగా పదవీ విరమణ చేయాలి.. ఇదీ భారతీయ యువత ఆలోచన. ముఖ్యంగా 25 ఏళ్లలోపు వయసున్న ఉద్యోగుల్లో.. 43 శాతం మంది 45-55 సంవత్సరాలకే రిటైర్మెంట్ తీసుకోవాలని భావిస్తున్నారు. ముందస్తు పదవీ విరమణ కోరుకుంటున్నప్పటికీ 75% మంది తమ ఆదాయంలో కేవలం 1-15% మాత్రమే పెన్షన్ పథకాలకు కేటాయిస్తున్నారు. దేశంలో ప్రైవేటు రంగంలో పనిచేసేవారు, వ్యక్తిగతంగా ఉపాధి పొందుతున్నవారిపై ప్రముఖ ప్రొఫెషనల్ సేవల సంస్థ 'గ్రాంట్ థోర్న్‌టన్ భారత్'చేసిన సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ప్రైవేటు రంగంలో పనిచేస్తున్నవారిలో.. తమ పదవీ విరమణ తరువాత ఆశిస్తున్న ఆదాయానికి, వారి ఆర్థిక ప్రణాళికలకు మధ్య చాలా అంతరం ఉంది. అంటే రిటైర్ అయ్యాక ఆశిస్తున్న ఆదాయం ఎక్కువ.. కానీ అందుకు తగ్గట్టుగా చేయాల్సిన పొదుపు మాత్రం తక్కువ అన్నమాట. 'ఇండియాస్ పెన్షన్ ల్యాండ్‌స్కేప్: ఏ స్టడీ ఆన్ రిటైర్మెంట్ రియాలిటీ అండ్ రెడీనెస్'పేరుతో 'గ్రాంట్ థోర్న్‌టన్ భారత్'సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. 2024 ఆగస్టు-సెప్టెంబర్ మధ్య నిర్వహించిన సర్వే ఆధారంగా దీన్ని రూపొందించారు. ఇందులో పాల్గొన్నవారిలో 79 శాతం మంది వయసు 25-54 ఏళ్లలోపే. 88 శాతం మంది ప్రైవేటు రంగంలో పనిచేస్తున్నవారు కాగా, 5 శాతానికిపైగా వ్యక్తిగతంగా ఉపాధి పొందుతున్నవారు. వీరిలో వార్షికాదాయం రూ.5-10 లక్షలు ఉన్నవారు 12.6 శాతం కాగా, రూ.10-20 లక్షల మధ్య ఉన్నవారు 25.25 శాతం. రూ.20-30 లక్షల మధ్య ఆదాయార్జన పరులు 27.25 శాతం. రూ.40 లక్షలకుపైన ఆదాయం ఉన్నవారు 30.23 శాతం.

నెలకు రూ.లక్ష పెన్షన్ కావాలంటున్నారు

ఆదా చేస్తున్నది మాత్రం జీతంలో 15% లోపే

సంపాదన ఉన్నా సేవింగ్స్ పట్టని ప్రైవేటు ఉద్యోగులు

ముందస్తు రిటైర్‌మెంట్ కోరుతున్న యువత 'గ్రాంట్ థోర్న్‌టన్ భారత్'సర్వేలో వెల్లడి





కోరేది కొండంత.. దాచేది పిసరంత!

సంపాదన ఉన్నప్పటికీ..

56% మంది సంవత్సరానికి రూ.20 లక్షల కంటే ఎక్కువ సంపాదిస్తున్నప్పటికీ.. చాలా తక్కువ మందే పెన్షన్‌పథకాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. అధిక ఆదాయం సంపాదించేవారిలో 30% మంది నెలకు రూ.2 లక్షల కంటే ఎక్కువ పెన్షన్లు ఆశిస్తున్నారు. సంవత్సరానికి రూ.40 లక్షల కంటే ఎక్కువ సంపాదించేవారిలో 58% మంది పదవీ విరమణ కోసం వారి జీతంలో 1-15% మాత్రమే కేటాయిస్తున్నారు. రూ.20-30 లక్షల ఆదాయం ఆర్జించేవారిలో 75% మంది పెన్షన్‌కోసం తమ వేతనంలో 6-20% సమకూరుస్తున్నారు. సర్వేలో పాల్గొన్నవారిలో సగం మందికి అటల్ పెన్షన్ యోజన గురించి అవగాహన లేదు. పెన్షన్ మొత్తాలను ఎలా లెక్కిస్తారో 30% మందికి తెలియదు. ఆర్థిక అక్షరాస్యత పెరగాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

రూ.లక్ష పెన్షన్ కావాలి

55% మంది నెలకు రూ.లక్ష కంటే ఎక్కువ పెన్షన్ ఆశిస్తున్నారు. అయితే 11% మంది మాత్రమే తమ ప్రస్తుత పెట్టుబడులు ఈ అంచనాలను అందుకోవడానికి సరిపోతాయని నమ్ముతున్నారు. ప్రభుత్వ మద్దతు ఉన్న పెన్షన్‌ప్రణాళికల పట్ల సుమారు 39% మంది మొగ్గుచూపుతున్నారు. అధిక ముప్పు, అధిక రాబడి ఉన్న ప్రణాళికలు ముఖ్యంగా యువతను ఆకర్షిస్తున్నాయి. 25 ఏళ్లలోపు వారిలో 31% మంది ఈ పథకాలపై ఆసక్తిని వ్యక్తం చేస్తున్నారు. నిజానికి నెలకు రూ.లక్ష పెన్షన్ పొందడానికి 30 ఏళ్ల వ్యక్తి 12% వార్షిక రాబడి, 6.75% యాన్యుటీ రేటును ఊహిస్తూ 60 సంవత్సరాల వయస్సు వరకు నెలకు రూ.6,000 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

రిటైర్మెంట్ ఫండ్‌కు జీతంలో ఎంత మొత్తం కేటాయిస్తున్నారంటే...

జీతంలో శాతం	కేటాయిస్తున్న వారి శాతం
1-5	27.57
6-10	27.24
11-15	18.94
16-20	11.63

ఎంత పెన్షన్ కావాలంటే..

పెన్షన్ మొత్తం	కోరుకుంటున్నవారి శాతం (రూ.లలో)
40 వేలు-70 వేలు	15.28
70 వేలు-లక్ష	19.27
లక్ష-1.5 లక్షలు	21.26
1.5-2 లక్షలు	13.29
2 లక్షలకుపైన	20.93

సంప్రదాయ పెన్షన్..: 56% మంది 55-65 సంవత్సరాల మధ్య పదవీ విరమణ పొందాలని ఆలోచిస్తున్నారు. 45-50 ఏళ్ల మధ్య రిటైరైపోవాలని సుమారు 11 శాతం మంది చెప్పారు. 75% మంది తమ జీతంలో 15% లోపే పదవీ విరమణ పథకాలకు కేటాయిస్తున్నారు. అత్యధికులు ఇప్పటికీ సంప్రదాయ పెన్షన్ సాధనాలవైపే మొగ్గు చూపుతున్నారు. 35% మంది ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) ఎంచుకుంటున్నారు. తరువాత గ్రాట్యుటీ, జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) మీద ఆధారపడుతున్నారు. అయితే, గ్రాట్యుటీ మాత్రమే సరిపోదని 99% మంది భావిస్తున్నారు. 32% మంది మాత్రమే ఎన్‌పీఎస్ పనితీరుతో సంతృప్తి చెందారు. ఈపీఎఫ్‌కు ప్రజాదరణ ఉన్నప్పటికీ దాని పనితీరుపై కేవలం 46% మంది మాత్రమే సంతృప్తిగా ఉన్నారు. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) విషయంలో కూడా చాలా తక్కువ మందే ఆసక్తి చూపారు. పదవీ విరమణ తర్వాత స్థిర ఆదాయాన్ని అందించడంలో మంచివే అయినప్పటికీ 76% మంది యాన్యుటీ పథకాలలో పెట్టుబడి పెట్టడం లేదని నివేదిక వివరించింది.

పొంచి ఉన్న సంక్షోభం..: శ్రామిక జనాభా పెరుగుతున్న కొద్దీ ఆశిస్తున్న పదవీ విరమణ అవసరాలు, వాస్తవ పొదుపుల మధ్య అంతరం స్పష్టంగా కనిపిస్తోంది. దీన్ని తగ్గించడానికి వ్యక్తుల జీవిత అవసరాలకు అనుగుణంగా ఉండే బలమైన పెన్షన్ వ్యవస్థ అవసరం. అత్యధికులు తమ గ్రాట్యుటీ మొత్తాలు సరిపోవని భావిస్తున్నారు. తక్కువ వార్షిక పెట్టుబడుల రేటు కారణంగా పదవీ విరమణ తర్వాత వచ్చే హామీ ఆదాయం విషయంలో అనిశ్చితి ఉంది. బలమైన ఆర్థిక విద్య, మరింత ఆకర్షణీయమైన పెన్షన్ ఉత్పత్తులు, అధిక పొదుపులను ప్రోత్సహించడానికి విధాన పరమైన సంస్కరణలు రాకపోతే రాబోయే దశాబ్దాలలో పదవీ విరమణ పొందిన వ్యక్తుల కుటుంబాల్లో సంక్షోభం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

9న సిట్ ముందుకు ప్రభాకర్‌రావు?

ఎమర్జెన్సీ సర్టిఫికెట్ జారీ చేసిన భారత ఎంబసీ



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆ విభాగ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు సోమవారం సిట్ ముందు హాజరుకానున్నట్టు తెలిసింది. ఈయనకు గత నెలలో సుప్రీంకోర్టు స్వల్ప ఊరట ఇచ్చిన విషయం విదితమే. ప్రభాకర్‌రావును అమెరికా నుంచి తిరిగి రానివ్వాలని పోలీసులకు, పాస్‌పోర్టు పునరుద్ధరించాలని ఆ అధికారులకు, పోలీసుల విచారణకు సహకరించాలని ఆయన్ను ఆదేశించింది. పాస్‌పోర్టు అందిన మూడురోజుల్లో తిరిగి వచ్చి పోలీసుల ఎదుట హాజరవ్వాల్సి ఉంది. ప్రభాకర్‌రావుకు అమెరికాలోని భారత ఎంబసీ శుక్రవారం పాస్‌పోర్టుకు బదులుగా ఎమర్జెన్సీ సర్టిఫికెట్ జారీ చేసింది. దీని ఆధారంగా శనివారం ఆయన స్వదేశానికి బయలుదేరనున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆయన సోమవారం సిట్ ఎదుట విచారణకు హాజరవుతారని అధికారవర్గాలు చెబుతున్నాయి.

విషమంగానే మాగంటి ఆరోగ్యం



గచ్చిబౌలి (హైదరాబాద్): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (62) ఆరోగ్యం విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో సీనియర్ డాక్టర్ల పర్యవేక్షణలో రెండు రోజులుగా వెంటిలేటర్‌పై ఆయనకు చికిత్స అందిస్తున్నారు. మరో 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు సూచించారు. గుండె పోటుతో ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపీనాథ్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం పరామర్శించారు. గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు తెలిపిన ప్రకారం మాగంటి ఆరోగ్యం నిన్నటి కంటే మెరుగ్గా ఉందని మంత్రి చెప్పారు. తనకు మాగంటితో ఎంతో సాన్నిహిత్యం ఉందని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. నల్లగొండ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి గోపీనాథ్‌ను పరామర్శించేందుకు రావాల్సి ఉండగా చివరి నిమిషాల్లో రద్దు అయింది. అయితే శనివారం ఏఐజీ ఆస్పత్రిలో సీఎం మాగంటిని పరామర్శించే అవకాశముందని పోలీసు అధికారులు తెలిపారు.

కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

- కేసు తదుపరి విచారణ ఆగస్టు 25కు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రాజెక్టు పేరుతో రూ.25 వేలకోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం తరలించిందంటూ ఆయన చేసిన ఆరోపణలు తమ పార్టీ ప్రతిష్టను దెబ్బతీశాయని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఆత్రం సుగుణ కేటీఆర్‌పై ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, గతేడాది సెప్టెంబర్ 30న కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు తనపై తప్పుడు కేసు నమోదు చేశారంటూ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టి ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 21న తుదితీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆత్రం సుగుణ మే 19న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టి కేటీఆర్‌తోపాటు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 25కు వాయిదా వేసింది.

నేటి నుంచి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

- పోస్టర్ రిలీజ్ చేసిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, ఎండీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి నాలుగవ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు శుక్రవారం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఎండీ సోని బాలాదేవి పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. శనివారం నుంచి www.tgss.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. 01-09-2016 నుంచి 30-8-2017 మధ్య జన్మించి 8 నుంచి 9 ఏళ్ల వయసు కలిగినవారు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న క్రీడా పాఠశాలలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుందన్నారు. జూన్ 16 నుంచి 19 వరకు మండల స్థాయి ఎంపిక, మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థినీవిద్యార్థులు జిల్లా స్థాయిలో జూన్ 23 నుంచి 26 వరకు.. అందులో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో జూలై 1 నుంచి 5 వరకు ఎంపిక జరుగుతుందని వెల్లడించారు. హకీంపేటలో బాలురకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లు, కరీంనగర్‌లో బాలురకు 20, బాలికలకు 20 సీట్లు ఉంటాయన్నారు. ఆదిలాబాద్‌లో బాలురకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లు మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ప్రభుత్వ చొరవకు ఉద్యోగుల అభినందనలు

- ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు



మారం జగదీశ్వర్

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవకు తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రులు, త్రిసభ్య కమిటీ చైర్మన్ నవీన్‌మిత్తల్, సభ్యులు లోకేశ్‌కుమార్, కృష్ణభాస్కర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని 206 ఉద్యోగ సంఘాలతో 13.50 లక్షల మంది ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తూ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి ఏర్పాటైందని తెలిపారు. ఈ జేఏసీ ద్వారా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. పలు దశల్లో చేసిన చర్చలు, వినతులు, విజ్ఞాపనల ఫలితంగా.. ప్రభుత్వం పలు అంశాల్లో నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని వ్యాఖ్యానించారు.

ఆరోగ్య పథకం కోసం ట్రస్టు ఏర్పాటు లాభదాయకం

ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేయనున్న ఆరోగ్య పథకం నిర్వహణకు ప్రత్యేకంగా హెల్త్‌కేర్ ట్రస్టు ఏర్పాటు చేయడం లాభదాయకమని ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం నాంపల్లిలోని సీసీఎల్ఏ కార్యాలయ ఆవరణలోని డిప్యూటీ కలెక్టర్ల సంఘ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార మార్గాలను చూపిందని, కేబినెట్ నిర్ణయంతో ఉద్యోగులకు భరోసా కల్పించినట్టైందన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రతినెలా రూ.700 కోట్లు విడుదల చేయడం ఊరటనిచ్చే అంశమని చెప్పారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులు సొంత జిల్లాలకు తిరిగి వెళ్లేలా చర్యలకు ఆదేశించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

క్లుప్తంగా...

గవర్నర్, సీఎం బక్రీద్ శుభాకాంక్షలు





సాక్షి, హైదరాబాద్: త్యాగనిరతి, శాంతి, ఐక్యత, సహనానికి ప్రతీక బక్రీద్ అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభివర్ణించారు. ప్రవక్తల అచంచలమైన దైవభక్తి, త్యాగనిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు గవర్నర్, సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌లో ఇంజనీర్ల కృషి భేష్

- రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్



సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్‌లో ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజనీర్ దళాల కృషి ప్రశంసనీయమని రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్టార్టప్‌లతో పాటు రక్షణ సాంకేతికతలో ఆత్మనిర్భర్ భారత్‌ను ప్రోత్సహించడంలో వారి పాత్రను ఆయన అభినందించారు. సికింద్రాబాద్‌లోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్(ఎంసీఈఎంఈ)ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సైనికులతో సంభాషించారు. 'డ్రోన్ ఆలయ'పేరుతో ఏర్పాటు చేసిన కొత్త డ్రోన్ శిక్షణ ప్రయోగశాలను ఆయన సందర్శించారు. స్వదేశీ యాంటీ డ్రోన్ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఉన్న మార్గాలపై చర్చించారు.

పాత్రికేయుల విభజన సరికాదు

- పౌరసంబంధాల శాఖ కమిషనర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ప్రతి పాత్రికేయుడికి అవకాశం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. కేవలం ఒకట్రెండు సంఘాలకు చెందిన పాత్రికేయులకు మాత్రమే శిక్షణ ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈమేరకు టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, గుడిగ రఘు, కార్యదర్శులు ఈ.చంద్రశేఖర్, బి.జగదీశ్ తదితరులు రాష్ట్ర పౌరసంబంధాల శాఖ కమిషనర్ హరీశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఒక సంఘంలో సభ్యత్వం తీసుకుంటేనే మీడియా అకాడమీ శిక్షణలో అవకాశమిస్తామని చెప్పడాన్ని ఫెడరేషన్ నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జూన్ 30తో అక్రిడిటేషన్ల రెన్యువల్ గడువు ముగుస్తుందని, కొత్త అక్రిడిటేషన్లను జారీ చేయాలని కోరారు.

ఎప్పుడేం జరుగుతుందో?

తాజా రాజకీయ పరిణామాలపై బీఆర్ఎస్‌లో ఉత్కంఠ

- కాళేశ్వరం కమిషన్ విచారణకు 9న హరీశ్, 11న హాజరవనున్న కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ లోపల, వెలుపల చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలతో పార్టీ కేడర్‌లో ఉత్కంఠ నెలకొంది. పార్టీకి చెందిన ముగ్గురు కీలక నేతలు విచారణ సంస్థల ఎదుట హాజరుకానున్న నేపథ్యంలో విచారణ తర్వాత ఎదురయ్యే పరిణామాలు ఎలా ఉంటాయనే కోణంలో కేడర్‌లో చర్చ జరుగుతోంది. మరోవైపు పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల ఎమ్మెల్సీ కవిత 'తెలంగాణ జాగృతి' ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు కూడా చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో విదేశీ పర్యటన ముగించుకొని శనివారం హైదరాబాద్‌కు చేరుకోనున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వీటన్నింటిపై ఎలా స్పందిస్తారనే చర్చ నడుస్తోంది.

కేసీఆర్ విచారణ నేపథ్యంలో పార్టీ కార్యాచరణ ఏమిటో?

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటైన కమిషన్ ఎదుట విచారణకు ఈ నెల 9న హరీశ్‌రావు, 11న కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ విషయంలో కేసీఆర్‌కు కమిషన్ నోటీసులు ఇచ్చినా పార్టీ ఇప్పటివరకు స్పందించకపోవడాన్ని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించిన నేపథ్యంలో ఈ నెల 11న బీఆర్ఎస్ చేపట్టే కార్యాచరణపై ఉత్కంఠ నెలకొంది. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ కవిత ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిరసన తెలపడం తెలిసిందే. ఈ నెల 11న కూడా తెలంగాణ జాగృతి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టే యోచనలో కవిత ఉన్నట్లు సమాచారం.

'ఫార్ములా-ఈ'పై విచారణకు కేటీఆర్

'ఫార్ములా-ఈ' కారు రేసు అంశంలో గతంలో విచారణకు హాజరైన కేటీఆర్‌కు ఈ నెల 5న రావాల్సిందిగా ఏసీబీ మరోసారి నోటీసు జారీ చేయగా అమెరికా పర్యటన ముగించుకొని వచ్చాక హాజరవుతానని పేర్కొనడం తెలిసిందే. శనివారం హైదరాబాద్ చేరుకోనున్న కేటీఆర్ ఈ నెల 3వ వారంలో ఏసీబీ విచారణకు హాజరయ్యే అవకాశమున్నట్లు తెలిసింది. పార్టీ అధినేత కేసీఆర్, మరో కీలక నేత హరీశ్‌రావు కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరయ్యే సమయంలోనే కేటీఆర్‌కు కూడా నోటీసులు రావడం వెనుక కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్గాలు విమర్శిస్తున్నాయి.

'కవిత ఎపిసోడ్'పైనా పార్టీలో ఉత్కంఠ

ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ కావడం కలకలం సృష్టించింది. గత నెల 23న అమెరికా నుంచి తిరిగి వస్తూ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కేసీఆర్‌కు తాను లేఖ రాసిన విషయాన్ని అంగీకరిస్తూనే 'కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయి' అంటూ ఆమె వ్యాఖ్యానించారు. అలాగే గత నెల 29న కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. పార్టీ జెండా, కండువాలు లేకుండా ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద ధర్నా కూడా చేపట్టారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందన ఎలా ఉంటుందనే ఉత్కంఠ కేడర్‌లో వ్యక్తమవుతోంది. అయితే కేటీఆర్ తాజా పరిణామాల జోలికి వెళ్లకుండా కేవలం సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణం, ప్రభుత్వ వైఫల్యాలపై నిరసనలు వంటి అంశాలపైనే దృష్టి సారించే అవకాశముందని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి.

26 వేలకు పైగా పాఠశాలలు డిజిటలైజ్

టీ ఫైబర్ ఎండీ వేణుప్రసాద్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలను ఇంటర్నెట్‌తో అనుసంధానం చేసి డిజిటలైజ్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ వెల్లడించారు. అన్ని పాఠశాలల్లో ఇంటర్నెట్ వసతి, డిజిటల్ తరగతి గదులను అందించడం ద్వారా గ్రామాల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగు పడతాయన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఎండీ వేణు ప్రసాద్ కాలిఫోర్నియా రాష్ట్రం మిల్పిటాస్‌లోని ఫాల్కన్ ఎక్స్‌లో ప్రవాస భారతీయులతో భేటీ అయ్యారు. 8 వేలకు పైగా గ్రామాలను ఇప్పటికే ఇంటర్నెట్‌తో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం రూ.3,500 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. టీ ఫైబర్ భాగస్వామ్యంతో ఎక్విప్ అనే స్వచ్ఛంద సంస్థ 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల వివరాలతో ఆన్‌లైన్ వ్యవస్థను అభివృద్ధి చేసిందని వేణుప్రసాద్ వెల్లడించారు. కాగా, టీ ఫైబర్ చొరవను స్వాగతిస్తూ కాలిఫోర్నియా నుంచి వేయి పాఠశాలలకు సహాయం అందిస్తామని ఫోర్సిస్ ఇంక్ సీఈఓ జేపీ వేజెండ్ల హామీఇచ్చారు. విరాళాల కోసం అవసరమైన ప్రచార సామగ్రిని అందజేస్తే పాఠశాలలకు అవసరమైన నిధుల సేకరణను సమన్వయం చేస్తామని ఎన్జీఓ నిర్వాహకులు విజయ ఆసూరి తెలిపారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) ఇప్పటికే ఈ తరహా పైలట్ ప్రాజెక్టు చేపట్టిందని టీడీఎఫ్ ప్రతినిధి మహేందర్ గూడూరు చెప్పారు. సమావేశంలో వెంకట్ కోగంటి, శ్రీ హరి గక్కిన, సుబ్బారావు చెన్నూరి, ఫాల్కన్ ఎక్స్ ప్రతినిధి డాక్టర్ రమేశ్ కొండ, ఎక్విప్ ప్రతినిధి సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ మినరల్స్ రంగాన్ని బలోపేతం చేస్తాం: కిషన్‌రెడ్డి

- నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ఔట్‌రీచ్ ఫోరం ప్రారంభం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో క్రిటికల్ మినరల్స్ రంగాన్ని బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం విస్తృత చర్యలు తీసుకుంటోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం సాధించాలంటే మినరల్స్ రంగాన్ని స్వయం సమృద్ధిగా అభివృద్ధి చేయాల్సిన అవసరముందని చెప్పారు. ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ఔట్‌రీచ్ ఫోరాన్ని ప్రారంభించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మినరల్స్ రంగానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఇప్పటివరకు 34 బ్లాకుల వేలం విజయవంతంగా పూర్తయిందని, మరిన్ని బ్లాకుల వేలం కోసం చర్యలు చేపట్టామని వెల్లడించారు. క్లీన్ ఎనర్జీ లక్ష్యాలను చేరుకోవాలంటే లిథియం, కోబాల్ట్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ వంటి క్రిటికల్ మినరల్స్‌కు ప్రాధాన్యం అవసరమన్నారు. 2040 నాటికి ఈ మినరల్స్ డిమాండ్ 4 నుంచి 6 రెట్లు పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం భారత్ 100 శాతం ఈ మినరల్స్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోందని కేంద్రమంత్రి వెల్లడించారు. కాగా, సింగరేణి సంస్థ కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలోకి స్వయంగా కానీ ఇతర సంస్థలతో జాయింట్ వెంచర్‌గా కానీ ప్రవేశించడానికి సంసిద్ధంగా ఉందని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం స్పష్టం చేశారు. సదస్సులో ఆయన సింగరేణి సంస్థ భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించారు.

మండే ఎండ.. విపరీతంగా ఉక్కపోత

రాష్ట్రంలో ఇదీ ప్రస్తుత వాతావరణ పరిస్థితి

- మందగమనంలో నైరుతి రుతుపవనాలు
- ముందస్తుగా మురిపించి.. సీజన్ వచ్చాక వానలు కరువు
- మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి: వాతావరణ శాఖ



సాక్షి, హైదరాబాద్: ముందస్తుగా మురిపించిన నైరుతి రుతుపవనాలు.. రాష్ట్రంలో ప్రస్తుతం కాస్త నెమ్మదించాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాల సీజన్‌ను జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు పరిగణిస్తారు. కానీ ఈసారి వారం రోజుల ముందే రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. తొలి నాలుగు రోజులు అత్యంత చురుకుగా కదిలాయి. దీంతో పలుచోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల భారీవర్షాలు, ఒకట్రెండు చోట్ల అతిభారీ వర్షాలు సైతం నమోదయ్యాయి. కానీ వాస్తవ సీజన్ ప్రారంభం(జూన్ 1వ తేదీ) నుంచి రుతుపవనాల కదలికలు కాస్త మందగించాయి. దీంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకొని ఉష్ణోగ్రతలు పెరిగాయి. సాధారణంగా రోహిణి కార్తె చివర్లో తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ప్రస్తుతం పొద్దంతా ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతూ తీవ్రమైన ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సాయంత్రానికి వాతావరణం కాస్త చల్లబడినా వర్షాలు మాత్రం కురవటంలేదు. ఈ నెల తొలి వారంరోజుల్లో 26 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదు కావాల్సి ఉండగా.. అందులో సగం కూడా కురవలేదు.

రెండోవారం తర్వాతే..: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వర్షాలకు అనుకూలంగా లేవు. మరో నాలుగైదు రోజులపాటు ఇదే తరహా వాతావరణం ఉంటుందని వాతావరణ విభాగం అధికారులు చెబుతున్నారు. జూన్ రెండోవారం తర్వాతే వర్షాలకు అనుకూల పరిస్థితులు ఉంటాయని అంటున్నారు. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం, వాయుగుండం, తుఫాన్ల ప్రభావంతోనే నైరుతి సీజన్ వర్షాలు ఎక్కువ కురుస్తాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు బంగాళాఖాతంలో అలాంటి పరిస్థితులు ఏర్పడలేదు. ప్రస్తుతానికి వాతావరణ శాఖ సైతం ఎలాంటి అంచనాలను విడుదల చేయలేదు. శుక్రవారం రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదయ్యాయి. అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రత రామగుండంలో 40 డిగ్రీల సెల్సియస్, అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత హనుమకొండలో 23ల డిగ్రీ సెల్సియస్‌గా నమోదయ్యాయి. రానున్న మూడు రోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే నమోదవుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

● నేడు బక్రీద్

భక్తి... త్యాగాల సమ్మేళనం ఈదుల్ అజ్ హా



ప్రతి విశ్వాసికి జీవితంలో తీపి గుర్తులుగా నిలిచిపోయే సందర్భాలు కొన్ని ఉంటాయి. అలాంటి వాటిలో పండుగలు కూడా ఒకటి. ఇస్లామ్ జీవన విధానంలో ముస్లింలు రెండు పండుగలు జరుపుకుంటారు. ఒకటి ఈదుల్ ఫిత్ర్ /రమజాన్, రెండవది ఈదుల్ అజ్ హా/బక్రీద్. ఈదె ఖుర్బాన్ గా పిలువబడే ఈ బక్రీద్ పర్వదినం చరిత్రలో ఒక విశిష్ట స్థానం దక్కించుకుంది. ఇది కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, ఇది భక్తి, త్యాగం, ప్రేమ, సహనం, సమానత్వం, మానవతా విలువల ఉత్కృష్ట రూపం. ఈద్ మూలసారాన్ని అర్థం చేసుకోవాలంటే, దాని చారిత్రక నేపథ్యాన్ని గుర్తుచేసుకోవాలి. ప్రవక్త ఇబ్రాహీం అలైహిస్సలాంను దైవం పరీక్షించాడు. పరీక్షలో భాగంగా తన కుమారుడు ఇస్మాయిల్ అలైహిస్సలాంను త్యాగం చేయమని ఆదేశించాడు. దైవాదేశాన్ని విన్న మరుక్షణం ఆయన ఎలాంటి తడబాటు లేకుండా అంగీకరించారు. కుమారుణ్ని కూడా సంప్రదించారు. ఇది దేవుని ఆజ్ఞ అని అర్థమై, తండ్రికి సహకరించేందుకు సిద్ధపడ్డాడు కుమారుడు. ఇదే సమయంలో దైవం వారి నిబద్ధతను మన్నించి, వారి త్యాగానికి బదులుగా ఒక గొర్రె పొట్టేలును పంపించి, వారిని పరీక్ష నుండి సురక్షితం గావించాడు. నిజాయితీ, భక్తి తత్పరత, నిబద్ధత, త్యాగనిరతి లాంటి సుగుణాలన్నీ ఎటువంటి కఠిన పరీక్షలనుంచయినా సురక్షితంగా బయట పడేయగలవని ఈ సంఘటన రుజువు చేస్తోంది.

ఈ ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ ప్రతి సంవత్సరం ముస్లింలు ఈదుల్ అజ్ హా/బక్రీద్ జరుపుకుంటారు. ఈ పండుగ కేవలం ఒక జంతువును త్యాగం చేయడం మాత్రమే కాదు. అది మన మనస్సులోని స్వార్థాన్ని, లోభాన్ని, అహంకారాన్ని త్యాగం చేయడం కూడా! మనం చేసే ఈ త్యాగం తాలూకు భక్తి శ్రద్ధలు అంటే తఖ్వా మాత్రమే దైవం చూస్తాడు, స్వీకరిస్తాడు. రక్త మాంసాలతో ఆయనకు సంబంధంలేదు. అవసరమైతే ధర్మం కోసం, న్యాయం కోసం నా ప్రాణమైనా ఇస్తాను అనే స్పష్టమైన సంకేతం ఇందులో ఉంది. ఈ విషయం ఖురాన్‌లో ఇలా ఉంది:

నా నమాజు, నా త్యాగం (నుసుక్), నా జీవితం, నా మరణం సమస్తమూ సర్వలోక పాలకుడైన దైవానికే.(పవిత్ర ఖురాన్ 6:162)

'అల్లాహ్ వద్దకు మాంసం గాని, రక్తం గాని చేరవు; ఆయనకు చేరేది మీ తఖ్వా మాత్రమే'

(పవిత్ర ఖురాన్ , సూరె హజ్ : 37)

ఈద్ పర్వదినాన్ని మనం ఎలా గడిపితే అది దైవానికి ఆమోదయోగ్యమవుతుందో ఆ దిశగా ప్రతి విశ్వాసి ప్రయాణం సాగాలి. త్యాగం, భక్తి, ప్రేమ, వినయం, క్షమ, సహనం, మానవత ఇవే ఈ పండుగకు మూల సారాంశం. మన తలుపు తట్టే ప్రతి అవసరమున్న హృదయాన్ని తాకే రోజు ఈదుల్ అజ్ హా కావాలి. మనం చేసే త్యాగం దైవానికి చేరాలంటే అది హృదయ పూర్వకమైనదిగా, తఖ్వాతో కూడినదై ఉండాలి.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

హృదయాన్ని తాకే సందేశం

ఈ పర్వదినాన మాంసాన్ని పంచుకోవడం కూడా ఒక విశేషమైన సంప్రదాయం. పేదలకు, బంధువులకు, సొంత కుటుంబానికి ఈ మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి పంచడం వల్ల పరస్పర మానవ సంబంధాలు బలపడతాయి. ఇది ఒక ఆచారమే కాదు, ఒక సాంఘిక బాధ్యత కూడా.

ఈ సందర్భంలో ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం వారి ప్రవచనం మనకు మార్గదర్శకంగా నిలుస్తుంది: 'తను కడుపు నిండా అన్నం తిని, తన పొరుగువాడు పస్తు ఉన్నట్లయితే, అలాంటి వ్యక్తి మోమిన్ (విశ్వాసి) కాలేడు. (ముస్తదక్ అల్ హాకీం, 7303) ఈ హదీసు మనకు బోధించేది, మనకు తెలిసేది ఏమిటంటే ఈద్ పర్వదినం సందర్భంగా సంతోషం కేవలం మన ఇంట్లో మాత్రమే కాదు, మన చుట్టుపక్కల వారిని కూడా మన సంతోషంలో భాగస్వాములను చేయాలి. అదే నిజమైన ఆధ్యాత్మికత. అదే నిజమైన మానవత. అలాగే, ఈద్ సందర్భంగా త్యాగం అంటే, కేవలం మాంసం పంచడం మాత్రమే కాదు, మన అవసరాలను కొంతవరకు నియంత్రించుకొని, పేదసాదల పట్ల కరుణతో, సేవాభావంతో వ్యవహరించాలి. నిజమైన త్యాగం అంటే పండుగ, పండుగ తర్వాతి కాలంలోనూ మన ప్రవర్తనలో మార్పు కనిపించాలి. మన వ్యక్తిత్వంలో, మన ఇంట్లో, మన కుటుంబంలో, మన సమాజంలో పరిశుభ్రత, నైతికత పరిఢవిల్లాలి. ముఖ్యంగా ఈద్ రోజున మనం ఇరుగు, పొరుగును పలకరించాలి. కులమతాలు వేరయినా, మానవతా సంబంధాల పరంగా మనమంతా ఒక్కటే. పరస్పరం సోదర సంబంధమే. ఈ ఐక్యతను చాటాలి. ఈద్ ఒక ఇస్లాంకు సంబంధించిన పండుగ అయినా, దాని సందేశం విశ్వమానవీయంగా ఉంది. ప్రతి హృదయాన్ని తాకే విధంగా ఉంది. దీన్ని మత విభేదాల్ని చెరిపి, మానవతను సమీకరించే రోజుగా మార్చుకోవాలి.

* నేడు ఫుడ్ సేఫ్టీ డే

సాధారణంగా కలుషిత ఆహారం, నీళ్ల ద్వారా బ్యాక్టీరియా, వైరస్, పరాన్నజీవులు, రసాయనాలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలకు కారణం అవుతాయి. ఈ సమస్య అంతా వంట గది నుంచే మొదలవుతుంది. ఈ సమస్యకు అడ్డుకట్ట వేయాలంటే..?

తాజా ఆహారం.. ఆరోగ్యం పదిలం



ప్రతి యేటా సురక్షితం కాని ఆహారం తినడం వల్ల 60 కోట్ల మంది అనారోగ్యానికి గురవుతున్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి. నేడు ఫుడ్ సేఫ్టీ దినోత్సవ సందర్భంగా కొన్ని సురక్షితమైన అలవాట్ల గురించి తెలుసుకుందాం...

- చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలి. వాడిన పాత్రలను, వాడాలనుకున్న పాత్రలను తప్పనిసరిగా కడిగాకనే తిరిగి ఉపయోగించాలి.
- ముడి పదార్థాలను, వండిన పదార్థాలను వేరుగా ఉంచడం వల్ల క్రాస్–కాలుష్యాన్ని నివారించవచ్చు.
- పూర్తిగా ఉడికించాలి. ముఖ్యంగా మాంసం, మాంసాహారం, సముద్రపు ఆహారం.. బాగా ఉడికించిన తర్వాతనే తీసుకోవాలి.
- ఆహారాన్ని సరైన పద్ధతుల్లో నిల్వ చేయాలి. అతి చల్లని, అతి వేడి పదార్థాలను తీసుకోవడం నివారించాలి.
- సురక్షితమైన నీరు, ముడి పదార్థాలను ఉపయోగించాలి. పదార్థాల తాజాదనాన్ని చెక్ చేసి, తీసుకోవాలి. ఇది పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారిలో చాలా ముఖ్యం.

ఆహార భద్రతకు 5 శక్తివంతమైన ప్రయోజనాలు

- ఆహారాన్ని శుభ్రంగా వుంచుకోవడం అన్నది 200 కంటే ఎక్కువ ఆహార సంబంధిత వ్యాధులను దూరంగా ఉంచుతుంది.
- ఆరోగ్యకరమైన ఆహారం ద్వారా జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చు.
- తాజా ఆహారం వల్ల ఆహార నష్టం, వ్యర్థాలను తగ్గించవచ్చు.
- సురక్షితమైన ఆహారం ప్రతి ఒక్కరి హక్కు. ఇంట్లో/రెస్టారెంట్లలో ఆహారాన్ని ఎక్కడ తీసుకున్నా ఆరోగ్యకరమైనదానిపట్ల తప్పక దృష్టి పెట్టాలి.

బులియన్

జూన్ 6న ముగింపు (బంగారం 10 గ్రా.: వెండి కిలో) రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,210
బంగారం (22 క్యారెట్లు)	90,790
వెండి	1,01,200
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,750
బంగారం (22 క్యారెట్లు)	91,300
వెండి	1,08,500
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,600
బంగారం (22 క్యారెట్లు)	91,300
వెండి	1,18,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,750
బంగారం (22 క్యారెట్లు)	94,040
వెండి	1,08,500
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,800
బంగారం (22 క్యారెట్లు)	89,060
వెండి	1,00,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,600
బంగారం (22 క్యారెట్లు)	91,300
వెండి	1,14,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

బ్యూటిప్



అరటిపండు గుజ్జులో ఒక స్పూను పెసర పిండి, మంచి గంధం, తేనె వేసి కలపాలి. దీనితో ముఖానికి ప్యాక్ వేసుకుని, పదిహేను నిమిషాల తర్వాత కడిగేస్తే ముఖం ప్రకాశవంతంగా ఉంటుంది.

పాటనుకుంటివా? ఫైర్ ఇంజన్లు...





అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ యేడాది ఒడిశాలో 4,500 హెక్టార్లకు (11,120 ఎకరాలు) పైగా అడవులను మంటలు ప్రభావితం చేశాయి. ఈ సమస్య ప్రతి యేటా ఎదుర్కొనేదే. అధికారులు సీసీ కెమెరాలు, ఉపగ్రహ డేటా వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మంటలను ట్రాక్ చేస్తున్నారు. అడవిలో ఎండు ఆకులను కాల్చడం వల్ల కూడా వేడిగాలులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఈ మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. వాటిని ఆర్పడం మరింత కష్టతరం అవుతోంది. ఈ నేపథ్యంలో అగ్ని ప్రమాదాల నుంచి గ్రామ ప్రజలను రక్షించడం కోసం ఒకప్పుడు పురుషులు జట్లు జట్లుగా కలిసి ఊళ్లన్నీ తిరిగి పాటలు పాడి అగ్నిప్రమాదాలు జరగకుండా ఏం జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించేవారు. ఇప్పుడు ఆ బాధ్యతను స్త్రీలు స్వీకరించడమే కాదు. మరింత బాగా అవగాహన కల్పిస్తూ... ప్రమాదాల నుంచి రక్షిస్తున్నారని కియోంఝర్ జిల్లాలోని అటవీ డిప్యూటీ పరిరక్షకుడు హనుమంత్ ధమ్ధేరే అన్నారు.

ఒడిషా రాష్ట్రంలోని ముర్గపహాడి గ్రామంలోని మహిళలు సంవత్సరాల తరబడి నిశ్శబ్దంగా పొలం పనులు, పిల్లలను సాకడం చేస్తుండేవారు. దీంతోపాటు అడవుల్లో పువ్వులు, కట్టెలు సేకరిస్తుంటారు. ఉపాధి లేనప్పుడు వారి భర్తలు నగరాల్లో పని చేస్తుంటే వీళ్లు ఇళ్లను నడిపిస్తుండేవారు. రెండేళ్లుగా మహిళలు కూడా బృందాలుగా చేరి, పాటలు పాడుతూ అవగాహన కల్పిస్తున్నారు. ఇది వారి స్వీయ గౌరవాన్ని పెంచడమే కాదు సమాజంలో వారి పాత్రను మరింత బలపరుస్తోంది.

సంప్రదాయ గీతాలతో ఆధునిక పరిష్కారం

ఈ ప్రయత్నం ఫలితంగా అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు 20–30 శాతం తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో ధమ్ధేరే కొన్ని మహిళా సంకీర్తన బృందాలను చేర్చుకున్నారు. ఈ బృందాలు స్థానిక భాషలలో పాడతాయి. వాటిని స్థానిక ప్రజలు సులభంగా అర్థం చేసుకోవడంతోపాటు అవగాహనతో అటవీ పరిరక్షణకు పాటు పడుతుంటారు. ఈ పని చేసినందుకు గాను ఈ బృందాలకు అటవీశాఖ నుంచి ఆదాయం కూడా లభిస్తుంది.

సాంస్కృతిక పునరుద్ధరణ

సంకీర్తన మండళ్లు 15వ శతాబ్దం నుంచి ఉన్న సంప్రదాయ గీతాల సమూహాలు. ఈ సంప్రదాయాన్ని ఆధునిక అవసరాలకు అన్వయించి, పర్యావరణ పరిరక్షణలో ఉపయోగిస్తున్నారు. దీన్ని ఒక సాంస్కృతిక పునరుజ్జీవనంగా పరిగణించవచ్చు. అయితే, సంకీర్తన మండలి బృందాలలో సాధారణంగా పురుష గాయకులు, నృత్యకారులు ఉండేవారు. వీరు డ్రమ్స్ వాయించడం, మతపరమైన భక్తిపాటలు పాడేవారు. 'గ్రామాల్లోని పురుషులు ఫ్యాక్టరీలలో పని చేయడానికి హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వలస వెళ్లినప్పుడు సంకీర్తన మండళ్లు దాదాపుగా పనిచేయడం లేదు. మేం దానిని పునరుద్ధరించాలని నిర్ణయించుకున్నాం' అని ముర్గపహాడిలోని బృందానికి నాయకత్వం వహిస్తున్న 35 ఏళ్ల ప్రమీలా ప్రధాన్ చెప్పారు. ప్రధాన్ బృందంలో 17 మంది ఉండగా, వారిలో తొమ్మిదిమంది మహిళలు ఉన్నారు.

పురుషులు ఈ మండళ్ళను వదిలి వెళ్లాక, గ్రామీణ మహిళలు 'సంకీర్తన మండలి' అనే సంప్రదాయ సంగీత సమూహాన్ని మళ్లీ ప్రారంభించారు. ఈ గీతాలు దేవుని గురించి మాత్రమే కాక, ప్రకృతి పరిరక్షణ, అగ్నిప్రమాదాల నివారణ వంటి సామాజిక అంశాలను కూడా ప్రస్తావిస్తాయి. ఇది ఒకవైపు వారిని సాధికారతవైపుకు తీసుకెళ్తుండగా, మరోవైపు పర్యావరణాన్ని రక్షించడంలో సహాయపడుతోంది.

ఉపాధి గీతాలు

రాష్ట్రంలో దాదాపు 20,000 సంకీర్తన బృందాలు ఉండగా వాటిలో కనీసం 1,000 బృందాలు మహిళలే నిర్వహిస్తున్నారు. అటవీ మంటలు వారి ఆదాయాలను, పిల్లల పోషణను ప్రభావితం చేస్తున్నాయని మహిళలు అంటున్నారు. 'కుటుంబ పోషణ కోసం అడవిదుంపలు, ఆకుకూరలు, పుట్టగొడుగులను సేకరిస్తాం. పెద్ద అగ్నిప్రమాదం జరిగితే, ప్రభుత్వం నుంచి మాకు లభించే బియ్యంతోనే సరిపెట్టుకోవాలి. ఇప్పుడు సమాజానికి ఉపయోగపడేలా సంకీర్తన మండలిలో చేరినందుకు మాకు ఉపాధి కూడా లభిస్తోంది' అని 42 ఏళ్ల బాలమతి చెప్పారు.

కేతకి నాయక్‌కి 10 ఏళ్ల వయసులో పెళ్లి అయ్యింది. ఇప్పుడు ఆమెకు పాతికేళ్లు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 'నా చిన్నతనంలో పాటలు పాడేదాన్ని. పెళ్లయ్యాక నా నోరు మూతపడిపోయింది. ఇప్పుడు బృందంలో చేరి, ఊరంతా తిరిగి పాటలు పాడుతున్నాను. ప్రజలు నన్ను ఆశీర్వదిస్తున్నారు' అని ఆనందంగా చెబుతుంది.


ఇప్పుడు ఈ మండళ్ళలో యువతులు, విద్యార్థులు కూడా చేరి శిక్షణ తీసుకుంటున్నారు. దీని ద్వారా తరువాతి తరం అడవుల పరిరక్షణకు ఏం చేయగలరో నేర్చుకుంటున్నారు.

వంటిల్లు

ఊరించే..

ముస్లింలు జరుపుకునే ప్రధాన పండుగల్లో రెండోది బక్రీద్. ఇది త్యాగానికి ప్రతీక. దీనిని 'ఈదుల్ అజ్ హా' అని కూడా అంటారు. ఈ రోజు ప్రతి ముస్లిం తమ తాహతుకు తగ్గట్టుగా ఇరుగు పొరుగు వారికి ఖుర్బానీ ఇవ్వడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఏటా మంచి ఘుమ ఘుమలతో ఈ పండుగను జరుపుకుంటారు. అయితే ఈసారి బక్రీద్‌ను మరి కాస్త విభిన్న రుచులతో చేసుకుందాం ఇలా...

మొఘలాయ్ పాయ



కావలసినవి: మటన్ పాయ – ముప్పావు కేజీ, నూనె – నాలుగు టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయలు – ఆరు (సన్నగా తరగాలి), నల్లయాలుక్కాయలు – మూడు, సాధారణ యాలుక్కాయలు – మూడు, దాల్చిన చెక్క – రెండు అంగుళాల ముక్క, అనాసపువ్వు – రెండు, మిరియాలు – రెండు టీస్పూన్లు, జీలకర్ర – టేబుల్ స్పూను, లవంగాలు – ఐదు, అల్లంవెల్లుల్లి పేస్టు – రెండున్నర టేబుల్ స్పూన్లు, కారం – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా, పసుపు – అరటేబుల్ స్పూను, పచ్చిమిర్చి తరుగు – రెండు టీస్పూన్లు, కొత్తిమీర తరుగు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● కుకర్ గిన్నెలో నూనె వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నూనెలో ఉల్లిపాయ తరుగు వేసి చక్కగా వేయించాలి. ● వేగాక రెండురకాల యాలుక్కాయలు, దాల్చిన చెక్క, అనాసపువ్వు, మిరియాలు, లవంగాలు, జీలకర్ర వేసి మంచి వాసన వచ్చేంత వరకు వేయించాలి. ● ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్టు, శుభ్రంగా కడిగిన మటన్ పాయ వేసి కలిపి ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి. ● తరువాత కారం, ధనియాలపొడి, పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి ఐదునిమిషాలు ఉడికించాలి. ● ఇప్పుడు రెండు గ్లాసుల నీళ్లుపోసి మూతపెట్టి అరగంటపాటు సన్నని మంట మీద ఉడికించాలి. ● అరగంట తరువాత నూనె పైకి తేలినప్పుడు కొత్తిమీర, పచ్చిమిర్చి తరుగుతో గార్నిష్ చేసి దించేయాలి.

కాలా మటన్



కావలసినవి: మటన్ – ముప్పావు కేజీ, గ్రీన్ చట్నీ(పచ్చిమిర్చి, కొత్తిమీర, పుదీనా పేస్టు) – అరకప్పు, పసుపు – అరటీస్పూను, ఉప్పు – రుచికి సరిపడా, పెరుగు – కప్పు, ఉల్లిపాయ తరుగు – రెండు కప్పులు, నూనె – ఐదు టేబుల్ స్పూన్లు, ధనియాలు – టేబుల్ స్పూను, గసగసాలు – టేబుల్ స్పూను, యాలుక్కాయలు – నాలుగు, దాల్చిన చెక్క – అంగుళం ముక్క, లవంగాలు – ఐదు, మిరియాలు – ఐదు, సోంపు – టేబుల్ స్పూను, ఎండు మిర్చి – నాలుగు, ఎండుకొబ్బరి తురుము – అరకప్పు, బిర్యానీ ఆకు – ఒకటి, షాజీరా – టీస్పూను, వెల్లుల్లి తరుగు – రెండు టేబుల్ స్పూన్లు, అల్లం తరుగు – టేబుల్ స్పూను, బంగాళ దుంపలు – రెండు, చింతపండు గుజ్జు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● మటన్ ముక్కలను శుభ్రంగా కడిగి ఒక గిన్నెలో వేయాలి. దీనిలో పసుపు, రుచికి సరిపడా ఉప్పు, గ్రీన్ చట్నీ, పెరుగు వేసి కలిపి ఇరవైనిమిషాలు పక్కన పెట్టుకోవాలి. ● ఇరవై నిమిషాల తరువాత మటన్‌ను కుకర్‌లో వేయాలి. దీనిలో కొద్దిగా ఉల్లిపాయ తరుగు, కప్పు నీళ్లు పోసి ఒక విజిల్ వచ్చేంతవరకు పెద్దమంట మీద ఉడికించాలి. తరువాత సన్నని మంట మీద పదినిమిషాలు ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు స్టవ్ మీద బాణలి పెట్టి టేబుల్ స్పూన్ నూనె వేయాలి. వేడెక్కిన నూనెలో ధనియాలు, గసగసాలు, యాలుక్కాయలు, లవంగాలు, దాల్చిన చెక్క, మిరియాలు, సోంపు, ఎండు మిర్చి వేసి మంచి వాసన వచ్చేంత వరకు వేయించాలి. ●దీనిలో కొన్ని ఉల్లిపాయ ముక్కలు వేసి ముదురు బ్రౌన్ రంగు వచ్చేంతవరకు వేయించాలి. ఇప్పుడు ఎండుకొబ్బరి తురుము వేసి రంగు మారేంత వరకు వేయించి, చల్లారాక కొద్దిగా నీళ్లు పోసి పేస్టులా రుబ్బుకుని పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు స్టవ్ మీద మరో బాణలి పెట్టి మిగిలిన నూనె వేయాలి. నూనె వేడెక్కిన తరువాత బిర్యానీ ఆకు, షాజీరా వేసి నిమిషంపాటు వేయించాలి. ● తరువాత అల్లం, వెల్లుల్లి తరుగు, మిగిలిన ఉల్లిపాయ తరుగు వేసి లేత బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించాలి. ● ఇప్పుడు బంగాళ దుంపల్ని తొక్కతీసి ముక్కలు తరిగి వేసి, కొద్దిగా నీళ్లుపోసి మగ్గనివ్వాలి. ●దుంప ముక్కలు సగం ఉడికిన తరువాత ఉడికిన మటన్ మిశ్రమం వేయాలి. ● ఐదు నిమిషాల తరువాత మసాలా పేస్టు, రుచికి సరిపడా ఉప్పు వేసి పదినిమిషాలపాటు మగ్గనిచ్చి దించేయాలి.

రామ్‌పూరి తార్ కుర్మా



కావలసినవి: నెయ్యి – కప్పు, మటన్ – కేజీన్నర, అల్లం వెల్లుల్లి పేస్టు – రెండు టేబుల్ స్పూన్లు, కారం – రెండు టేబుల్ స్పూన్లు, బిర్యానీ ఆకులు – రెండు, పసుపు – అరటీస్పూను, గరం మసాలా పొడి – టేబుల్ స్పూను, వేయించిన ఉల్లిపాయ పేస్టు – పావు కప్పు, పెరుగు – ఆరు టేబుల్ స్పూన్లు, పాలు – కప్పు, ఫూల్ మఖనీ – నాలుగు టేబుల్ స్పూన్లు, కర్బూజా గింజలు – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా, మటన్ సూప్ – అరలీటర్, జీడిపప్పు – పది. **కుర్మా మసాలా:** యాలుక్కాయలు – పది, నల్ల యాలుక్కాయలు – రెండు, దాల్చిన చెక్క – అంగుళం ముక్క, జాపత్రి పొడి – పావు టీ స్పూన్, అనాసపువ్వు – రెండు, లవంగాలు – నాలుగు, షాజీరా – టీ స్పూను, ఎండుకొబ్బరి తురుము – టేబుల్ స్పూను, మిరియాలు – పది, కశ్మీరీ ఎండుమిర్చి – రెండు.

తయారీ: ● మటన్‌ను శుభ్రంగా కడిగి టేబుల్ స్పూను ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలిపి పక్కనబెట్టాలి. ● కర్బూజ గింజలు, ఫూల్ మఖనీలను అరకప్పు పాలలో నానబెట్టి, పేస్టు చేయాలి. ● కుర్మా మసాలా దినుసులన్నింటిని దోరగా వేయించి పొడిచేసి పక్కనపెట్టుకోవాలి. ● మందపాటి బాణలిని స్టవ్ మీద పెట్టి నెయ్యి వేసి, నెయ్యి వేడెక్కిన తరువాత బిర్యానీ ఆకు, కారం వేయాలి. ● ఆరని మిషం వేగాక మటన్ ముక్కలు, పసుపు, ఒకటిన్నర టేబుల్ స్పూన్లు ఉప్పు వేసి పదినిమిషాల పాటు ఉడికించాలి. ● తరువాత మంటను మీడియంకు తగ్గించి, కుర్మా మసాలా టీస్పూను పక్కన పెట్టి మిగతాది వేయాలి, ఉల్లిపాయ పేస్టు, ఫూల్ మఖనీ పేస్టు, పెరుగు కలిపి మూతపెట్టి మగ్గనివ్వాలి. ● ఇప్పుడు మటన్ సూప్, పావు కప్పు పాలు, రుచికి సరిపడా ఉప్పు వేసి సన్నని మంట మీద ముక్క మెత్తబడే వరకు ఉడికించాలి. ● చివరిగా కుర్మా మసాలా పొడి, జీడిపప్పు వేసి మగ్గనిచ్చి దించేయాలి.

లైఫ్@360

ఫుడ్ @ 60



ఆహారంలో ఈ మార్పులు తప్పనిసరి.. మీరు అరవై ఏళ్ల వయసు పైబడి ఉంటే ఆహారంలో ఈ విధమైన మార్పులు చేసుకోవాలి. ఏది తినడానికి మంచిది, ఏది తినకూడదో కూడా తెలుసుకొని ఆచరణలో పెట్టాలి.

వయసు పెరిగే కొద్దీ శరీర అవసరాలు కూడా మారుతాయి. ముఖ్యంగా 60 ఏళ్ల తర్వాత. మనసు తీపి, వేయించిన వంటకాలు వంటి వివిధ రకాల రుచుల వైపు ఆకర్షిస్తుంది. కానీ ఈ వయస్సులో, మీ ఆహారం శరీరానికి శక్తిని అందించేలా, జీర్ణక్రియను సులభతరం చేసేలా, రోజంతా మిమ్మల్ని శక్తివంతంగా, తేలికగా భావించేలా ఉండాలి. మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, మీరు మీ ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం. పోషకాహారం మిమ్మల్ని శారీరకంగా ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా మానసికంగా సంతోషంగా, శక్తివంతంగా ఉంచుతుంది.



వేపుళ్లకు దూరం...

60 ఏళ్ల తర్వాత శరీర జీర్ణశక్తి క్రమంగా తగ్గుతుంటుంది. ఈ స్థితిలో సమోసా, కచోరి, పూరీ, భజియా వంటి వేయించిన, భారీ ఆహార పదార్థాలను జీర్ణం చేసుకోవడం కష్టమవుతుంది. ఈ ఆహారం కడుపుపై ??భారంగా ఉండటమే కాకుండా గ్యాస్, ఆమ్లత్వం, అలసటను కూడా కలిగిస్తుంది. శరీరంలో నిరంతరం బరువుగా ఉన్నప్పుడు, నిద్ర, మానసిక స్థితి, శక్తి స్థాయిలు కూడా ప్రభావితమవుతాయి. వృద్ధులు ప్రతిసారీ టీతో పాటు క్రిస్పీ లేదా వేయించినవి ఏదైనా తినాలని కోరుకుంటారు. కానీ ఈ అలవాటు క్రమంగా హానికరంగా మారుతుంది.



సరైన ఎంపిక...

నూనెతో చేసిన ఆహారానికి బదులుగా జీలకర్ర, ఇంగువ చేర్చి కూరగాయలతో చేసిన తేలికపాటి సలాడ్స్ తినవచ్చు. ఇవి రుచికరంగా ఉండటమే కాకుండా, శరీరాన్ని తేలికగా, సమతుల్యంగా ఉంచుతాయి.

స్వీట్లు, పిండి పదార్థాలకు దూరం...

ఈ వయస్సులో స్వీట్లు, పిండితో చేసిన వస్తువులు స్లో పాయిజన్‌గా భావించాలి. బిస్కెట్లు, కేకులు, పిండితో చేసిన టోస్ట్, మిల్క్ కేక్, హల్వా లేదా పేడా వంటి స్వీట్లు రుచికరంగా కనిపిస్తాయి కానీ వాటిలో పోషకాలు ఏవీ ఉండవు. ఇవి రక్తంలో చక్కెరను త్వరగా పెంచుతాయి. మలబద్ధకానికి కారణమవుతాయి. దీర్ఘకాలంలో మధుమేహం, కీళ్ల నొప్పులు, అలసటకు దారితీస్తాయి. భోజనం తర్వాత స్వీట్లు తినడం మంచిదే అనిపిస్తుంది. కానీ ఇప్పుడు ఈ అలవాటు హానికరం కావచ్చు. ఈ అలవాటును పూర్తిగా తొలగించుకోకుండానే మనం మెరుగైన ప్రత్యామ్నాయాలను అందించగలం.

మంచి ఎంపిక...

స్వీట్లు తినాలపిస్తే భోజనం తర్వాత బెల్లం-నువ్వుల లడ్డు, రాగి లడ్డు, 1-2 ఖర్జూరం లేదా అర టీస్పూన్ గుల్కంద్ తినవచ్చు. కాలానుగుణంగా లభించే చిరు ధాన్యాలతో తయారు చేసిన రోటీలు, కూరగాయలతో శనగ పిండి టోస్ట్, నెయ్యితో పోహా కూడా మంచి ఎంపికలు.

చల్లని- పుల్లని పదార్థాలకు దూరం...

రోజువారీ భోజనంలో కారంగా ఉండే ఊరగాయలు, చల్లని పదార్థాలు, ప్యాక్ చేసిన పానీయాలను చేర్చడం ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. కానీ ఇది మీ శరీరంలో వాపు, అధిక రక్తపోటు, వాతం వంటి సమస్యలను పెంచుతుంది. మార్కెట్లో లభించే కారంగా, నూనెతో కూడిన ఊరగాయలలో అధిక సోడియం ఉంటుంది. ఇది శరీరంలో నీటిని నిలుపుకునేలా చేస్తుంది. రక్తపోటు అసమతుల్యతకు కారణమవుతుంది. అదేవిధంగా ఫ్రిజ్‌లో దీర్ఘకాలం ఉంచిన కోల్డ్ లస్సీ, కూల్ డ్రింక్స్, ప్యాక్డ్ జ్యూస్‌లు జీర్ణక్రియను దెబ్బతీస్తాయి. శరీరం పాడిబారడం, గ్యాస్, అలసటను కలిగిస్తాయి.

మంచి ప్రత్యామ్నాయాలు...

వీటికి బదులుగా తక్కువ నూనె, సుగంధ ద్రవ్యాలతో ఇంట్లో తయారుచేసిన నిమ్మకాయ లేదా గూస్బెర్రీ ఊరగాయ, పుదీనా-కొత్తిమీర చట్నీ, జీలకర్రతో మజ్జిగ లేదా వేడి సూప్ చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వేడి సూప్‌లు, ఉడికించిన కూరగాయలు, నిమ్మకాయ-పుదీనా నీరు లేదా మరిగించిన జీలకర్ర-కొత్తిమీర నీటిని పానీయంగా తీసుకోవడం వల్ల శరీరం చల్లబడుతుంది. జీర్ణక్రియ పనితీరు మెరుగ్గా ఉంటుంది.

కడుపు ఉబ్బరమా..?



కడుపు ఉబ్బరం చాలా మందిలో కనిపించే ఒక సాధారణ సమస్య. ఇది చాలా అసౌకర్యాన్ని కలిగిస్తుంది. క్రమంగా జీర్ణ సమస్యలు, మానసిక రుగ్మతలు, నిద్ర లేమి వంటి సమస్యలకు దారితీస్తుంది. సహజంగానే ఈ సమస్యను నివారించుకోవచ్చు.

ఎందుకు వస్తుంది?

కడుపులో ఏర్పడే కొన్నిరకాల రసాయనాల ద్వారా ఇలా జరుగుతుంది. సాధారణంగా కడుపు ఉబ్బరం అనేది మలబద్ధకం ద్వారా వస్తుంది. ఎలాంటి మందులు వాడకుండా కడుపు ఉబ్బరాన్ని కొన్ని యోగాసనాల ద్వారా తగ్గించుకోవచ్చు

కటి చక్రాసనం...

- పేరుకు తగ్గట్లుగానే ఈ ఆసనం వెన్నెముకకు సంబంధించినది. నేలపై నిల్చొని వీపును రెండు పక్కలా తిప్పుతూ ఉండాలి.
- ఈ సమయంలో చేతులను భుజాలకు రెండు వైపులా స్ట్రెచ్ చేస్తూ చాపాలి. ఇలా రెండువైపులా కనీసం 10 రౌండ్లు, 2 నిమిషాల వరకు చేయాలి.


సైడ్ యాంగిల్ పోజు: కాళ్లను స్ట్రెచ్ చేసి, ఒకవైపుగా వంగాలి. ఇంకో కాలును వెనక్కి చాపాలి. వంగిన కాలుమీద చేతిని ఉంచి మరో చేతిని నిటారుగా పైకి చూపిస్తూ, బాడీని వీలైనంత వరకు వంచాలి. మొదట్లో 15-20 సెకన్ల నుంచి ప్రారంభించి క్రమంగా 2 నిమిషాల వరకు చేయడం అలవాటు చేసుకోవాలి.

ఫ్రాగ్ పోజ్: ముందుగా వజ్రాసన భంగిమలో మీ కాళ్లను వెనుకకు మడిచి యోగా మ్యాట్‌పై కూర్చోవాలి. మీ చేతులను పిడికిలిగా చేసి, వాటిని ఉదరం దగ్గర పెట్టుకుని మెల్లగా ముందుకు వంగాలి. ఈ ఆసనం కూడా మొదట్లో 15-20 సెకన్ల నుంచి ప్రారంభించి క్రమంగా 2 నిమిషాల వరకు చేయాలి.

హెల్త్ టిప్స్



- సబ్జాగింజలను డైలీ ఆహారం తీసుకోవడం వల్ల మలబద్ధకం, రక్తపీడనం, అధిక బరువు సమస్యలు తగ్గుతాయి. నీరసంగా ఉన్నప్పుడు గింజలు వేసిన నీళ్లు తాగడం వల్ల నీరసం తగ్గి యాక్టివ్‌గా ఉంటారు. ఈ గింజల్లో ఉన్న క్యాల్షియం, మ్యాంగనీస్, ఫాస్పరస్‌లు ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. క్రమం తప్పకుండా సబ్జాగింజలను నానపెట్టుకుని తాగితే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరతాయి.



- శరీరం మీద దద్దుర్లు దురదతో బాధిస్తుంటే.. కొబ్బరి నూనెలో కొద్దిగా అలోవిరా జెల్ వేసి పేస్టులా కలిపి దద్దుర్ల పైన రాస్తే ఉపశమనం లభిస్తుంది.

సంతృప్తి సగం బలం

మనిషి జీవితంలో ముందుకు సాగాలంటే ప్రతికూల ఆలోచనలు వదిలి సానుకూల ఆలోచనలు చేయాలి. గొప్ప వ్యక్తుల జీవితాలు, ఆలోచనల నుంచి ప్రేరణ పొందవచ్చు. అలాంటి ఆలోచనలు జీవితంలో ముందుకు సాగడానికి ప్రతి ఒక్కరికీ సహాయపడతాయి. మహాభారతంలోని ముఖ్యమైన పాత్రలలో విదురుడు ఒకరు. మంచితనం, మేధస్సు, జ్ఞానం, కృష్ణ భక్తి వలన విదురుడు నేటికీ నీతి సూత్రాల రూపంలో జనుల గుండెల్లో నిలిచిపోయాడు. విదురుడు చెప్పిన విధానాలను విదుర నీతి అంటారు. విదురుడు ఎప్పుడూ అసంతృప్తిగా ఉండే వ్యక్తుల గురించి తన నీతి శాస్త్రంలో చెప్పాడు. వీరు ఎప్పుడూ దుఃఖపడుతూనే జీవితాన్ని గడిపేస్తారని అన్నారు.



అసూయ: విదురనీతి ప్రకారం ఇతరుల పురోగతిని చూసి అసూయపడే వ్యక్తి తన జీవితంలో ఎప్పుడూ విచారంగా ఉంటాడు. ఈ రకమైన గుణం అంటే అసూయ గుణం గల వ్యక్తులకు ఆత్మవిశ్వాసం తక్కువగా ఉంటుంది. అసూయాపరుడు అవతలి వ్యక్తిలో ప్రతికూల ఆలోచనలను కూడా పెంచుతాడు.

ద్వేషం: ద్వేషం లేదా అసహ్యం అనేది మిమ్మల్ని లోపలి నుంచి దహించి వేసే భావన. ఇతరుల పట్ల అకారణ ద్వేషం ఉన్న వ్యక్తి చివరికి ప్రతికూలతను, ఒంటరితనాన్ని ఎంచుకుంటాడు. అది తప్ప వీరికి మరేమీ మిగలదు. ఇతరులను ద్వేషించే వ్యక్తి తన దగ్గరి బంధువుల నుంచి కూడా దూరం అవుతాడు.

అసంతృప్తి: జీవితంలో సంతోషంగా ఉండాలంటే ఉన్నదానితో సంతృప్తి చెందాలి. విదుర నీతి ప్రకారం తనకి ఉన్న దానితో సంతృప్తి చెందని వ్యక్తి ఎల్లప్పుడూ అసంతృప్తిగా ఉంటాడు. అలాంటి వారు ఎప్పుడూ సంతోషంగా ఉండరు.

కోపం- అనుమానం...

కోపంగా ఉన్న వ్యక్తి జీవితంలో ఎప్పుడూ దుఃఖం ఉంటుందని విదురుడు అన్నాడు. అధికంగా కోపం తెచ్చుకునే వ్యక్తి జీవితంలో సంబంధాలపై ప్రభావం చూపిస్తుంది. సంబంధాలను కూడా పాడుచేస్తుంది. ఇంకా విదుర నీతిలో ప్రతి చిన్న విషయాన్ని అనుమానించి, తన జీవితాన్ని నిత్యం సందేహంతో గడిపే వ్యక్తి జీవితం దుఃఖంతోనే గడిచిపోతుందని చెప్పాడు.


ఇతరులపై ఆధారపడి ఉండటం: కష్టపడి పనిచేయడం ద్వారానే విజయం లభిస్తుంది. కష్టపడి పనిచేయడం మానేసి ఇతరులపై ఆధారపడే వ్యక్తికి సమాజంలో తగినంత గౌరవం లభించదు. అలాంటి వ్యక్తి ఎల్లప్పుడూ సంతోషంగా ఉండడు.

అందువల్ల ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని అసూయాద్వేషాలను పక్కకు నెట్టి సానుకూలతకు, సంతృప్తికే ఓటు వేద్దాం... జీవితాన్ని సంతోషంగా తీర్చిదిద్దుకుందాం.

> ద్వేషం లేదా అసహ్యం అనేది మిమ్మల్ని లోపలి నుంచి దహించి వేసే భావన. ఇతరుల పట్ల అకారణ ద్వేషం ఉన్న వ్యక్తి చివరికి ప్రతికూలతను, ఒంటరితనాన్ని ఎంచుకుంటాడు.

సాక్షి సినిమా

హరి హర వీరమల్లు వాయిదా



● పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన 'హరి హర వీరమల్లు' సినిమా విడుదల మరోసారి వాయిదా పడింది. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ కథానాయిక. నిర్మాత ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో మార్చి 28న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ తేదీకి పోస్ట్‌పోన్ చేసి, మే 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కానీ, ఆ తేదీకి కూడా విడుదల వాయిదా వేసి, జూన్ 12న రిలీజ్ చేయనున్నట్లు తెలిపింది చిత్రబృందం. ఈ మేరకు ప్రమోషన్స్ కూడా జోరుగా చేశారు. అయితే ఈ నెల 12న విడుదలని వాయిదా వేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించారు. కొత్త రిలీజ్ డేట్‌ని మాత్రం ప్రకటించలేదు. ''ఈ నెల 12న మీ ముందుకు ఈ సినిమాని తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలు చేస్తున్నాం. అయినప్పటికీ ఆ తేదీకి తీసుకురాలేకపోతున్నాం. అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాం. అందుకే మరికొంత సమయం తీసుకుంటున్నాం'' అని పేర్కొన్నారు మేకర్స్.

పెద్ద హీరోలు ఆలోచించాలి

- నిర్మాత బన్నీ వాసు



''సినిమా విడుదలైన 28 రోజుల్లోపే ఓటీటీకి ఇవ్వాలనే ట్రెండ్ కొనసాగితే రాబోయే నాలుగైదు సంవత్సరాల్లో 90 శాతం సింగిల్ స్క్రీన్ థియేటర్స్ మూతపడే ప్రమాదం ఉంది. ఈ విషయాన్ని పెద్ద హీరోలు కూడా ఆలోచించాలి'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలోని తాజా పరిస్థితులను ఉద్దేశించి 'ఎక్స్' వేదికగా ఆయన ఓ పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్ సారాంశం ఏంటంటే... ''ఎగ్జిబిటర్లు, నిర్మాతలు గ్రహించాల్సింది, కరెక్ట్ చేసుకోవాల్సింది పర్సంటేజీ విధానం కాదు. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించడం ఎలా అని. ఇప్పుడున్న అర్ధ రూపాయి వ్యాపారంలో నీది పావలా, నాది పావలా అని కొట్టుకోవడం కాదు... మునుపటిలా మన వ్యాపారాన్ని రూపాయికి ఎలా తీసుకెళ్లాలి అనేది ఆలోచించాలి. పెద్ద హీరోలు రెండు సంవత్సరాలకు ఒక సినిమా, మూడు సంవత్సరాలకు ఒక సినిమా చేస్తూ పోతే థియేటర్ల నుంచి ప్రేక్షకులు కూడా దూరమైపోతారు. ఈ రెండు మూడేళ్లల్లో చాలా మంది థియేటర్స్ ఓనర్స్ వాటిని నడపలేక మూసేస్తారు. సింగిల్ స్క్రీన్స్ మూతపడితే... కేవలం మల్టీప్లెక్సులే థియేటర్స్ అయితే... పెద్ద హీరోలందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే... మీ సినిమాకు థియేటర్స్ ద్వారా వచ్చే ఆదాయంలో కేవలం 43 శాతం మాత్రమే నిర్మాతలకు వెళుతుంది'' అన్నారు.

భాయ్... బాబా... ఓ అంతర్జాతీయ చిత్రం

● సౌదీ అరేబియన్ మూవీ '7 డాగ్స్'లో అతిథి పాత్రల్లో బాలీవుడ్ స్టార్స్



● సంజయ్ దత్, సల్మాన్ ఖాన్

''అదిరింది టీజర్... సల్మాన్ భాయ్ భలే ఉన్నాడు... సంజూ బాబా కూడా బాగున్నాడు'' అంటూ సల్మాన్ ఖాన్, సంజయ్ దత్‌ల అభిమానులు ఆనందపడిపోతున్నారు. శుక్రవారం విడుదలైన సౌదీ అరేబియన్ మూవీ '7 డాగ్స్' టీజర్‌లో సల్మాన్, సంజయ్‌ల లుక్స్‌ని ఇలా ప్రశంసించారు. ఈ బాలీవుడ్ స్టార్స్ ఇద్దరూ కలిసి నటిస్తున్న తొలి అంతర్జాతీయ చిత్రం ఇది. ఈ చిత్రానికి అదిల్ ఎల్ అరబీ, బిలాల్ ఫల్లాహ్ దర్శకత్వం వహిస్తున్నారు. అరబ్ స్టార్స్ కరీం అబ్దెల్ అజీజ్, అహ్మద్ ఎజ్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఇంటర్నేషనల్ క్రైమ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో సల్మాన్, సంజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తారు. టీజర్‌లో ఇద్దరి పాత్రల గురించిన విశేషాలను బయట పెట్టలేదు. సల్మాన్ విచిత్రమైన చూపులు చూస్తుండగా, తుపాకీ గురి పెట్టి, కోపంగా కనిపించారు సంజయ్ దత్.

కథేంటంటే... వార్తల్లో ఉన్న ప్రకారం... ఇంటర్‌పోల్ ఆఫీసర్ ఖలీద్ అల్ అజ్జాజీ చుట్టూ ఈ చిత్రం తిరుగుతుంది. రహస్య ప్రపంచ నేరాల సిండికేట్ అయిన '7 డాగ్స్'లోని ఉన్నత స్థాయి సభ్యుడు ఘాలీ అబు దావూద్‌ను ఈ అధికారి పట్టుకుంటాడు. ఓ ఏడాది తర్వాత ఆ సంస్థ తిరిగి పుంజుకుంటుంది. పింక్ లేడీ అనే కొత్త డ్రగ్‌ను రవాణా చేయడం ప్రారంభిస్తుంది. ఈ ముఠా గుట్టుని రట్టు చేయడానికి ఖలీద్ అయిష్టంగానే ఘాలీతో చేతులు కలుపుతాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అన్నదే కథ అని సమాచారం. ఈ ఏడాదే ఈ చిత్రం విడుదల కానుంది.

వినోదాల మిత్ర మండలి



● 'మిత్ర మండలి' పోస్టర్

ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిన నిహారిక ఎన్ఎం 'మిత్ర మండలి'తో తెలుగులో హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్. దర్శకత్వంలో బన్నీ వాసు బీవీ వర్క్స్ సమర్పణలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''స్నేహం ప్రధానంగా నడిచే కథ 'మిత్ర మండలి'. ప్రేక్షకులకు అపరిమిత వినోదాన్నివ్వడానికి ఈ గ్యాంగ్ సిద్ధమవుతోంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్ఆర్. ధృవన్, కెమేరా: సిద్దార్థ్ ఎస్.జె, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజీవ్ కుమార్ రామా, సహ నిర్మాత: సోమరాజు పెన్మెత్స.

వృక్షో రక్షతి రక్షితః



● నాగ దుర్గ

రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, నాగదుర్గ, మహేంద్రనాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కలివి వనం'. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రాజ్ నరేంద్ర మాట్లాడుతూ-''వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. ఈ సందేశాన్నిస్తూ తీసిన సినిమా 'కలివి వనం'. వర్షం ఆకాశం నుంచి వస్తుందని పిల్లలకు చెబుతాం. కాదు చెట్ల వల్లే వర్షం వస్తుందని నేర్పించాలి. అప్పుడే చెట్ల విలువ బాల్యం నుంచి పిల్లలు తెలుసుకుంటారు. కోటి మొక్కలు నాటిన వనజీవి రామయ్య, తన 70 ఎకరాల సొంత భూమిలో మొక్కలు నాటి అడవిగా మార్చిన దుశ్చర్ల సత్యనారాయణ గార్ల స్ఫూర్తితోనే ఈ చిత్రాన్ని రూపొందించాను'' అన్నారు. ''ఒక చిన్న ఐడియాగా మొదలైన ఈ మూవీ ఈ రోజు ఇంత బాగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండటం సంతోషంగా ఉంది'' అన్నారు మల్లికార్జున్ రెడ్డి. ''నటీనటులు, సాంకేతిక నిపుణుల సపోర్ట్‌తో ఒక మంచి చిత్రాన్ని మీ ముందుకు తీసుకు వస్తున్నాం'' అని విష్ణువర్ధన్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో దుశ్చర్ల సత్యనారాయణ, మ్యూజిక్ డైరెక్టర్ మదీన్ ఎస్.కె, జర్నలిస్ట్ లక్ష్మీ నారాయణ, పాటల రచయిత తిరుపతి మాట్ల, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాఘవ తదితరులు మాట్లాడారు.



● నాగచైతన్య, శోభిత, జైనబ్, అఖిల్, అమల, నాగార్జున

మా కల నిజమైంది

- నాగార్జున

ఏడడుగులు వేసిన అఖిల్-జైనబ్



హీరో అఖిల్ అక్కినేని, థియేటర్ ఆర్టిస్ట్ జైనబ్ రవ్జీ ఏడడుగుల బంధంతో ఒక్కటయ్యారు. 2024 నవంబరులో అఖిల్-జైనబ్‌ల నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లోని అక్కినేని నాగార్జున నివాసంలో శుక్రవారం తెల్లవారుజామున 3:35 గంటలకు వీరి వివాహ వేడుక జరిగింది. ఈ పెళ్లికి ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు, బంధువులు హాజరయ్యారు. సినిమా ఇండస్ట్రీ నుంచి చిరంజీవి-సురేఖ, రామ్‌చరణ్-ఉపాసన దంపతులు, దర్శకుడు ప్రశాంత్ నీల్, హీరోలు సుమంత్, శర్వానంద్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరై, నూతన వధూవరులకు శుభాకాంక్షలు అందజేశారు. పెళ్లి అనంతరం జరిగిన బరాత్‌లో అఖిల్ సోదరుడు, హీరో నాగచైతన్య హుషారుగా సందడి చేశారు. ఈ వివాహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ''మా ప్రియమైన కొడుకు అఖిల్ తన ప్రియమైన జైనబ్‌ను వివాహం చేసుకున్నాడు. మా ఇంట్లో తెల్లవారుజామున 3:35 గంటలకు ఈ వివాహం జరిగింది. ఈ విషయాన్ని నేను, అమల ఎంతో ఆనందంగా పంచుకుంటున్నాం. అందరి ప్రేమ, చిరునవ్వులు... ఇలా మాకు అత్యంత ప్రియమైన వారి మధ్య మా కల నిజమవడాన్ని చూసి, ఆనందపడ్డాం. అఖిల్-జైనబ్‌ల ఈ కొత్త ప్రయాణానికి మీ అందరి ఆశీర్వాదాలు కావాలి'' అంటూ నాగార్జున 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ఇదిలా ఉంటే... ఈ నెల 8న హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో అఖిల్, జైనబ్‌ల రిసెప్షన్ జరగనుంది. ఈ వేడుకకి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు హాజరు కానున్నారు.

ప్రేమకథలు షురూ



● యం.యస్.వి. సాగర్

గీతా సింగ్, కార్తీక్, కాశీ మదన్, ఇషాని, చలానా అగ్నిహోత్రి, శ్రుతీలయ ముఖ్య తారలుగా 'బ్యాచిలర్స్ ప్రేమ కథలు' చిత్రం ఆరంభమైంది. యం.యస్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో ఎస్ఎమ్ 4 ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ ప్రారంభోత్సవానికి అతిథులుగా హాజరైన దర్శకుడు వి. సముద్ర కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ క్లాప్ ఇచ్చారు. అనంతరం చిత్ర దర్శక-నిర్మాత సాగర్ మాట్లాడుతూ- ''నేను తీసిన 'కాలం రాసిన కథలు' సినిమాకు మంచి స్పందన వచ్చింది. ఆ ఉత్సాహంతో ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'బ్యాచిలర్స్ ప్రేమకథలు' తీస్తున్నాను. ఈ సినిమా ద్వారా మంచి సందేశం ఇవ్వబోతున్నాను. నూతన నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి కెమేరా: ప్రసాద్ .ఎస్, సంగీతం: మెరుగు అరమాన్.

స్టాక్ మార్కెట్లు
(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
747	252
82,189	25,003

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,531	▲	232
డోజోన్స్	42,664	▲	344
ఎఫ్‌టీఎస్ఈ 100	8,838	▲	27
డాక్స్	24,304	▼	19
షాంఘై	3,385	▲	1
నికాయ్	37,742	▲	187

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ	83.79	87.47
£	బ్రిటన్ పౌండ్	భారతీయ	113.43	118.35
€	యూరో	భారతీయ	95.38	99.86
¥	జపాన్ యెన్ (100)	భారతీయ	48.10	70.11
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ	53.22	58.06
S$	సింగపూర్ డాలర్	భారతీయ	64.09	68.79
SAR	సౌదీ రియాల్	భారతీయ	21.94	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	22.42	24.20
¥	చైనా యువాన్	భారతీయ	11.03	12.86

ఈఎంఐ.. ఇంకా తగ్గేనోయ్



అంతటా అనిశ్చితి నెలకొన్న తరుణంలో వృద్ధికి ఊతమిచ్చే దిశగా మరిన్ని చర్యలకు ఆర్‌బీఐ ఉపక్రమించింది. ధరలు కాస్త అదుపులో ఉంటున్న నేపథ్యంలో కీలక రెపో రేటులో ఏకంగా అర శాతం కోత పెట్టి 5.5 శాతానికి తగ్గించింది. దీంతో గృహ, వాహన, ఇతరత్రా రుణాలపై వడ్డీ రేట్లు తగ్గనున్నాయి. అలాగే, ఇప్పటికే రుణాలు తీసుకున్న వారికి ఈఎంఐల భారం నుంచి మరికొస్త ఉపశమనం లభించనుంది. ఇక నగదు నిల్వల నిష్పత్తిని తగ్గించడంతో బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యత పెరిగి, ఎకానమీకి బూస్టర్‌లాగా పని చేయనుంది. రిజర్వ్ బ్యాంక్ నిర్ణయాన్ని పరిశ్రమ వర్గాలు స్వాగతించాయి. అటు మార్కెట్లు కూడా జోరుగా పరుగులు తీశాయి.

- గృహ, వాహన రుణాలు మరింత చౌక
- వృద్ధికి ఊతమిచ్చే దిశగా ఆర్‌బీఐ చర్యలు
- రెపోలో 0.5% కోత
- 5.5 శాతానికి రేటు
- సీఆర్‌ఆర్ 1% తగ్గింపు
- బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ. 2.5 లక్షల కోట్లు

ముంబై: కీలక పాలసీ రేట్ల కోత ఊహిస్తున్నదే అయినా రిజర్వ్ బ్యాంక్ అందరినీ ఆశ్చర్యపరిచింది. పావు శాతం తగ్గింపు ఉండొచ్చని భావిస్తుండగా.. శుక్రవారం ఏకంగా అరశాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో కీలకమైన రెపో రేటు 5.5 శాతానికి దిగి వచ్చింది. 2020 మే తర్వాత మళ్లీ ఈ ఏడాది ఫిబ్రవరిలో మొదటిసారిగా ఆర్‌బీఐ పాలసీ రేటును తగ్గించింది. ఆ తర్వాత ఏప్రిల్‌లో కూడా కోతను పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది ఇప్పటివరకు మూడు విడతల్లో మొత్తం దీన్ని 100 బేసిస్ పాయింట్ల (ఒక్క శాతం) మేర తగ్గించినట్లయింది. ఇక బ్యాంకులకు నగదు నిల్వల నిష్పత్తిని (సీఆర్‌ఆర్) 100 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఇది 3 శాతానికి చేరింది. ఇప్పటికే మిగులు నిధులున్న బ్యాంకింగ్ వ్యవస్థలోకి దీనితో మరో రూ. 2.5 లక్షల కోట్లు అదనంగా వచ్చి చేరనున్నాయి. సీఆర్‌ఆర్ కోత సెప్టెంబర్–డిసెంబర్ మధ్య నాలుగు విడతలుగా అమల్లోకి వస్తుంది. మరోవైపు, రూ. 2.5 లక్షల లోపు పసిడి రుణాలపై లోన్–టు–వేల్యూ (ఎల్‌టీవీ) నిష్పత్తిని ప్రస్తుతమున్న 75 శాతం నుంచి 85 శాతానికి ఆర్‌బీఐ పెంచింది.

బుధవారం నుంచి మూడు రోజులు పాటు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సారథ్యంలో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానాన్ని సమీక్షించిన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంది. పాలసీ రేటును అర శాతం తగ్గించే ప్రతిపాదనకు అనుకూలంగా అయిదుగురు ఓటేశారు. 'ఉదార' విధానం నుంచి 'తటస్థ' విధానానికి పాలసీని మారుస్తున్నట్లు ఆర్‌బీఐ పేర్కొంది. అంటే, రెపో రేటును తగ్గించడానికే పరిమితం కాకుండా భవిష్యత్తులో వచ్చే డేటాను బట్టి పెంచడం, తగ్గించడంపై నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించింది.

రెపో తగ్గితే..

బ్యాంకులకు ఇచ్చే నిధులపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీ రేటును రెపో రేటుగా వ్యవహరిస్తారు. ఈ రేటును తగ్గిస్తే దీనితో అనుసంధానమైన ప్రామాణిక రుణ రేట్లు (ఈబీఎల్‌ఆర్) తగ్గుతాయి. బ్యాంకులు ఈ ప్రయోజనాన్ని పూర్తిగా కస్టమర్లకు బదలాయిస్తే గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై నెలవారీ వాయిదాల (ఈఎంఐ) భారం అర శాతం మేర తగ్గుతుంది. అయితే, రేట్ల కోతతో రుణగ్రహీతలకు భారం తగ్గనున్నప్పటికీ.. డిపాజిట్ రేట్లు కూడా తగ్గడం వల్ల డిపాజిటర్లపై ప్రతికూల ప్రభావం పడనుంది.

వృద్ధికి దన్ను..

ఓవైపు ఆరు నెలలుగా ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గుముఖం పట్టి లక్షిత స్థాయి కన్నా దిగువకు రావడం, మరోవైపు సర్వత్రా అనిశ్చితి నెలకొని వృద్ధి నెమ్మదించడం వంటి అంశాల నేపథ్యంలో రేట్ల కోత నిర్ణయం తీసుకున్నట్లు సంజయ్ మల్హోత్రా చెప్పారు. "వృద్ధికి దోహదపడేలా పాలసీ రేట్లను ఉపయోగించి దేశీయంగా ప్రైవేట్ వినియోగం, పెట్టుబడులకు ఊతమిచ్చే ప్రక్రియను కొనసాగించాల్సిన అవసరం నెలకొంది" అని ఆయన తెలిపారు. 7–8 శాతం స్థాయిలో అధిక వృద్ధి ఆకాంక్ష సాధన దిశగా తీసుకున్న చర్యగా మానిటరీ పాలసీని చూడాలని మల్హోత్రా వివరించారు.

మా పని మేము చేశాం ..



ఫిబ్రవరి నుంచి 100 బేసిస్ పాయింట్ల స్థాయిలో వేగంగా రెపో రేటును తగ్గించాం. ప్రస్తుత పరిస్థితుల్లో పాలసీ రేటును ఉపయోగించి వృద్ధికి ఊతమిచ్చేలా మరిన్ని చర్యలను తీసుకునేందుకు అవకాశాలు ఇక పరిమితంగానే ఉన్నాయి. నా విధులను నిర్వర్తించడాన్ని నేను విశ్వసిస్తాను. మేము మా వంతుగా చేయాల్సింది చేసాం. ఇక మిగతావారు తమ వంతుగా చేయాల్సినది చేస్తారని ఆశిస్తున్నాం.

– సంజయ్ మల్హోత్రా, గవర్నర్, ఆర్‌బీఐ

ఆశ్చర్యపర్చింది..



ఎంపీసీ నిర్ణయం చాలా వినూత్నంగా, ఎవరూ ఊహించని విధంగా ఆశ్చర్యపర్చింది. ఎకానమీలో అన్ని రంగాలకు, ముఖ్యంగా బ్యాంకింగ్.. ఫైనాన్స్‌కు ఇది కచ్చితంగా సానుకూలాంశం.

– సీఎస్ శెట్టి, చైర్మన్, ఎస్‌బీఐ

హౌసింగ్ మెరుగవుతుంది..



ఈఎంఐల భారం తగ్గడం వల్ల కొనుగోలుదారుల సెంటిమెంట్ మెరుగుపడుతుంది. మొదటిసారి కొనుగోలు చేసే వారు తగిన నిర్ణయం తీసుకునేందుకు దోహదపడుతుంది.

– శేఖర్ జి.పటేల్, ప్రెసిడెంట్, క్రెడాయ్

వృద్ధికి ఊతమిస్తుంది..



లిక్విడిటీ పెరగడం, రుణాలపై వడ్డీ రేట్లు తగ్గడం వినియోగానికి ఊతమిస్తుంది. పెట్టుబడులకూ దోహదపడుతుంది.

– రాజీవ్ సబర్వాల్, ఎండీ, టాటా క్యాపిటల్

ఆటో రంగానికి సానుకూలం



"రెపో రేటును తగ్గించడంతో మరింత తక్కువ వడ్డీ రేటుకే రుణాలు లభిస్తాయి ఆటో పరిశ్రమకు ఇది సానుకూలం.

– శైలేష్ చంద్ర, ప్రెసిడెంట్, సియామ్

మార్కెట్లకు ఆర్‌బీఐ పుష్

ఆర్‌బీఐ కీలక వడ్డీరేటు రెపోను అంచనాలకు మించి 0.5 శాతం తగ్గించడం, నగదు నిల్వల నిష్పత్తిలోనూ ఒక శాతం కోత పెట్టడం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది.

- సెన్సెక్స్ @ 82,000,
- 747 పాయింట్లు అప్
- నిఫ్టీ @ 25,000
- 252 పాయింట్లు ప్లస్

ముంబై: తొలుత అటూఇటుగా ప్రారంభమైన ప్రధాన ఇండెక్సులకు రేట్ల కోత ప్రకటనతో జోష్‌వచ్చింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇవ్వడంతో సెన్సెక్స్ 82,000 పాయింట్లు, నిఫ్టీ 25,000 పాయింట్ల మైలురాళ్లను మళ్లీ అధిగమించాయి. వెరసి సెన్సెక్స్ 747 పాయింట్లు ఎగసి 82,189 వద్ద ముగిసింది. నిఫ్టీ 252 పాయింట్లు బలపడి 25,003 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 858 పాయింట్లు జంప్ చేసి 82,300కు చేరడం గమనార్హం.!



రియల్టీ భళా

ఎన్‌ఎస్‌ఈలో రియల్టీ అత్యధికంగా 5 శాతం ఎగసింది. మెటల్, ప్రయివేట్ బ్యాంక్, ఆటో, కన్జూమర్ డ్యూరబుల్స్ 2–1.3 శాతం మధ్య పుంజుకున్నాయి. నిఫ్టీ దిగ్గజాలలో శ్రీరామ్, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ, యాక్సిస్, మారుతీ, ఇండస్‌ఇండ్, హీరోమోటో, బజాజ్ ఫిన్, డాక్టర్ రెడ్డీస్, ఎంఅండ్ఎం, ఎటర్నల్, టాటా స్టీల్, హిందాల్కో, టైటన్, హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ బ్యాంక్ 5.5–1.5 శాతం మధ్య జంప్‌చేశాయి. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బీఈఎల్, ఎయిర్‌టెల్ 1–0.5 శాతం మధ్య డీలాపడ్డాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 1–0.5 శాతం చొప్పున పుంజుకున్నాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 1,010 కోట్లు, దేశీ ఫండ్స్ రూ. 9,342 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశాయి.

ఇండస్‌ఇండ్ ఓకే

అవకతవకలకు బాధ్యతవహిస్తూ ఎండీ, సీఈవో సుమంత్ కత్పాలియా రాజీనామా చేయడం తగిన చర్యగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అంతేకాకుండా వీటిపై నిబంధనలకు అనుగుణమైన చర్యలు చేపట్టడంతో ప్రస్తుతం ఇండస్‌ఇండ్ సక్రమంగానే పనిచేస్తున్నట్లు ప్రస్తావించారు.

హౌసింగ్ బూస్ట్

వడ్డీ రేట్ల కోతతో ప్రధానంగా హౌసింగ్ లబ్ధి పొందనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రియల్టీ షేర్లు లాభాల దౌడు తీశాయి. ఎన్‌ఎస్‌ఈలో గోద్రెజ్ ప్రాపర్టీస్, సన్‌టెక్, డీఎల్‌ఎఫ్, ఒబెరాయ్ రియల్టీ, కోల్టేపాటిల్, పుర్వంకారా, ప్రెస్టీజ్ ఎస్టేట్, శోభా, లోధా, ఫీనిక్స్, సిగ్నేచర్ గ్లోబల్ 6–3 % మధ్య జంప్‌చేశాయి.

స్టార్‌లింక్ శాట్‌కామ్ సేవలకు లైసెన్సు

న్యూఢిల్లీ: అమెరికన్ దిగ్గజం ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ భారత్‌లో శాటిలైట్ కమ్యూనికేషన్ సర్వీసులు అందించే దిశగా మరో అడుగు ముందుకు పడింది. దేశీయంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు కంపెనీకి టెలికం శాఖ లైసెన్సు మంజూరు చేసింది. దీంతో యూటెల్‌శాట్ వన్‌వెబ్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్ తర్వాత శాట్‌కామ్ లైసెన్సు పొందిన మూడో కంపెనీగా స్టార్‌లింక్ నిల్చింది. అమెజాన్‌కి చెందిన క్విపర్ ఇంకా అనుమతుల కోసం ఎదురు చూస్తోంది. స్టార్‌లింక్ దరఖాస్తు చేసుకున్న 15–20 రోజుల్లో ట్రయల్ స్పెక్ట్రం మంజూరు అవుతుందని టెలికం శాఖ వర్గాలు తెలిపాయి.



కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

7-6-2025	
విశాఖ	535-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530-00
వరంగల్	532-00
రిటైల్ ధర	5.90

సాక్షి స్పోర్ట్స్



సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి

ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత పోరాటం ముగిసింది. జకార్తాలో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీకి ఓటమి ఎదురైంది. ప్రపంచ ఏడో ర్యాంక్ ద్వయం మాన్ వె చోంగ్-టీ కాయ్ వున్ (మలేసియా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 22వ ర్యాంక్ జోడీ సాత్విక్-చిరాగ్ 19-21, 16-21తో ఓటమి పాలైంది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సాత్విక్-చిరాగ్ జోడీకి 9,062 డాలర్ల (రూ. 7 లక్షల 77 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. గతంలో మాన్ వె చోంగ్-టీ కాయ్ వున్‌లతో పోటీపడ్డ నాలుగుసార్లూ విజయం సాధించిన సాత్విక్-చిరాగ్ ద్వయం ఐదో ప్రయత్నంలో మాత్రం ఓటమిని మూటగట్టుకోవడం గమనార్హం.

ఫైనల్లో అల్‌కరాజ్

కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు విజయం దూరంలో స్పెయిన్ స్టార్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ 4-6, 7-6 (7/3), 6-0, 2-0తో ఎనిమిదో సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై గెలుపొందాడు. నాలుగో సెట్‌లో అల్‌కరాజ్ 2-0తో ఆధిక్యంలో ఉన్న దశలో గాయం కారణంగా ముసెట్టి వైదొలిగాడు. 2 గంటల 25 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్‌కు తొలి రెండు సెట్‌లలో ఊహించని ప్రతిఘటన ఎదురైంది. తొలి సెట్‌ను కోల్పోయిన అల్‌కరాజ్ రెండో సెట్‌ను టైబ్రేక్‌లో గెలిచి పుంజుకున్నాడు. మూడో సెట్‌లో ముసెట్టి ఒక్క గేమ్ కూడా నెగ్గలేకపోయాడు. నాలుగో సెట్‌లో రెండు గేమ్‌లు ముగిశాక ముసెట్టి తొడ కండరాల గాయంతో ఆటను కొనసాగించలేనని చైర్ అంపైర్‌కు తెలపడంతో మ్యాచ్‌ను నిలిపివేసి అల్‌కరాజ్‌ను విజేతగా ప్రకటించారు. దాంతో 22 ఏళ్ల అల్‌కరాజ్ తన కెరీర్‌లో ఐదోసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోకి ప్రవేశించాడు. గతంలో ఆడిన నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల ఫైనల్స్‌లో (2022 యూఎస్ ఓపెన్; 2023, 2024 వింబుల్డన్; 2024 ఫ్రెంచ్ ఓపెన్) అల్‌కరాజే గెలుపొందడం విశేషం. సినెర్ (ఇటలీ), జొకోవిచ్ (సెర్బియా) మధ్య రెండో సెమీఫైనల్ విజేతతో ఆదివారం ఫైనల్లో అల్‌కరాజ్ తలపడతాడు. శనివారం మహిళల సింగిల్స్ ఫైనల్ జరగనుంది. ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్), ప్రపంచ రెండో ర్యాంకర్ కోకో గాఫ్ (అమెరికా) టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నారు. సబలెంకా తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరుకోగా ... 2022లో రన్నరప్‌గా నిలిచిన కోకో గాఫ్ రెండోసారి టైటిల్ పోరుకు అర్హత పొందింది.



శుక్రవారం ఉదయం లండన్ బయలుదేరేముందు భారత ఆటగాళ్లు

రాహుల్ సూపర్ సెంచరీ

- భారత్ 'ఎ'తొలి ఇన్నింగ్స్ 319/7
- ఇంగ్లండ్ లయన్స్‌తో రెండో అనధికారిక టెస్టు

నార్తంప్టన్: ఇంగ్లండ్‌తో ప్రతిష్టాత్మక టెస్టు సిరీస్‌కు ముందు భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ సత్తా చాటాడు. ఇంగ్లండ్ లయన్స్ జట్టుతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఎ'జట్టు తరఫున బరిలోకి దిగిన రాహుల్ (168 బంతుల్లో 116; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో విజృంభించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలకగా... జట్టులో అందరికంటే అనుభవజ్ఞుడైన రాహుల్‌కు ఈ మ్యాచ్ ద్వారా చక్కటి ప్రాక్టీస్ లభించింది. ఫలితంగా శుక్రవారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 'ఎ'జట్టు 83 ఓవర్లలో 7 వికెట్లకు 319 పరుగులు చేసింది. వికెట్ కీపర్ ధ్రువ్ జురేల్ (87 బంతుల్లో 52; 7 ఫోర్లు) అర్ధశతకం సాధించగా... గత మ్యాచ్‌లో డబుల్ సెంచరీతో చెలరేగిన కరుణ్ నాయర్ (71 బంతుల్లో 40; 4 ఫోర్లు), ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (57 బంతుల్లో 34; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (13 బంతుల్లో 11; 2 ఫోర్లు), ఓపెనర్ యశస్వి జైస్వాల్ (26 బంతుల్లో 17; 2 ఫోర్లు), శార్దుల్ ఠాకూర్ (34 బంతుల్లో 19; 3 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోయారు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన రాహుల్... నాయర్‌తో మూడో వికెట్‌కు 86 పరుగులు, ధ్రువ్ జురేల్‌తో నాలుగో వికెట్‌కు 121 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో చక్కటి ఆటతీరు కనబర్చి అభిమానుల అంచనాలను అందుకున్నాడు. తనుశ్ కొటియాన్ (5 బ్యాటింగ్), అన్షుల్ కంబోజ్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ 3, జార్జ్ హిల్ 2 వికెట్లు పడగొట్టారు.

ఇంగ్లండ్ బయలుదేరిన గిల్ బృందం

మరోవైపు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్న 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం భారత జట్టు శుక్రవారం ఉదయం ఇంగ్లండ్ బయలుదేరింది. ఈ సిరీస్‌కు ఎంపికైన పలువురు ఆటగాళ్లు ఇప్పటికే ఇంగ్లండ్‌కు చేరుకోగా... తాజాగా కెప్టెన్ శుబ్‌మన్ గిల్, రిషభ్ పంత్, మొహమ్మద్ సిరాజ్, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, ప్రసిధ్ కృష్ణ ఇంగ్లండ్‌కు వెళ్లారు. అనధికారిక టెస్టుల్లో పాల్గొనని వీరంతా ప్రాక్టీస్ అనంతరం భారత్ 'ఎ'జట్టుతో సన్నాహక మ్యాచ్ ఆడనున్నారు.



కేఎల్ రాహుల్

పీయూష్ చావ్లా వీడ్కోలు

అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ పలికిన భారత స్పిన్నర్



న్యూఢిల్లీ: భారత సీనియర్ లెగ్‌స్పిన్నర్ పీయూష్ చావ్లా... ఆటలోని అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికాడు. రెండు ప్రపంచకప్‌లు గెలిచిన జట్టులో సభ్యుడైన పీయూష్ చావ్లా శుక్రవారం సామాజిక మాధ్యమాల వేదికగా రిటైర్మెంట్ ప్రకటించాడు. రెండు దశాబ్దాలకు పైగా ఆటతో అనుబంధం కొనసాగించిన 36 ఏళ్ల చావ్లా... ఇకపై కొత్త ప్రయాణాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించాడు. 2006 నుంచి 2012 మధ్య మూడు ఫార్మాట్లలో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన పీయూష్... 3 టెస్టుల్లో 7 వికెట్లు, 25 వన్డేల్లో 32 వికెట్లు, 7 టి20ల్లో 4 వికెట్లు పడగొట్టాడు. 2007లో భారత జట్టు తొలిసారి టి20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడైన చావ్లా... 2011 వన్డే ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ లోనూ తుది జట్టులో చోటు దక్కించుకోకుండానే ప్రపంచ చాంపియన్ అనిపించుకున్నాడు. ఐపీఎల్‌లో నాలుగు (పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్) జట్లకు ప్రాతినిధ్యం వహించిన చావ్లా 192 వికెట్లు పడగొట్టాడు. 2014 సీజన్‌లో కోల్‌కతా ట్రోఫీ చేజిక్కించుకున్న సమయంలో చివర్లో చావ్లా విన్నింగ్ షాట్ కొట్టాడు. పుష్కరకాలం క్రితమే జాతీయ జట్టుకు దూరమైన చావ్లా... గతేడాది వరకు దేశవాళీల్లో ఆడాడు. ప్రస్తుతం వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న పీయూష్... రిటైర్మెంట్ సందర్భంగా కెరీర్‌లో సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపాడు. 'రెండు దశాబ్దాలకు పైగా మైదానంలో గడిపిన తర్వాత ఇక వీడ్కోలు పలికే సమయం వచ్చేసింది. ఆట నాలో భాగమైంది. ఇక్కడ నేర్చుకున్న క్రమశిక్షణ, స్ఫూర్తితో జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తా. అంతర్జాతీయ స్థాయిలో టీమిండియాకు ప్రాతినిధ్యం వహించడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. అందులోనూ 2007 టి20, 2011 వన్డే ప్రపంచకప్‌లో గెలిచిన జట్లలో భాగస్వామిని కావడం మరింత ప్రత్యేకం. ఈ ప్రయాణంలో ప్రతి క్షణాన్ని ఆస్వాదించా. ఆ జ్ఞాపకాలెప్పుడూ నాతోనే ఉంటాయి. నాపై నమ్మకముంచిన ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ధన్యవాదాలు. ఈ లీగ్ నా కెరీర్‌ను ఎంతగానో మార్చింది' అని చావ్లా ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు.



సచిన్ టెండూల్కర్, యూసుఫ్ పఠాన్, గౌతమ్ గంభీర్‌లతో కలిసి 2011 వన్డే వరల్డ్‌కప్ ట్రోఫీతో పీయూష్ చావ్లా (ఫైల్)

ఆర్‌సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ అరెస్టు

ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీకి చెందిన మరో ముగ్గురు కూడా



సాక్షి, బెంగళూరు: ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ట్రోఫీ గెలవడాన్ని పురస్కరించుకొని నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆర్‌సీబీ ఫ్రాంచైజీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సోసాలే, ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీకి చెందిన సునీల్ మాథ్యూ, కిరణ్ కుమార్, సుమంత్‌లను శుక్రవారం బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు బెంగళూరు కొత్త పోలీస్ కమిషనర్ సీమాంత్ కుమార్ సింగ్ వివరాలు వెల్లడించారు. 'ఘటనతో సంబంధం ఉన్న పలువురిని అరెస్ట్ చేశాం. ఈ కేసును మా బృందం తీవ్రంగా పరిగణిస్తోంది. కేసు సీఐడీకి అప్పగించేందుకు ముందు సేకరించాల్సిన వివరాలను వేగంగా చేస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది అభిమానులు మృతి చెందగా... 50 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ కేసును సీఐడీకి అప్పగించగా... బెంగళూరు పోలీసులు, క్రైమ్ బ్రాంచ్ కలిసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారికి వైద్య చికిత్సల అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు. మరోవైపు తొక్కిసలాట ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) స్పష్టం చేసింది. ఇది కేవలం కర్ణాటక ప్రభుత్వం ఆర్‌సీబీ యాజమాన్యం, ఈవెంట్ నిర్వాహకుల తీరు వల్లే జరిగిందని పేర్కొంది. ఈ ప్రమాదంలో కేఎస్‌సీఏపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంతో... దాన్ని రద్దు చేయాలని కోరుతూ సంఘం కర్ణాటక హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం... ఎఫ్‌ఐఆర్ లో పేర్కొన్న వివరాలను ఆధారంగా చేసుకొని కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ అధికారులపై ఎలాంటి తీవ్రమైన చర్యలు తీసుకోకూడదని బెంగళూరు పోలీసులను ఆదేశించింది. ఇక ఈ ప్రమాదం అనంతరం కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శి గోవిందరాజును పదవి నుంచి తొలగించడంతో పాటు... ఇంటెలిజెన్స్ చీఫ్ హేమంత్ నింబాల్కర్ సహా పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేశారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కార్పొరేట్ ఉద్యోగం.. కొవ్వొత్తిలా ఆరోగ్యం



అద్దాల మేడలు.. స్టార్ హోటల్‌ను తలపించే ఆఫీస్, వసతులు. రెస్టారెంట్లకు ఏమాత్రం తీసిపోని కెఫెటేరియా. వారంలో రెండు రోజులు సెలవులు. ఇంటి దగ్గరకు వచ్చి మరీ తీసుకుని వెళ్లి మళ్లీ క్షేమంగా ఇంటి ముందు దింపే వాహనాలు. ఆరేడంకెల వార్షిక వేతనం. 'నీకేంటి.. పెద్ద కంపెనీలో జాబ్' అంటూ అసూయపడే బంధువులు, స్నేహితులు. ఇదంతా నాణేనికి ఒకవైపు. ఒత్తిడి, ఆందోళన, అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం వంటి అనారోగ్య సమస్యలు మరోవైపు. అది కూడా నాలుగు పదుల వయసు దాటక ముందే. ఇదీ కార్పొరేట్ సంస్థల్లో కంప్యూటర్ల ముందు పనిచేసే ఓ సగటు వైట్‌కాలర్ ఉద్యోగి జీవితం! ఉద్యోగుల ఆరోగ్య ప్రయోజనాల కోసం పనిచేసే ప్లమ్ అనే వేదిక రూపొందించిన 'ఉద్యోగి ఆరోగ్య నివేదిక-2025' చెబుతున్న సత్యమిది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

మూడు పదులకే గుండె జబ్బులు	20% మందికి మానసిక సమస్యలు	కార్పొరేట్ సిబ్బందికి దీర్ఘకాలిక రోగాలు	ఒత్తిడితో అయిదింట ఒక వంతు మంది రాజీనామా
జాబ్ వదిలేసేందుకు 20% మంది సిద్ధం	'ఉద్యోగి ఆరోగ్య నివేదిక-2025' చెబుతున్న నిజాలు		

ఉద్యోగుల ఆరోగ్య బీమా, ప్రయోజనాల వేదిక 'ప్లమ్'.. భారత్‌లో వైట్-కాలర్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై లోతైన అధ్యయనం చేసి 'ఉద్యోగి ఆరోగ్య నివేదిక-2025'ను విడుదల చేసింది. లక్షకుపైగా టెలిహెల్త్ సంప్రదింపులు, 25,000 బీమా క్లెయిమ్‌లు, 1,998 ఆరోగ్య శిబిరాల స్క్రీనింగ్స్, 512 సర్వే ప్రతిస్పందనల ఆధారంగా ఈ నివేదిక రూపొందించింది. గతంతో పోలిస్తే తక్కువ వయసులోనే ఉద్యోగులు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని ఈ సర్వేలో తేలింది. మానసిక ఆరోగ్య సమస్యలు, అధిక రక్తపోటు, మధుమేహం, మహిళల్లో పీరియడ్లకు సంబంధించిన పీసీఓఎస్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల సమస్యలను ఎదుర్కొంటున్నట్టు చెప్పిన ఉద్యోగుల సగటు వయస్సు 40 కంటే తక్కువగా ఉందని నివేదిక వివరించింది.

30 దాటగానే సమస్యలు

అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. దీర్ఘకాలిక వ్యాధుల ప్రారంభ వయస్సు బాగా తగ్గడం. హృద్రోగ నిపుణులను సంప్రదించేవారి సగటు వయసు ఇప్పుడు కేవలం 32 మాత్రమేనని నివేదికలో తేలింది. ఒక్క గుండె జబ్బులకే ఇది పరిమితం కాలేదు.. తీవ్రమైన ఇతర సమస్యలూ చిన్న వయసులోనే ఎదురవుతున్నాయి. తీసుకునే ఆహారం విషయంలో నిర్లక్ష్యం, సమయపాలన లేని ఆహారపుటలవాట్లు, గంటల తరబడి సీట్లకే పరిమితం కావడం, సరైన శారీరక శ్రమ లేకపోవడం, పని ఒత్తిడి ఇందుకు ప్రధాన కారణాలు.

జబ్బులు వస్తున్న సగటు వయసు

జబ్బు	వయసు
గుండె జబ్బు	32
కేన్సర్	33
మధుమేహం	34
దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి	35
సెరిబ్రోవాస్కులర్ (తలలో రక్తప్రవాహ సమస్య)	36

రెండు వైపులా స్పందన అంతంతే..

నివారించగల వ్యాధుల ప్రాబల్యం పెరుగుతున్నప్పటికీ ప్రస్తుతం 20% కంపెనీలు మాత్రమే క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలను చేపడుతున్నాయి. అలాంటి కార్యక్రమాలు ఉన్నప్పటికీ 38% మంది ఉద్యోగులే వాటిలో పాల్గొంటున్నారు. 34% కంపెనీలు మాత్రమే ఉద్యోగులకు అనుగుణంగా మెరుగైన ప్రయోజనాలను అందిస్తున్నాయి. మూడింట ఒక వంతు ఉద్యోగులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడానికి కూడా సమయం లేదని అంటున్నారు. కంపెనీలు ఆరోగ్యం కోసం రూ.100 ఖర్చు చేస్తే.. అవి అంతకు మూడు రెట్లు ఆదా చేస్తాయని ఈ నివేదిక చెబుతోంది. 42% మహిళలు రుతుక్రమ సమస్య ఉన్నా, విశ్రాంతి తీసుకోకుండా ఆఫీసుల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సమయంలో వీళ్ల విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక గదులు లేకపోవడం, పని ఒత్తిడి ఇందుకు కారణాలు.

ఖర్చులపైనా ప్రభావం

35 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్నవారు దేశంలో 60 కోట్ల వరకూ ఉన్నారు. ప్రధాన సంపాదనపరుల్లో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు చిన్న వయసులో రావడం.. దేశ ఉత్పాదకత, ఆర్థిక వృద్ధి, ఆరోగ్య సంరక్షణ ఖర్చులపై తీవ్ర ప్రభావాలను చూపుతుందనడంలో సందేహం లేదు. ఈ సర్వే ప్రకారం.. దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా కంపెనీలు ఏడాదికి ఒక ఉద్యోగి నుంచి 30 రోజుల వరకు ఉత్పాదకత, పని దినాలను కోల్పోతాయని అంచనా. 40 శాతం ఉద్యోగులు మానసిక అనారోగ్య సమస్యలతో నెలలో కనీసం ఒక రోజైనా సెలవు తీసుకుంటున్నారట. సామాజిక ఒంటరితనం మరొక ముఖ్యమైన సమస్య. 30 శాతం మంది ఉద్యోగులు కార్యాలయంలో ఒంటరితనం అనుభవిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచంలో ఇదే అత్యధికం.

బీమా కంటే ఆరోగ్య సంరక్షణకు..


కంపెనీలు తమ ఉద్యోగులకు బీమా కల్పించడంతోపాటు ఆరోగ్య సంరక్షణ గురించీ ఆలోచించాలని 'ప్లమ్' సహ వ్యవస్థాపకుడు అభిషేక్ పొద్దార్ తెలిపారు. మానసిక, శారీరక, సామాజిక శ్రేయస్సును కలిగి ఉన్న సమగ్ర ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అందించడంలోనే నిజమైన ఉద్యోగి శ్రేయస్సు ఉందన్నారు. 'ఉద్యోగులు తమ ఆరోగ్య ప్రయాణాన్ని బాధ్యతగా తీసుకునేలా చేసే సమగ్ర విధానం ఆవశ్యకతను మా నివేదిక నొక్కి చెబుతోంది. ఉద్యోగి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ప్రతి సంస్థకు ప్రాధాన్యతగా మారాలి' అని ప్లమ్ మరో సహ వ్యవస్థాపకుడు సౌరభ్ అరోరా పేర్కొన్నారు.

ఒత్తిడికి చిత్తవుతున్నారు

సమస్య	ఎంత శాతం ఉద్యోగులు
ప్రతిరోజు కోపం వస్తున్నవారు (ప్రపంచ సగటు కంటే ఇది 10% పాయింట్లు ఎక్కువ.)	20
క్రమం తప్పకుండా ఒత్తిడికి గురయ్యేవారు	87
సాధారణ ఆందోళన లక్షణాలు ఉన్నవారు	55
మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం గత ఏడాది ఉద్యోగాలను వదిలేసినవారు	20

వైద్య పరీక్షల్లో తేలిందేమంటే..

సమస్యల వారీగా రోగుల శాతం



మహిళలు ఏయే సమస్యలకు వైద్యుల వద్దకు వెళ్తున్నారంటే

- **23%** సంతానోత్పత్తి సమస్యల కోసం
- **32%** హార్మోన్ల ఆరోగ్యానికి
- **18%** రుతుక్రమ సమస్యల పరిష్కారం కోసం

తిరగని ఫ్యాన్లు.. ఇంటినుంచి పంకా..



ఈ ఫొటో చూడండి.. ఆస్పత్రిలో స్టాండ్ ఫ్యాన్ గిరగిరా తిరుగుతోంది. ఆస్పత్రిలో ఇలాంటి ఫ్యాన్లు కూడా పెడుతున్నారా? అని అనుకుంటున్నారా.. ఇది సర్కారు పెట్టిందికాదు. ఓ బాలింత తన ఇంటి నుంచి తెచ్చుకున్నది. మంత్రి సీతక్క నియోజకవర్గ కేంద్రం ములుగు ప్రభుత్వ ఆస్పత్రిలోనిది ఈ చిత్రం. ఏరియా ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలు ఫ్యాన్‌లు లేక నానా పాట్లు పడుతున్నారు. అసలే ఎండలు, ఆపై ఫ్యాన్లు తిరగకపోవడంతో ఇలా తమ ఇంటినుంచి సొంత ఫ్యాన్లు తెచ్చుకుని ఉపశమనం పొందుతున్నామని పలువురు రోగులు తెలిపారు.

- ములుగు రూరల్

ఉద్యోగ నిర్వహణ ఇలాగేనా?

స్థలం స్వాధీనం విషయంలో అటవీశాఖ ఉద్యోగుల తీరుపై విమర్శలు



సొమ్మసిల్లిన చిరంజీవి భార్య వద్ద ఏడుస్తున్న కుటుంబీకులు



యువకుడిని ఈడ్చుతున్న అటవీ ఉద్యోగి

అశ్వారావుపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని ఓ స్థలంపై అటవీశాఖకు, ఓ కుటుంబానికి మధ్య వివాదం నెలకొనగా, అటవీ శాఖకు అనుకూలంగా హైకోర్టు తీర్పు వచ్చింది. దీంతో ఆ శాఖ ఉద్యోగులు పెద్దసంఖ్యలో వచ్చి సామగ్రి, మనుషులనే తేడా లేకుండా అక్కడి నుంచి కుటుంబ సభ్యులను ఈడ్చి రోడ్డున పడేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. అశ్వారావు పేట రింగ్ సెంటర్‌లో చిలకా చిరంజీవి, మరికొందరు ఉంటున్న స్థలంపై అటవీశాఖతో ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆ స్థలంపై అటవీ శాఖకు అనుకూలంగా తాజాగా కోర్టు తీర్పు రాగా, శుక్రవారం రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో వచ్చిన అటవీ శాఖ ఉద్యోగులు.. చిరంజీవి నివాసం ఉంటున్న స్థలం నుంచి వారిని బలవంతంగా ఖాళీ చేయించారు. ఏళ్లుగా పూలు అమ్ముకుని జీవిస్తున్నామని, ఒకేసారి రోడ్డున పడేయొద్దని కోరుతున్నా వినకుండా వారి నివాసం కూల్చేశారు. ఉద్యోగులను ప్రాధేయపడుతున్న చిరంజీవి భార్య, ఆయన కుమారుడు నాగేంద్రలను నెట్టిపారేయడమే కాక సొమ్మసిల్లిన చిరంజీవి భార్యను అలాగే ఈడ్చుకెళ్లి జీపులో పడేయడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాక వారి ఇంటిలోని సామగ్రి మొత్తాన్ని ట్రాక్టర్‌లో విసిరేసి అక్కడి నుంచి తరలించారు. ఆ స్థలాన్ని ఖాళీ చేయించడం ఉద్యోగుల విధినిర్వహణలో భాగమే అయినా వారు వ్యవహరించిన తీరుపై స్థానికంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

గ్రూప్-3 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల

ఈనెల 18 నుంచి జూలై 8 వరకు ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్-3 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) శుక్రవారం విడుదల చేసింది. గ్రూప్-3 కేటగిరీలో మొత్తం 1,388 ఉద్యోగ ఖాళీలున్నాయి. తాజాగా ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచింది. 1:1 నిష్పత్తిలో ఎంపిక చేసినప్పటికీ స్పోర్ట్స్ కేటగిరీలో మాత్రం ఎక్కువ మంది అభ్యర్థులను కమిషన్ ఎంపిక చేసింది. తాజా గా విడుదలైన జాబితాలో మొత్తం 1,462 అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లున్నాయి. వీటిలో 81 మంది స్పోర్ట్స్ కేటగిరీలో ఎంపికైన వాళ్లే. గ్రూప్-3 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 18వ తేదీ నుంచి జూలై 8 వరకు నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నాంపల్లిలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆవరణలో ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈనెల 10న ధ్రువప త్రాల పరిశీలనకు సంబంధించి రోజువారీ షెడ్యూల్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. నిర్దేశించిన తేదీల్లో ఆయా అభ్యర్థులు అన్నిరకాల ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. గైర్హాజరైన అభ్యర్థులకు మరో అవకాశం ఉండదని స్పష్టంచేశారు. మరిన్ని వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


BANTIA Furnitures
సఫారీ సోఫా సెట్ : 3 + 2 + దివాన్ (8 సీటర్) + ఉచితం సెంటర్ టేబుల్
MRP ₹62,999
Sale ₹ 22,222
PER DAY EMI ₹24
రిక్లైనర్ సోఫాసెట్
2 రిక్లైనర్స్‌తో 3 సీటర్
+ 2 రిక్లైనర్స్‌తో 2 సీటర్ & కన్సోల్ టేబుల్
MRP ₹1,49,499
Sale ₹ 69,999
PER DAY EMI ₹75
స్టోరేజ్‌తో బెడ్ + 10" యూరో టాప్ స్ప్రింగ్ మ్యాట్రెస్
విలువ రూ. 15,000 గలవి ఉచితం
MRP ₹42,999
Sale ₹ 24,999
PER DAY EMI ₹27
టేకఉడ్ బెడ్‌తో రూ. 20,000 విలువ గల మ్యాట్రెస్ ఉచితం
MRP ₹42,999
Sale ₹ 29,999
PER DAY EMI ₹32
మీ పాత మ్యాట్రెస్‌ను కొత్త మ్యాట్రెస్‌తో ఎక్స్ఛేంజ్ చేసుకోండి
ఎక్స్ఛేంజ్ విలువ రూ. 20,000/- వరకు
+
2 పిల్లోస్ విలువ రూ. 999/- వరకు
+
ఎంఆర్‌పీపై 15% డిస్కౌంట్ పొందండి
ప్రీమియం
క్వాలిటీ
క్వీన్ సైజ్ బెడ్
MRP ₹43,499
Sale ₹ 9,999
PER DAY EMI ₹11
ఉచితం
10" స్ప్రింగ్ మ్యాట్రెస్,
పిల్లో టాప్
విలువ రూ. 15,000/-
టేకఉడ్
డైనింగ్ టేబుల్
6 సీటర్
(1 టేబుల్
+ 4 చైర్స్
+ 1 బెంచ్)
MRP ₹1,39,999
Sale ₹ 59,999
PER DAY EMI ₹65
ప్రీమియం క్వాలిటీ ఉడెన్ డైనింగ్ టేబుల్,
6 చైర్స్‌తో
MRP ₹47,999
Sale ₹ 17,999
PER DAY EMI ₹19
యాంటియాక్ : సాలిడ్ ఉడెన్ డైనింగ్
టేబుల్ 6 సీటర్ (4 చైర్స్ + 1 బెంచ్)
MRP ₹55,999
Sale ₹ 24,999
PER DAY EMI ₹27
మార్బుల్ డైనింగ్ టేబుల్, 6 చైర్స్‌తో
MRP ₹25,499
Sale ₹ 13,999
PER DAY EMI ₹15
ప్రీమియం క్వాలిటీ వార్డ్ రోబ్
మిర్రర్‌తో
2 డోర్
MRP ₹ 27,449
₹ 8,999
PER DAY EMI ₹10
మిర్రర్‌తో
3 డోర్
₹ 12,999
2 మిర్రర్స్‌తో 4 డోర్ ₹ 16,999

సాక్షి ప్లస్
శనివారం । 7-6-2025

బాగుపడే 'మార్గ'మేది?


రాజీవ్ రహదారిపై థర్మోప్లాస్టిక్ పెయింటింగ్ కనిపించకుండా పేరుకుపోయిన మట్టి

- రాజీవ్ రహదారి నిర్వహణ గాలికి..
- టోల్ ట్యాక్స్ వసూళ్లపైనే శ్రద్ధ.. కానరాని నిర్వహణ
- రోడ్డుపై అతుకులు.. సర్వీస్ రోడ్డు లేక వాహనచోదకుల ఇబ్బంది
- పలు చోట్ల నిత్యం ప్రమాదాలు
- 4 ఉమ్మడి జిల్లాలకు కీలకమైన రోడ్డు
- ప్రత్యేక దృష్టి సారించాలని వాహనచోదకుల వినతి

సాక్షి, సిద్దిపేట: రాజీవ్ రహదారి నిర్వాహకులకు టోల్ ట్యాక్స్ వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. రోడ్డు నిర్వహణపై లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారి నిర్వహణను పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి పై ఎక్కడో ఒక చోట.. రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మరణాలు, గాయాలతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంటోంది.

కీలక రహదారి

హైదరాబాద్ నుంచి ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, కరీంనగర్, అదిలాబాద్ వెళ్లాలంటే ఈ రహదారి ఎంతో కీలకం. ఔటర్ రింగ్ రోడ్ శామీర్‌పేట నుంచి రామగుండం వరకు మొత్తం 207 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రోడ్డును రూ.1,400 కోట్లతో డీబీఎఫ్‌వోటీ (డిజైన్ బిల్ట్ ఫైనాన్స్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో నిర్మించారు. పాతికేళ్ల టోల్ వసూలు చేసుకునేలా ఆ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. 2014 నుంచి ప్రారంభమైన టోల్ వసూళ్లు 2039లో ముగియనున్నాయి. ఈ రాష్ట్ర రహదారిపై దుద్దెడ, రేణికుంట, బసంత్‌నగర్‌లలో టోల్ ప్లాజాలను ఏర్పాటు చేశారు. రోజుకు దాదాపు 50 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

అతుకుల రోడ్డు

రోడ్డులో పలుచోట్ల గుంతలు ఉండటంతో.. అక్కడి వరకు ప్యాచ్ వర్క్‌లు చేశారు. దీంతో అతుకుల రోడ్డుగా మారింది. రోడ్డు మధ్యలో పలు చోట్ల థర్మోప్లాస్టిక్ పెయింటింగ్ వేయకపోవడం, రోడ్ స్టాడ్స్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. టూ లైన్ రోడ్ మధ్యలో థర్మోప్లాస్టిక్ పెయింటింగ్ వేయకపోవడంతో.. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు చివరిలో సోలార్ రోడ్ స్టాడ్స్ లేకపోవడంతో.. రోడ్డు దిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

సర్వీస్ రోడ్లు లేక ఇబ్బంది

పలు చోట్ల సర్వీస్ రోడ్లను నిర్మించాలని పోలీస్ శాఖ ఎన్నిమార్లు సూచించినా.. రాజీవ్ రహదారి నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. సిద్దిపేట పట్టణ శివారు నర్సాపూర్‌లోని కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లేందుకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు రోజూ 5వేల మంది కేసీఆర్ నగర్ నుంచి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. మలుపులు, సర్వీసు రోడ్లు, నిర్మాణ లోపాలతో వాహనాలు అదుపు తప్పి ఢీకొంటున్నాయి. కూడళ్లు, రోడ్డుకు అనుబంధ గ్రామాల నుంచి అడ్డంగా వచ్చే వాహనాలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వంటిమామిడి మార్కెట్, ములుగు చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయం, వర్గల్‌కమాన్, సింగాయపల్లి చౌరస్తా, ముత్రాజ్‌పల్లి వెళ్లే దారి, గజ్వేల్ మండలం రాణే కంపెనీ ప్రాంతం, రిమ్మనగూడ, కొండపాక, తిమ్మారెడ్డిపల్లి, మేదినీపూర్, మంగోల్ జంక్షన్, కుకునూరుపల్లి, రంగధాంపల్లి, మందపల్లి, ఇబ్రహీంపూర్‌లలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్వహణపై దృష్టి సారించాలని వాహన,చోదకులు కోరుతున్నారు.


ఒక వైపు రోడ్డు కొత్తగా వేయడం.. మరో వైపు రోడ్డు వేయకపోవడం

సర్వీస్ రోడ్డుకు అనుమతి రాలేదు

సిద్దిపేట పట్టణ శివారులో కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లే దగ్గర సర్వీస్ రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపించాం. ఇంకా అనుమతి రాలేదు. రోడ్డులో థర్మోప్లాస్టిక్ పెయింటింగ్ పనులు నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నాయి. అది ఒక్క రోజులో పూర్తయ్యేది కాదు. త్వరలో దుద్దెడ నుంచి కరీంనగర్ థర్మోప్లాస్టిక్ పెయింటింగ్ పనులు ప్రారంభమవుతాయి.

–విజయ భాస్కర్, డీజీఎం, హెచ్‌కేఆర్

నిర్వహణ పట్టించుకోవాలి

రాజీవ్ రహదారి నిర్వహణను పట్టించుకోవాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. కార్నర్‌లతో పాటు గ్రామాల నుండి రోడ్ పైకి వాహనాలు వచ్చే క్రమంలో.. రాజీవ్ రహదారి నుంచి అతి వేగంగా వాహనాలు వస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల వేగ నియంత్రణ కోసం సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– అనిల్, వాహనచోదకుడు, బెజ్జంకి

మడావి హిడ్మా ఎక్కడ?



పీఎల్‌జీఏ కంపెనీ వన్ కమాండర్‌గా భీకర దాడులు చేయడంలో దిట్ట

మురియా ఆదివాసీ నుంచి మావో అగ్రనేతగా... భద్రతాదళాల చేతిలో హిడ్మా తాజా ఫొటో

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: యాంటీ నక్సల్స్ ఆపరేషన్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా వినిపించే పేరు మడావి హిడ్మా. ఇటీవల హిడ్మా పేరుతో ఓ ఏరియా కమిటీ సభ్యుడు లొంగిపోతే ఆ విషయం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రస్తుతం పీఎల్‌జీఏ కంపెనీ వన్ కమాండర్‌గా ఉన్న హిడ్మాకు సంబంధించిన కీలక సమాచారం భద్రతా దళాలకు చిక్కినట్టు సమాచారం. ఆయన ప్రస్తుతం ఎక్కడ పాగా వేశాడో తెలియరాకున్నా దాదాపు 20 ఏళ్ల తర్వాత హిడ్మాకు సంబంధించిన తాజా ఫొటోగా పేర్కొంటున్న చిత్రం శుక్రవారం వెలుగుచూడడం గమనార్హం.

అత్యంత రహస్యం

మడావి హిడ్మాకు మూడంచెల భద్రతావ్యవస్థ ఉంటుంది. దగ్గరగా ఉండే ఏ టీమ్‌లో 10–12 మంది సభ్యులు, మధ్యలో ఉండే బీ టీమ్‌లో 20–22 మంది, వెలుపలి రక్షణ వలయంలో 15 మంది వరకు సభ్యులు ఆయనకు రక్షణగా ఉంటారు. దళం/కంపెనీలో ఇతరులకు వండే ఆహార పదార్థాలను హిడ్మా తినడని, ఆయనకు ప్రత్యేకంగా వంట తయారు చేస్తారని చెబుతారు. హిడ్మా వ్యక్తిగత అవసరాల కోసం ఇద్దరు సభ్యులు ప్రత్యేకంగా ఉంటారని ప్రచారం. ఎక్కడైనా క్యాంప్ వేసినా అందరితో కలివిడిగా ఉండకపోగా, ప్రత్యేక క్యాంపులో ఉంటాడు. హిడ్మాను ఎవరైనా కలవాలంటే ఆయన వ్యక్తిగత సహాయకుల ద్వారా సంప్రదించాలని సమాచారం. కంపెనీలో పనిచేసే సాధారణ మావోయిస్టులకు సైతం ఆరు నెలలకోసారి కూడా హిడ్మా కనిపించడని తెలిసింది. ఆయన వ్యక్తిగత వివరాలు బయటకు రాకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంటుండగా, పొలిటికల్ వింగ్ కంటే ఆర్మీ విభాగంపైనే ఎక్కువగా మక్కువ చూపిస్తాడు. ప్రస్తుతం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కంపెనీ 1కి కమాండర్‌గా ఉన్నాడు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, సెంట్రల్ రీజినల్ బ్యూరో, తెలంగాణ కమిటీలకు ఈ కంపెనీ రక్షణ కల్పిస్తోంది. దండకారణ్య ప్రాంతం హిడ్మా అడ్డాగా ఉంది.

జిరామ్‌ఘాటీతో

సల్వాజుడుం సృష్టికర్త మహేంద్రకర్మ టార్గెట్‌గా 2013 మే 25న సుక్మా జిల్లాలోని ధర్మా లోయలో జిరామ్‌ఘాటీ దగ్గర జరిపిన దాడిలో కేంద్ర కమిటీ సభ్యురాలు కల్పన అలియాస్ సుజాతతోపాటు హిడ్మా కీలకపాత్ర పోషించాడు. ఈ ఘటనలో కాంగ్రెస్ అగ్రనేత నందకుమార్ పటేల్‌తో పాటు 27 మంది చనిపోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అంతకు నెలరోజుల ముందు సుక్మా జిల్లా కంచాల దగ్గర పోలీసులపై మెరుపుదాడికి దిగారు. హెలికాప్టర్ ఎక్కుతున్న ఓ పోలీసు ఉద్యోగిపైకి కాల్పులు జరిపారు. ఆయన మృతదేహం అప్పగింత విషయంలో మూడు రోజులు నెలకొన్న ఉత్కంఠ హిడ్మా అంటే హడల్ అనే విధంగా మారింది. దీంతో భద్రతాదళాలు హిడ్మాపై కూపీ లాగడం మొదలుపెట్టాయి. చాన్నాళ్ల తర్వాత 2021 ఏప్రిల్‌లో బీజాపూర్ జిల్లా తెర్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో అంబుష్ చేశారు. ఈ ఘటనలో 22 మంది జవాన్లు చనిపోయారు. ఈ ఘటన భద్రతాదళాల వెన్నులో వణుకు పుట్టించింది. ఈ ఘటన తర్వాత హిడ్మా పేరు వింటేనే భయపడే పరిస్థితి వచ్చింది. ఆ తర్వాత 2023 ఏప్రిల్ 26న బీజాపూర్ జిల్లా ఆరాన్‌పూర్ దగ్గర ఐఈడీ బాంబు పేల్చిన ఘటనలో 10 డీఆర్‌జీ జవాన్లు చనిపోయారు. ఆ తర్వాత భద్రతాదళాలపై ఏ భారీ దాడి జరిగినా దాని వెనుక హిడ్మానే ఉన్నాడనే ప్రచారం జరగడం సర్వసాధారణమైంది.

కిషన్‌జీ, చలపతి అడుగుజాడల్లో

హిడ్మా సొంతూరు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పువ్వర్తి. ఆయన మురియా తెగకు చెందిన ఆదివాసీ. బాలసంఘం ద్వారా మావోయిస్టు పార్టీలోకి వెళ్లిన హిడ్మా విప్లవ భావాల ను నరనరాన ఒంట బట్టించుకున్నాడు. మావోయిస్టులు నడిపే స్కూల్‌లో చదువుతూ ఏ ఫర్ ఆరమ్స్, బీ ఫర్ బెంగాల్, సీ ఫర్ చారు మంజుదార్ అన్నట్టుగా కిషన్ జీ అలియాస్ భద్రన్న నేతృత్వంలో సాయుధపోరులో తొలి అడుగులు వేశాడు. ఆపై జేగురుగొండ ఏరియా దళ కమాండర్‌గా ఉన్న సమయంలో అగ్రనేత నంబాల కేశవరావు డైరెక్షన్‌లో జరిగిన చింతల్నార్ -టేకుమెట్ల దాడిలో ముందుండి నడిచాడు. ఈ అంబుష్‌దాడిలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చనిపోయారు. ఈ ఘటన తర్వాత మావోయిస్టు పార్టీలో హిడ్మాకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అనంతరం మరో అగ్రనేత చలపతి దగ్గర విప్లవ పాఠాలు నేర్చుకున్నాడు.

ఉరిమిన ప్రకృతి

- గత ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో దేశవ్యాప్తంగా పెరిగిన మరణాలు
- 11 ఏళ్ల తర్వాత తొలిసారి 3,080 మంది మృతి
- ఎన్వీ స్టాట్స్ ఇండియా–2025 నివేదిక వెల్లడి
- ఏపీ, తెలంగాణలపైనా ప్రభావం
- తెలంగాణలో పెరిగిన పశువుల మరణాలు, దెబ్బతిన్న ఇళ్లు





సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో గత ఏడాది ప్రకృతి వైపరీత్యాల వల్ల మానవ మరణాల సంఖ్య గణనీయంగా ఉందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్వీ స్టాట్స్ ఇండియా–2025 (పర్యావరణ గణాంకాలు) నివేదిక వెల్లడించింది. వరదలు, పిడుగుపాట్లు, వడగాల్పులు, భారీ వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాలతో 2024–25 ఏడాదిలో ఏకంగా 3,080 మంది మరణించినట్లు తెలిపింది. 2013–14 ఏడాదిలో సంభవించిన మానవ మరణాల తర్వాత అత్యధిక మరణాలు గత ఏడాదే సంభవించినట్లు పేర్కొంది. రెండ్రోజుల కింద విడుదల చేసిన ఈ నివేదికలో అనేక అంశాలను ప్రస్తావించింది.

నివేదికలో అంశాలివి

- ➤ పాతికేళ్లలో అంటే 2001–02 నుంచి చూస్తే అత్యధిక మరణాలు 2007–08లో 3,764, 2008–09లో 3,405, 2013–14లో 5,677 నమోదు కాగా, ఆ తర్వాత గత ఏడాదే అత్యధికంగా మరణాలున్నాయి.
- ➤ పశు మరణాల సంఖ్య మాత్రం గత ఏడాది గణనీయంగా తగ్గింది. అత్యధికంగా 2006–07లో 4,55,619 పశువులు మరణించగా, 2023–24లో 1,19,683, గత ఏడాది 61,966 చనిపోయాయి.
- ➤ ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇళ్లు కూలడం వంటి నష్టాలు 2007–08లో ఏకంగా 35.27 లక్షలుండగా, అది 2023–24లో 1.40 లక్షలు, 2024–25లో మాత్రం 3.64 లక్షలుగా ఉంది.
- ➤ వ్యవసాయ రంగానికి సంబంధించి 2007–08లో అత్యధికంగా 85.13 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరగ్గా, 2023–24లో 13.39 లక్షల హెక్టార్లు, 2024–25లో 14.24 లక్షల హెక్టార్లుగా ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో..

- ➤ తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనూ ప్రకృతి వైపరీత్యాల ప్రభావం తీవ్రంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 2023–24లో 39 మంది మృతి చెందగా, 462 పశు మరణాలు సంభవించాయి. మొత్తం 5,805 ఇళ్లు దెబ్బతిన్నాయి. 2.68 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగింది. అదే 2024–25లో ఏకంగా 56 మరణాలు సంభవించగా, 122 పశువులు మరణించాయి. 1,323 ఇళ్లు దెబ్బ తినగా, 11వేల హెక్టార్లలో పంట నష్టం జరిగింది. ఏపీలో ప్రకృతి వైపరీత్యాల నిర్వహణకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,326 కోట్లు ఖర్చు చేయగా, 2024–25లో రూ.3,193 కోట్లు ఖర్చు చేసినట్లు నివేదిక తెలిపింది.
- ➤ తెలంగాణలో 2023–24లో 19 మంది మృతి చెందగా.. 605 పశువులు మరణించాయి. 5,093 ఇళ్లు దెబ్బ తినగా, 61వేల హెక్టార్లలో పంట నష్టం జరిగింది. 2024–25లో మాత్రం 29 మంది మరణించగా, 13,412 పశువులు మరణించాయి. 8,690 ఇళ్లు దెబ్బ తిన్నాయి. పంట నష్టం వివరాలను మాత్రం నివేదికలో పేర్కొనలేదు. ప్రకృతి వైపరీత్యాల నిర్వహణకు తెలంగాణ రాష్ట్రం 2023–24లో రూ.931 కోట్లు ఖర్చు చేయగా, 2024–25లో రూ.103 కోట్లు ఖర్చు చేసినట్లు నివేదిక వెల్లడించింది.

శాంతి, ఐక్యత చాటే పండుగ: మహేశ్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: శాంతి, ఐక్యతకు ప్రతీకగా, సత్యం, త్యాగం, సహనానికి ప్రతిబింబంగా, ప్రేమ, సౌభ్రాతృత్వ విలువలను చాటే బక్రీద్ పర్వదినాన్ని రాష్ట్రంలోని ముస్లింలంతా ప్రశాంతంగా జరుపుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

8, 9 తేదీల్లో చేపమందు ప్రసాదం పంపిణీ

- రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 8,9 తేదీల్లో చేప మందు ప్రసాదాన్ని పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ఈ చేపమందు పంపిణీ కోసం ప్రత్యేక ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. గతంలో ఉన్న 32 క్యూలైన్లను 42కు పెంచామని, ప్రసాదం కోసం వచ్చే వారికి ఎక్కడా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు జరిగాయని వివరించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మత్స్య శాఖ అధికారుల సమన్వయంతో లక్షకు పైగా చేపపిల్లలను ఈసారి పంపిణీ చేయబోతున్నామన్నారు. ఈ చేప మందు ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభిస్తారని, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు.

తెలంగాణ సోయి లేని ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తోంది

- దాశరథి శత జయంతిని ప్రభుత్వం నిర్వహించకపోతే జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మట్టిలో పుట్టిన మాణిక్యం, స్వాతంత్య్ర సమరయోధుడు దాశరథిని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సోయి ఏమాత్రం లేని ప్రభుత్వం తెలంగాణను పాలిస్తుండటం విచారకరమన్నారు. శుక్రవారం దాశరథిని నిర్బంధించిన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఖిల్లా రామాలయాన్ని ఆమె సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. దాశరథి శతజయంతి సందర్భంగా ఆయన గొప్పతనాన్ని భావి తరాలకు తెలిసేలా కార్యక్రమాలు నిర్వహించాలని తాను పలు సందర్భాల్లో ప్రభుత్వాన్ని కోరామని.. అయినా దున్నపోతు మీద వానపడ్డట్టుగా ప్రభుత్వం తీరు ఉందని కవిత మండిపడ్డారు.




శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో బక్రీద్ కొనుగోళ్ల సందడి

క్లుప్తంగా...

హామీలు నెరవేర్చి.. చేనేత పరిశ్రమను రక్షించండి
ఏపీ చేనేత కార్మిక సంఘం డిమాండ్



సత్తెనపల్లి: ఎన్నికల హామీలు నెరవేర్చి.. చేనేత పరిశ్రమను రక్షించాలని, కార్మికులను ఆకలి చావుల నుంచి కాపాడాలని కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమను సంరక్షిస్తామని, ఉత్పత్తులపై జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ చేస్తామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామంటూ హామీలిచ్చాయని చెప్పారు. కానీ ఇప్పటివరకు వాటిని నెరవేర్చలేదని మండిపడ్డారు. వాటిని నెరవేర్చడంతో పాటు చేనేత కార్మికులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కామర్తి రాజు, కట్టా శివ దుర్గారావు, డోకుపర్తి రామారావు, వాస గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

138 అంగన్‌వాడీ భవనాలకు రూ.11.52కోట్లు

సాక్షి, అమరావతి: పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా 138 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణానికి రూ.11.52కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది. రాష్ట్ర ఏజెన్సీలోని అత్యంత బలహీన గిరిజన సమూహాలు(పీవీటీజీ) ఉన్న ప్రాంతాల్లో 138 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.12లక్షల చొప్పున నూతన భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా కేటాయించినట్టు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటికే మరో రూ.5.4కోట్లు అదనంగా నిధులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విడుదల చేస్తూ అనుమతిచ్చినట్టు మరో ఉత్తర్వులు జారీ చేశారు.

దళితులు, క్రైస్తవులపై ఆగని దాడులు
జాన్‌వెస్లీ ఆవేదన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దళితులు, క్రైస్తవులు, క్రైస్తవ ప్రార్థనా మందిరాలపై దాడులు ఆగలేదనీ, ఈ విషయంలో రాష్ట్ర గవర్నర్ స్వయంగా డీజీపీకి లేఖ రాసినా చర్యలు శూన్యమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులు, క్రైస్తవులపై దాడులను కూటమి ప్రభుత్వం అరికట్టడంలేదని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ దాడులను అరికట్టేలా సుప్రీంకోర్టు నిబంధనలు జారీ చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. నేరుగా పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దళితులను కొడుతున్నారని, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకు ఇది పరాకాష్ట అని విమర్శించారు.

పార్టీ లైన్ దాటి మాట్లాడితే నేతలపై కఠిన చర్యలే
జనసేన పార్టీ ప్రకటన

సాక్షి, అమరావతి: అధినేత పవన్‌కళ్యాణ్ వివిధ సభలు, పార్టీ సమావేశాలలో వెలిబుచ్చే అభిప్రాయాలకు భిన్నంగా పార్టీ లైన్ దాటి మాట్లాడే పార్టీ సభ్యులపై కఠిన చర్యలు తప్పవంటూ జనసేన పార్టీ ఒక ప్రకటనలో హెచ్చరించింది. పార్టీ కేంద్ర కార్యాలయంలో అధినేత రాజకీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీహరిప్రసాద్ పేరుతో ఈ ప్రకటన శుక్రవారం విడుదలైంది. పవన్‌కళ్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంతోపాటు వివిధ జిల్లాల్లో కొన్ని చోట్ల టీడీపీ – జనసేన నేతల మధ్య విభేదాలు పెరుగుతుండడంతో ఈ ప్రకటన జారీ చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ఆప్కాబ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గన్ని



సాక్షి, అమరావతి: ఏపీ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ (ఆప్కాబ్) చైర్మన్‌గా ఉంగుటూరు టీడీపీ మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు విజయవాడలోని ఆప్కాబ్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆప్కాబ్ శాఖలపై సీసీటీవీ ద్వారా నిఘా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన సెంట్రల్ మానిటరింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. బ్యాంకు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆప్కాబ్ చరిత్రను ఆవిష్కరించే ఆప్కాబ్ హిస్టరీ వాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆప్కాబ్ ఉన్నతాధికారులతో భేటీ అయ్యి బ్యాంక్ కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు.

పచ్చని కాపురాల్లో... వివాహేతర చిచ్చు

వివాహేతర సంబంధాలు పచ్చని కాపురాల్లో చిచ్చు పెడుతున్నాయి. తమ బంధానికి అడ్డుగా ఉన్నారన్న కారణంతో ఏకంగా హత్యలదాకా వ్యవహారం వెళ్తోంది. ఇలాంటి ఘటనల్లో ఎక్కువగా బాధితుల బిడ్డలు అనాథలుగా మారుతుండటం అందరినీ కలవరపెడుతోంది. ఈ మధ్యకాలంలో తరచూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.



- సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన ఓ వివాహితకు రొద్దం మండలానికి చెందిన పురుషుడితో వివాహేతర సంబంధం ఏర్పడింది. అనుమానం వచ్చిన భర్త మంజునాథ్ నిత్యం వేధించసాగాడు. మధ్యలో అడ్డుగా ఉన్న భర్తను తొలగించుకునేందుకు ప్రియుడితో కలిసి భార్య పన్నాగం పన్నింది. మద్యం మత్తులో ఉన్న భర్తను కిరాయి ఇచ్చి హత్య చేయించింది. గతేడాది జరిగిన ఈ ఘటనకు కారణాలు ఆలస్యంగా వెలుగు చూశాయి. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఏడాది తర్వాత మృతదేహాన్ని రీపోస్టుమార్టం చేయడంతో వాస్తవాలు వెలుగు చూశాయి.
- సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం కుటాలపల్లిలో గతేడాది ఎన్నికల సమయంలో ఓ దారుణ హత్య వెలుగు చూసింది. ఇద్దరు వ్యక్తులు ఒకే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించడమే దీనికి కారణంగా తేలింది. అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి ఒకరికి తెలియకుండా మరొకరు వివాహేతర సంబంధం కొనసాగించారు. అయితే ఆర్థిక లావాదేవీల్లో తేడా రావడంతో శ్రీనివాసరెడ్డి మరికొందరితో కలిసి అమర్‌నాథ్‌రెడ్డిని హతమార్చాడు. గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

- భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో అనర్థాలు
- చిచ్చు రేపుతోన్న సోషల్ మీడియా పరిచయాలు
- ఇద్దరి మధ్యకు మూడో వ్యక్తి రావడంతో హత్యలకు దారి
- బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారుతున్న పిల్లలు



సాక్షి, పుట్టపర్తి

రెండు మనసులు.. మూడు ముళ్లు.. ఏడు అడుగులతో ముడిపడిందే భార్యాభర్తల బంధం. జీవితాంతం ప్రేమ, ఆప్యాయతలతో పాటు కష్టసుఖాలు, కుటుంబ బాధ్యతలను మోసుకుంటూ ముందుకు సాగేదే సంసారం. ఈ పవిత్ర బంధం.. మనస్పర్థలు, అనుమానాలు, కుటుంబ కలహాలతో విచ్ఛిన్నం అవుతోంది. చిన్నపాటి మనస్పర్థల కారణంగా పరాయి వ్యక్తులతో చనువుగా పెరిగి.. సాన్నిహిత్యం ఏర్పడుతోంది. అదే వివాహేతర సంబంధాలకు దారి తీస్తోంది. అలాంటి సంబంధాలు పచ్చని కాపురాల్లో చిచ్చు రేపుతున్నాయి. ఈ క్రమంలో కొంతమంది అడ్డు తొలగించుకునే క్రమంలో భర్తలను, ప్రియులను చంపేస్తున్నారు. ఫలితంగా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. చిన్నారులు అనాథలుగా మారుతున్నారు. హత్య చేసి పరారీ అవుతుండటంతో చిన్నారులు ఎవరి దగ్గర ఉండాలో అర్థం కాక బాల్యంలోనే కార్మికులుగా మారి అష్టకష్టాలు పడుతున్నారు.

అఘాయిత్యాలకు దారి తీస్తూ..

వివాహేతర సంబంధాలతో భార్యభర్తల మధ్య మనస్పర్థలు పెరిగి అఘాయిత్యాలకు దారి తీస్తున్నాయి. ఇద్దరి మధ్యలోకి మరొకరు రావడంతో పరిస్థితులు నిమిషాల్లో మారిపోతున్నాయి. క్షణికావేశంతో హత్యలు, ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. దంపతుల్లో ఎవరో ఒకరు జైలుకు వెళ్లినా.. కనీసం బెయిల్ ఇప్పించేందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో అలాంటి దంపతుల పిల్లలు అనాథలుగా మారుతున్నారు. అంతేకాదు వివాహేతర సంబంధాలతో ఎలాంటి పరిణామాలు జరిగినా.. వారి కుటుంబ సభ్యులు సమాజంలో తలెత్తుకొని తిరగలేని పరిస్థితి నెలకొంది.

కారణాలు ఎన్నెన్నో..

- పని ఒత్తిడితో జీవిత భాగస్వామికి సరైన సమయం కేటాయించకపోవడంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి.
- చిన్న సమస్యలను పెద్దవిగా చూస్తూ.. పదే పదే చర్చించి.. తల్లిదండ్రుల వరకూ వెళ్లడం .. ఆ తర్వాత పోలీస్‌స్టేషన్ల మెట్లు ఎక్కుతున్నారు.
- జీవిత భాగస్వాములు తాము చెప్పినట్లు వినలేదంటూ ఇద్దరిలో ఎవరో ఒకరు దారి తప్పి సమస్యల ఊబిలో కూరుకుపోతున్నారు.
- స్మార్ట్‌ఫోన్లను అతిగా వినియోగించి సోషల్ మీడియా పరిచయాలతో ప్రాణాల మీదికి తెచ్చుకోవడం.
- మద్యానికి బానిసై ఆర్థిక సమస్యల్లో చిక్కుకుని .. కుటుంబ పోషణ గురించి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటం కూడా కారణమవుతోంది.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి



దంపతుల మధ్య మనస్పర్థలు రావడం సహజమే. అయితే క్షణికావేశాలకు వెళ్లకుండా.. సామరస్యంగా ఇద్దరూ పరిష్కార మార్గం ఎంచుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. వివాహం జరిగిన కొత్తలో మనస్పర్థలు వచ్చినా.. వెంటనే సరిదిద్దుకోవాలి. అయితే ఇరవై ఏళ్ల దాంపత్య జీవితంలో కూడా ఇంకా సమస్యలు వెలుగు చూస్తుండటం అవగాహన లోపమే. దంపతులిద్దరూ పిల్లలు, కుటుంబ బాధ్యతల గురించి తెలుసుకుంటే ఎలాంటి మనస్పర్థలు రావు. క్షణికావేశంతో తీసుకునే నిర్ణయాలతో కుటుంబం రోడ్డున పడుతుంది. అంతేకాకుండా చిన్నారులు అనాథలుగా మారాల్సి వస్తోంది.

– వి.రత్న, సత్యసాయి జిల్లా ఎస్పీ

---

70 ఏళ్లు 61 కోర్సులు

నిత్య విద్యార్థి డాక్టర్ కర్రి రామారెడ్డి

తాజాగా 11 సర్టిఫికెట్ కోర్సుల్లో ఉత్తీర్ణత


ఎనిమిదింటిలో టాపర్

మరోసారి మెగాస్టార్ విభాగంలో చేరనున్న రామారెడ్డి

ఆయనో నిత్య విద్యార్థి. నిరంతరం ఓ కొత్త విషయాన్ని తెలుసుకోవాలి, నూతన విషయాన్ని నేర్చుకోవాలనే తపన ముందు 70 ఏళ్ల వయోభారం దూదిపింజెంలా తేలిపోయింది. ఆ మనో సంకల్పానికి ప్రతిరూపమే 61 కోర్సుల్లో ఉత్తీర్ణుడిని చేసింది. అంతేకాదు వాటిలో కొన్ని కోర్సుల్లో అగ్రగణ్యుడిగా నిలిపింది.

– కంబాలచెరువు (రాజమహేంద్రవరం)

డాక్టర్ కర్రి రామారెడ్డి



ప్రతిష్ఠాత్మక ఐఐటీల నుంచి సర్టిఫికెట్ కోర్సులు

వృత్తి వైద్యం.. ప్రవృత్తి నిరంతర అధ్యయనం

రాజమహేంద్రవరానికి చెందిన మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి 1980లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. నగరంలోని దానవాయిపేటలో సొంతంగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. వృత్తిపరంగా సేవల్లో రాణిస్తున్నారు. అయితే మారుతున్న కాలానికనుగుణంగా పలు విషయాలపై లోతైన అధ్యయనం చేయాలనే తపన ఆయనలో గాఢంగా నాటుకుపోయింది. 1989 నుంచి పలు అంశాల్లో డిగ్రీల సాధనకు ఉద్యుక్తులయ్యారు. అప్పటి నుంచి సర్టిఫికెట్ కోర్సుల వేటను ప్రారంభించారు. అలా మూడున్నర దశాబ్దాల కాలంలో ఆయన పేరు చెంత 61 కోర్సులు చేరాయి. 2024వరకు ఇలా 50 కోర్సులు పూర్తి చేశారు. ఈ ఏడాది జనవరి, జూన్ ఒకే సెమిస్టర్‌లో 11 ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేశారు. వీటిలో ఎనిమిది కోర్సుల్లో టాపర్‌గా నిలిచారు. ఒకే సెమిస్టర్‌లో ఏదైనా ఆరు కోర్సుల్లో టాపర్‌గా నిలిస్తే ఎన్‌పీటీఈఎల్ మెగాస్టార్ విభాగంలో చేరుస్తారు. గత సెమిస్టర్‌లో ఆ గౌరవాన్ని రామారెడ్డి అందుకున్నారు. మరోసారి ఎనిమిది కోర్సుల్లో టాపర్‌గా నిలిచి, ఇంకోసారి మెగాస్టార్ గుర్తింపునకు అర్హత సంపాదించారు.

డాక్టర్ రామారెడ్డి ఖరగ్‌పూర్ ఐఐటీ నుంచి 4, బాంబే, ఐఐటీ, మద్రాస్ ఐఐటీల నుంచి చెరో 3, గౌహతి ఐఐటీ నుంచి ఒకటి చొప్పున మొత్తం 11 కోర్సులు పూర్తి చేశారు. ఆయా ఐఐటీలు అందించే సీడీబీ, సీయూడీ, సీఎస్ఎమ్, సీఈఐ, సీఎమ్ఎస్పీ తదితర కోర్సుల్లో చేరి ఏకకాలంలో ఉత్తీర్ణులయ్యారు. అంతేకాదు మెగాస్టార్ గుర్తింపుపొందారు. ఈ కోర్సులన్నింటికీ స్థానిక రాజీవ్‌గాంధీ కాలేజీ కేంద్రం కావడంతో వేరే ప్రాంతానికి వెళ్లనవసరం లేకుండా ఇక్కడే పూర్తి చేశారు. వీటితో కలిపి ఇప్పటి వరకు రామారెడ్డి 61 కోర్సులు పూర్తి చేశారు. జీవితంలో చదువు ఒక భాగంగా మారిందని, అవార్డులు, రికార్డుల కోసమో ఈ పనిచేయడం లేదంటున్నారు వైద్యులు రామారెడ్డి. చదువుకు వయస్సుతో సంబంధం లేదని రుజువు చేస్తున్నందుకు ఆనందంగా ఉందని ఆయన చెబుతున్నారు. భవిష్యత్‌లో మరిన్ని డిగ్రీలు సాధించి తీరుతానంటున్నారాయన. యోగా సాధనతో శరీరానికి, మనస్సుకి శక్తి వచ్చినట్లుగానే, నిత్యం చదవడం వలన మెదడు చురుకుగా ఉంటుందని మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. రామారెడ్డి కృషిని స్థానికులు అభినందిస్తున్నారు.

మూల్యాంకనంలో తప్పులకు లోకేశ్‌దే బాధ్యత
ప్రకాశం జిల్లా డీఈవో కార్యాలయాన్ని ముట్టడించిన విద్యార్థి నాయకులు

ఒంగోలు సిటీ: పదో తరగతి పరీక్షల మూల్యాంకనంలో వేలాది మంది విద్యార్థులకు మార్కులు తప్పుగా రావడానికి విద్యా శాఖమంత్రి లోకేశ్‌దే బాధ్యత అని, ఆయన తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జోనల్ అధ్యక్షుడు దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా డీఈవో కార్యాలయాన్ని వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘ నాయకులు శుక్రవారం ముట్టడించారు. ట్రిపుల్ ఐటీకి అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల సీటు రాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు నష్టపోయారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం మూల్యాంకనం తప్పిదాల వల్ల ట్రిపుల్‌ఐటీ సీట్లు కోల్పోయిన వారికి ప్రత్యేకంగా అడ్మిషన్లు నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ మూల్యాంకనంలో తప్పిదాలపై ప్రశ్నించిన విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిపై గంజాయి కేసు పెట్టి జైల్లో పెట్టారని, ఇది అత్యంత దుర్మార్గమన్నారు.

ప్రతిభ అవార్డుల కొలమానం ఏంటి?
ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ప్రభుత్వం విద్యార్థులకు అందించే ప్రతిభా అవార్డులకు కొలమానమేంటో చెప్పాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. విద్యార్థుల మార్కులా లేక చదువు అమ్మడం, కొనడమా అని ప్రశ్నించింది. దీనికి ఇంటర్మీడియట్ విద్యా మండలి సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. ప్రతిభా అవార్డులు విద్యార్థి ఉన్నత విద్యకు, వారు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని, ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయంది. మరి ఎవరిని ప్రోత్సహించేందుకు ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నారో చెప్పాలని నిలదీసింది. విద్యా వ్యవస్థను ప్రభుత్వం వ్యాపారంగా మార్చేసిందని, ప్రైవేటు యాజమాన్యాల్లో చదివే విద్యార్థులను మార్కుల వైపు పరుగులు తీయిస్తున్నారని, ఇంటర్మీడియట్ బోర్డు పాఠ్య ప్రణాళిక అనుసరించని ప్రైవేటు కళాశాల విద్యార్థుల కోసమే ఈ అవార్డులు ఇచ్చేలా ఉన్నారని పేర్కొంది. అవార్డులు ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు వచ్చే అవకాశం లేదని, ఏడాది కాలంలో ప్రభుత్వం విద్యను భ్రష్టు పట్టించిందని ఘాటుగా వ్యాఖ్యానించింది.

ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు
వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు

సాక్షి అమరావతి: ఎమ్మార్పీకి మించి రాష్ట్రంలో ఎవరైనా ఎరువులు విక్రయిస్తే సంబంధిత డీలర్ల లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా, వారిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు హెచ్చరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎరువుల కొరత లేదన్నారు. ఎమ్మార్పీ ధరకు మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని, విధిగా రసీదు తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే సమీప వ్యవసాయశాఖాధికారులకు లేదా టోల్ ఫ్రీ నం .155251కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు 16.76 లక్షల టన్నులు ఎరువులు అవసరం కాగా, 11.09 లక్షల టన్నుల నిల్వ లుండగా, ఇప్పటి వరకు 2 లక్షల టన్నుల ఎరువుల అమ్మకాలు జరిగాయని, మరో 9.09 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

యువతకు ఉపాధి.. యోధులకు భరోసా

- పదవీ విరమణ పొందుతున్న సైనికులకు 'ఫుడ్‌క్రాఫ్ట్' అండ
- మూడు నెలల శిక్షణతో స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు
- నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి



ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్



ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ అనంతరం పరీక్ష రాస్తున్న డిఫెన్స్ ఉద్యోగులు(ఫైల్)

ఆరిలోవ: విశాఖ నగరంలోని ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్రత్యేక గుర్తింపు పొందింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక ఇన్‌స్టిట్యూట్ ఇది. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది యువత దేశ విదేశాల్లో ఉద్యోగాలు సాధించడంతో పాటు స్వయం ఉపాధి మార్గాల్లో స్థిరపడ్డారు. అలాగే ఈ ఇన్‌స్టిట్యూట్‌లో రక్షణ రంగ ఉద్యోగులకు సైతం వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నారు. విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో 1986లో ఈ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటైంది. అప్పటి నుంచి వేలాది మంది నిరుద్యోగ పేద యువతకు అండగా నిలుస్తోంది. పదో తరగతి ఉత్తీర్ణులైన యువతీ యువకులకు వంటలు, హాస్పిటాలిటీ, బేకరీ వంటి విభాగాల్లో శిక్షణ ఇచ్చి, వారిని సొంతకాళ్లపై నిలబడేలా తీర్చిదిద్దుతోంది.

రక్షణ రంగ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ

2017 నుంచి ఈ ఇన్‌స్టిట్యూట్ తన సేవల పరిధిని మరింత విస్తరించింది. కేంద్ర ప్రభుత్వ చొరవతో డిఫెన్స్ రంగంలోని ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగులకు వంటల తయారీలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఉద్యోగ విరమణకు ఆరు నెలల గడువు ఉన్న వారిలో ఆసక్తి కలిగిన వారిని ఎంపిక చేసి, వారికి ఈ శిక్షణ అందిస్తున్నారు. డైరెక్టర్ జనరల్ రీసెటిల్‌మెంట్(డీజీఆర్) ఆధ్వర్యంలో ఐఐటీ, ఎన్ఐటీ, ఎఫ్‌సీఐ వంటి సంస్థలతో పాటు ఫుడ్‌క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్‌లో కూడా ప్రీ రిలీజ్ కోర్సు(పీఆర్‌సీ)లలో భాగంగా ఈ శిక్షణను అందిస్తున్నారు. ఈ శిక్షణకు సంబంధించిన ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఇక్కడ ఉత్తర, దక్షిణ భారత వంటకాలతో పాటు హాస్పిటాలిటీ, బేకరీ, టూరిజం (హోటల్ మేనేజ్‌మెంట్) వంటి విభాగాల్లో నిష్ణాతులైన ఇన్‌స్ట్రక్టర్ల ద్వారా తర్ఫీదు ఇస్తున్నారు. 2017 నుంచి ఇప్పటివరకు 24 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశారు. ప్రతీ బ్యాచ్ మూడు నెలల కాలపరిమితితో నడుస్తుంది. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ అందజేస్తారు. ఈ సర్టిఫికెట్‌తో వారు పదవీ విరమణ అనంతరం స్వయం ఉపాధి పొందడానికి లేదా ఇతర సంస్థల్లో ఉద్యోగాలు సంపాదించడానికి మార్గం సుగమం అవుతోంది.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

ఇక్కడ శిక్షణ పొందిన పలు రాష్ట్రాలకు చెందిన డిఫెన్స్ ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతాలు, పట్టణాల్లో విజయవంతంగా ఉపాధి పొందుతున్నారు. కొందరు విశాఖ నగరంలోని పలు హోటళ్లు, గీతం వంటి యూనివర్సిటీల్లో ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొందరు ఇతర రాష్ట్రాల్లో సొంతంగా హోటళ్లు, పార్లర్లు కూడా నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు ఒడిశాకు చెందిన తుస్టి అనే ఆర్మీ ఉద్యోగి ఇక్కడ శిక్షణ పొందారు. పదవీ విరమణ తర్వాత తన పేరుతోనే ఒక పార్లర్‌ను విజయవంతంగా నడుపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో కొనసాగుతున్న ఈ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్.. అటు నిరుద్యోగ యువతకు, ఇటు దేశ సేవలో తరించిన సైనికులకు ఉపాధి మార్గాలను చూపుతూ ఆదర్శంగా నిలుస్తోంది.



శిక్షణలో తయారు చేసిన వంటకాలు



శిక్షణ పొందిన అనంతరం డిఫెన్స్ ఉద్యోగి ఒడిశాలో నిర్వహిస్తున్న పార్లర్

రిటైర్‌మెంట్ అనంతరం నూతన కెరీర్



ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో 2024 బ్యాచ్‌లో 'డిప్లమో ఇన్ బ్యాంక్విట్ మేనేజ్‌మెంట్'లో మూడు నెలల పాటు శిక్షణ పొందాను. ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగ విరమణ అనంతరం గీతం వర్సిటీలో హాస్పిటాలిటీ సర్వీస్‌లో ఉద్యోగంలో చేరాను. ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందడం వల్ల నాకు రిటైర్ అయిన తర్వాత కూడా ఉపాధి లభించింది.

– ఆర్.అనూప్, రిటైర్డ్ ఉద్యోగి, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

శిక్షణ వల్లే సాధ్యమైంది



2024 బ్యాచ్‌లో ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో హాస్పిటాలిటీలో శిక్షణ పొందాను. మూడు నెలల శిక్షణ అనంతరం తిరిగి ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగంలో చేరాను. మూడు నెలలు తర్వాత రిటైర్ అయ్యాను. అనంతరం గీతం యూనివర్సిటీలో ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం లభించింది. ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో పొందిన శిక్షణ వల్లే ఇది సాధ్యమైంది. దీంతో నా కుటుంబాన్ని పోషించుకోవడానికి వేరే చోట ఉద్యోగం కోసం వెతకాల్సిన పని తప్పింది.

– శ్రీకాంత్, రిటైర్డ్ ఉద్యోగి, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

డిఫెన్స్ ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు



2017 నుంచి డిఫెన్స్ ఉద్యోగులకు ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటివరకు 24 బ్యాచ్‌ల్లో 796 మందికి శిక్షణ అందించి సర్టిఫికెట్లు అందజేశాం. ఇక్కడ శిక్షణ పొందినవారు డిఫెన్స్‌లో రిటైర్ అయిన వెంటనే వివిధ రంగాల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. కొందరు సొంతంగా హోటళ్లు, పార్లర్లు నిర్వహిస్తున్నారు. ఇది వారికి చాలా మంచి అవకాశం. ఈ శిక్షణకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది.

-కె.వి.రమణ, ప్రిన్సిపాల్, ఫుడ్‌క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్, విశాఖపట్నం

• చిత్రం చెప్పిన కథ



ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి

ఈ రెండు ఫోటోలు గమనించింది. రెంటిలోనూ ఉన్నది ఒక్క జంటే. ఇద్దరి కాళ్లు గమనించారా? అతని కాళ్లకు బదులు ఇనుప రాడ్లు ఉన్నాయి కదూ. అయినా అతను తన భార్యతో ఎంత సంతోషంగా డాన్స్ చేస్తున్నాడో గమనించారా? అతని పేరు ఒలెక్సండర్ జెవనెన్‌కో. వయసు 36. ఉక్రెయిన్ దేశస్థుడు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక ఉక్రెయిన్ సైనికుడైన జెవనెన్‌కోకు రెండు కాళ్లు తెగిపోయాయి. అయినా అతను ధైర్యంగా ఆ యుద్ధ గాయాన్ని ఎదుర్కొన్నాడు. బతికాడు. ఇలా కృత్రిమ కాళ్లతో ముందుకు సాగుతున్నాడు. అతని భార్య మారియా కొరియోగ్రాఫర్. అందుకని ఆమె స్టెప్స్‌కు అనుగుణంగా అతను కూడా కాళ్లు కదిపాడు. చిన్న చిన్న దెబ్బలకే బెంబేలెత్తేవారు ఇతని నుంచి చాలా నేర్చుకోవాలి కదూ.



• ఇన్‌స్పిరేషన్

చదరంగానికి రారాజు



పిల్లలూ... నార్వేలో జరుగుతున్న ప్రపంచ చెస్ టోర్నమెంట్‌లో కొమ్ములు తిరిగిన గ్రాండ్‌మాస్టర్లు పాల్గొన్నారు. వీరిలో అమెరికాకు చెందిన వరల్డ్ నం.1 గ్రాండ్ మాస్టరైన మాగ్నస్ కార్ల్‌సన్‌ను మన తెలుగు గ్రాండ్‌మాస్టర్ గుకేష్ ఓడించాడు. గుకేష్ ఇప్పటికే ప్రపంచ ఖ్యాతి గడించాడు. ఇప్పుడు ఈ విజయం అతనికి మరింత గొప్పదనం తెచ్చింది.

ఇంతకీ మీకు గుకేష్ గురించి తెలుసా?

పలకా – బలపం పట్టి బడికెళ్ళే వయసులో చెస్ బోర్డ్ – పీసెస్ పట్టుకుని ప్రపంచ ఛాంపియన్ కావాలని కావాలని కలలు కన్నాడు గుకేష్ దొమ్మరాజు. 2006 మే 29న చెన్నైలో ఒక తెలుగు కుటుంబంలో జన్మించిన గుకేష్ ఏడేళ్ళప్పుడు వెళమ్మాళ్ స్కూల్‌లో చదరంగం నేర్చుకోవడం ప్రారంభించాడు. ఆ తరువాత కొద్ది కాలానికే చెస్‌లో అతను చూపించిన అసాధారణ ప్రతిభ తల్లిదండ్రులను అబ్బురపరిచింది. దీంతో వారు నాలుగవ తరగతిలో ఉన్నప్పుడే ఫార్మల్ ఎడ్యుకేషన్ ఆపించి, గుకేష్ చెస్ పై దృష్టి పెట్టేలా ప్రోత్సహించారు. ఈ నిర్ణయం అతని కెరీర్‌లో కీలకమైన మలుపుగా నిలిచింది.

చెన్నైలోని ఒక చెస్ అకాడమీలో కఠినమైన శిక్షణ పొందాడు గుకేష్. రోజూ సగటున 70 చెస్ పజిల్స్ పరిష్కరించడం, చెస్ ఇంజన్‌లతో అభ్యాసం చేయడం వంటి విభిన్న పద్ధతులతో, విశ్లేషాత్మకంగా శిక్షణ కొనసాగించాడు. మరింత తర్ఫీదు కోసం అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన విశ్వనాథన్ ఆనంద్ అకాడమీలో చేరాడు. వెస్ట్‌బ్రిడ్జ్ చెస్ అకాడమీలో ఆనంద్ మెంటర్‌షిప్‌లో అతని ఆట స్థాయి మరింత పదునెక్కింది. 2019లో 12 సంవత్సరాల వయస్సులో గుకేష్ గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధించి, చరిత్రలో రెండవ అతి పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు.



2024 అభ్యర్థుల టోర్నమెంట్‌లో 17 ఏళ్ల వయస్సులో విజయం సాధించి, మరోసారి అతి పిన్న వయస్కుడైన ఛాంపియన్‌షిప్ ఛాలెంజర్‌గా నిలిచాడు. ఈ విజయం డింగ్ లిరెన్‌తో జరిగిన 2024 ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌కు దారితీసింది. అక్కడ గుకేష్ 7.5–6.5 స్కోరుతో విజేతగా నిలిచాడు. ఈ విజయంతో గ్యారీ కాస్పరోవ్ రికార్డును అధిగమించి, 18 ఏళ్ల వయస్సులో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన అతి పిన్న వయస్కుడిగా చరిత్రలో నిలిచాడు.



గుకేష్ తల్లిదండ్రుల త్యాగం అతని విజయంలో కీలక పాత్ర పోషించింది. తండ్రి తన వృత్తిని వదిలి, గుకేష్‌తో ప్రపంచవ్యాప్తంగా టోర్నమెంట్‌లకు ప్రయాణించాడు, తల్లి ఇంటి బాధ్యతలను నిర్వహించింది. స్పాన్సర్‌షిప్ లేని సమయంలో కూడా కుటుంబం ఆర్థికంగా అతనికి మద్దతు ఇచ్చింది. గుకేష్ ఈ ప్రయాణంలో తన గురువు విశ్వనాథన్ ఆనంద్ యొక్క వారసత్వాన్ని కొనసాగిస్తూ, భారత చెస్‌కు కొత్త గౌరవాన్ని తెచ్చాడు.

• మహనీయులు

తెలుగు రాష్ట్రానికి తొలి సభాపతి కాళేశ్వరరావు



తెలుగు నేల మీద ఎంతోమంది స్వాతంత్ర్య సమర యోధులు పుట్టారు. దేశం కోసం ఎన్నో సేవలందించారు. వారిలో ఒకరు అయ్యదేవర కాళేశ్వర రావు. జనవరి 22, 1881న కృష్ణా జిల్లా నందిగామలో లక్ష్మయ్య, వరలక్ష్మమ్మ దంపతులకు ఆయన జన్మించారు. వరలక్ష్మమ్మ లక్ష్మీదేవి పూజ చేసేవారు. ఆ భక్తితో ఆయనకు 'కాళి' పేరు మీదుగా కాళేశ్వరరావు అని నామకరణం చేశారు. మద్రాసు (నేటి చెన్నై) విశ్వవిద్యాలయంలో బీఎల్ చదివిన కాళేశ్వర రావుకు అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తామన్నా విదేశీ ప్రభుత్వం కింద పని చేయనని చెప్పి నిరాకరించారు. 1906లో విజయవాడలో న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టారు. 1921లో మహాత్మాగాంధీ పిలుపు మేరకు న్యాయవాది వృత్తిని వదిలేశారు. రఘుపతి వెంకటరత్నం నాయుడు ప్రభావంతో బ్రహ్మ సమాజ కార్యక్రమాలపై ఆయనకు ఆసక్తి కలిగింది. అదే సమయంలో ఉవ్వెత్తున్న ఎగిసిన స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. విజయవాడలోని రామమోహన గ్రంథాలయం స్థాపనకు సాయమందించారు. వేదాంతం, చరిత్ర, రాజకీయాల నేపథ్యం పై అనేక రచనలు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ను జైల్లో పెట్టగా, ఆ సమయంలోనే చైనా జాతీయోద్యమ చరిత్ర, ఈజిప్ట్ చరిత్ర, ఫ్రెంచి విప్లవ చరిత్ర, అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రపై పుస్తకాలు రాశారు. శాసనసభ ఎన్నికలలో కాళేశ్వరరావు విజయవాడకు ప్రాతినిధ్యం వహించారు. విజయవాడ పురపాలక సంఘ అధ్యక్షుడిగానూ, మద్రాసు శాసనసభకు చీఫ్ విప్‌గా బాధ్యతలు చేపట్టారు. 1955లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తొలి శాసనసభకు తొలి సభాపతిగా ఎన్నికై 1962 వరకు బాధ్యతలు నిర్వర్తించారు. 1962 ఫిబ్రవరి 26న కాళేశ్వరరావు మరణించారు.

• వండర్ కిడ్

ఎనిమిదేళ్ల పాప.. పత్రిక ఎడిటర్





పిల్లలూ! రోజూ పొద్దున్నే న్యూస్‌పేపర్ చదివే అలవాటు చాలామందికి ఉంటుంది. అయితే రకరకాల వార్తలు ఏరి, కూర్చి మనకు అందించేందుకు న్యూస్‌పేపర్ సంస్థలో అనేక మంది పనిచేస్తుంటారు. వారందరికీ బాస్‌గా వ్యవహరించేది ఎడిటర్. ఆ పత్రిక బయటకు రావడంలో ఆయనదే కీలక పాత్ర. ఎడిటర్‌గా స్థానం పొందాలంటే ఎంతో అనుభవం కావాలి. అయితే ఓ పాప మ్యాగజైన్ ఎడిటర్‌గా మారి రికార్డు సృష్టించింది.

ఆస్ట్రేలియాకు చెందిన రోక్సాన్ డౌన్ ఎనిమిదేళ్లకే 'ఇట్‌గర్ల్' అనే మ్యాగజైన్‌కి ఎడిటర్‌గా మారింది. ఆ వయసున్న చిన్నారులు తోటి పిల్లలతో ఆడుకోవాలని అనుకుంటారు. అయితే రోక్సాన్ మాత్రం ఏదైనా కొత్తగా చేయాలన్న ఆలోచనతో ఉంది. తన వయసున్న ఆడపిల్లలు చదువుకునే మ్యాగజైన్‌ను రూపొందించాలని భావించింది. దానికి తనే ఎడిటర్‌గా మారింది. మ్యాగజైన్‌లో ఏం రాయాలో, ఎలాంటి అంశాలను చేర్చాలో తెలుసుకునేందుకు రోక్సాన్ చాలా పరిశోధనలు చేసింది. రోజంతా తన వయస్సుగల వారితో తిరుగుతూ వారి ఇష్టాలు, ఇబ్బందులు, వారు ఆసక్తులు గమనించి, వాటి గురించి తన మ్యాగజైన్‌లో వ్యాసాలు రాయడం మొదలుపెట్టింది.

మ్యాగజైన్ కోసం ప్రముఖ పాప్ గాయకుడు జస్టిన్ బీబర్‌ని రోక్సాన్ ఇంటర్వ్యూ చేసింది. అది ప్రఖ్యాతి పొందడంతో ఆ తర్వాత అనేకమంది రచయితలు, టిక్‌టాక్ స్టార్లు, గాయకులు, నటులను ఇంటర్వ్యూలు చేసే స్థితికి చేరుకుంది. ఆ ఇంటర్వ్యూలను వీడియో రూపంలో యూట్యూబ్‌లో చూడొచ్చు. ఓ వైపు మ్యాగజైన్ పనులు చేస్తూనే, పాఠశాలకు వెళ్లి చదువుకుంటోంది రోక్సాన్. బద్ధకంగా ఉండటం తనకు అస్సలు నచ్చదని, జీవితంలో ఏదైనా సాధించాలన్న ఆకాంక్ష అందరిలోనూ ఉండాలని తను చెప్తోంది.

• పుస్తకాలు చదువుదాం


కొలంబస్ సాహస యాత్రలు



అమెరికాను కనుగొన్నది కొలంబస్ అన్న విషయం మనందరికీ తెలుసు. భారతదేశానికి మార్గం కనుక్కునే క్రమంలో ఆయనకు అమెరికా ఎదురైంది. అందుకుగానూ ఆయన ఎన్నో సాహసాలు చేయాల్సి వచ్చింది. తన ప్రాణాలనే పణంగా పెట్టాల్సి వచ్చింది. కొత్త విషయాలు కనుక్కునే క్రమంలో ఎవరైనా అలాంటివి చేయాల్సిందే. క్రిస్టోఫర్ కొలంబస్ చేసిన నిజ జీవిత సాహస యాత్రలు ఈ పుస్తకంలో పొందుపరిచారు. పిల్లలు చాలా ఆసక్తి కలిగించే పుస్తకం ఇది.

* * *

ది టేల్ ఆఫ్ పీటర్ రాబిట్



పీటర్ అనే చిన్నారి కుందేలు చాలా తుంటరిది. ఓ రోజు మిస్టర్ మెక్‌గ్రెగర్‌కు చెందిన తోటలోకి ప్రవేశించి అల్లరి చేస్తుంది. అక్కడ నుంచి తప్పించుకున్న పీటర్ తన తల్లి వద్దకు తిరిగి వస్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందనేది తెలియాలంటే 'ది టేల్ ఆఫ్ పీటర్ రాబిట్' పుస్తకం చదవాలి. 1902లో బీట్రిక్స్ పాటర్ అనే రచయిత రాసిన పిల్లల నవల ఇది. దీన్ని ప్రచురించేందుకు ఎవరూ ముందుకు రాక, చివరకు ఆయనే దీన్ని ముద్రించారు. ఇప్పటిదాకా ఈ పుస్తకం 45 మిలియన్ కాపీలు అమ్ముడుపోయింది.

• బాలల కథ

నక్క వైద్యం



ఒకానొక అడవిలో క్రూరమైన పులి ఉండేది. కనిపించిన జంతువునల్లా చంపి తినేసేది. ఒకసారి ఓ లేడిని చంపి తిన్న తర్వాత పులికి తీవ్రమైన పంటి నొప్పి వచ్చింది. మొదట్లో పులి దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కానీ రోజురోజుకీ నొప్పి తీవ్రమైంది. ఆ బాధతో వేటకు వెళ్లడం మానేసింది. వెంటనే తనకు వైద్యం చేయాలని జంతువులకు కబురు పెట్టింది. పులికి వైద్యం చేయకపోతే అడవికి రాజు ఉండడు. రాజు లేకపోతే వేరే అడవుల నుంచి ప్రమాదం. అందువల్ల జంతువులు ఏ ఆపాయం నుంచి బయటపడాలనుకున్నాయి.

ముందుగా ఓ మొసలి వచ్చి పులికి వైద్యం చేయాలని ప్రయత్నించింది. పంటినొప్పిని తగ్గిద్దామని నోరు తెరవమంది. పులి నోరు తెరవగానే ఆ దుర్వాసనకు మొసలి ముక్కు మూసుకుంది. అది చూసి పులి హూంకరించింది. నన్నే అవమానిస్తావా అంటూ మొసలిని అక్కడి నుంచి తరిమికొట్టింది. ఆ తర్వాత ఓ తోడేలు పులికి వైద్యం చేస్తానంటూ వచ్చింది. పులి నోరు తెరవగానే ఆ దుర్వాసన కారణంగా ఎదుట నిలవలేక ముఖం పక్కకు తిప్పుకుంది. ఈ విషయం పులికి అర్థమైంది. అయితే తనకు అవమానం జరిగిందని భావించి తోడేలును కూడా తరిమికొట్టింది.



ఇలా పులి దగ్గరికి ఏ జంతువు వచ్చినా దుర్వాసన తట్టుకోలేక ముఖం తిప్పుకోవడం, అది చూసి పులి వాటిని తరిమికొట్టడం రివాజుగా మారింది. చివరకు అడవిలోని నక్క ఓ ఉపాయం ఆలోచించింది. పులికి తాను వైద్యం చేస్తానని ముందుకొచ్చింది. ముక్కుకు ఓ బట్ట అడ్డం పెట్టుకొని పులి ముందుకు వెళ్లింది. నక్క ముక్కుకు బట్ట చూసి పులి గాండ్రించింది. తనను అవమానిస్తావా అంటూ నక్క మీదకు కోపంగా రాబోయింది. 'అయ్యో.. తప్పుగా భావించకండి. రెండు రోజులుగా నాకు జలుబు చేసింది. ముక్కు నుంచి తెగ నీరు కారుతోంది. తమలాంటి పెద్దవారి ముందుకు వచ్చేటప్పుడు అలాగే వస్తే బాగుండదని ఇలా బట్ట కట్టుకొని వచ్చాను' అని వినయంగా జవాబు చెప్పింది. ఈ విషయం విని పులి ఆగిపోయింది. నక్క చెప్పేది అబద్ధమని అనిపించినా, దాని తెలివికి ముచ్చటపడి దగ్గరికి రమ్మంది. నక్క పులి పంటికి వైద్యం చేసింది. కొద్ది రోజులకు పులి పంటి నొప్పి తగ్గిపోయింది. నక్కకు పులి దగ్గర మంచి ప్రాపకం లభించింది.

నీతి: అపాయానికి ఉపయమే శరణ్యం.

పిల్లలతో రండి పార్క్‌లో అడుగు పెట్టండి

పిల్లలూ! పార్కులు చాలా ఉంటాయి. వాటికి పిల్లలు, పెద్దలు వెళుతుంటారు. మార్నింగ్, ఈవెనింగ్ వాకింగ్ కోసం పెద్దవాళ్లు పార్కులకు వెళుతుంటారు. వాళ్లను ఏ పార్కు వాళ్లయినా రానిస్తారు. కాని ఒక పార్కు ఉంది. అక్కడ మాత్రం పిల్లలు తోడు లేకుండా పెద్దలు పార్క్‌లోకి అడుగు పెట్టడానికి లేదు. అంటే పిల్లలే ఎంట్రీ టికెట్ అన్నమాట.

లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియం సమీపంలోని బ్లూమ్స్‌బరీలో ఉన్న కోరమ్స్ ఫీల్డ్స్ పార్క్‌లోకి వెళ్లాలంటే పెద్దల వెంట పిల్లలు ఉండాల్సిందే. 16 వయసులోపు పిల్లలంతా ఇక్కడికి వచ్చి ఎంతసేపైనా గడపొచ్చు. అంతకంటే పెద్ద వయసువారు రావాలంటే వెంట పిల్లల్ని తీసుకునే వెళ్లాలి. చిన్నారుల్ని ప్రకృతికి దగ్గర చేసేందుకు ఆ పార్క్ వాళ్లు పెట్టిన రూల్ ఇది. ప్రపంచంలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన మొట్టమొదటి పార్క్‌లలో ఇది కూడా ఒకటి.

కెప్టెన్ థామస్ కోరమ్ అనే సమాజ సేవకుడు లండన్ నగర ప్రజలకు ఎన్నో సేవలందించారు. 1936లో స్థానికంగా పార్క్ ఏర్పాటు చేసినప్పుడు దానికి 'కోరమ్స్ ఫీల్డ్స్ పార్క్' అని ఆయన పేరు పెట్టారు. ఈ పార్క్‌లో అనేక విశేషాలున్నాయి. అన్ని పార్కులలాగే ఇక్కడా చెట్లు, ఆట వస్తువులు, జిమ్ పరికరాలుంటాయి. అయితే ఇక్కడ నిత్యం అనేక కార్యక్రమాలు జరుగుతుంటాయి. క్రీడా అభివృద్ధి కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, యువతకు మోటివేషన్ ప్రోగ్రాంలు, చిన్నపిల్లల్ని సంరక్షించే పద్ధతులపై సెమినార్లు నిర్వహిస్తుంటారు. అందుకే ఇక్కడికి రావడానికి పిల్లలతో పాటు పెద్దలూ ఆసక్తి చూపిస్తుంటారు. ఇక్కడ పిల్లలు సురక్షితంగా ఉంచేందుకు ప్రత్యేకంగా సిబ్బంది ఉంటారు. జంతుప్రదర్శనశాల, అడ్వెంచర్ ప్లేగ్రౌండ్ కూడా అందుబాటులో ఉంది. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు ఈ పార్క్ తెరిచి ఉంటుంది.

• భలే రూల్







రూ. 500కే లవ్లీనా అకాడమీలో బాక్సింగ్ శిక్షణ


అకాడమీ ప్రారంభోత్సవం సందర్భంగా అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ, బాక్సర్ లవ్లీనా

గువాహటి: భారత స్టార్ మహిళా బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ తన ఒలింపిక్స్ కలను సాకారం చేసుకున్నట్లే మిగతా వారు కూడా ఒలింపియన్లుగా ఎదగాలనే లక్ష్యంతో అకాడమీని అందుబాటులోకి తెచ్చింది. ఉత్తర గువాహటిలోని బర్చంద్రాలో గురువారం లాంఛనంగా ప్రారంభమైన ఈ అకాడమీలో ఫీజు ఎంతో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. అందరూ వెచ్చించే విధంగా నెలకు కేవలం రూ. 500 చెల్లించి ఇక్కడ 'పంచ్'లు నేర్చుకోవచ్చు. 8 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయో విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఉంటుంది. అలాగే 18 ఏళ్ల పైబడిన వారికి కూడా కోచింగ్ ఇస్తారు. ఆమె లాభాపేక్షలేని కృషిని గుర్తించిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ రూ. 2 కోట్ల గ్రాంట్‌ను అందజేయనున్నట్లు ప్రకటించారు. లవ్లీనా తన అకాడమీకి ప్రభుత్వ స్థలాన్ని అడగలేదు. 2021లో సొంతంగా అకాడమీ ఏర్పాటు కోసం స్థలం కొనుగోలు చేసిన ఆమె మెరుగైన మౌలిక సదుపాయాలతో దాన్ని తీర్చిదిద్దింది. 26–26 సైజ్ బాక్సింగ్ రింగ్‌తో పాటు ఆధునిక పరికరాలతో కూడిన జిమ్‌ను ఏర్పాటు చేసింది. గువాహటిలో సకల హంగులతో నెలకొల్పిన తొలి బాక్సింగ్ అకాడమీగా చెప్పవచ్చు. అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాల బాలబాలికలు, యువత కోసం దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రతిభా సత్తులు ఉన్న వారు తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు, ప్రొఫెషనల్ బాక్సర్లుగా తయారయ్యేందుకు ఈ అకాడమీ దోహదం చేస్తుందని ఈ సందర్భంగా లవ్లీనా పేర్కొంది. కొత్త తరం బాక్సర్లకు ఇదో వేదికగా మారాలని ఆకాంక్షించింది. 'మేటి బాక్సర్లను తయారు చేయాలనే కలతో దీన్ని నిర్మించాను. ఇక్కడ శిక్షణ పొందిన బాక్సర్లు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పతకాలు తేవాలని, 2028కల్లా కొందరైనా బాక్సర్లు వెలుగులోకి రావాలని ఆశిస్తున్నాను' అని 2020 **టోక్యో ఒలింపిక్స్‌**లో కాంస్య పతకం నెగ్గిన లవ్లీనా **చెప్పింది. దశల** వారీగా బాక్సర్లకు హాస్టల్ వసతి క**ల్పించాలనుకుం**టున్నట్లు తెలిపింది. ఇందుకోసం **రాష్ట్ర ప్రభుత్వ** సహకారాన్ని తీసుకుంటామని చెప్పి**ంది.**

భారత వాలీబాల్ సమాఖ్య ఎన్నికలు నేడు

న్యూఢిల్లీ: ఎన్నాళ్లనుంచో నాన్చుతూ వస్తోన్న భారత వాలీబాల్ సమాఖ్య (వీఎఫ్ఐ) ఎన్నికలు నేడు తేలనున్నాయి. ఢిల్లీ హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం శనివారం ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఎన్నికల ప్రక్రియ జరుగనుంది. ఓ రకంగా వీఎఫ్ఐలో ఇదొక ముందడుగని చెప్పొచ్చు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఎన్నికైన కార్యవర్గం సమాఖ్యను నడిపించబోతోంది. ఇక ఎన్నికల ప్రక్రియ విషయానికి వస్తే... దేశవ్యాప్తంగా 33... రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలుపుకొని 66 మంది ప్రతినిధులు ఈ ఓటింగ్‌లో పాల్గొంటారు. 12 కీలక పదవుల కోసం 29 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. అధ్యక్ష కార్యదర్శులు, ఇద్దరు ఉపాధ్యక్షులు, ఒక కోశాధికారి, ఇద్దరు సంయుక్త కార్యదర్శులు, ఐదుగురు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎన్నిక కావాల్సివుంది. అధ్యక్ష పదవి కోసం ముక్కోణపు పోటీ నెలకొంది. బిహార్‌కు చెందిన ఆనంద్ శంకర్, నాగాలాండ్‌కు చెందిన ప్రేమ్ సింగ్, హిమాచల్ నుంచి వీరేందర్ కన్వార్ రేసులో ఉన్నారు. ప్రధాన కార్యదర్శికి గట్టిపోటీ ఉంది. మొహమ్మద్ అక్రమ్‌ఖాన్ (ఛత్తీస్‌గఢ్), నిలేశ్ విష్ణు (మహారాష్ట్ర), రామనంద్ చౌదరి (రాజస్థాన్)లు కార్యదర్శి పదవిని ఆశిస్తున్నారు. ఓటింగ్ ముగిసిన అర్ధగంటకే కౌంటింగ్ ప్రారంభిస్తారు. ఈ ఎన్నికలకు రిటైర్డ్ జస్టిస్ కృష్ణభట్‌ను రిటర్నింగ్ అధికారిగా ఢిల్లీ హైకోర్టు నియమించింది. అలాగే భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), కేంద్ర క్రీడాశాఖ, అంతర్జాతీయ వాలిబాల్ సమాఖ్య ప్రతినిధులు కూడా పర్యవేక్షకులుగా హాజరు కానున్నట్లు తెలిసింది.



అయ్యయ్యో నవదీప్..!

లాస్ ఏంజెలిస్ పారాలింపిక్స్‌లో అతని కేటగిరీకి కత్తెర ● యోగేశ్ ఈవెంట్ కూడా...

న్యూఢిల్లీ: నవదీప్ సింగ్ గుర్తున్నాడా... అదేనండీ మరుగుజ్జు జావెలిన్ త్రోయర్, పారిస్ పారాలింపిక్స్ (2024)లో ఎఫ్41 ఈవెంట్‌లో పోటీపడటంతోనే అందరిని ఆకర్షించాడు. పొట్టి కాళ్లతో చిట్టి చిట్టి అంగల్లు వేగంగా వేసుకుంటూ వెళ్లి ఈటెను విసిరిన ప్రదర్శన చాలా గమ్మత్తుగా ఉంటుంది. ఆ ప్రదర్శనతోనే నవదీప్ బంగారు పతకంతో అందలమెక్కాడు. మన ప్రధాని నరేంద్ర మోదీ ముచ్చటపడి మరీ అతనికి షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకు నవదీప్‌తో సమానంగా ఫొటోలో కనిపించేందుకు కింద కూర్చున్నారు. అతని నెత్తికి టోపీపెట్టి అభినందించారు. అలా క్రీడాప్రియులకు పరిచయమైన నవదీప్‌కు లాస్ ఏంజెలిస్–2028 ఒలింపిక్స్ పెద్ద షాక్ ఇచ్చింది. అతను స్వర్ణం నిలబెట్టుకునే అవకాశం లేకుండా 'ఎఫ్ 41' కేటగిరీని తదుపరి విశ్వక్రీడల నుంచి తొలగించింది. రోస్టర్‌లో భాగంగా ఆతిథ్య దేశం కొన్ని క్రీడలు లేదంటే కేటగిరీలను పక్కనబెట్టే అవకాశం ఒలింపిక్ చార్టర్ కల్పిస్తుంది. ఇందులో భాగంగానే నవదీప్ ఈవెంట్‌తో పాటు డిస్కస్ త్రోయర్ యోగేశ్ కథునియా 'ఎఫ్ 56' కేటగిరీని సైతం లాస్ ఏంజెలిస్ నిర్వాహకులు తొలగించారు. పారిస్‌లో యోగేశ్ డిస్కస్ త్రో 'ఎఫ్ 56' కేటగిరీలో రజత పతకం గెలుపొందాడు. అయితే వీరిద్దరి కేటగిరీలు లాస్ ఏంజెలిస్ పారాలింపిక్స్‌లోని 552 మెడల్ ఈవెంట్‌లలో లేవు. ఓవరాల్‌గా 4400 అథ్లెట్ల కోటాలో ఏ మార్పు లేదు. టోక్యో, పారిస్ పారాలింపిక్స్‌లో కూడా 4400 మంది అథ్లెట్లు పోటీపడ్డారు. మిగతా క్రీడా ఈవెంట్లను సర్దుబాటు చేయడం ద్వారా 4400 అథ్లెట్ల కోటా అలాగే కొనసాగుతోంది.



రష్మిక జోరు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అమెరికాలోని సౌత్ కరోలినా రాష్ట్రంలోని సమ్టర్ పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 335వ ర్యాంకర్ రష్మిక 6–4, 6–1తో అమెరికాకు చెందిన జూలియా ఫ్లిగ్నెర్‌పై గెలిచింది. 1 గంటా 46 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక 10 ఏస్‌లు సంధించి, 7 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 333వ ర్యాంకర్ దర్యా విద్మనోవా (చెక్ రిపబ్లిక్)తో రష్మిక తలపడుతుంది.

భారత ఆర్చర్లకు నిరాశ

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–3 టోర్నమెంట్‌లో భారత కాంపౌండ్ విభాగం క్రీడాకారులు నిరాశపరిచారు. ఒక్కరు కూడా పతకం సాధించలేకపోయారు. మహిళల వ్యక్తిగత విభాగం క్వార్టర్ ఫైనల్స్‌లో మధుర 152–159తో మరియానా బెర్నాల్ (మెక్సికో) చేతిలో, ప్రపంచ చాంపియన్ అదితి స్వామి 147–152తో ఆండ్రియా బెసెరా (మెక్సికో) చేతిలో ఓడిపోయారు. పురుషుల కాంపౌండ్ విభాగం క్వార్టర్ ఫైనల్లో రిషభ్ యాదవ్ 149–157తో నికోలస్ గిరార్డ్ (ఫ్రాన్స్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

'ఆఖరి' అంచెకు భారత్ 'సై'

● నేడు నెదర్లాండ్స్‌తో పోరు
● ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ హాకీ

రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ హాకీ ఆఖరి అంచె పోటీలకు భారత జట్లు సిద్ధమయ్యాయి. ఈ యూరో అంచె పోటీల్లో అంచనాలకు మించి రాణించాలని, గరిష్ఠ పాయింట్లతో నేరుగా ప్రపంచ కప్ బెర్తు సాధించాలని పురుషుల, మహిళల జట్లు పట్టుదలతో ఉన్నాయి. ముందుగా భారత పురుషుల జట్టు నేడు ఆతిథ్య నెదర్లాండ్స్‌తో తలపడుతుంది. భువనేశ్వర్ అంచె పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన భారత్ వచ్చే ప్రపంచకప్‌కు వేదికైన నెదర్లాండ్స్‌లోనూ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. నేడు, 9వ తేదీన డచ్ టీమ్‌తో జరిగే రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడం ద్వారా యూరో అంచెకు శుభారంభం పలకాలని హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత్ భావిస్తోంది. ప్రస్తుతం 15 పాయింట్లతో ఇంగ్లండ్ (16), బెల్జియం (16)ల తర్వాత మూడో స్థానంలో ఉన్న హర్మన్ బృందం ఈ ఆఖరి అంచె పోటీలతో మెరుగైన స్థానంలో నిలవాలని ఆశిస్తోంది. డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్, మిడ్‌ఫీల్డ్‌లో హార్దిక్ సింగ్‌లతో పాటు రక్షణ శ్రేణిలో అమిత్ రోహిదాస్, హర్మన్, జుగ్‌రాజ్, జర్మన్‌ప్రీత్‌లు స్థాయికి తగిన ఆటతీరును కనబరిస్తే గెలుపు ఏమంత కష్టం కాదు. భారత చీఫ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ తమ జట్టు అన్ని రంగాల్లోనూ మెరుగైందని, యువ ఆటగాళ్లు సైతం అనుభవం సంపాదించారని తప్పకుండా ప్రత్యర్థులపై పైచేయి సాధిస్తారని అన్నాడు. నెదర్లాండ్స్‌తో పోరు ముగిశాక భారత్ 11, 12 తేదీల్లో అర్జెంటీనాతో, 14, 15 తేదీల్లో ఆస్ట్రేలియాతో, 21, 22 తేదీల్లో బెల్జియంతో తలపడుతుంది. మరోవైపు మహిళల జట్టు యూరో అంచె పోటీలను లండన్‌లో ఆడనుంది. ఈ నెల 14 నుంచి భారత మహిళల జట్టు పోరు ప్రారంభం అవుతుంది. భారత జట్టు తొమ్మిది పాయింట్లతో ఆరో స్థానంలో ఉంది. ఇప్పటి వరకు ఎనిమిది మ్యాచ్‌లు ఆడిన భారత జట్టు రెండింటిలో మాత్రమే గెలిచింది.



జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ కొత్త చరిత్ర

తొలిసారి ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీకి అర్హత ● చైనా జట్టుకు నిరాశ





జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ ఆటగాళ్ల సంబరం

దోహా: వచ్చే ఏడాది జరగనున్న ప్రతిష్టాత్మక ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు చైనా దూరమైంది. ఆసియా జోన్ అర్హత పోటీల్లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో చైనా 0–1 గోల్స్ తేడాతో ఇండోనేసియా చేతిలో పరాజయం పాలవడంతో... వరల్డ్‌కప్ రేసుకు దూరమైంది. ఇక ఉజ్బెకిస్తాన్, జోర్డాన్ తొలిసారి ప్రపంచకప్‌నకు అర్హత సాధించగా... క్వాలిఫయింగ్ పోటీల్లో చక్కటి ప్రదర్శన కనబర్చిన దక్షిణ కొరియా కూడా ముందంజ వేసింది. 2026లో అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ప్రపంచ కప్‌నకు ఇప్పటికి 10 జట్లు అర్హత సాధించాయి. ఆతిథ్య హోదాలో ఈ మూడు దేశాలు నేరుగా ముందంజ వేయగా... ఆసియా నుంచి జపాన్, ఇరాన్, జోర్డాన్, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్తాన్... ఓసియానియా నుంచి న్యూజిలాండ్... దక్షిణ అమెరికా నుంచి అర్జెంటీనా వరల్డ్‌కప్ బెర్తులు దక్కించుకున్నాయి.


ఆసియా క్వాలిఫయింగ్ పోటీల్లో భాగంగా... గురువారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా 1–0తో జపాన్‌పై, ఇండోనేసియా 1–0తో చైనాపై, జోర్డాన్ 3–0తో ఒమన్‌పై, సౌదీ అరేబియా 2–0తో బ్రహెయిన్‌పై, పాలస్తీనా 2–0తో కువైట్‌పై, ఖతార్ 1–0తో ఇరాన్‌పై విజయాలు సాధించాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఉజ్బెకిస్తాన్ మధ్య మ్యాచ్ 0–0తో 'డ్రా' కాగా... ఉత్తర కొరియా, కిర్గిస్తాన్ పోరు 2–2 గోల్స్‌తో సమమైంది. దక్షిణ కొరియా 2–0తో ఇరాక్‌పై గెలవడం ద్వారా వరుసగా 11వసారి వరల్డ్ కప్ బెర్త్ దక్కించుకుంది. **యూఏఈ మ్యాచ్ 'డ్రా' అయినా...** గ్రూప్ 'ఎ'లో ఇరాన్ తర్వాత రెండో స్థానంలో నిలవడం ద్వారా ఉజ్బెకిస్తాన్ ముందంజ వేసింది. గ్రూప్ 'బి' నుంచి దక్షిణ కొరియా, జోర్డాన్ టోర్నీకి అర్హత సాధించాయి.

గ్రూప్ 'సి' నుంచి పోటీపడుతున్న చైనా... ఇప్పటి వరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 7 పరాజయాలతో 6 పాయింట్లు ఖాతాలో వేసుకొని చివరి స్థానంలో కొనసాగుతోంది. మరొక్క మ్యాచ్ మాత్రమే మిగిలి ఉండగా... జపాన్ (20 పాయింట్లు), ఆస్ట్రేలియా (16 పాయింట్లు), సౌదీ అరేబియా (13 పాయింట్లు), ఇండోనేసియా (12 పాయింట్లు), బ్రహెయిన్ (6 పాయింట్లు)... చైనా కంటే ముందున్నాయి. 2022లో జరిగిన ప్రపంచ కప్‌లో ఆసియా నుంచి 4 జట్లు మాత్రమే పాల్గొనగా... ఈసారి 8 జట్లు బరిలోకి దిగడం ఖాయమైంది. ఆఫ్రికా నుంచి 9 జట్లు, యూరప్ నుంచి 16 జట్లు వరల్డ్‌కప్‌లో పాల్గొననున్నాయి. ఈసారి ప్రపంచకప్‌లో మొత్తం 48 జట్లు పోటీపడుతున్నాయి.

2026 ప్రపంచకప్ టోర్నీకి ఇప్పటి వరకు అర్హత సాధించిన జట్లు

ఆతిథ్య దేశాలు: అమెరికా, మెక్సికో, కెనడా.
ఆసియా: జపాన్, ఇరాన్, జోర్డాన్, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్తాన్.
ఓసియానియా: న్యూజిలాండ్.
దక్షిణ అమెరికా: అర్జెంటీనా.

న్యూజిలాండ్ కొత్త కోచ్‌గా రాబ్ వాల్టర్



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ క్రికెట్ జట్టు కొత్త హెడ్ కోచ్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన రాబ్ వాల్టర్‌ను నియమించారు. గతంలో ఆయన సొంతజట్టు సఫారీకి కోచ్‌గా సేవలందించారు. వాల్టర్ కోచింగ్‌లో దక్షిణాఫ్రికా జట్టు... భారత్ ఆతిథ్యమిచ్చిన 2023 వన్డే ప్రపంచకప్, ఈ ఏడాది పాక్ ఆతిథ్యమిచ్చిన చాంపియన్స్ ట్రోఫీలలో సెమీఫైనల్ వరకు పోరాడింది. గతేడాది టి20 ప్రపంచకప్ ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికా భారత్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచింది. ఇలాంటి మంచి రికార్డు ఉన్న వాల్టర్ ఈ ఏడాది ఏప్రిల్‌లో సఫారీ జట్టు కోచ్ పదవి నుంచి వైదొలిగారు. వెంటనే న్యూజిలాండ్ దేశవాళీ జట్టుకు సేవలందించేందుకు వచ్చారు. తాజాగా న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు వాల్టర్‌ను తమ జాతీయ జట్టుకు హెడ్ కోచ్‌గా నియమించింది. ఇన్నాళ్లు కివీస్‌కే చెందిన గ్యారీ స్టెడ్ కోచ్‌గా ఉండగా మార్చిలో... కేవలం టెస్టు జట్టుకే సేవలందిస్తానని ప్రకటించారు. వన్డే, టి20 జట్ల కోచ్‌గా వైదొలగుతానని చెప్పారు. అయితే కివీస్ బోర్డు మూడు ఫార్మాట్లకు కలిపి ఒకరే కోచ్‌గా ఉంటే బాగుంటుందని భావించి 49 ఏళ్ల వాల్టర్‌కు బాధ్యతలు అప్పగించింది. జింబాబ్వే పర్యటనతో ఆయన కోచింగ్ మొదలవుతుంది. త్వరలో కివీస్ జట్టు జింబాబ్వేలో ముక్కోణపు టి20 సిరీస్‌తో పాటు రెండు టెస్టుల సిరీస్‌లో పాల్గొంటుంది.

సూపర్ స్పెయిన్


● నేషన్స్ లీగ్ ఫైనల్లోకి ప్రవేశం
● సెమీఫైనల్లో ఫ్రాన్స్‌పై విజయం

స్టుట్‌గార్ట్ (జర్మనీ): ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లతో కళకళలాడుతోన్న స్పెయిన్ ఫుట్‌బాల్ జట్టు నేషన్స్ లీగ్ టోర్నమెంట్‌లో టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్పెయిన్ 5–4 గోల్స్ తేడాతో గత ప్రపంచకప్ రన్నరప్ ఫ్రాన్స్ జట్టును ఓడించింది. ఆదివారం జరిగే ఫైనల్లో క్రిస్టియానో రొనాల్డో నాయకత్వంలోని పోర్చుగల్ జట్టుతో స్పెయిన్ తలపడుతుంది. ఫ్రాన్స్‌తో జరిగిన సెమీఫైనల్ పోరులో స్పెయిన్ తరఫున 17 ఏళ్ల లామినె యామల్ (54వ, 67వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో అదరగొట్టగా... నికో విలియమ్స్ (22వ నిమిషంలో), మికెల్ మెరీనో (25వ నిమిషంలో), పెడ్రీ (55వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ఫ్రాన్స్ తరఫున కెప్టెన్ కిలియాన్ ఎంబాపె (59వ నిమిషంలో), రాయన్ చెర్కి (79వ నిమిషంలో), కోలో మువాని (90+3వ నిమిషంలో) ఒక్కో గోల్ చేయగా... స్పెయిన్ ప్లేయర్ డేనియల్ వివియాన్ 84వ నిమిషంలో సెల్ఫ్ గోల్ సాధించాడు. గత ఏడాది యూరో చాంపియన్‌గా నిలిచిన స్పెయిన్ నేషన్స్ లీగ్‌లోనూ నిలకడగా రాణిస్తోంది. ఏడేళ్ల క్రితం మొదలైన ఈ టోర్నీలో స్పెయిన్ 2022–2023 సీజన్‌లో విజేతగా నిలిచి, 2020–2021 సీజన్‌లో రన్నరప్ ట్రోఫీని అందుకుంది.





ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా సాగిస్తున్న వైమానిక దాడుల్లో గాజా పూర్తిగా ధ్వంసమైంది. దెయిర్ అల్-బలాహ్‌లో శుక్రవారం బక్రీద్ సందర్భంగా శిథిలాల కుప్పగా మారిన మసీదు పక్కనే ప్రార్థనలు చేస్తున్న పాలస్తీనియన్లు



దక్షిణ అమెరికా దేశం గ్వాటెమాలాలో వొల్కానో ఆఫ్ ఫైర్ ఇటీవల బద్దలైంది. గురువారం ఈ పర్వత శిఖరం నుంచి అగ్ని జ్వాల మాదిరిగా ఎగసి పడుతున్న లావా

బంకమట్టి రేణువులతో కరోనా పరీక్ష

కొత్త విధానం అభివృద్ధి చేసిన ఐఐటీ-గౌహతి పరిశోధకులు

న్యూఢిల్లీ: కరోనా వైరస్ సోకిందో లేదో గుర్తించడానికి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)-గౌహతి పరిశోధకులు చౌకైన, తేలికైన విధానాన్ని అభివృద్ధి చేశారు. వైరస్ నిర్ధారణకు ఇదొక ప్రత్యామ్నాయం అవుతుందని చెబుతున్నారు. ఇందుకోసం వారు బంకమట్టి రేణువులు ఉపయోగించారు. కరోనా వైరస్ కలిగిన ఉప్పునీటి ద్రావకంలో ఈ రేణువులు వేగంగా మార్పులకు గురవుతున్నట్లు తేల్చారు. రేణువుల్లోని క్లే-ఎలక్ట్రోలైట్ సిస్టమ్ అవక్షేపణ రేటు మారుతున్నట్లు గుర్తించారు. ఈ మార్పులను బట్టి వైరస్ సోకిందో లేదో సులభంగా గుర్తుపట్టవచ్చని పేర్కొన్నారు. మార్పులేవీ లేకపోతే వైరస్ సోకనట్లే. బాధితుల నుంచి నమూనాలు సేకరించి, ఈ పరీక్ష నిర్వహిస్తే ఫలితంగా త్వరగా తేలిపోతుంది. సార్స్-కోవ్-2ను గుర్తించడానికి ప్రస్తుతం పాలిమెరేజ్ చైన్ రియాక్షన్(పీసీఆర్) టెస్టు చేస్తున్నారు. దీనికి చాలా సమయం పడుతోంది. అంతేకుండా భారీ యంత్ర పరికరాలు అవసరం. యాంటిజెన్ టెస్టు కూడా అందుబాటులో ఉన్నప్పటికీ ఈ పరీక్షలో కచ్చితత్వం తక్కువే. యాంటీబాడీ టెస్టింగ్‌కు కూడా కొన్ని పరిమితులు ఉన్నాయని ఐఐటీ-గౌహతి ప్రొఫెసర్ టి.వి.భరత్ చెప్పారు. ప్రయోగశాలలు, నిపుణులు, వనరులు లేనిచోట ఇలాంటి పరీక్షలు చేయలేం కాబట్టి బంకమట్టి రేణువులతో వైరస్‌ను గుర్తించడం చక్కటి ప్రత్యామ్నాయం అవుతుందని పేర్కొన్నారు. దీంతో కచ్చితమైన ఫలితం లభిస్తుందని వెల్లడించారు. ఈ పరీక్ష కోసం పరిశోధకులు బెంటోనైట్ అనే బంకమట్టి ఉపయోగించారు. ఇందులో విశిష్టమైన రసాయన నిర్మాణం ఉంటుంది. కాలుష్య కారకాలు, భారీ లోహాలను సైతం సులభంగా పీల్చుకోగలదు. బంకమట్టి రేణువులు వైరస్‌లను గ్రహిస్తాయి. అందుకే వైరస్‌ల ఉనికిని గుర్తించడానికి బంకమట్టి ఉపయోగించే విధానాలు ఇప్పటికే అమల్లో ఉన్నాయి.

వీసా మోసగాళ్లున్నారు జాగ్రత్త!

అమెరికా ఎంబసీ హెచ్చరిక • బెంగళూరులో బయటపడ్డ వీసా స్కామ్

న్యూఢిల్లీ: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని వీసా దరఖాస్తుదారులను ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయం హెచ్చరించింది. ఇటీవల మారిన నిబంధనలను ఆసరాగా చేసుకునేందుకు మోసగాళ్లు ప్రయత్నిస్తున్నారంటూ ఓ ప్రకటనలో అలర్ట్ చేసింది. బెంగళూరుకు చెందిన ఓ ఇంజినీర్‌ను సైబర్ నేరగాడు బీ1/బీ2 నాన్ ఇమిగ్రాంట్ వీసా ఇంటర్వ్యూ ముందుగానే ఇప్పిస్తామని మోసం చేశారని వివరించింది. అమెరికా వీసా దరఖాస్తు పోర్టల్‌లో వ్యక్తిగత వివరాలను, అర్హతలను షేర్ చేయవద్దంటూ శుక్రవారం అమెరికా ఎంబసీ 'ఎక్స్'లో కోరింది. వీసా ఇంటర్వ్యూ తేదీ ముందుగానే వచ్చేందుకు ఎక్కువ ప్రాసెస్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఎవరైనా చెబితే నమ్మవద్దని, అది వట్టి మోసమని వెల్లడించింది.

ఇంజినీర్ ఎలా మోసపోయారంటే..

బెంగళూరు ఆర్‌ఆర్ నగర్‌కు చెందిన ఇంజినీర్(45) అమెరికా సందర్శనకు అవసరమైన బీ1/బీ2 నాన్ ఇమిగ్రాంట్ వీసా కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈయన ఇంటర్వ్యూ షెడ్యూల్ 2026 మార్చిలో ఖరారైంది. టెలీగ్రామ్ యాప్‌లో వచ్చిన ఓ ప్రకటనను చూసి ఆయన.. ఓ వ్యక్తిని మే 22న సంప్రదించాడు. ఆ మోసగాడు తన పేరు వనం శ్రవణ్ కుమార్‌గా పరిచయం చేసుకున్నాడు. వీసా ఇంటర్వ్యూ తేదీ ముందుగా రావాలంటే అడ్వాన్స్‌గా రూ.10వేలు చెల్లించాలన్నాడు. ఆ మేరకు డబ్బు పంపగా, వ్యక్తిగత వివరాలు కావాలడిగాడు. అమెరికా వీసా అప్లికేషన్ పోర్టల్ లాగిన్ పాస్‌వర్డ్ కూడా తీసుకున్నాడు. ఫేక్ అపాయింట్‌మెంట్ రీషెడ్యూల్ పత్రం పంపించిన మోసగాడు...మరో రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. లేదంటే లాగిన్ పాస్‌వర్డును మారుస్తానని బెదిరించాడు. ఆ మేరకు రూ.10వేలు చెల్లించిన తర్వాత కూడా ఆ మోసగాడు లాగిన్ పాస్‌వర్డును మార్చేశాడు. దీంతో, బాధితుడు చేసేదిలేక మే 24న పోలీసులను ఆశ్రయించాడు.

అవకాశం కోల్పోయిన బాధితుడు

ఈ విషయంలో బాధితుడికి అమెరికా ఎంబసీ నుంచి ఎటువంటి సాయం అందదని సీనియర్ సీఐడీ అధికారి ఒకరు తెలిపారు. బాధితుడు ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ తొందరగా వచ్చేందుకు తనంతట తానే థర్డ్ పార్టీని ఆశ్రయించాడని, అధికారిక ప్రక్రియను కాదని దొడ్డిదారిన పని పూర్తి చేసుకునే ఇటువంటి వారిని ఎంబసీ అధికారులు ప్రోత్సహించరన్నారు. వ్యక్తిగత వివరాలతోపాటు పాస్‌వర్డ్ సైతం మోసగాడికి ఇవ్వడం మరీ దారుణమన్నారు. బాధితుడు మరోసారి వీసా కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఇలా ఉండగా, విద్యార్థి వీసా ఇంటర్వ్యూలతోపాటు విజిటర్ వీసా దరఖాస్తుల పరిశీలనను తక్షణమే నిలిపివేయాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం గత నెలలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ కాన్సులేట్లకు ఆదేశాలు జారీ చేశారు. అమెరికాలో చదువుకునే అంతర్జాతీయ విద్యార్థులందరి సోషల్ మీడియా అకౌంట్లను తనిఖీ చేయాలంటూ విదేశాంగ శాఖ నిర్ణయించిన నేపథ్యంలోనే ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా, నాన్ ఇమిగ్రాంట్ వీసా దరఖాస్తుదారుల నుంచి ప్రాసెసింగ్ ఫీజుగా ఇకపై వెయ్యి డాలర్లు వసూలు చేయనున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఇందులో వీసా ఇంటర్వ్యూలు తొందరగా పూర్తవ్వాలని కోరుకునే పర్యాటక వీసా దరఖాస్తుదారులు సైతం ఉన్నారు.

60 ఏళ్ల తర్వాత డిగ్రీ పట్టా సాధించిన 88 ఏళ్ల బామ్మ

న్యూహాంప్‌షైర్: అమెరికాలోని మెయిన్ రాష్ట్రానికి చెందిన ఓ బామ్మ ఎట్టకేలకు డిగ్రీ పట్టా అందుకున్నారు. వాస్తవానికి ఈమెకీ పట్టా 1959 లోనే అందాల్సి ఉంది. అనివార్య కారణాలతో డిగ్రీ పూర్తి చేయలేకపోయారు. కుమార్తె చొరవ తో దాదాపు 60 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఈమె కల నిజమైంది. న్యూహాంప్‌షైర్‌కు చెందిన జోన్ అలెగ్జాండర్(88) సాధించిన ఘనత ఇది. ఈమె మెయిన్ యూనివర్సిటీలో సైన్స్ ఇన్ ఎడ్యుకేషన్ కోర్సులో 1950ల్లో చేరారు. 1959 కల్లా ఈ డిగ్రీని పూర్తి చేయాల్సి ఉంది. పట్టా చేతికి రావాలంటే కోర్సు చివర్లో విద్యార్థినీ విద్యార్థులు కొద్దికాలంపాటు ఉపాధ్యాయులుగా పనిచేయాలనే నిబంధన ఉంది. అప్పటికి గర్భవతిగా ఉన్న జోన్‌ను అధికారులు బోధించేందుకు అనుమతించలేదు. ఆ రోజుల్లో జోన్ వంటి వారందరిదీ ఇదే పరిస్థితి. దీంతో, డిగ్రీ పట్టాను అందుకోవాలన్న జోన్ కల అలాగే మిగిలిపోయింది.

కుమార్తె సాయంతో..

ఈ ఏడాది ఆరంభంలో జోన్ అలెగ్జాండర్ కుమార్తె ట్రేసీ తల్లి కలను నిజం చేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. మెయిన్ యూనివర్సిటీ అధికారులను సంప్రదించారు. కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ విభాగం అసోసియేట్ డీన్‌గా ఉన్న జస్టిన్ డిమ్మెల్ సానుకూలంగా స్పందించారు. జోన్ అలెగ్జాండర్‌కు సంబంధించిన విద్యార్హతల వివరాలను క్షుణ్నంగా పరిశీలించారు. 1980ల్లో ఆమె ఓ ప్రీస్కూల్‌లో పూర్తిస్థాయి సహాయకురాలిగా పనిచేసినట్లుగా గుర్తించారు. ఈ అనుభవాన్ని బోధనతో సమానమైన అర్హతగా భావించి, జోన్ అలెగ్జాండర్‌కు డిగ్రీ పట్టా ప్రదానం చేసేందుకు వర్సిటీ యాజమాన్యం అంగీకరించింది. ఈ ఏడాది మేలో జోన్ అలెగ్జాండర్‌ను గ్రాడ్యుయేట్‌గా గుర్తిస్తున్నట్లు మెయిన్ వర్సిటీ ప్రకటించింది. మే 11వ తేదీన జరిగిన స్నాతకోత్సవానికి జోన్ వెళ్లలేకపోయారు. బదులుగా ఆమె కుమార్తె ట్రేసీ, మనవరాలు ఇసాబెల్ వర్సిటీ స్నాతకోత్సవంలో పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రెసిడెంట్ ప్రత్యేకంగా జోన్ అలెగ్జాండర్ పేరును ప్రస్తావించారు. విద్యారంగానికి జీవితాన్ని అంకితం చేసిన జోన్ ఎన్నో సేవలందించారని కొనియాడారు. చిట్టచివరికి తన కృషిని గుర్తించడం ఎంతో ముఖ్యమైన అంశమని జోన్ పేర్కొన్నట్లు యూనివర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది. స్నాతకోత్సవంలో తల్లి తరఫున పట్టా అందుకున్న వేళ ఎంతో ఉద్వేగానికి గురైనట్లు ట్రేసీ పేర్కొన్నారు. యూనివర్సిటీలోని ప్రతి ఒక్కరూ ఎంతో మద్దతిచ్చారన్నారు. కాగా, జోనీ అలెగ్జాండర్ భర్త తీర రక్షక దళం అధికారి. ఈ దంపతులకు నలుగురు కుమార్తెలు. భర్త ఎక్కువ సమయంలో విధుల్లో ఉండాల్సి రావడంతో నలుగురు కూతుళ్ల భారం జోనీయే మోశారు. న్యూ హాంప్‌షైర్‌లోనే ఉంటున్న జోనీ ఇప్పటికీ చర్చి, స్థానిక లైబ్రరీ, స్కూళ్లలో జరిగే సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. 'డిగ్రీ సంపాదించడం నా వ్యక్తిగత లక్ష్యం. మా కుటుంబంలోని వారంతా గ్రాడ్యుయేట్లే. ఎట్టకేలకు నేను సైతం గ్రాడ్యుయేట్‌నయ్యా'అని గర్వంగా చెప్పుకుంటున్నారు జోనీ అలెగ్జాండర్..!



మెయిన్ వర్సిటీ అందజేసిన పట్టాతో జోన్ అలెగ్జాండర్

కిరాయికి వెళ్లకుండానే నెలకు రూ. 8 లక్షలు సంపాదిస్తున్న ఆటోవాలా

ముంబై: ముంబైలోని అమెరికా కాన్సులేట్ వెలుపల ఉంటూ నెలకు లక్షల్లో సంపాదిస్తున్న ఓ ఆటోవాలా ఉదంతం పతాక శీర్షికల్లో నిలిచింది. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం కాకుండా వీసా దరఖాస్తుదారుల బ్యాగ్‌లను భద్రంగా ఉంచడమన్న చిన్న వ్యాపార చిట్కాయే ఇతడి విజయ రహస్యం. ఇతడు ఇంజినీరింగ్‌లాంటివేమీ చదవలేదు. స్టార్టప్ ఫండింగ్ అసలే లేదు. ఎటువంటి వ్యాపార ప్రణాళికా లేదు.. అయినప్పటికీ తన రోజువారీ శ్రమను నెలకు రూ.5 లక్షల నుంచి 8 లక్షల వరకు సంపాదించే వ్యాపారంగా మార్చాడు. లెన్స్‌కార్ట్ కంపెనీలో పని చేసే రాహుల్ రుపానీ ఇటీవల వీసా అపాయింట్‌మెంట్ కోసం అమెరికా కాన్సులేట్ వద్దకు వెళ్లిన సమయంలో ఈ ఆటో డ్రైవర్ తారసపడ్డాడు. రుపానీయే ఇతడి వివరాలను లింక్డిన్‌లో షేర్ చేశారు. 'ఇటీవల వీసా అపాయింట్‌మెంట్ కోసం అమెరికా కాన్సులేట్‌కు వెళ్లా. నా దగ్గర బ్యాగ్ ఉండటంతో అక్కడి సెక్యూరిటీ సిబ్బంది నన్ను లోపలికి వెళ్లనివ్వలేదు. బ్యాగును తాత్కాలికంగా భద్రపరిచేందుకు అక్కడ లాకర్లు కూడా లేవు. ఏం చేయాలా అని ఆలోచిస్తూ రోడ్డు పక్కనే నిలబడి ఉన్నా. అంతలోనే అక్కడికి ఆ ఆటో డ్రైవర్ వచ్చాడు. బ్యాగును జాగ్రత్తగా తన దగ్గర ఉంచుకుంటానని, రూ.వెయ్యి ఖర్చవుతుందని చెప్పాడు. మొదట నేను వెనుకాడా. చివరికి అతడికి బ్యాగ్ ఇచ్చేసి ఆఫీసులోకి వెళ్లి పనిచూసుకుని వచ్చేశా. అప్పుడతడిని అడిగితే తన వినూత్న వ్యాపారంగా గురించి చెప్పాడు'అని రుపానీ వివరించారు. వీసాలకోసం వచ్చే వారిలో నిత్యం కనీసం 20 నుంచి 30 మంది అతడి వద్ద తమ బ్యాగులను ఉంచి వెళ్తుంటారు. వీరి నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తూ నెలకు కనీసంగా రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు సంపాదిస్తున్నాడని రుపానీ తెలిపారు. అయితే, ఆటోలో 30 వరకు బ్యాగులను ఉంచుకోవడం చట్టబద్ధ వ్యవహారం కాదని తెలుసుకున్న ఆ ఆటోవాలా మరో ఉపాయం కనిపెట్టాడు. కాన్సులేట్‌కు సమీపంలోనే వస్తువులను భద్రపరిచే లాకర్ సౌకర్యం ఉన్న ఓ పోలీసు అధికారిని భాగస్వామిగా చేసుకున్నాడు. అతడి లాకర్‌లోనే సేకరించిన బ్యాగులన్నిటినీ చట్టబద్ధంగా, మరింత భద్రంగా ఉంచుతున్నాడని రుపానీ వివరించారు. అతడి ఆటో ఇప్పుడు కేవలం బ్యాగుల రవాణా కోసం పనిచేస్తోంది. చాలా మంది అమెరికా వీసా ఇంటర్వ్యూల కోసం శ్రమకోర్చుతుండగా ఆటోవాలా మాత్రం..ఎటువంటి కష్టం లేకుండా ఎంతో లాభదాయకమైన వ్యాపారం నడుపుతున్నాడని రుపానీ లింక్డిన్ పోస్టులో ప్రశంసలు కురిపించారు.

నిజమైన కులగణన అనుమానమే: రాహుల్

రాజ్‌గిరి: కేంద్రం చేపట్టే కులగణన సర్వేపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అనుమానం వ్యక్తం చేశారు. ఓబీసీ, దళిత, గిరిజన వర్గాలకు చెందిన అధికారులు లేకుండానే ప్రశ్నావళిని ఎలా ఖరారు చేస్తారని ప్రశ్నించారు. 'వాస్తవ కులగణనను మోదీ ప్రభుత్వం చేపట్టదు. ఎందుకంటే, అలాంటి కులగణనతో బీజేపీ రాజకీయాలు ముగిసిపోవడం ఖాయం. కులగణనకు బీజేపీ మోడల్, తెలంగాణ మోడల్ అనే రెండున్నాయి. బీజేపీ మోడల్‌లో అధికారులంతా ఓ గదిలో కూర్చుని ప్రశ్నావళిని ఖరారు చేస్తారు. ఇందులో ఓబీసీ, దళిత, గిరిజన వర్గాలకు చెందిన అధికారులుండరు. కేవలం ఎంపిక చేసిన అధికారులు మాత్రమే ఉంటారు'అంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. నలంద జిల్లా రాజ్‌గిర్‌లో శుక్రవారం జరిగిన సంవిధాన్ సురక్షా సమ్మేళన్‌లో రాహుల్ మాట్లాడారు. భారత్, పాకిస్తాన్‌ల మధ్య తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతల సమయంలో జోక్యం చేసుకుని శాంతి నెలకొనేలా చేశానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు ప్రకటించినా ప్రధాని మోదీ మౌనముద్ర దాల్చారంటూ ఆయన ఆరోపించారు. 'శాంతికి, న్యాయానికి నెలవుగా ఒకప్పుడు పేరుగాంచిన బిహార్ నేడు నితీశ్ సారథ్యంలోని ఎన్డీయే పాలనలో దేశ నేర రాజధానిగా మారిపోయిందన్నారు.

రూ.5 లక్షలు కాదు.. కోటి ఇవ్వాల్సిందే

గృహ హింస బాధితురాలికి ఆ పరిహారం సబబే

ఆమె భర్త దగ్గర భాగా డబ్బుంది • వ్యాఖ్యానించిన ముంబై కోర్టు

ముంబై: గృహ హింస బాధితురాలిగా ఉన్న ఓ మహిళకు ఇవ్వాల్సిన పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.కోటికి పెంచుతూ ముంబైలోని ఓ సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. ఎలివేటర్ కంపెనీని నడిపే ఈమె భర్త వద్ద భారీగానే డబ్బుందని, అతడిది కోటీశ్వరుల కుటుంబమని వ్యాఖ్యానించింది. పిటిషనర్ తన భర్తతో కలిసి ఉన్న సుదీర్ఘమైన 20 ఏళ్ల సమయంలో అనూహ్యమైన శారీరక, మానసిక హింస ఎదుర్కొన్నారని పేర్కొన్న న్యాయస్థానం..నిర్వహణ ఖర్చుల కింద భార్య, కుమార్తెకు నెలకు భర్త ఇచ్చే మొత్తాన్ని సైతం రూ.లక్ష నుంచి రూ.లక్షన్నరకు పెంచింది. మేజిస్ట్రేట్ కోర్టు 2020లో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బాధితురాలు(41) వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన డిండోషిలోని అదనపు సెషన్స్ జడ్జి ఎస్‌జే అన్సారీ గత నెలలో గృహ హింస నిరోధక చట్టం కింద ఈ మేరకు తీర్పు వెలువరించారు. 1997లో వివాహమైనప్పటి నుంచి పిటిషనర్ అయిన బాధితురాలిని భర్త, అతడి కుటుంబం శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా తీవ్ర వేదనకు, అవమానాలకు గురి చేశారని జడ్జి అన్సారీ తీర్పులో పేర్కొన్నారు. చిట్టచివరి ప్రయత్నంగా బాధితురాలు భరణ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. భార్య కారణంగా తాను ఆర్థికంగా చితికిపోయానని, ఇద్దరు కుమారుల చదువులు, పోషణ కోసం ఎంతో ఇబ్బందులు పడుతున్నానని, ఉండే ఇంటికి అద్దె సైతం చెల్లించలేని స్థితిలో ఉన్నానంటూ భర్త చేసిన వినతిని జడ్జి తోసిపుచ్చారు. ఇందుకు సంబంధించిన ఎటువంటి ఆధారాలను చూపలేకపోయారని ఎత్తి చూపారు. 2012లో కోటి విలువ చేసే భూమిని కొనుగోలు చేయడంతోపాటు ఎలివేటర్ కంపెనీ నడుపుతున్న అతడి వద్ద డబ్బు మూలుగుతోందని వ్యాఖ్యానించారు. 'పిటిషనర్ ఇప్పుడు తన ఇద్దరు కుమారుల నుంచి దూరంగా ఉంటూ వేదన అనుభవిస్తున్నారు. ఆ కుమారులిద్దరినీ తల్లికి వ్యతిరేకంగా భర్త మార్చినట్లు కూడా కనిపిస్తోంది. ఇది విస్మరించలేని అంశం'అని న్యాయమూర్తి పేర్కొన్నారు. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే పరిహారంతో పాటు మహిళకు, ఆమె కుమార్తెకు మంజూరు చేసిన భరణం మొత్తాన్ని కూడా పెంచామని స్పష్టం చేశారు.

డిన్నర్‌కి వెళ్తూ కోటీశ్వరులయ్యారు!

అమెరికా దంపతులకు రూ.12.86 కోట్ల లాటరీ

వాషింగ్టన్: అదృష్టం అంటే నిజంగా ఇదేనేమో! డిన్నర్ చేద్దామని సరదాగా హోటల్‌కు వెళ్తూ మధ్యలో ఆగి కొన్న లాటరీ టికెట్‌కు ఏకంగా 1.5 మిలియన్ డాలర్ల(రూ.12.86 కోట్లు) సొమ్ము లభించింది. అమెరికాలోనూ న్యూజెర్సీలో ఈ సంఘటన జరిగింది. న్యూజెర్సీ దంపతులు డిన్నర్ కోసం హోటల్‌కు బయలుదేరారు. మధ్యలో ఓ దుకాణం వద్ద ఆగి 3 డాలర్లు(రూ.257) పెట్టి లాటరీ టికెట్ కొనేశారు. నిజానికి వారిద్దరిలో ఒకరికి ఇదే దుకాణంలో కొనడం ఇష్టంలేదు. మరోచోట చూద్దామని చెప్పారు. కాసేపు ఇద్దరూ చర్చించుకొని చివరికి ఇక్కడే కొనాలని నిర్ణయించుకున్నారు. టికెట్ కొన్న తర్వాత స్క్రాచ్ చేసి చూడగా, ఏకంగా 1.5 మిలియన్ డాలర్ల సొమ్ము గెలుచుకున్నట్లు తెలిసిపోయింది. దంపతులు ఒక్కసారిగా కోటీశ్వరులుగా మారిపోయారు. తమ కష్టాలన్నీ తీరిపోయినట్లేనని వారు ఆనందం వ్యక్తంచేశారు. బిల్లులు చెల్లించడానికి ఇన్నాళ్లూ చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇకపై ఆ పరిస్థితి ఉండదని చెప్పారు. తమ జీవితం ఇక సుఖమయం అవుతుందని సంతోషపడ్డారు. 1.5 మిలియన్ డాలర్ల సొమ్మును 25 ఏళ్లపాటు విడతలవారీగా తీసుకొనేలా లాటరీ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

యువతకు సాధికారత శక్తివంతమైన పని: ప్రధాని

న్యూఢిల్లీ: యువతకు సాధికారత కల్పించడం ఒక దేశం చేయగలిగే అత్యంత శక్తివంతమైన పని అని ప్రధాని మోదీ చెప్పారు. తన హయాంలో గత 11 ఏళ్లలో ఇదే ప్రధాన లక్ష్యంగా స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి అనేక పథకాలను ప్రారంభించామన్నారు. శుక్రవారం ఆయన 'ఎక్స్'లో 'భారతీయ యువత ప్రపంచ వేదికపై గత 11 ఏళ్లలో తనదైన ముద్ర వేసింది. మన యువశక్తి భారత దేశాన్ని మన యువశక్తి చైతన్యం, ఆవిష్కరణలు, దృఢ సంకల్పంతో ముడిపడి ఉంది. మన యువత అసమానమైన శక్తి, దృఢ సంకల్పంతో దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించింది'అని పేర్కొన్నారు. వికసిత్ భారత్ సాధన దిశగా యువత కృషి చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2014 మే 26వ తేదీన మొదటిసారిగా మోదీ ప్రధానిగా ప్రమాణం చేశారు. గతేడాది జూన్ 9వ తేదీన వరుసగా మూడో విడత ఆయన ప్రధాని పదవిని చేపట్టారు.

చంద్రుడిపై కుప్పకూలిన లాండర్

విఫలమైన జపాన్ ప్రైవేట్ సంస్థ ప్రయోగం

టోక్యో: జపాన్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ చంద్రుడిపైకి చేపట్టిన ప్రయోగం విఫలమైంది. ఐస్పేస్ సంస్థ పంపిన లూనార్ ల్యాండర్ కుప్పకూలింది. మరో రెండు నిమిషాల్లో చంద్రుడిపైన మినీ రోవర్ ల్యాండవుతుందనగా మిషన్‌తో సంబంధాలు తెగిపోయాయని ఐస్పేస్ సీఈవో టకేషి హకామడ తెలిపారు. రెండేళ్ల క్రితం ఐస్పేస్ చేపట్టిన మొట్ట మొదటి ప్రయోగం విఫలమైంది. దీంతో, ఈసారి 'రిసైలెన్స్' పేరుతో పక్కాగా ఈ ప్రయోగం చేపట్టినట్లు అంతకుముందు టకేషి చెప్పారు. ఈ ప్రయోగానికి సుమారు రూ.815 కోట్లు ఖర్చయిందని ఐస్పేస్ సీఈవో టకేషి చెప్పారు. అయితే, 2027లో నాసాతో కలిసి భారీ ల్యాండర్‌ను ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. చంద్రుని ఉపరితలంపై ఉంచడానికి స్వీడన్ కళాకారుడు తయారు చేసిన బొమ్మ పరిమాణంలోని ఎర్రటి ఇంటిని, చంద్రుని మట్టిని సేకరించడానికి పారతో కూడిన రోవర్ రిసైలెన్స్‌లో ఉన్నాయి. రిసైలెన్స్‌లో ఉన్న లేజర్ వ్యవస్థ నిర్దేశించిన ప్రకారం ఎత్తును సరిగ్గా అంచనా వేయలేకపోవడంతో ల్యాండర్ అత్యంత వేగంగా చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టి, ధ్వంసమైనట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చామని ఐస్పేస్ ఒక ప్రకటనలో తెలిపింది.

ముందస్తు బెయిల్ యథాలాపంగా ఇవ్వరాదు: సుప్రీం

న్యూఢిల్లీ: తీవ్ర ఆరోపణలున్న కేసుల్లో ముందస్తు బెయిల్ విషయంలో యాంత్రికంగా వ్యవహరించరాదని సుప్రీంకోర్టు దిగువ కోర్టులకు హితవు పలికింది. హత్య కేసులో నిందితులైన నలుగురికి పట్నా హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను కొట్టివేస్తూ జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పైవ్యాఖ్య చేసింది. పట్నా హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హతుడి కుమారుడు వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం..'ఐపీసీ సెక్షన్ 302, 307ల కింద తీవ్ర నేరారోపణలున్న అంశంలో పట్నా హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ అనుమతి ఉత్తర్వుల్లో ఎలాంటి సహేతుకత కనిపించడం లేదు. న్యాయ విశ్లేషణ లోపించింది. తీవ్ర నేరాలకు సంబంధించిన కేసుల్లో యాంత్రికంగా ముందస్తు బెయిల్ ఇవ్వలేం. ఆ ఉత్తర్వుల్ని కొట్టివేస్తున్నాం'అని వివరించింది. ఆరోపణల తీవ్రతను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని ధర్మాసనం పేర్కొంది. నిందితులను 8 వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది.

ఆపరేషన్ సిందూర్‌పై వ్యాఖ్యలు.. గుజరాత్ కాంగ్రెస్ నేత అరెస్ట్

అహ్మదాబాద్: ఆపరేషన్ సిందూర్‌పై సోషల్ మీడియాలో తప్పుదోవ పట్టించే, నైతికతను దెబ్బతీసే పోస్టులు పెట్టారనే ఆరోపణలపై గుజరాత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేశ్ సోనీని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్ర సీఐడీలోని సైబర్ క్రైం విభాగం ఇందుకు సంబంధించి గురువారం ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఫేస్‌బుక్ పేజీలో రాజేశ్ సోనీ రెండు పోస్టులు పెట్టారు. రఫేల్ ఫైటర్ జెట్ పైలట్ వేషధారిగా ఉన్న ప్రధాని మోదీ ఫొటో కింద..'సైనికులకు క్రెడిట్ దక్కదని దయచేసి గమనించండి. ఆపరేషన్ సిందూర్‌లో రఫేల్‌ను వాడినందుకు అయ్యే ఖర్చు కంటే ఈయన ప్రచారం కోసం రెట్టింపు ఖర్చవుతుంది'అని క్యాప్షన్ పెట్టారు. మరో పోస్టులో ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత ప్రభుత్వం లొంగిపోయిందంటూ ప్రజలను కించపరుస్తూ మరో పోస్టు పెట్టారని పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయనపై పలు సెక్షన్ల కింద తీవ్ర ఆరోపణలు మోపారు. రుజువైతే ఏడేళ్ల నుంచి జీవిత కాల జైలు శిక్ష, జరిమానా పడే అవకాశముంది.

తహవ్వూర్ రాణా కస్టడీ మళ్లీ పొడిగింపు

న్యూఢిల్లీ: ముంబై ఉగ్రదాడుల కేసులో నిందితుడు తహవ్వూర్ హుస్సేన్ రాణా జ్యుడీషియల్ కస్టడీని జూలై 9వ తేదీ వరకు పొడిగిస్తూ ఢిల్లీ కోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. రాణా కస్టడీ ముగియడంతో శుక్రవారం ప్రత్యేక జడ్జి చందర్‌జిత్ సింగ్ వర్చువల్‌గా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రాణా లాయర్ అతడి ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేయడంతో జూన్ 9వ తేదీకల్లా ఇందుకు సంబంధించిన నివేదిక అందజేయాలని అధికారులకు ఉత్తర్వులిచ్చారు. ముంబై ఉగ్రదాడుల ప్రధాన సూత్రధారి డేవిడ్ హేడ్లీ అలియాస్ దావూద్ గిలానీకి రాణా సన్నిహితుడు. ఏప్రిల్ 4వ తేదీన ఇతడిని అమెరికా నుంచి తీసుకువచ్చారు. అప్పటి నుంచి అతడు జ్యుడీషియల్ కస్టడీలో కొనసాగుతున్నాడు.

ఆపరేషన్ బ్లూస్టార్‌కు 41 ఏళ్లు

స్వర్ణ దేవాలయంలో ఖలిస్తానీల నినాదాలు

అమృత్‌సర్: పంజాబ్‌లోని స్వర్ణ దేవాలయం ఖలిస్తానీ అనుకూల నినాదాలతో ప్రతిధ్వనించింది. స్వర్ణ దేవాలయంపై చేపట్టిన సైనిక చర్య 'ఆపరేషన్ బ్లూస్టార్'కు శుక్రవారంతో 41 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చేపట్టిన బంద్ ఆలయ పరిసరాల్లో ప్రశాంతంగా ముగిసింది. ఆపరేషన్ సమయంలో ప్రాణాలు కోల్పోయిన జర్నయిల్ సింగ్ బింద్రన్‌వాలె చిత్రపటాలతోపాటు ఖలిస్తానీ జెండాలను చేబూనిన దళ్ ఖల్సా కార్యకర్తలు సిక్కుల అత్యున్నత పీఠం అకల్ తఖ్త్ వద్ద నినాదాలు చేపట్టారు. వీరిలో మాజీ ఎంపీ సిమ్రన్‌జిత్ సింగ్ మాన్ సారథ్యంలోని అకాలీదళ్(అమృత్‌సర్) సభ్యులు, మాజీ ఎంపీ ధ్యాన్ సింగ్ మండ్ తదితరులున్నారు. అకల్ తఖ్త్ జతేదార్ కుల్దీప్ సింగ్ గర్గజ్ సారథ్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సిక్కు ఖైదీల విడుదల కోసం అన్ని సిక్కు విభాగాలు ఉమ్మడిగా ప్రయత్నాలు చేయాలని ఈ సందర్భంగా గర్గజ్ పిలుపునిచ్చారు. స్వర్ణ దేవాలయంలో దాగున్న మిలిటెంట్ల ఏరివేతకు గాను 1984లో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్యే 'ఆపరేషన్ బ్లూస్టార్'.

5 వేలు దాటిన కరోనా పాజిటివ్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య శుక్రవారం 5,364కు చేరుకుంది. గత 24 గంటల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళ, గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీలో అత్యధిక కేసులు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం నమోదైన కరోనా కేసుల తీవ్రత తక్కువగానే ఉందని, బాధితులు క్వారంటైన్‌లో ఉంటే సరిపోతుందని అధికారులు చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి దాకా కరోనా వల్ల 55 మంది మృతిచెందారు.

రాజతరంగిణి గ్రంథాన్ని రచించింది ఎవరు?

రాజపుత్ర వంశాలు (క్రీ.శ. 760 - 1142)

రాజపుత్ర వంశానికి చెందిన రాజులు బెంగాల్, బిహార్ ప్రాంతాలను పాలించారు. వాస్తవానికి వీరు రాజపుత్రులు కారు. 'పాల' వంశస్థులు. ఈ వంశ స్థాపకుడు గోపాలుడు. వీరిలో 'దేవపాలుడు' గొప్పవాడు. ఇతడు తూర్పు ఈశాన్య దేశాలైన జావా, సుమత్రాతో సత్సంబంధాలు కొనసాగించాడు. ఈ వంశీయులు సుమారు 400 ఏళ్లు పాలించారు. వీరిలో చాలా మంది బౌద్ధమతాన్ని అనుసరించారు. ధర్మపాలుడు విక్రమశిల విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. ఉద్దంతపురం, జగద్దల విశ్వవిద్యాలయాలను పాలరాజుల కాలంలోనే ఏర్పాటు చేశారు. వీరు అనేక విహారాలను పునర్నిర్మించారు.

గూర్జార ప్రతీహారులు - 'కనౌజ్' (క్రీ.శ. 800 -1036)

ఈ వంశస్థాపకుడు నాగభట్టు. మహేంద్రపాలుడు గొప్పవాడు. ఇతడి ఆస్థానంలో రాజశేఖరుడు అనే ప్రముఖ కవి ఉండేవాడు. మహేంద్రపాలుడు అరబ్ సైన్యాలపై విజయం సాధించాడు. అరబ్ బాటసారి సులేమాన్ మిహిరభోజుడి సామ్రాజ్యం గురించి వర్ణించాడు. మిహిరభోజుడి కుమారుడు మహేంద్రపాలుడు. ఇతడి తర్వాత ప్రతీహారుల సామ్రాజ్యం క్షీణించింది.

గహద్వాల్ వంశం - కనౌజ్ (క్రీ.శ. 1080-1194)

ఈ వంశ స్థాపకుడు చంద్రదేవుడు (1085-1100). ఈ పాలకుల్లో గొప్పవాడు జయచంద్రుడు. మహమ్మద్ ఘోరీ 1193లో జయచంద్రుడిని ఓడించడంతో అవమానం భరించలేక అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. గహద్వాలులు శతాబ్ద కాలం పాటు తురుష్క దండయాత్రల నుంచి మధ్యదేశాన్ని రక్షించారు.

చందేలులు - బుందేల్ ఖండ్ క్రీ.శ. 916-1203

చందేలుల రాజధాని ఖజురహో. ఈ వంశ మూలపురుషుడు జయశక్తి. క్రీ.శ. 950 ప్రాంతంలో యశోవర్మ స్వతంత్రంగా చందేల రాజ్యాన్ని స్థాపించాడు. చందేల రాజుల్లో విద్యాధరుడు ప్రసిద్ధుడు. మధ్యప్రదేశ్‌లోని 'ఖజురహో' దేవాలయాలను నిర్మించింది వీరే. అల్లావుద్దీన్ ఖిల్జీ 1309లో చందేలులను తుదముట్టించి బుందేల్‌ఖండ్‌ను ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపాడు.

కాలచూరులు (క్రీ.శ. 950 - 1195)

కాలచూరి వంశస్థుల రాజధాని త్రిపుర (మధ్యప్రదేశ్). ఈ వంశ స్థాపకుడు కోకల్లుడు (845 - 880). కాలచూరుల్లో గంగయదేవుడు ప్రసిద్ధుడు. ఇతడికి 'విక్రమాదిత్య', 'త్రికళింగాధిపతి' అనే బిరుదులు ఉన్నాయి. క్రీ.శ. 1212లో చందేల త్రైలోక్య మల్లుడు కాలచూరి చివరి పాలకుడైన విజయసింహుడిని ఓడించాడు.

చౌహానులు క్రీ.శ. 973-1192

వీరినే చహమాణులు అని కూడా అంటారు. ఈ వంశానికి మూలకర్త సింహరాజు. వీరి రాజధాని 'శాకంబరి'. అజయరాజు అజ్మీర్‌ను నిర్మించాడు. సోమదేవ మహాకవి విశాలదేవుడి ఆస్థానంలో ఉండేవాడు. ఇతడు 'లలిత విగ్రహరాజ' నాటకాన్ని రచించాడు. ఈ వంశస్థుల్లో మూడో పాలకుడైన పృథ్వీరాజు చాలా గొప్పవాడు. పృథ్వీరాజ్ చౌహాన్ 1191లో మహమ్మద్ ఘోరీని మొదటి 'తరైన్' యుద్ధంలో ఓడించి క్షమించి వదిలేశాడు. కానీ మహమ్మద్ ఘోరీ మళ్లీ దండెత్తి వచ్చి పృథ్వీరాజ్‌ను 1192లో రెండో తరైన్ యుద్ధంలో ఓడించాడు.

గుజరాత్ చాళుక్యులు (క్రీ.శ. 974-1238)

గుజరాత్ చాళుక్య వంశస్థుల రాజధాని 'అన్హిల్‌వాడ్' (గుజరాత్). వీరినే సోలంకీలు అంటారు. ఈ వంశస్థాపకుడు మూలరాజు. మొదటి భీమరాజు కాలంలో (1022-64) ఘజనీ మహమ్మద్ 1024లో సోమనాథ ఆలయాన్ని ధ్వంసం చేశాడు. భీమరాజు మనవడైన జయసింహుడి కాలంలో సోలంకీ రాజ్యం ఉచ్ఛస్థితిలో ఉంది. జైనకవి హేమచంద్రుడు ఇతడి మంత్రి. జయసింహుడి తర్వాత సామంతులైన వాఘేల వంశస్థులు సోలంకీలను జయించి రాజ్యాన్ని ఆక్రమించారు.

పరమారులు - మాల్వా, మధ్యప్రదేశ్ (క్రీ.శ. 974 - 1233)

పరమార వంశ స్థాపకుడు 'సియక'. వీరిలో ముంజరాజు గొప్పవాడు. ఇతడినే 'వాక్పతిరాజు'గా వ్యవహరిస్తారు. ఇతడి ఆస్థానంలో ధనంజయ, హలాయుధ, ధనిక, పద్మ గుప్త తదితర మహాకవులు ఉండేవారు. వాక్పతిరాజు 'ముంజేశ్వరం' తటాకాన్ని నిర్మించాడు.

ఇతడి కుమారుడైన భోజరాజుకు ఈ వంశంలో మంచి పేరు ఉంది. భారతదేశ చరిత్రలో ఇతడికి ప్రత్యేక స్థానం ఉంది. భోజరాజుకు 'కవిరాజ మాళ్వా చక్రవర్తి' అనే బిరుదు ఉంది. ఇతడు ధార్ నగరాన్ని నిర్మించాడు.

సేన వంశస్థులు (క్రీ.శ. 1119 -1190)

వీరు బెంగాల్‌ను పాలించారు. సేన వంశీయుల్లో లక్ష్మణసేనుడు ప్రసిద్ధుడు. ఇతడు విజయయాత్రలు చేసి పూరీ, కాశీ, ప్రయాగలో విజయస్తంభాలు స్థాపించాడు. ఇతడు స్వయంగా కవి. ఇతడి ఆస్థానంలో పంచరత్నాలు అనే ప్రసిద్ధ కవులు ఉండేవారు. వీరిలో ధోయి, జయదేవుడు ముఖ్యమైనవారు. జయదేవుడి 'గీత గోవిందం' ప్రసిద్ధి చెందిన రచన.



కర్కోటక వంశం (క్రీ.శ. 630-955)

ఈ వంశం కశ్మీర్ ప్రాంతాన్ని పాలించింది. 'కర్కోటక వంశ' స్థాపకుడు దుర్లభవర్ధనుడు. కల్హణుడి 'రాజ తరంగిణి' వీరి చరిత్రకు ప్రధాన ఆధారం. ఈ వంశంలో ముక్తాపీడ లలితాదిత్య గొప్పరాజు. ఇతడు కశ్మీర్ రాజ్యాన్ని ఆసియాలోని పెద్ద రాజ్యాల్లో ఒకటిగా రూపొందించాడు. 'మార్తాండ', 'సూర్య' దేవాలయాలను నిర్మించాడు.

లోహారులు (క్రీ.శ. 939 -1339)

ఈ రాజ్యస్థాపకుడు పర్వగుప్తుడు. కశ్మీర్‌ను పరిపాలించిన లోహారులందరిలో 'రాణి దిద్దా'కు ప్రత్యేక స్థానం ఉంది. 1139లో షామీర్ (షామ్స్ ఉద్దీన్) అనే ముస్లిం వీరుడు 'శ్రీ సంస్థినా' బిరుదుతో కశ్మీర్‌ను ఆక్రమించాడు. లోహారుల కాలంలో సంస్కృతం రాజభాషగా ఉండేది. బ్రాహ్మణులకు రాజకీయంగా ప్రాబల్యం ఉండేది.

షాహీలు (క్రీ.శ. 883-1026)

షాహీలు కాబూల్, పంజాబ్ ప్రాంతాలను పాలించారు. వీరినే హిందూషాహీలుగా వ్యవహరిస్తారు. రాజ తరంగిణి, అల్‌బెరూనీ గ్రంథం వీరి చరిత్రకు ముఖ్యమైన ఆధారాలు. వీరి రాజధాని కాబూల్. అల్‌బెరూనీ ఈ వంశంలో మొదటివారిని హిందూ తురుష్కులుగా పేర్కొన్నాడు. కుషాన్ వంశంలో చివరి రాజు 'లగితూర్మాన్'ను అతడి మంత్రి కల్లర్ తొలగించి, హిందూషా వంశాన్ని స్థాపించాడు. షాహీ రాజ్యాన్ని ముస్లింలు ఆక్రమించారు. అరబ్బు యాత్రికుడైన అల్‌బెరూనీ భారతదేశంలో 'కితాబ్-ఉల్-హింద్' గ్రంథం రాశాడు.

అరబ్బుల దండయాత్రలు (క్రీ.శ. 712)

అరబ్బులు సింధూ ప్రాంతంపై దండయాత్ర చేశారు. భారతదేశంపై దండయాత్రల వల్ల అరబ్బులకు పరిమిత ఫలితాలు లభించాయి. ఎడారి వల్ల సింధూ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలపైకి దాడి చేయడానికి వీలు కలుగలేదు. అరబ్బుల పాలనలో సింధ్, గుజరాత్ రాష్ట్రాలు విదేశీ వాణిజ్యాన్ని విస్తృతంగా సాగించి ఐశ్వర్యవంతమయ్యాయి. అరబ్బుల ద్వారా ఐరోపా దేశాలకు భారతీయ సంస్కృతి వ్యాపించింది.

మహమ్మద్ ఘజనీ దండయాత్రలు (క్రీ.శ. 1000-27): ఇతడు భారతదేశంపై 17 సార్లు దండెత్తాడు. ఘజనీ 1026లో సోమ్‌నాథ్ దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. ఇది గుజరాత్‌లోని కథియవార్‌లో ఉంది. ఇతడు రాజపుత్ర రాజ్యాల సిరిసంపదలను కొల్లగొట్టాడు. వారి సైన్యాలు చాలా వరకు క్షీణించాయి. ఘజనీ మహమ్మద్ భారతదేశంలో ముస్లిం రాజ్య స్థాపనకు అనుకూల పరిస్థితులను కల్పించాడు.

మహమ్మద్ ఘోరీ దండయాత్రలు (క్రీ.శ. 1175-1206): ఇతడిని భారతదేశంలో తురుష్క అఫ్గాన్ సామ్రాజ్య స్థాపకుడిగా పేర్కొంటారు. ఘోరీ మరణానంతరం అతడు జయించిన భూభాగాలన్నింటితో అతడి బానిస అయిన కుతుబుద్దీన్ ఐబక్ ఢిల్లీలో స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని స్థాపించాడు. మహమ్మద్ ఘోరీ.. పృథ్వీరాజ్ చౌహాన్‌తో 1191లో మొదటి, 1192లో రెండో తరైన్ యుద్ధాలు చేశాడు. బిహార్, బెంగాల్‌ను జయించడంలో భక్తియార్ ఖిల్జీ (1197) అనే అఫ్గాన్ సాహసయోధుడు ఘోరీకి సహాయపడ్డాడు. ఘోరీని 1206లో పంజాబ్‌లోని భోఖర్లు అనే తెగకు చెందినవారు హత్య చేశారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

ఢిల్లీ సుల్తాన్‌లు (క్రీ.శ. 1206-1210)

కుతుబుద్దీన్ ఐబక్: ఇతడు భారతదేశంలో తురుష్క-అఫ్గాన్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు ఇల్బారీ వంశానికి చెందిన తురుష్కుడు. ఇతడు 1206లో ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. ఢిల్లీకి మొదటి ముస్లిమ్ సుల్తాన్ ఇతడే. ఇతడిని బానిస వంశ స్థాపకుడిగా పేర్కొంటారు. 1210లో ఇతడు 'పోలో' ఆడుతూ గుర్రంపై నుంచి పడి మరణించాడు. ఐబక్ 'కుతుబ్ మినార్' నిర్మాణాన్ని ప్రారంభించగా, ఇల్‌టుట్ మిష్ పూర్తి చేశాడు. కుతుబుద్దీన్ ఐబక్‌కు 'లక్‌బక్ష్' అనే బిరుదు ఉంది.

ఇల్‌టుట్ మిష్ (క్రీ.శ. 1211-1236): ఇల్ టుట్ మిష్ తురుష్కుల్లో ఇల్బారీ తెగకు చెందినవాడు. రాజ్య రక్షణ కోసం ఇతడు 40 మందితో బానిసల దళం (చిహల్‌గనీ) ఏర్పాటు చేశాడు. ఇల్‌టుట్‌మిష్ మంగోలుల దాడుల నుంచి భారతదేశాన్ని కాపాడాడు. స్వతంత్రంగా అరబ్బీ నాణేలను ముద్రించడం ప్రారంభించాడు. వెండి టంకా, రాగి జిటాల్ ఇతడి కాలం నుంచే వాడుకలోకి వచ్చాయి. తురుష్క సామ్రాజ్యాన్ని స్థిరపరిచాడు. కుతుబ్‌మినార్ నిర్మాణాన్ని పూర్తి చేయించాడు.

సుల్తాన్ రజియా (క్రీ.శ. 1236-1240): ఈమె ఇల్‌టుట్ మిష్ కుమార్తె. యాకుబ్‌ఖాన్ అనే అబిసీనియన్‌ను వివాహం చేసుకున్నారు. ఈమె మధ్యయుగానికి చెందిన మొదటి, చివరి సుల్తానా (రాణి). ఇల్‌టుట్ మిష్ తన కుమారులు అసమర్థులవ్వడం వల్ల కూతురైన రజియాను వారసురాలిగా ప్రకటించాడు. ఈమె మంచి పాలనాదక్షురాలు. ఈమె కాలంలో చిహల్‌గనీలు బలవంతులై ఆమెను ఎదిరించారు. వీరిని అడ్డుకునే ప్రయత్నంలో రజియా ప్రాణాలను కోల్పోయారు.

సుల్తాన్ నసీరుద్దీన్ మహమ్మద్ (క్రీ.శ. 1246 - 1265): ఇతడు ఇల్‌టుట్ మిష్ కుమారుడు. అసమర్థుడు. భోగలాలసుడు. అమీర్‌ల చేతిలో కీలుబొమ్మగా మారాడు.

సుల్తాన్ ఘియాసుద్దీన్ బాల్బన్ (క్రీ.శ. 1265 -1285): ఇతడు సుల్తాన్ నసీరుద్దీన్‌కు 1246-65 మధ్య ప్రధానమంత్రిగా సర్వాధికారాలు చెలాయించాడు. ఇతడి మరణానంతరం సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. 40 మంది బానిసల దళాన్ని రద్దు చేశాడు. శత్రువుల రహస్యాలు తెలుసుకునేందుకు గూఢచార దళాన్ని ఏర్పాటు చేశాడు. సాష్టాంగపడి సుల్తాన్ పాదాలను లేదా సింహాసనాన్ని ముద్దు పెట్టుకోవడం లాంటి పారశీక రాచ మర్యాదలను బాల్బన్ ప్రవేశపెట్టాడు. సర్దార్లను అణచివేయడానికి మద్యపానం, జూదం, అతిగా మాట్లాడటం లాంటివాటిని నిషేధించాడు.

- వెనిస్ యాత్రికుడైన 'మార్కోపోలో' భారతదేశాన్ని సందర్శించాడు. రాణి రుద్రమదేవి ఆస్థానానికి వచ్చాడు.

ఖిల్జీ వంశం (క్రీ.శ. 1290-1320)

ఇది ఢిల్లీని పాలించిన రెండో తురుష్క వంశం. వీరి పాలనా కాలం క్రీ.శ. 1290-1320.

జలాలుద్దీన్ (క్రీ.శ. 1290-1296): ఇతడు బాల్బన్ కొలువులో చేరిన ఖిల్జీ వంశానికి చెందిన తురుష్క తెగకు చెందిన వ్యక్తి. 1290లో బానిస వంశ చివరి పాలకుడైన కైకోబాద్‌ను వధించి ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. ఇతడి అన్న కొడుకు అల్లా ఉద్దీన్ ఖిల్జీ. జలాలుద్దీన్ తన కూతురిని అల్లా ఉద్దీన్‌కు ఇచ్చి వివాహం చేశాడు. ఇతడి కాలంలో ఇస్లామ్ మతాన్ని స్వీకరించిన మంగోలులు నయా ముస్లింలుగా చెలామణి అయ్యారు. వీరు ప్రభుత్వానికి బెడదగా తయారయ్యారు.

అల్లాఉద్దీన్ ఖిల్జీ (క్రీ.శ. 1296-1316): ఇతడు 1299లో గుజరాత్‌ను జయించాడు. కాకతీయ, యాదవ, హోయసాల, పాండ్య రాజ్యాలపై అల్లా ఉద్దీన్ సేనాని మాలిక్‌కపూర్ దండెత్తి జయించాడు. 1312లో మాలిక్‌కపూర్ దేవగిరి రాజైన శకదేవుడిని వధించి ఆ రాజ్యాన్ని ఢిల్లీ రాజ్యంలో కలిపాడు. 1303లో మంగోలుల దాడుల నుంచి రక్షించుకోవడానికి దుర్గాలను నిర్మించాడు.

అల్లాఉద్దీన్ ఖిల్జీకి 'సికిందర్' అనే బిరుదు ఉంది. ఇతడు జాగీర్లను రద్దు చేశాడు. ఇతడి కాలంలో సైన్యం పోషణ బాధ్యత ప్రభుత్వ పరిధిలోనే ఉండేది. గుర్రాలపై ముద్రలు వేసే పద్ధతి ప్రవేశపెట్టాడు.

జీతాలను నగదు రూపంలో చెల్లించేవాడు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వ్యాపారులు సరకులు అమ్మాలని శాసించాడు. ఇతడు 'సిరి', 'అలైదర్వాజా' కట్టడాలను నిర్మించాడు. అమీర్‌ఖుస్రూ అనే పర్షియన్ కవిని పోషించాడు. అల్లాఉద్దీన్ 'నయాముస్లిం'లను అణచివేశాడు. అలైదర్వాజా తురుష్క వాస్తు రీతికి ప్రతీక.

అల్లాఉద్దీన్ షియాబుద్దీన్ ఉమర్, కుతుబుద్దీన్ ముబారక్ ఖిల్జీ వంశం చివరి పాలకులు. నసీరుద్దీన్ ఖుస్రూతో ఖిల్జీ వంశ పాలన పూర్తిగా అంతమైంది.

సముద్రం లోతును కొలిచే పరికరం ఏది?

ధ్వని

ప్రకంపన స్థితిలో ఉన్న వస్తువు నుంచి వెలువడే శబ్దాన్ని 'ధ్వని' అంటారు. ధ్వని గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'అకౌస్టిక్స్' అంటారు.

ధ్వని ప్రసారానికి..

1) కంపించే గుణం ఉన్న కణాలు

2) స్థితిస్థాపకత, జడత్వ స్వభావం ఉన్న యానకం అవసరం.

ధ్వని ప్రసారం జరిగే పదార్థాలు: ఇనుము, రాగి, అల్యూమినియం, ఉక్కు మొదలైనవి.

ధ్వని ప్రసారం జరగని పదార్థాలు: రబ్బర్, పొట్టు, దూది, దుస్తులు మొదలైనవి.

యానకం: శక్తి స్వరూపం ప్రయాణించడానికి వీలైన భౌతిక అంశాన్ని యానకం అంటారు.

- రాబర్ట్ బాయిల్ శూన్యంలో ధ్వని ప్రయాణించదని గంటజాడీ ప్రయోగం ద్వారా వివరించాడు. ఇతడిని రసాయన శాస్త్ర పితామహుడిగా పేర్కొంటారు.
- చంద్రుడిపై వాతావరణం లేనందువల్ల అక్కడ ధ్వని వేగం శూన్యం.
- చంద్రుడి శాస్త్రీయనామం సెలిని. చంద్రుడి గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని సెలినాలజి అంటారు.
- పౌనపున్యం: ఒక సెకన్ కాలంలో చేసే కంపనాల సంఖ్యను 'పౌనపున్యం' అంటారు.
- పౌనపున్యం = 1/T
- ప్రమాణాలు: sec^{-1}, cycle/sec, Hz.
- పౌనపున్యం ఆధారంగా ధ్వనులు 3 రకాలు. అవి: 1) పరశ్రావ్యాలు, 2) శ్రవ్య అవధి ధ్వనులు, 3) అతిధ్వనులు
- **పరశ్రావ్యాలు:** 20Hz కంటే తక్కువ పౌనపున్యం ఉన్న ధ్వనులను పరశ్రావ్యాలు అంటారు. ఈ ధ్వనులను వినగలిగే జీవులు పాము, తిమింగలం.
- ఖడ్గమృగాలు 5Hzపౌనపున్యం ఉన్న ధ్వనులను విడుదల చేస్తూ భావ వ్యక్తీకరణ చేసుకుంటాయి.
- భూకంపాల రాకను మొదటగా పసిగట్టే జీవి పాము.
- భూకంపాలను అంచనా వేసే పరికరాలు - భూకంపలేఖిని, భూకంపదర్శిని.
- భూకంపలేఖినిని ఉపయోగించి సెస్మిక్ తరంగాలను కొలుస్తారు.
- **సెస్మిక్ తరంగాలు:** భూ అంతర్భాగంలోని కదలికలు భూ ఉపరితలంపై తరంగాలను విడుదల చేస్తాయి. వీటినే సెస్మిక్ తరంగాలు అంటారు.
- భూకంప తీవ్రతను కొలిచే పరికరాలు - రిక్టర్ స్కేలు, భ్రామక పరిమాణ స్కేలు.
- భూకంపాలు సంభవించే ప్రాంతాల్లో మట్టి, కలప వినియోగించి నిర్మాణాలు చేయాలి.
- తెలంగాణ రాష్ట్రంలో భూకంపం సంభవించే ప్రమాదం ఉన్న ప్రాంతం - హైదరాబాద్.
- శ్రవ్య అవధి: 20Hz&20,000Hz (20 KHz) పౌనపున్యం ఉన్న ధ్వనులను శ్రవ్య అవధి (లేదా) శ్రవ్యాలు అంటారు. మానవుడు వినగలిగే ధ్వనులు ఇవే.
- చిన్నపిల్లలు వినగలిగే శ్రవ్య అవధి -30,000 Hz.
- వృద్ధులు వినగలిగే ధ్వని అవధి 10 KHz - 12 KHz.
- చెవి వెలుపలి భాగమైన 'పిన్నా' ధ్వని కంపనాలను గ్రహిస్తుంది. ఈ కంపనాలు చెవి లోపలి కర్ణభేరికి తాకి కంపింపజేసినప్పుడు మనం ధ్వనిని వినగలుగుతాం.
- మానవ శరీరంలో అతిచిన్న ఎముక 'స్టెపిస్', అతిపెద్ద ఎముక ఫీమర్ (తొడ ఎముక).
- **అతిధ్వనులు:** 20,000 Hz కంటే ఎక్కువ పౌనపున్యం ఉన్న ధ్వనులను 'అతిధ్వనులు' అంటారు. ఈ ధ్వనులను వినగలిగే జీవులు - కుక్క, గబ్బిలం, ఏనుగు.
- కుక్క వినగలిగే ధ్వని పౌనపున్య అవధి - 50,000 Hz (50 KHz).
- గబ్బిలం వినగలిగే ధ్వని పౌనపున్య అవధి 1,00,000 Hz.

అతిధ్వనుల అనువర్తనాలు

1. పాలు, నీటిలోని బ్యాక్టీరియాను నశింపజేయడానికి ఉపయోగిస్తారు. పాలను 62°C నుంచి 67°C వరకు వేడిచేసి బ్యాక్టీరియాను నశింపజేస్తారు.
- పాల స్వచ్ఛతను కొలవడానికి ఉపయోగించే పరికరం 'లాక్టోమీటర్'.
- పాలలో రైబోఫ్లోవిన్ ఉండటం వల్ల పసుపు వర్ణంలో కనిపిస్తాయి.
2. సముద్రాల లోతును కొలవడానికి ఉపయోగించే సోనార్ పరికరం అతిధ్వనుల ఆధారంగా పనిచేస్తుంది. సోనార్‌ను కనుగొన్న శాస్త్రవేత్త - నిక్సన్.
- SONAR → Sound Navigation and Ranging
3. సోల్డరింగ్ (Pb+ Sn), వెల్డింగ్‌లలో; చేపలను ఆకర్షించడానికి, దోమలను పారదోలడానికి అతిధ్వనులను వాడతారు.
4. స్కానింగ్ ప్రక్రియలోనూ అతిధ్వనులను ఉపయోగిస్తారు. శరీర భాగాలను స్కానింగ్ చేయడాన్ని 'సోనోగ్రఫీ' అంటారు.
5. విరిగిన దంతాలను తొలగించడం, కీళ్ల నొప్పుల నివారణ, కిడ్నీలోని రాళ్లను కరిగించడంలోనూ వీటిని వినియోగిస్తారు.
   కిడ్నీలోని రాళ్ల రసాయన నామాలు..
   1. కాల్షియం ఆగ్జలేట్ స్ఫటికాలు
   2. కాల్షియం ఫాస్ఫేట్ స్ఫటికాలు
6. వస్తువులను కావాల్సిన ఆకారాల్లో కోయడం, రంధ్రాలు చేయడంలో అతిధ్వనులు ఉపయోగిస్తారు.
7. వస్తువులను శుభ్రపరచడానికి, కంటిలోని
- శుక్లాలను తొలగించడానికి వీటిని వినియోగిస్తారు.



తరంగాలు-రకాలు

ప్రసార స్వభావం ఆధారంగా తరంగాలు రెండు రకాలు.

1. యాంత్రిక తరంగాలు: యానక ప్రమేయం ఆధారంగా ప్రయాణించే తరంగాలను 'యాంత్రిక తరంగాలు' అంటారు.
   ఉదా: ధ్వని తరంగాలు.
2. విద్యుత్ అయస్కాంత తరంగాలు: యానక ప్రమేయం లేకుండానే ప్రయాణించే తరంగాలను 'విద్యుత్ అయస్కాంత తరంగాలు' అంటారు.

ఉదా: కాంతి తరంగాలు, రేడియో తరంగాలు, మైక్రో తరంగాలు.

యాంత్రిక తరంగాలు ప్రధానంగా రెండు రకాలు.

1. పురోగామి తరంగాలు: అలజడి ప్రారంభమైన బిందువు నుంచి తరంగాలు ముందు దిశల్లో చలిస్తూ మళ్లీ వెనక్కి రాని తరంగాలను 'పురోగామి తరంగాలు' అంటారు.
   ఉదా: ఒక తాడు చివరను పట్టుకొని లాగి వదిలినప్పుడు ఏర్పడే తరంగాలు, నిశ్చల స్థితిలో ఉన్న నీటిలో రాయిని వేసినప్పుడు ప్రయాణించే తరంగాలు.

పురోగామి తరంగాలు రెండు రకాలు. అవి:

ఎ) **అనుదైర్ఘ్య తరంగాలు:** యానకంలోని కణాలు తరంగ ప్రసార దిశకు సమాంతరంగా కంపిస్తూ ఉంటే వాటిని 'అనుదైర్ఘ్య తరంగాలు' అంటారు.

ఉదా: వాయు పదార్థాల్లో ధ్వని తరంగాలు, స్ప్రింగ్‌లో ఏర్పడే తరంగాలు. వీటిలో i) సంపీడనం, ii) విరళీకరణం ఉంటాయి.

- కణాల సాంద్రత గరిష్ఠంగా ఉండే బిందువును 'సంపీడనం' అంటారు. రెండు వ రుస సంపీడనాల మధ్య దూరం.
- కణాల సాంద్రత కనిష్ఠంగా ఉండే బిందువును 'విరళీకరణం' అంటారు. రెండు వరుస విరళీకరణాల మధ్య దూరం .

బి) **తిర్యక్ తరంగాలు:** యానకంలోని కణాలు తరంగ ప్రసార దిశకు లంబంగా కంపిస్తూ ఉంటే వాటిని 'తిర్యక్ తరంగాలు' అంటారు.

ఉదా: కాంతి తరంగాలు, ద్రవ పదార్థాల్లో ఏర్పడే తరంగాలు. తిర్యక్ తరంగాల్లో శృంగాలు, ద్రోణులు ఏర్పడతాయి.

- తరంగ ప్రసార దిశకు పైభాగాన ఏర్పడే బిందువును 'శృంగం' అంటారు. రెండు వరుస శృంగాల మధ్యదూరం.
- తరంగ ప్రసార దిశకు దిగువన ఏర్పడే బిందువును 'ద్రోణి' అంటారు. రెండు వరుస ద్రోణుల మధ్యదూరం .

2. స్థిర తరంగాలు: రెండు స్థిర బిందువుల మధ్య బంధించిన తరంగాలను స్థిరతరంగాలు అంటారు.

ఉదా: మూసి ఉన్న గొట్టాల్లో ఏర్పడే తరంగాలు.

స్థిర తరంగాల లక్షణాలు:

i) ఒకే కంపన పరిమితి,
ii)) ఒకే తరంగదైర్ఘ్యం,
iii) ఒకే పౌనపున్యం కలిగి ఉంటాయి.

- స్థిర తరంగాల్లో అస్పందన, ప్రస్పందన స్థానాలు ఉంటాయి.
- అత్యల్ప స్థానభ్రంశం ఉన్న బిందువును 'అస్పందన స్థానం', గరిష్ఠ స్థానభ్రంశం ఉన్న బిందువును 'ప్రస్పందన స్థానం' అంటారు.
- రెండు వరస అస్పందన లేదా ప్రస్పందన బిందువుల మధ్య దూరం = $\lambda/3$
- అస్పందన, ప్రస్పందన బిందువుల మధ్య దూరం = $\lambda/4$

గతంలో అడిగిన ప్రశ్నలు

1. అకౌస్టిక్స్ అనేది దేనికి సంబంధించిన అధ్యయనం?
   ఎ) ఉష్ణం బి) అంతరిక్ష ప్రయాణం
   సి) ధ్వని డి) కాంతి
2. కిందివాటిలో ధ్వని అతి నెమ్మదిగా దేనిలో ప్రయాణిస్తుంది?
   ఎ) గాలి బి) గాజు
   సి) నీరు డి) చెక్క
3. రెండు క్రమానుసార బిందువుల మధ్యదూరం ఒకే దిశలో ఉంటే అది దేన్ని సూచిస్తుంది?
   ఎ) తరంగదైర్ఘ్యం బి) కంపన పరిమితి
   సి) కాంతి తీవ్రత డి) పౌనపున్యం
4. ధ్వని దేని ద్వారా ప్రయాణించదు?
   ఎ) శూన్యం బి) ఉదజని
   సి) నీరు డి) ఉక్కు
5. సముద్రం లోతును కొలిచే పరికరం ఏది?
   ఎ) రాడార్ బి) సోనార్
   సి) లేజర్ డి) పైవేవీకావు
6. మహాసముద్రాల లోతులు కొలవడానికి వేటిని ఉపయోగిస్తారు?
   ఎ) ఆల్ట్రాసోనిక్ కిరణాలు
   బి) పరశ్రావ్యాలు
   సి) ఆల్ట్రాసోనిక్ ధ్వనులు
   డి) హైడ్రో కెమెరా
7. కిందివాటిలో దేనిలో ధ్వని వేగంగా ప్రయాణిస్తుంది?
   ఎ) గాలి బి) నీరు
   సి) ఉక్కు డి) శూన్యం
8. చంద్రునిపై ధ్వని లేకపోవడానికి కారణం?
   ఎ) వాతావరణం లేకపోవడం
   బి) కాంతి లేకపోవడం
   సి) స్వయం ప్రకాశం కానందువల్ల
   డి) పైవన్నీ
9. నీటి ఉపరితలంపై ఏర్పడే అలలు ఏ రకమైనవి?
   ఎ) తిర్యక్ తరంగాలు
   బి) దైర్ఘ్య తరంగాలు
   సి) స్థిర తరంగాలు
   డి) పురోగామి తరంగాలు
10. గబ్బిలాలు రాత్రివేళలో వేటి సహాయంతో సంచరిస్తాయి?
   ఎ) పరారుణ కిరణాలు
   బి) అతిధ్వని తరంగాలు
   సి) అతినీలలోహిత కిరణాలు
   డి) పైవేవీకావు
11. భూకంప తీవ్రతను కొలిచే సాధనాన్ని ఏమంటారు?
   ఎ) టోక్యోమీటరు బి) స్టీరియోస్కోప్
   సి) ఎపిటయోస్కోప్ డి) సిస్మోగ్రాఫ్
12. ధ్వని కిరణాలు వేటికి ఉదాహరణ?
   ఎ) అనుదైర్ఘ్య తరంగాలు
   బి) తిర్యక్ తరంగాలు
   సి) విద్యుత్ తరంగాలు
   డి) స్థిర తరంగాలు

సమాధానాలు

1) సి; 2) డి; 3) ఎ; 4) ఎ; 5) బి; 6) సి; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) బి; 11) డి; 12) ఎ.

విద్య, ఉద్యోగ సమాచారం

డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో స్టేట్ కోఆర్డినేటర్ పోస్టులు

న్యూఢిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో ఒప్పంద ప్రాతిపదికన స్టేట్‌కోఆర్డినేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-01, పశ్చిమ బెంగాల్-01, లక్షద్వీప్-01, పుదుచ్చేరి-01, మిజోరాం-01, ఒడిశా-01, తెలంగాణ-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ(ఎంఏ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 20 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **దరఖాస్తు ప్రారంభతేది:** 02.06.2025.
» **దరఖాస్తు చివరితేది:** 16.06.2025.
» **వెబ్‌సైట్:** https://dic.gov.in/

జీజీహెచ్, శ్రీకాకుళంలో 11 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(జీజీహెచ్) ప్రభుత్వ ఆసుపత్రిలో తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
» **పోస్టుల వివరాలు:** డాక్టర్-01, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కమ్ ఒకేషనల్ కౌన్సిలర్-01, వార్డ్ బాయ్-02, కౌన్సిలర్/సోషల్ వర్కర్/సైకాలజిస్ట్-02, పీర్ ఎడ్యుకేటర్-01, చౌకీదార్-02, హౌస్‌కీపింగ్ స్టాఫ్-01, యోగా థెరపిస్ట్/ డాన్స్/ మ్యూజిక్/ ఆర్ట్ టీచర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంబీబీఎస్, ఎనిమిదో తరగతిలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు డాక్టర్‌కు రూ.55,000, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌కు రూ.25,000, వార్డ్ బాయ్స్‌కు రూ.13,000, కౌన్సిలర్‌కు రూ.17,500, పీర్ ఎడ్యుకేటర్‌కు రూ.10,000, చౌకీదార్‌కు రూ.9000, హౌస్ కీపింగ్‌కు రూ.9000, యోగా థెరపిస్ట్‌కు రూ.5000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ ఆఫ్ ది సూపరింటెండెంట్, జీజీహెచ్, శ్రీకాకుళం చిరునామాకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 09.06.2025.
» **వెబ్‌సైట్:** http://srikakulam.ap.gov.in/

సైక్లోన్ అనేది ఏ భాష నుంచి వచ్చింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

డిజాస్టర్ మేనేజ్‌మెంట్

పర్యావరణ సమస్యలు

విపత్తు

భారీ ప్రాణ, ఆస్తి, పర్యావరణ నష్టాన్ని కలిగించే ఆకస్మిక ప్రమాదమే విపత్తు. వీటి ద్వారా భారీ స్థాయిలో నష్టం సంభవిస్తుంది. విపత్తు రకం, తీవ్రత, సంభవించే ప్రాంతంపై నష్ట తీవ్రత ఆధారపడి ఉంటుంది. తరచు సంభవించే విపత్తుల వల్ల ఒక దేశ ఆర్థిక, సామాజిక, ఆరోగ్య స్థితిగతులు పూర్తిగా అస్తవ్యస్తమవుతాయి. శీతోష్ణస్థితి మార్పు ప్రభావంతో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వరదలు, తుపాన్లు, కరవు లాంటి విపత్తుల తీవ్రత పెరిగింది. పోటీ పరీక్షల్లో.. విపత్తు, విపత్తు రకాలు, తాజా సంఘటనలు (**ఉదా:** మక్కా తొక్కిసలాట, నేపాల్ భూకంపం), వాటి గల కారణాలు, నిర్వహణ వ్యవస్థలు, ఒప్పందాలు, సమావేశాలపై ఎక్కువగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది.

విపత్తులు ప్రధానంగా రెండు రకాలు..

1. సహజ(Natural)
2. మానవ జనిత(Anthropogenic)

వీటిని భారీ, స్వల్ప అనే రెండు రకాలుగా విభజిస్తారు.

- **సహజ భారీ విపత్తులు:** వరద, తుపాను, కరవు, భూకంపం, సునామీ, అగ్నిపర్వతాల విస్ఫోటం.
- **సహజ స్వల్ప విపత్తులు:** అత్యల్ప శీతాకాల ఉష్ణోగ్రతలు, అధిక వేసవి ఉష్ణోగ్రతలు, కొండ చరియలు, మంచు చరియలు విరిగిపడటం.
- **మానవ జనిత భారీ విపత్తులు:** యుద్ధాలు, భారీ అగ్ని ప్రమాదాలు, వ్యాధుల ప్రబలత, శీతోష్ణస్థితి మార్పు ప్రభావాలు.
- **మానవ జనిత స్వల్ప విపత్తులు:** రోడ్డు, రైళ్ల, విమాన ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు, ఆహార విషపూరితం కావడం, తొక్కిసలాట, పర్యావరణ కాలుష్యం.



విపత్తు నిర్వహణ చక్రం

ఒక సమగ్ర విపత్తు నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు ద్వారా మాత్రమే విపత్తుల ద్వారా జరిగే నష్టాన్ని తగ్గించడం వీలవుతుంది. సాధారణంగా విపత్తు నిర్వహణలో మూడు అంశాలు ఉంటాయి.

1. విపత్తు పూర్వ నిర్వహణ (Pre - Disaster Management)
2. విపత్తు స్పందన(Disaster Response)
3. విపత్తు అనంతర నిర్వహణ (Post - Disaster Management)

విపత్తు పూర్వ నిర్వహణ

ఇందులో నిర్మూలన, సంసిద్ధత ముఖ్య అంశాలు.

నిర్మూలన: విపత్తు సంభవించే ప్రాంతాన్ని ముందుగానే గుర్తించి, భవిష్యత్తులో విపత్తు రాకుండా చేపట్టే చర్యలను నిర్మూలనగా పిలుస్తారు. సక్రమైన నిర్మూలన చర్యల ద్వారా విపత్తు సంభవించే పరిస్థితులను పూర్తిగా అరికట్టడానికి వీలవుతుంది. నిర్మూలన చర్యల ద్వారా విపత్తు నష్టం తగ్గుతుంది. **ఉదా:** రుతుపవనాలకు ముందు నదులు, కాలువలు, రిజర్వాయర్లలో పూడికతీత కార్యక్రమాలు నిర్వహించడం. రైల్వే ట్రాక్‌ల తనిఖీ. కొండ చరియలు విరిగిపడే ప్రాంతాల్లో అటవీకరణను ప్రోత్సహించడం.

సంసిద్ధత: విపత్తు పూర్వ నిర్వహణలో ఇది చాలా కీలకం. ఇందులో భాగంగా విపత్తు సంభవించే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో అనేక నివారణ చర్యలను తీసుకోవాలి. **ఉదా:** వరద సంభవించే ప్రమాదమున్న ప్రాంతాల్లో వేగవంతమైన హెచ్చరిక జారీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.

- విపత్తు ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టే అంచనా వ్యవస్థలను ఆధునిక సాంకేతికత సహాయంతో ఏర్పాటు చేయాలి.
- సంసిద్ధతలో ప్రభుత్వరంగ సంస్థలు, ఎన్జీవోలు, సాంకేతిక బృందాలు, స్వయం సహాయక బృందాలు పాల్గొనాలి.

విపత్తు స్పందన

విపత్తు సంభవించిన సమయంలో నిర్వహించే కార్యక్రమాలన్నింటినీ 'స్పందన' అంటారు. విపత్తు సమయంలో నష్టాన్ని నివారించడానికి 'ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్'(ఈఆర్ఎస్) ఏర్పాటు తప్పనిసరి. స్వల్ప వ్యవధిలో ప్రజలందరికీ హెచ్చరికలు జారీ చేసే వ్యవస్థ, సత్వర ఆరోగ్య సేవలు, ప్రమాదంలో చిక్కుకున్న వారిని గుర్తించి, రక్షించే (సెర్చ్ అండ్ రెస్క్యూ) సేవలన్నీ ఈఆర్ఎస్ లో భాగంగా ఉంటాయి.

విపత్తు అనంతర నిర్వహణ

విపత్తు సంభవించిన తర్వాత నిర్వహించే స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలన్నింటినీ కలిపి 'విపత్తు అనంతర నిర్వహణ' అంటారు. అత్యవసర సేవల పునరుద్ధరణ, దెబ్బతిన్న కమ్యూనికేషన్స్ వ్యవస్థల పునర్వ్యవస్థీకరణ, పునరావాస సేవల కల్పన, ఆరోగ్య సేవలు మొదలైనవి విపత్తు అనంతర నిర్వహణలో ముఖ్య అంశాలు. విపత్తు రకం, తీవ్రతను బట్టి పునరావాసం, పునరుద్ధరణ సమయం ఉంటుంది. ఈ చర్యలు కొన్ని వారాలు లేదా నెలలపాటు కొనసాగుతాయి.

భారత్‌లో విపత్తు నిర్వహణ వ్యవస్థ

భారతదేశంలో 2005కు ముందు ఒక సమగ్ర విపత్తు నిర్వహణ వ్యవస్థ అంటూ ఏదీలేదు. 1994లో జపాన్‌లోని యొకొహోమ నగరంలో ఐక్యరాజ్యసమితి నిర్వహించిన సదస్సులో తొలిసారిగా 'విపత్తు సంసిద్ధత'ను చర్చించారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతోన్న పేద దేశాల్లో విపత్తు నిర్వహణ చాలా పేలవంగా ఉందని ఈ సదస్సులో గుర్తించారు. కాబట్టి ప్రతి సభ్యదేశం తమ పౌరుల రక్షణ కోసం విపత్తు నివారణ, నిర్మూలన, సంసిద్ధత చర్యలను నిర్వహించాలి. దీంతో విపత్తు ద్వారా సంభవించే నష్టాన్ని తగ్గించాలని నిర్ణయించారు. దీని కోసం అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయిలో సహకరించుకోవాలని సూచించారు. ఇదే సదస్సులో 1991-2000 దశకాన్ని 'ఇంటర్నేషనల్ డికేడ్ ఫర్ నేచురల్ డిజాస్టర్ రిడక్షన్'గా గుర్తించారు. యొకొహోమ సదస్సు స్ఫూర్తితో 1999లో భారత్ ఒక 'హై పవర్డ్ కమిటీ' (హెచ్‌పీసీ)ని ఏర్పాటు చేసింది. 2001 జనవరిలో గుజరాత్‌లో సంభవించిన భూకంపం తర్వాత జాతీయ విపత్తు నిర్వహణ ప్రణాళిక ఏర్పాటుకు, నిర్మూలన చర్యలను సూచించడానికి ఒక జాతీయ కమిటీ ఏర్పాటు చేశారు. 10వ పంచవర్ష ప్రణాళికలో తొలిసారిగా విపత్తు నిర్వహణ అంశాన్ని చేర్చారు. 2005 డిసెంబర్ 23న భారత ప్రభుత్వం 'జాతీయ విపత్తు నిర్వహణ చట్టా'న్ని తీసుకొచ్చింది. ఈ చట్టంలో భాగంగా దేశంలో విపత్తుల నిర్వహణకు మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేశారు. జాతీయ స్థాయిలో విపత్తు నిర్వహణ విధానాలను రూపొందించి, మార్గదర్శకాలను విడుదల చేసే లక్ష్యంతో 'జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ' (ఎన్డీఎంఏ) ఏర్పాటైంది. ప్రధాని ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి యంత్రాంగం ఎన్డీఎంఏ విధులను నిర్వహిస్తుంది. రాష్ట్ర స్థాయిలో విపత్తు నిర్వహణకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ(ఎస్డీఎంఏ) ఏర్పాటైంది. అదే విధంగా జిల్లా స్థాయిలో విపత్తు నిర్వహణకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా విపత్తు నిర్వహణ సంస్థ (డీడీఎంఏ) కృషి చేస్తుంది. విపత్తు నిర్వహణపై పూర్తి స్థాయిలో పరిశోధనలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐడీఎం)ను న్యూఢిల్లీలో ఏర్పాటు చేశారు. యొకొహోమ సదస్సు అనంతరం 1995లో నేషనల్ సెంటర్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్సీడీఎం)ను ఏర్పాటు చేశారు. దీన్నే 2003 అక్టోబర్ 16న ఎన్ఐడీఎంగా అభివృద్ధి చేశారు.

ఎన్ఐడీఎం ప్రధాన విధులు

- విపత్తు నిర్వహణలో వివిధ శిక్షణ కార్యక్రమాలను రూపొందించడం, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడం.
- విపత్తు నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాల్లో మానవ వనరులను అభివృద్ధి చేసే ప్రణాళికలను రూపొందించి అమలు చేయడం.
- జాతీయ స్థాయి విపత్తు ప్రణాళికలను రూపొందించడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలివ్వడం.
- విపత్తు నిర్వహణలో శిక్షణతోపాటు ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సులను రూపొందించి నిర్వహించడం. దేశంలో, దేశం వెలుపల విపత్తు నిర్వహణపై సెమినార్‌లను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహను కల్పించడం.
- పాఠశాల, కళాశాల స్థాయిల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులకు విపత్తు నిర్మూలన, సంసిద్ధతలపై అవగాహన కల్పించడం.

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్)

విపత్తు సంభవించిన సమయంలో తక్షణ సహాయ కార్యక్రమాలను అందించి, ప్రమాదంలో చిక్కుకున్న వారిని వేగవంతంగా రక్షించే ఉద్దేశంలో జాతీయ విపత్తు నిర్వహణలో భాగంగా 2006లో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్డీఆర్ఎఫ్) ఏర్పాటైంది. ఇందులో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)లకు చెందిన 8 బెటాలియన్లు ఉన్నాయి. పై వాటికి అదనంగా సశస్త్ర సీమాబల్‌కు చెందిన రెండు బెటాలియన్లు ఉన్నాయి. ఒక్కో బెటాలియన్‌లో 1149 సిబ్బంది ఉంటారు..

మాదిరి ప్రశ్నలు

1. 1994 లో వరల్డ్ కాన్ఫరెన్స్ ఆన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సదస్సు జరిగిన యొకొహోమ నగరం ఏ దేశంలో ఉంది?
   ఎ) చైనా బి) తైవాన్
   సి) జపాన్ డి) దక్షిణ కొరియా
2. దేశంలో ఏటా వరదకు గురయ్యే ప్రమాదమున్న ప్రాంతం?
   ఎ) 80 మిలియన్ హెక్టార్లు
   బి) 45 మిలియన్ హెక్టార్లు
   సి) 100 మిలియన్ హెక్టార్లు
   డి) 150 మిలియన్ హెక్టార్లు
3. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ ఏ నగరంలో ఉంది?
   ఎ) చెన్నై బి) హైదరాబాద్
   సి) బెంగుళూరు డి) విశాఖపట్నం
4. హుద్‌హుద్ తుపాను ఏ రకమైన విపత్తు?
   ఎ) పెను తుపాను
   బి) తీవ్ర పెను తుపాను
   సి) సూపర్ సైక్లోన్ డి) అల్పపీడనం
5. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సిస్టం(ఐఎన్‌సీవోఐఎస్) ఏ నగరంలో ఉంది?
   ఎ) హైదరాబాద్ బి) చెన్నై
   సి) గోవా డి) ముంబై
6. విపత్తు నిర్వహణలో ఏయే అంశాలు ఉంటాయి?
   ఎ) నివారణ బి) సంసిద్ధత
   సి) నిర్మూలన డి) పైవన్నీ
7. 1999లో ఏ రాష్ట్ర తీరంలో ప్రమాదకర భారీ సూపర్ సైక్లోన్ సంభవించింది?
   ఎ) ఒడిశా బి) ఆంధ్రప్రదేశ్
   సి) తమిళనాడు డి) మహారాష్ట్ర
8. ఇంటర్నేషనల్ సునామీ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఎక్కడ ఉంది?
   ఎ) హొనోలులు బి) గోవా
   సి) జకార్తా డి) మాల్దీవులు
9. సైక్లోన్ అనేది ఏ భాష నుంచి వచ్చింది?
   ఎ) గ్రీకు బి) లాటిన్
   సి) జపనీస్ డి) ఫ్రెంచ్
10. హిందు మహాసముద్రంలో తుపానుకు తొలిసారిగా ఎప్పుడు నామకరణం చేశారు?
   ఎ) 2001 బి) 2002
   సి) 2003 డి) 2004
11. కుండ్స్ అనే భూగర్భ ట్యాంకులను ఏ రాష్ట్రంలో నిర్మిస్తున్నారు?
   ఎ) మేఘాలయ బి) మధ్యప్రదేశ్
   సి) రాజస్థాన్ డి) తెలంగాణ
12. ఏ దేశంలోని తియాంజిన్ అనే ప్రాంతం లో 2015 ఆగస్టు 12న సయనైడ్ లీకేజి ఘటన జరిగింది?
   ఎ) జపాన్ బి) చైనా
   సి) దక్షిణ కొరియా
   డి) ఉత్తర కొరియా
13. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికెట్ కోర్సును అందించేది?
   ఎ) ఇగ్నో
   బి) బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ
   సి) నలందా ఓపెన్ యూనివర్సిటీ
   డి) వర్ధమాన్ మహావీర్ యూనివర్సిటీ
14. గుజరాత్ తీరంలో సునామీ సంభవించిన సంవత్సరం?
   ఎ) 1945 బి) 1962
   సి) 2004 డి) 2006
15. ఇటీవల మక్కాలో జరిగిన విపత్తు ఏ రకమైంది?
   ఎ) బాంబు పేలుడు బి) తొక్కిసలాట
   సి) భూకంపం డి) వరదలు

సమాధానాలు

1) సి	2) బి	3) ఎ	4) బి
5) ఎ	6) డి	7) ఎ	8) ఎ
9) ఎ	10) డి	11) సి	12) బి
13) ఎ	14) ఎ	15) బి	

When the needle enters the red zone..



Directions (Q. No.1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. She didn't (1)/ even take the trouble (2)/ to find out how to (3)/ spelling my name. (4)/ No error (5)
2. The escaped prisoners (1)/ were eventually trapped (2)/ in an underground garage (3)/ as recaptured. (4)/ No error (5)
3. He was (1)/ weakly, (2)/ cowardly and (3)/ treacherous. (4)/ No error (5)
4. The director transposes (1)/ Shakespeare's play (2)/ to 16th century Venice (3)/ to present day England. (4)/ No error (5)
5. We need to (1)/ ensure a smooth transition (2)/ between the old system (3)/ and new. (4)/ No error (5)
6. I think you'll have to (1)/ tweak these figures (2)/ a little before you shown (3)/ them to the boss. (4)/ No error (5)
7. These days it seemed (1)/ we must all submit (2)/ to the tyranny (3)/ of the motor car. (4)/ No error (5)
8. The political situation remains (1)/ highly unstable in many remote areas (2)/ even though the curfew (3)/ is lifted. (4)/ No error (5)
9. If society (1)/ is to exist as a unity, (2)/ its members may have (3)/ shared values. (4)/ No error (5)
10. The universal geriatric problems (1)/ projected in the movie (2)/ catched the attention of (3)/ the people across the world. (4)/ No error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The ceremony was transmitted ____ by satellite to ____ 50 countries.
1) open; above
2) online; around
3) streaming; almost
4) live; over
5) latest; approximately

12. The police reforms will ensure greater ____ and ____.
1) law; care 2) security; safe
3) transparency; accountability
4) trepidation; tumult
5) flexibility; reach

13. She had set a ____ for him and he had walked straight into it.
1) goal 2) objective
3) vision
4) mission 5) trap

14. A restaurant has to ____ the tricky path between maintaining ____ and keeping prices down.
1) treat; quantity
2) meet; demand
3) tread; quality
4) expect; stock
5) maintain; inventory

15. The aircraft is designed to ____ turbulent conditions.
1) withstand 2) resist
3) change 4) modify
5) oversea

Directions (Q. No. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? Mark (5) No correction required as your answer, if there is no error.

16. The city's crime rate is a serious turn down to potential investors.
1) Turn on 2) turn in
3) turn off 4) turn up
5) no correction required

17. The rise in violent crime will may go unchecked.
1) must go 2) would go
3) must not go 4) shall go
5) No correction required

18. Planes passed overhead with unceasing regularity.
1) over sky 2) over and above
3) outcast 4) over flown
5) No correction required

19. My son's 13 but he's younger for his age.
1) youngest 2) youth
3) older 4) young
5) No correction required

20. When the needle enters the red zone the engine is indicator hot.
1) too 2) much
3) becomes 4) left
5) No correction required

Directions (Q. No. 21-25): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

For decades, Chinese economic policymakers have drawn praise for keeping their economy growing strongly through **turbulence**, such as the Asian financial crisis of 1997-1998 and the worldwide financial tumult of 2008. But investors have begun to lose faith in Beijing's economic management. As China's economy slowed, the government decided to **deploy** the stock market to ease the pain. State-run media talked up stocks, and individual investors responded by buying shares and igniting a 150 per cent run-up in the Shanghai Composite stock index in the year through June. The hope was that Chinese companies could issue shares into a rising market and use the proceeds to **shrink** debts. But the stock bubble burst June 12. Shanghai stocks plummeted 37 per cent. The government sought futilely to intervene, suspending trading in hundreds of companies and banning big investors from selling stakes for six months. The intervention undermined Beijing's pledge to give market forces a bigger say in the economy and left policymakers looking clumsy and ineffectual.

On August 12, China surprised investors by marking down the value of its currency, the yuan. The government said it was responding to market forces: Investors had signaled that the yuan was overvalued. But skeptics worried that the devaluation was a desperate move to jolt the economy - a sign that the economy was weaker than thought. The move followed a report that exports had plunged in July. A cheaper yuan gives Chinese companies a price advantage in foreign markets. Since the devaluation, China has intervened to keep the yuan from falling too fast, confusing markets and renewing doubts about Beijing's commitment to market forces.

Chinese economic statistics have long been viewed as **dubious**. Premier Li Keqiang once acknowledged that the statistics on economic output were "man-made" and worthless. China watchers tended to shrug off the uncertainty as long as it was clear that the economy was **booming**. But now there's concern about what's really happening. Economists are looking at alternative measures of economic performance, such as electricity consumption. The London firm Consensus Economics asked several economists for forecasts based on the unconventional measures. These forecasters saw the Chinese economy growing just 5.3 per cent in the year up to the fourth quarter of 2015. Conventional forecasts have the economy growing closer to 7 per cent.

21. The Chinese economic policy makers have drawn praise during
1)The government's intervention which suspended trading
2) Selling of stock prices and upkeeping the market value
3) Undermining the value of the stock and trading stopped by the government
4) Tough times like Asian financial crisis and the worldwide financial tumult
5) individual investors responded by buying shares and igniting a 150 per cent run-up

22. What led the investors to lose faith in the Beijing's economy?
1) Praise for keeping their economy growing strongly through turbulence
2) State-run media boosted the sales by investing in more stocks
3) The government suspending trading in hundreds of companies and banned big investors from selling stakes for six months
4) Chinese companies issued shares into a rising market
5) individual investors bought shares and reinvested

23. The effect of government's intervention
1) Damaged the promise to give the market forces a bigger say in the economy
2) policy makers looked cooperative and favourable
3) effective measures to curb the slowdown boosted confidence
4) stock brokers had visualized a steady decline
5) there is an uprise in the sale of stocks

24. Devaluation of the currency
1) Was to respond to the stock and inventory
2) was in response to market forces
3) was a desperate move to jolt the economy
4) Was to respond positively to international market
5) To bring back the faith in the international trade

25. The result of devaluation of Yuan as stated in the passage is
1) exports had plunged after the move of devaluation
2) in confusing markets and renewing doubts about Beijing's commitment
3) to surprise investors by marking down the value of its currency
4) to go for alternative measures of economic performance
5) to burst the bubble of uncertainity prevalent in the minds of the investors

Directions (Q. No. 26-28): Choose the word which is MOST SIMILAR in meaning to the word given from the five options.

26. Turbulence
1) Turmoil 2) Stability
3) Confident 4) Organize
5) Segregate

27. Deploy
1) Cluster 2) Entangle
3) Install 4) Huddle
5) Disperse

28. Booming
1) Thriving 2) Striving
3) Demotivated 4) Annoyed
5) Provoked

Directions (Q. No. 29-30): Choose the word which is MOST OPPOSITE in meaning to the word given from the five options.

29. Shrink
1) Shrivel 2) Contract
3) Microscope 4) Minimize
5) Nurture

30. Dubious
1) Hesitant 2) Whisper
3) Summarize 4) Certain
5) Unsure

Answers

1) 4	2) 4	3) 2	4) 3	5) 4
6) 3	7) 1	8)5	9) 3	10) 3
11) 4	12) 3	13) 5	14) 3	15) 1
16) 3	17) 3	18) 5	19) 4	20) 1
21) 4	22) 3	23) 1	24) 2	25) 1
26) 1	27) 3	28) 1	29) 5	30) 4